


'పారదర్శకతతో పథకాలు
అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా
సంక్షేమం అందుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 355

శనివారం 16-3-2024



SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

తెలంగాణ పునర్నిర్మాణం

మహాలక్ష్మి

- మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం
- 26.45 కోట్లకు పైగా ఉచిత ప్రయాణాలు

ప్రజా పాలన

- ప్రతి మంగళ, శుక్రవారాల్లో ప్రజావాణి ధర్నాచౌక్ పునరుద్ధరణ
- పూలే ప్రజా భవన్ లోకి అందరికి ప్రవేశం
- గ్యారంటీల లబ్ధికి నిరంతర దరఖాస్తుల స్వీకరణ
- అర్హులైన వారందరికి తెల్ల రేషన్ కార్డుల జారీకి నిర్ణయం
- ఆర్థిక, విద్యుత్, సాగునీటి రంగాలపై అసెంబ్లీలో శ్వేతపత్రం

మహిళా శక్తి

- మహిళా సంఘాలకు 5 ఏండ్లలో రూ.లక్ష కోట్లు
- ప్రతి ఏటా 5000 గ్రామసంఘాలకు రూ.5000 కోట్లు
- మహిళలకు వడ్డీ లేని రుణాలు
- మహిళా సంఘం సభ్యురాలికి రూ.10 లక్షల ప్రమాద బీమా
- మహిళా సంఘాలకు పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పనులు
- మహిళలకు రుణ బీమా పథకం

శిక్షణ మరియు ఉపాధి

- నియోజకవర్గానికో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ నిర్మాణం
- జీనోమ్ వ్యాలీ ఫేజ్-2
- 65 ఐటీఐలలో స్కిల్ సెంటర్లు
- 3 జిల్లాల్లో గ్రీన్ ఫీల్డ్ ఫార్మా క్లస్టర్లు

విద్యారంగం

- ప్రతి ఊరిలో ప్రభుత్వ బడి
- స్టేట్ ఎడ్యుకేషన్ కమిషన్ ఏర్పాటు
- ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీల కోసం ఇంటిగ్రేటెడ్ క్యాంపస్‌లు
- ప్రభుత్వ స్థలాల్లో ఆదర్శ పాఠశాలలు
- టీచర్ల భర్తీకి నోటిఫికేషన్లు
- వైద్య, నర్సింగ్, ఫిజియోథెరపీ కళాశాలల నిర్మాణం

పట్టణాభివృద్ధి

- మూసీ పరివాహక ప్రాంత అభివృద్ధి
- మెహదీపట్నంలో స్కై వాక్ ఏర్పాటు
- హెచ్ఎండిఎ స్థలాల పరిరక్షణ
- లేఔట్ల క్రమబద్ధీకరణ

మైనారిటీ సంక్షేమం

- మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు.
- ఉర్దూ అకాడమీ ఏర్పాటు

చేయూత

- రూ.10 లక్షల రాజీవ్ ఆరోగ్యశ్రీ ఉచిత వైద్యం

ఉద్యోగ నియామకాలు

- టీఎస్పీఎస్సీకి నూతన కమీషన్ ఏర్పాటు
- 28 వేలకు పైగా నియామకాల భర్తీ
- 563 పోస్టలతో గ్రూప్-1
- 11,062 పోస్టలతో మెగా డీఎస్సీ
- 2008 డీఎస్సీ అభ్యర్థులకు ఉద్యోగాలు
- మహిళలకు 33 శాతం సమాంతర రిజర్వేషన్లు

పరిశ్రమలు - పెట్టుబడులు

- సీఎం దావోస్ పర్యటనతో రూ.40,232 కోట్ల పెట్టుబడులు
- 300 ఎకరాల్లో జీనోమ్ వ్యాలీ ఫేజ్-2
- ప్రభుత్వ బంజరు భూముల్లో పరిశ్రమల ఏర్పాటు
- టాటా టెక్నాలజీస్ రూ.2000 కోట్లు

మౌలిక రంగం

- నూతన పారిశ్రామిక వాడలు
- మెగా మాస్టర్ ప్లాన్ 2050
- ఒక్కో నియోజకవర్గానికి రూ.10 కోట్లు
- ఎన్టీపీసీ రామగుండం రెండో యూనిట్ ప్రారంభం
- రాజీవ్ రహదారి ఎలివేటేడ్ కారిడార్
- బోయిన్ పల్లి డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్
- పాతబస్తీ పైనుండి మెట్రో విస్తరణ
- NH-44పై కారిడార్ నిర్మాణం
- కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ

ఆరోగ్య తెలంగాణ

- రూ.10 లక్షల రాజీవ్ ఆరోగ్యశ్రీ ఉచిత వైద్యం
- అందరికీ డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కార్డులు
- బీబీనగర్ ఎయిమ్స్ లో పూర్తి స్థాయి వైద్య సేవలు
- డ్రగ్స్‌పై ఉక్కుపాదం

సాంస్కృతిక రంగం

- అధికారికంగా గద్దర్ జయంతి
- పద్మశ్రీ అవార్డు గ్రహీతలకు రూ.25 లక్షల నగదు, రూ.25 వేల పెన్షన్
- గద్దర్ విగ్రహ ఏర్పాటుకు చర్యలు
- కవులు, కళాకారులకు గద్దర్ అవార్డులు



గృహజ్యోతి

- 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్
- 41.78 లక్షల మందికి పైగా లబ్ధి

ఉద్యోగులకు అండగా ప్రభుత్వం

- ఉద్యోగులకు మొదటి తారీఖు జీతాలు
- ఆర్టీసి ఉద్యోగులకు 21 శాతం ఫిట్ మెంట్
- జీ.ఓ. 317, 46లపై కేబినెట్ సబ్ కమిటీలు
- సింగరేణి కార్మికులకు రూ.కోటి ప్రమాద బీమా

వ్యవసాయ రంగం

- రైతుకు పెట్టుబడి సాయం
- రాష్ట్ర రైతు కమిషన్ ఏర్పాటు
- నారాయణ పేట్ కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్
- పంటల బీమా పథకం ప్రారంభం
- ధరణి పోర్టల్ ప్రక్షాళనకు చర్యలు
- లక్షకు పైగా ధరణి సమస్యల పరిష్కారం
- కౌలు రైతుల రక్షణకు చట్టం తేవడానికి చర్యలు
- రూ.97 కోట్లతో రైతు నేస్తం

వెనుకబడిన వర్గాల అభ్యున్నతికై

- కులాల వారిగా 17 కార్పొరేషన్ల ఏర్పాటు
- కులగణనకు ఆమోదం
- గిరిజన కార్పొరేషన్ల ఏర్పాటు

గ్రామీణాభివృద్ధి

- తాగునీటికి నియోజకవర్గానికో రూ.కోటి ప్రత్యేక నిధులు
- రోడ్డు లేని 422 గ్రామాలు, 3177 ఆవాసాలకు తారు రోడ్డు

మహాలక్ష్మి


- రూ.500కే గ్యాస్ సిలిండర్
- 40 లక్షల మందికి పైగా లబ్ధి

ఇందిరమ్మ ఇండ్లు

- రూ.22,500 కోట్లతో 4.5 లక్షల మందికి ఇందిరమ్మ ఇండ్లు

తెలంగాణ చిహ్నాలు

- టీఎస్ నుంచి టీజీగా వాహనాల రిజిస్ట్రేషన్ మార్పు
- రాష్ట్రగీతంగా జయ జయహే తెలంగాణ
- ప్రభుత్వ అధికారిక చిహ్నంలో మార్పులు
- తెలంగాణ తల్లి విగ్రహంలో మార్పులు



ప్రగతి పథం.. సకల జనహితం.. మన ప్రజా ప్రభుత్వం.

జారీ చేసిన వారు: స్పెషల్ కమిషనర్, సమాచార పౌర సంబంధాల శాఖ, తెలంగాణ ప్రభుత్వం

జీవితంలో చెడు రోజులను ఎదుర్కోవడం ఎంతో కష్టంగా అనిపిస్తుంది. కానీ, మనలో దాగి ఉన్న ప్రతిభ, సామర్థ్యం, ధైర్యం గురించి మనల్ని మనం తెలుసుకునే సమయం ఇదే' అంటుంది భారతీ సుమారియా. జీవించాలనే ఆశను కోల్పోయి అత్తవారింటి నుంచి ఖాళీ చేతులతో బయటకు వచ్చేసిన ఆమె నేడు ఏడాదికి నాలుగు కోట్ల బిజినెస్ టర్నోవర్‌కి చేరుకునేంతగా ఎదిగింది. ముంబైలో పదేళ్ల క్రితం టూత్‌బ్రష్, టిఫిన్‌బాక్స్, వాటర్ బాటిల్ .. వంటి చిన్న చిన్న నిత్యావసర వస్తువులను ఉత్పత్తి చేసే పనిని ప్రారంభించి, ఒంటరి పోరాటంతో ఎదిగిన భారతీ సుమారియా ధైర్యం ప్రతి ఒక్కరికీ పాఠం అవుతుంది.

చేదు అనుభవాలే తీపి విజయాలకు మెట్లు


భారతీ సుమారియా

చేదు అనుభవాలే మనకు విజయవంతమైన మార్గానికి దారులు వేస్తాయి. దీనిని భారతీ సుమారియా చేసి చూపెట్టింది. సమస్యను సవాల్‌గా తీసుకొని ఎదిగిన వనితగా తనను తాను నిరూపించుకుంది. ఆ వివరాలు ఆమె మాటల్లోనే...

''నేను ముంబైలోని భివాండి ప్రాంతంలో పుట్టాను. కొన్నేళ్లకు ములుండ్‌కి వెళ్లాం. మా కుటుంబం సాధారణ మధ్యతరగతికి చెందినదే. ఆడపిల్లలకు ఎన్నో ఆంక్షలు. పదో తరగతి వరకు మాత్రమే చదవగలిగాను. పెళ్లయ్యాక వంటింటిని నడపాలి కానీ, ఆడపిల్లను చదివించి ఏం లాభం అనే మనస్తత్వం ఉన్న కుటుంబంలో పెరిగాను. అలా నా ప్రపంచం కూడా కుటుంబానికే పరిమితం అయ్యింది. నాకేమీ చేయాలనే కోరిక ఉండేది కాదు. నా ప్రపంచంలో నేను సంతోషంగానే ఉన్నాను. సక్సెస్ సాధించిన స్త్రీని చూసినా, అలాంటి వారి గురించి విన్నా, చదివినా నేను ఏదైనా చేయగలనా అనే ఆలోచన నా మదిలో మెదిలేది. కానీ, నా మనసులోని భావాలను కుటుంబ సభ్యులకు చెప్పుకునే ధైర్యం ఉండేది కాదు.

మహిళలకు మద్దతు లభించాలి

కష్టాల్లో ఉన్నప్పుడు ఎవరూ ఆదుకోకపోవడమే ఆడవాళ్లకున్న పెద్ద సమస్య. వాళ్ల అమ్మ ఇల్లు గానీ, అత్తమామల ఇల్లు గానీ తమ సొంతమని భావించరు. తల్లిదండ్రుల నుంచి ఆదరణ లభించక చాలా మంది మహిళలు ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. ఆసరా దొరికితే ఎంతోమంది ఆడపిల్లల ప్రాణాలు తీసుకోకుండా జీవించగలుగుతారు. ఈ విషయంలో నేను అదృష్టవంతురాలిని. నా పరిస్థితి చూసి మా తల్లిదండ్రులు నన్ను సొంతంగా వ్యాపారం చేయమని ప్రోత్సహించారు. నాన్న 3వ తరగతి వరకు మాత్రమే చదివారు. ముంబైలో బట్టల షాప్ పెట్టుకొని, మమ్మల్ని పోషించారు. మేం నలుగురం అక్కచెల్లెళ్లం. మా పెంపకం బాధ్యత అమ్మ తీసుకుంది. ఇంటిని చూసుకోవడంతో పాటు చుట్టుపక్కలవారితో ఎప్పుడూ కలుపుకోలుగా ఉండేది. ఇప్పుడు కూడా మా చుట్టుపక్కల వాళ్లకు సహాయం చేయడానికి అమ్మ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది.

పెళ్లితో మారిన జీవితం..

ఆడపిల్లలకు పెళ్లే జీవిత లక్ష్యంగా ఉన్న రోజుల్లో 20ఏళ్ల వయసులో నాకు వివాహం చేశారు. మా అమ్మానాన్నలు చెప్పినట్టుగా నా భర్త సలహాలను అనుసరించాను. అత్తమామల బాధ్యతలను నెరవేర్చడంలో తీరిక లేకుండా గడిపాను. అత్తింటిలో అడుగుపెట్టినప్పుడు అదే నా ప్రపంచం అయ్యింది. అయితే, నా భర్త ఏ పనీ చేసేవాడు కాదు. నేను ఆర్థికంగా స్వతంత్రురాలిని కాదు. నాకు ఏం చేయాలో అర్థం కాలేదు. నాకు, నా పిల్లలకు నోటిలో నాలుగు వేళ్లు పోక కనీసావసరాలు తీరక నా భర్త నాపై తన కోపాన్ని, చిరాకును ప్రదర్శించటం మొదలుపెట్టాడు. అప్పుడప్పుడూ చేయి కూడా చేసుకునేవాడు. ఇది నన్ను బాగా ప్రభావితం చేసింది. దీంతో నాకు ఆ ఇంట్లో ఉండటం కష్టంగా మారింది. మామగారు పనిచేసేవారు. కానీ, నా భర్త అస్సలు పనిచేసేవాడు కాదు. పిల్లల ఖర్చులు కూడా మామగారే భరించేవారు. 20 ఏళ్లు నా కోసం నేను ఎలాంటి షాపింగ్ చేయలేదు. మా అక్క బట్టలు నాకు ఇచ్చేది. వాటిని సంతోషంగా తీసుకునేదాన్ని. అత్తింట్లో రోజు రోజుకీ నా పరిస్థితి దిగజారడం మొదలయ్యింది. అమ్మ నా పరిస్థితి గమనించి పుట్టింటికి తీసుకు వచ్చింది. ఆ సమయంలో నేను చాలా నిస్సహాయంగా ఉన్నాను. జీవించాలనే కోరికను కూడా కోల్పోయాను. డిప్రెషన్‌కు గురయ్యాను. ఏం చేయాలో అర్థం కాక గంటల తరబడి మౌనంగా కూర్చునేదాన్ని. పిల్లల భవిష్యత్తు ఏమవుతుందో కూడా నాకు తెలియదు.

ఆరు లక్షల రూపాయలతో..

దీపావళికి, పుట్టిన రోజుకి నాన్న డబ్బులు ఇస్తుండేవారు. ఆ డబ్బు కూడా మా అత్తింట్లో ఖర్చయిపోయేది. దీంతో నాకు డబ్బు ఇవ్వకుండా డిపాజిట్ చేయమని, భవిష్యత్తులో ఉపయోగపడుతుందని చెప్పాను. అత్తింటి నుంచి బయటకు వచ్చాక ఏం చేయలేని పరిస్థితిలో నాన్న నాకోసం డిపాజిట్ చేసిన డబ్బు ఆరు లక్షలకు పెరిగిందని తెలిసింది. 2005లో ఆ ఆరు లక్షల రూపాయలతో 300 అడుగల విస్తీర్ణంలో ఉన్న ఓ ప్లేస్ అద్దెకు తీసుకొని టూత్‌బ్రష్, టిఫిన్‌బాక్స్, వాటర్‌బాటిల్ వంటి చిన్న చిన్న నిత్యావసర వస్తువులను తయారుచేసే పనిని ప్రారంభించాను. నా వ్యాపారాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు పగలు రాత్రి కష్టపడ్డాను. త్వరలోనే సిప్లా, బిస్లరీ వంటి పెద్ద బ్రాండ్‌ల నుండి ఆర్డర్లను పొందడం ప్రారంభించాను. ఈ రోజు నా ఫ్యాక్టరీ లక్షా ఇరవై వేల అడుగుల విస్తీర్ణంలో విస్తరించింది.

భయం బలంగా మారింది

ఎప్పుడూ పని కోసం ఇల్లు వదిలి వెళ్లలేదు. కానీ నాకు పని తప్ప వేరే మార్గం కనిపించలేదు. నా పిల్లలకు మంచి భవిష్యత్తు ఇవ్వాలని భావించి, రాత్రింబగళ్లు కష్టపడి పనిచేయడం మొదలుపెట్టాను. చెడు సమయాలు నన్ను నేను తెలుసుకునేలా చేశాయి. నా సామర్థ్యాలను తెలుసుకునే అవకాశం కల్పించింది. ఈ రోజు వెనక్కి తిరిగి చూసుకుంటే ఇదంతా ఎలా చేయగలిగాను అనే ఆశ్చర్యం కలుగుతుంది. ఎంతగా సహించానో అంతగా కష్టాలు పెరిగాయి. నాకు దేవుడి మీద అపారమైన నమ్మకం ఉంది. భగవంతుడు నా బలాన్ని గ్రహించి విజయపథంలో ముందుకు తీసుకెళ్లేందుకు చుట్టూ అలాంటి వాతావరణం సృష్టించాడని అనిపించింది. నా పురోభివృద్ధికి నా భర్త కోపం, తగాదాలే కారణమయ్యాయి. దాని వల్లనే నేను ఇదంతా చేయగలిగాను.

పిల్లలే నా ప్రపంచం

భార్యగా దృఢంగా ఉండలేకపోయినా పిల్లల కోసం ఎట్టి పరిస్థితుల్లోనూ అలిసిపోవడానికి, వదులుకోవడానికి సిద్ధంగా లేనని నన్ను నేను బలంగా తయారుచేసుకున్నాను. జీవించాలనే కోరిక కూడా కోల్పోయిన ఆ భారతి ఈమేనా అని అందరూ ఆశ్చర్యపోయారు. నా పిల్లల మంచి భవిష్యత్తు కోసం నేను కృషి చేయాల్సిందే అని గట్టిగా అనుకున్నాను. నేను నా పని మొదలుపెట్టినప్పుడు పిల్లలు నాకు పూర్తిగా మద్దతు ఇచ్చారు. అప్పట్లో నా కూతురు ఎనిమిదో తరగతి, కొడుకులిద్దరూ ఐదో తరగతి చదువుతున్నారు. నా కూతురు తన చదువుతో పాటు తన తమ్ముళ్లనూ చూసుకుంటుంది. నేను ఇంటికి వెళ్లడం లేట్ అయితే ఆమే స్వయంగా వంట చేసి, తమ్ముళ్లకు పెట్టి, తినిపించి, నిద్రపుచ్చేది.

పిల్లలను తండ్రి నుంచి దూరం చేయలేదు

ఎప్పుడూ పిల్లలను వారి తండ్రి నుంచి కానీ, వారి కుటుంబం నుంచి కానీ దూరం చేయలేదు. పిల్లలు తల్లిదండ్రులిద్దరి ప్రేమను పొందాలని నమ్ముతాను. భార్యాభర్తల మధ్య తగాదాల వల్ల పిల్లలు బాధపడకూడదు. పెళ్లయిన పాతికేళ్ల తర్వాత నా పిల్లలు వారి పూర్వీకుల ఇంట్లో ఉండకూడదని నిర్ణయించుకున్నారు. అక్కడ నుంచి మా ఇంటికి మారిపోయాం. నా పోరాటం నా పిల్లలను కూడా బలపరిచినందుకు సంతోషంగా ఉంది'' అని వివరిస్తుంది భారతీ సుమారియా.

కిచెన్ టిప్స్



- తోడు వేయడానికి తగిన మజ్జిగ లేక పెరుగు అందుబాటులో లేకపోతే పాలను గోరువెచ్చగా చేసి అందులో రెండు పచ్చి మిర్చి వేసి మూత పెట్టి.. ఆరేడు గంటలపాటు కదపకుండా పక్కన పెడితే పెరుగు గట్టిగా తోడుకుంటుంది.



- నిమ్మరసం చేసేటప్పుడు రసంతో పాటు నిమ్మ చెక్కలను కూడా అందులోనే వేసి కాసేపు ఉంచడం వల్ల.. మంచి ఫ్లేవర్, రుచితో పాటు పోషకాలు కూడా ఎక్కువగా అందుతాయి.



- సాధారణంగా అల్లం పేస్టును ఎప్పటికప్పుడు తాజాగా చేయడంతో పాటు కొంత స్టోర్ చేసి కూడా పెట్టుకుంటూ ఉంటాం. ఇది పాడవకుండా ఉండేందుకు అందులో చెంచా ఆవాల నూనె వేయాలి. ఇలా చేయడం వల్ల అల్లం పేస్ట్ పాడవకుండా ఉంటుంది.

మల్టీ టాలెంట్

మంజు వారియర్....పేరులోనే కాదు ఆమె వేసే ప్రతి అడుగులో సాహసం ఉంటుంది. కళకు సామాజిక స్పృహ జోడించి ముందుకు వెళుతోంది. యాక్టర్, రైటర్, డ్యాన్సర్, బ్రాండ్ అంబాసిడర్, ప్రొడ్యూసర్, సోషల్ యాక్టివిస్ట్‌గా బహుముఖ ప్రజ్ఞను సొంతం చేసుకుంది...

నారి వారియర్

కేరళలోని తిరువనంతపురం కల్పాక అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లోని మహిళా సభ్యులు సొంతంగా కూరగాయలు పండించడం ప్రారంభించారు. అందరూ ఆశ్చర్యపోయేలా పెద్ద వెజిటబుల్ గార్డెన్‌ను సృష్టించారు. 'కల్పాక క్వీన్స్'గా పేరు గాంచారు. వెజిటబుల్ గార్డెన్ సృష్టించడానికి కల్పాక క్వీన్స్‌కు 'హౌ వోల్డ్ ఆర్ యూ' అనే సినిమా స్ఫూర్తి ఇచ్చింది.

సమాజాన్ని సినిమా ప్రభావితం చేస్తుందా? సినిమాను సమాజం ప్రభావితం చేస్తుందా?... అనే చర్చ మాట ఎలా ఉన్నా సమాజంపై సినిమా చూపే ప్రభావం తక్కువేమీ కాదు. మంచి లక్ష్యానికి మంచి సినిమా వెన్నుదన్నుగా నిలుస్తుంది. మంజు వారియర్ రీఎంట్రీ మూవీ 'హౌ వోల్డ్ ఆర్ యూ' ఈ కోవకు చెందిన సినిమానే. మంజు వారియర్ ఈ సినిమాలో నిరూపమ రాజీవ్ అనే పాత్ర పోషించింది. నిరూపమ రాజీవ్ అనే వివాహిత టెర్రస్ ఫార్మింగ్‌కు సంబంధించిన ప్రయాణం సినిమా మూల కథ.


నృత్యం


సంగీతం
నటన

'స్త్రీలు తమలో ఉన్న శక్తి సామర్థ్యాలపై దృష్టి సారించి వెలికి తీస్తే ఎన్నో అద్భుతాలు సాధించవచ్చు అని చెప్పడానికి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి' అంటుంది వారియర్.

'హౌ వోల్డ్ ఆర్ యూ' సినిమా విడుదలైన తరువాత మంజు వారియర్ ఎక్కడికి వెళ్లినా మహిళలు దగ్గరికి వచ్చి 'మీ సినిమా స్ఫూర్తితో టెర్రస్ ఫార్మింగ్ మొదలు పెట్టాం' అని చెప్పేవాళ్లు.

ఆర్గానిక్ ఫార్మింగ్ ప్రాజెక్ట్ 'కుటుంబశ్రీ'కి బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంతో మంది మహిళలను ఆర్గానిక్ ఫార్మింగ్ వైపు నడిపిస్తోంది మంజు వారియర్.

పదిహేడు సంవత్సరాల వయసులో 'సాక్ష్యం' సినిమాతో మలయాళ చిత్రసీమలోకి అడుగు పెట్టిన వారియర్ 'తూవల్' 'కొట్టరం' 'సల్లాపం'...మొదలైన సినిమాలతో నటిగా మంచి పేరు తెచ్చుకుంది. చిత్రసీమలోకి రావడానికి ముందు దూరదర్శన్ సీరియల్స్‌లో నటించింది.

జెండర్-ఈక్వాలిటీని దృష్టిలో పెట్టుకొని కేరళ ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'జెండర్ పార్క్' ప్లాట్‌ఫామ్ బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న వారియర్ క్యాన్సర్ పేషెంట్‌ల కోసం హెయిర్ డొనేషన్ డ్రైవ్‌లను నిర్వహిస్తుంటుంది.

'చతుర్ముఖం' అనే మలయాళం సినిమాతో నిర్మాతగా తొలి అడుగు వేసింది మంజు. అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో ఈ చిత్రానికి అద్భుతమైన స్పందన వచ్చింది. 'సినిమా నిర్మాణంలో రిస్క్‌లు, బాధ్యతలు ఉంటాయి. నా చుట్టుపక్కల వాళ్ల సహకారంతో నిర్మాతగా ఎలాంటి సవాళ్లు, ఒత్తిడి ఎదుర్కోలేదు. 'కాయట్టం' సినిమాకు సహనిర్మాతగా ఉన్నప్పుడు చిత్ర నిర్మాణం గురించి సీరియస్‌గా ఆలోచించడం మొదలు పెట్టాను. నా జీవితంలో ఏది ప్లాన్ చేసుకోలేదు. ఆ సమయానికి ఏది ఆసక్తిగా ఉంటే అది చేస్తూ పోయాను. సినిమా నిర్మాణాన్ని నా జీవితంలో కొత్త ప్రయోగంగా భావిస్తాను' అంటుంది మంజు వారియర్.

క్లాసికల్ డ్యాన్సర్‌గా మంజు వారియర్ తెచ్చుకున్న పేరు తక్కువేమీ కాదు.


ఆర్గానిక్ ఫార్మింగ్ బ్రాండ్ అంబాసిడర్

స్కూల్లో చదువుకుంటున్న రోజుల నుంచి వారియర్ నాట్యప్రతిభ గురించి ప్రముఖ నాట్యకారుడు ఎన్వీ క్రిష్ణన్‌కు తెలుసు. 'మంజు గిఫ్టెడ్ డ్యాన్సర్. మన దేశంలోని అద్భుతమైన భరతనాట్య కళాకారులలో ఆమె ఒకరు' అంటాడు క్రిష్ణన్.

భరతనాట్యంలో పేరు తెచ్చుకున్న మంజు వారియర్ తన కూతురు మీనాక్షి డ్యాన్స్ టీచర్ గీతా పద్మకుమారన్ నుంచి కూచిపూడి నాట్యం నేర్చుకుంది. 'వారియర్‌కు కూచిపూడి నేర్పడం ఒక అద్భుత అనుభవం. తక్కువ సమయంలోనే డ్యాన్స్ నేర్చుకుంది. అద్భుతమై ఎక్స్‌ప్రెషన్స్ ఆమె సొంతం' అంటుంది గీత.

'సల్లాపం' అనే పుస్తకంతో రైటర్‌గా కూడా తన ప్రతిభ చాటుకుంది వారియర్. 'సల్లాపం' తన జ్ఞాపకాల సమాహారం. వీణ వాయించడం నేర్చుకున్న వారియర్ ఎన్నో వీడియోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. మంజు వారియర్ బహుముఖ ప్రతిభకు మరోసారి ఫిదా అయ్యారు అభిమానులు.

సంతోషమే నా బలం

ప్రాజెక్ట్ సక్సెస్ అయినా ఫెయిల్ అయినా... ఫలితంతో సంబంధం లేకుండా ఎప్పుడూ సంతోషంగా ఉండడానికే ప్రయత్నిస్తాను. సంతోషమే నా బలం. నా జీవితంలో ఎప్పుడూ ఏది ప్లాన్ చేసుకోలేదు. అయితే మంచి విషయాలు నా దారిలో ముందుకు వచ్చి కనిపిస్తాయి. వాటితో కలిసి ప్రయాణిస్తాను. సాహిత్య కార్యక్రమాల్లో మాట్లాడడానికి ముందు నేను ఎక్కడికి వెళ్తున్నానో, ఏం చెప్పబోతున్నానో, ప్రేక్షకులు ఎలా స్పందిస్తారో... ఇలా రకరకాలుగా ఆలోచిస్తుంటాను.

– మంజు వారియర్

రైతుబడి మాస్టారు!


జూలకంటి రాజేందర్ రెడ్డి

దేశరాజధాని నగరం న్యూఢిల్లీలోని ట్రిపుల్‌ఐటీ సంస్థ. ఇంద్రప్రస్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వేదిక మీద దేశవిదేశీ ప్రముఖుల సమక్షంలో ప్రసంగించవలసిందిగా ఆహ్వానం అందుకున్నాడు మన తెలుగు యువకుడు. నేడు జరగనున్న ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ సమ్మిట్-2024లో వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలలో యువతకున్న వ్యాపార అవకాశాల గురించి ప్రసంగించే అవకాశాన్నందుకున్న జూలకంటి రాజేందర్‌రెడ్డి ఈ సందర్భంగా 'సాక్షి'తో తన ప్రస్థానాన్ని పంచుకున్నారు.

''న్యూఢిల్లీ వేదికగా అది కూడా అత్యున్నత స్థాయి విద్యాసంస్థలో ప్రసంగించే అవకాశం నన్ను వెతుక్కుంటూ వచ్చింది. అంతకుముందు జాతీయ స్థాయిలో 'ద నేషనల్ క్రియేటర్స్ అవార్డు'కు సంబంధించిన 'మోస్ట్ ఇంపాక్ట్‌ఫుల్ అగ్రి క్రియేటర్' కేటగిరీలో 36 శాతానికి పైగా ఓట్లు సాధించి రైతుబడి చానెల్ ప్రథమస్థానంలో నిలిచింది. ఇందుకు అసలైన కార్యక్షేత్రం మా నల్గొండ జిల్లా, మాడ్గుల పల్లి మండలంలోని మాచనపల్లి గ్రామం. నా ఎదుగుదల మూలాలు మా ఊరిలోనే ఉన్నాయి. మాది వ్యవసాయ కుటుంబం. కానీ నేనెప్పుడూ పొలం పని చేయలేదు. నన్ను బాగా చదివించి మంచి ఉద్యోగం చేస్తుంటే చూడాలని కలలు కన్నారు అమ్మానాన్న. పనుల ఒత్తిడి ఉంటే సీజన్‌లో కూడా నాకు పొలం పనులు కాదు కదా, పశువుల దగ్గర సహాయానికి కూడా రానిచ్చేవారు కాదు. అలాంటిది ఇప్పుడు నా కెరీర్ వ్యవసాయ భూమిలోనే వేళ్లూనుకుపోయింది.

పలక... పేపర్!

అమ్మానాన్న కోరుకున్నట్లే చదువుకున్నాను. బీఈడీ చేసిన తర్వాత స్కూల్లో పలక మీద పిల్లలకు అక్షరాలు దిద్దించాల్సిన వాడిని, అనుకోకుండా కొత్తదారిలో అడుగుపెట్టాను. రోజూ పేపర్ చదివే అలవాటు ఉండడంతో ఓ రోజు జర్నలిజం కోర్సు ప్రవేశ పరీక్ష ప్రకటన నా కంటపడింది. ఉత్సాహం కొద్దీ పరీక్ష రాశాను. సెలెక్ట్ అయ్యాను. కానీ అక్కడ శిక్షణ పూర్తి చేయలేదు. కానీ 2008లో ఓ ప్రైవేట్ టీవీ చానెల్‌తో జర్నలిస్టుగా నా ప్రయాణం మొదలైంది. టీవీ చానెల్స్ మారుతూ కొంతకాలం హైదరాబాద్‌లో, మరికొంత కాలం జిల్లాల్లో ఉద్యోగం చేశాను. వార్తలకే పరిమితం కాకుండా ఫీచర్ స్టోరీల కోసం అన్వేషించేవాడిని. నా అన్వేషణలో కెమెరా కంటికి చిక్కిన ఓ వాస్తవం ఎంత ఆసక్తికరమైందో ఊహించగలరా!? కాకతీయుల వారసులు ఇప్పటికీ ఉన్నారు. ఎక్కడ ఉన్నారంటే... చత్తీస్‌గఢ్ రాష్ట్రం, జగదల్‌పూర్‌లో. 'కమల్ చంద్ర భంజ్ దేవ్ కాకతీయ' అక్కడ రాజు హోదాలో ఉన్నారు. వివరాలు సేకరిస్తూ వాళ్లను వెతుక్కుంటూ వెళ్లి షూట్ చేయడంలో కలిగిన జాబ్ శాటిస్‌ఫాక్షన్ ఇంత అని చెప్పలేను. ఇలా ఆరేళ్లు గడిచింది, అనుకోకుండా ఎలక్ట్రానిక్ మీడియా నుంచి ప్రింట్ మీడియాకి మారాను. అక్కడ ఆరేళ్లు పని చేశాను. ఉద్యోగం చేస్తున్నాను కానీ సంతృప్తి స్థాయి క్రమంగా తగ్గిపోసాగింది. ఎన్నాళ్లో... ఎన్నేళ్లో ఉద్యోగిగా నీ పయనం... అని నా ఆవేదనను ఫేస్‌బుక్‌లో రాసుకునేవాడిని.

నా విజయగాథ నేనే రాసుకున్నాను!

నాలో ఎడతెగని ఆలోచన మొదలైంది. ఎంతోమంది సక్సెస్ స్టోరీలు రాశాను. నా సక్సెస్ స్టోరీని నేను రాసుకోలేనా అనిపించింది. నాలుగు సంస్థల్లో పని చేశాను. సంస్థ పేరు నా ఇంటిపేరుగా నా పేరుకు ముందు చేరుతోంది. కానీ నా పేరే సంస్థ పేరు కాలేదా? ఆ మథనంలో నుంచి పుట్టుకొచ్చిందే రైతుబడి. రైతుబడి అనే అమృతం పుట్టడానికి ముందు నా మదిమథనంలో అనేక గరళాలు కూడా కోరలు సాచాయి. సూపర్‌మార్కెట్, 'రైతు పంట' పేరుతో రైతుల ఉత్పత్తుల విక్రయం, ఇన్ షాట్ తరహాలో 'లోకల్ న్యూస్ యాప్' పేరుతో ఓ న్యూస్ యాప్, అదే పేరుతో ఓ యూ ట్యూబ్ చానెల్... వీటిలో కొన్ని భారీ వైఫల్యాలు, మరికొన్ని పాక్షిక విజయాలనిచ్చాయి. ఆ తర్వాత మరో నాలుగు యూ ట్యూబ్ చానెళ్లు కూడా పెట్టాను. అవి విజయవంతం కాలేదు. కానీ నన్ను విజయపథంలో నడిపించే మార్గదర్శకాలయ్యాయి.

– జూలకంటి రాజేందర్ రెడ్డి,
సోషల్ ఇన్‌ఫ్లుయెన్సర్,
రైతుబడి యూట్యూబ్ చానెల్



కరోనా వచ్చింది... లాక్‌డౌన్ తెచ్చింది!

అది 2020, ప్రపంచానికి గుర్తొచ్చేది కరోనా, లాక్‌డౌన్. నాకు గుర్తొచ్చే అపురూపమైన ఘట్టం రైతుబడి ఆవిర్భావం. ఆ ఏడాది జనవరిలోనే రైతుబడి మొదలుపెట్టేశాను. ఉద్యోగం మానేయాలనే నిర్ణయానికి వచ్చాను. మేలో మానేశాను. ఆశ్చర్యం ఏమిటంటే... ఉద్యోగంలో అందుకున్న జీతానికి సమానమైన రాబడిని జూన్‌లోనే చూశాను. రైతులకు ఉపయోగపడే అంశాల మీదనే ఉంటాయి నా వీడియోలన్నీ. ఒకే పంట వేస్తున్న రైతులకు రకరకాల పంటలు వేయమని మాటలతో చెప్పడం వల్ల ప్రభావితం చేయలేం. ఏకకాలంలో రకరకాల పంటలు పండిస్తున్న రైతు అనుభవాలను వారి మాటల్లో వింటే సాటి రైతులు త్వరగా ప్రభావితమవుతారు. ఇదే నా సక్సెస్ ఫార్ములా. వ్యవసాయరంగ పరిశోధకులు, అధికారుల ద్వారా కూడా కొన్ని విషయాలు చెప్పించాను. కానీ రైతులు చెప్పిన విషయాలనే సాటి రైతులు గుర్తు పెట్టుకుంటున్నారు, ఆచరణలో పెడుతున్నారు. రైతులు కొందరు వ్యవసాయ పరికరాలను సొంతంగా తయారు చేసుకుంటారు, ఉన్న పరికరాలను తమ అవసరాలకు అనుగుణంగా మలుచుకుంటూ ఉంటారు. అలాంటి వాటిని కూడా బాగా చూపించేవాడిని. పంటలను, రైతులను వెతుక్కుంటూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తమిళనాడు, మహారాష్ట్రల్లో పర్యటించాను. లక్షకు పైగా కిలోమీటర్లు ప్రయాణించాను. పదమూడు వందలకు పైగా వీడియోలు చేశాను. నా రైతుబడికి పదమూడు లక్షలకు పైగా సబ్‌స్క్రైబర్‌లున్నారు. ఇప్పటి వరకు వన్ మ్యాన్ ఆర్మీలాగ నేనొక్కడినే పొలాలకు వెళ్లి కెమెరా ఆన్ చేసి రైతుతో మాట్లాడేవాడిని. ఆ ఫుటేజ్‌ని మా మంజుల (భార్య) ఇంట్లో ఎడిట్ చేసిచ్చేది. ఈ మధ్యనే ఒక టీమ్‌ను తయారు చేసుకున్నాను.

గుర్తు పడుతున్నారు!

'నాకు గుర్తింపు వచ్చింది' అనే పెద్ద మాట చెప్పను. కానీ ఇప్పుడు ఏ ఊరికి వెళ్లినా నన్ను గుర్తు పడుతున్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో వ్యవసాయం కోసం పని చేస్తున్న చానెళ్లలో రైతుబడి పెద్దది. ఇప్పుడు ఢిల్లీలో ప్రసంగించడానికి ట్రిపుల్ ఐటీ నుంచి ఆహ్వానం రావడానికి కారణం ఈ యూ ట్యూబ్ చానెలే. నేననుకున్నట్లే నా సంస్థపేరు నా పేరు కలిసి 'రైతుబడి రాజేందర్'నయ్యాను. ఇది కాకుండా నేను చేరాల్సిన లక్ష్యాలు రెండున్నాయి. ఒకటి... వ్యవసాయంలో అనుభవాలు పంచుతున్న రైతుబడి తరహాలోనే మరో వేదిక ద్వారా వ్యాపార అనుభవాలను యువతకు చేర్చడం, కొత్త ఎంటర్‌ప్రెన్యూర్‌లను తయారు చేయడం. ఇప్పటికే బిజినెస్ బుక్ పేరుతో ఆ ప్రయత్నం మొదలైంది. మరొకటి వ్యవసాయ భూమిని కొనుక్కోవడం. నేను డిగ్రీలో ఉన్నప్పుడు నాన్న పోయారు. అనివార్యమైన పరిస్థితుల్లో మా పొలాన్ని అమ్ముకున్నాం. కొద్దిగానైనా వ్యవసాయభూమిని కొని మా అమ్మకు బహుమతిగా ఇవ్వాలి. రైతు కుటుంబంలో పుట్టిన వాళ్లం భూమితో బంధాన్ని తెంచుకోలేం'' అన్నారు రాజేందర్‌రెడ్డి.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

శనివారం 16-3-2024

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 355

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




'రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు కళకళలాడాలి. పాడిపంటలతో పులకించిపోవాలి'



ధ్యానంతోనే మనస్సు నియంత్రణ

ప్రపంచ ఆధ్యాత్మిక సమ్మేళనంలో రాష్ట్రపతి ద్రౌపదీముర్ము - 10లో

సమ్మేళనానికి హాజరైన చినజీయర్ సహా వివిధ మతాల ఆధ్యాత్మికవేత్తలకు అభివాదం చేస్తున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము



పూర్తి వివరాలు ఎందుకివ్వలేదు

ఎలక్టోరల్ బాండ్ల విషయంలో పూర్తి సమాచారాన్ని ఎన్నికల సంఘానికి ఎందుకు ఇవ్వలేదని ఎస్‌బీఐని సుప్రీం ప్రశ్నించింది.

వివరాలు 6లో ▸



యడియూరప్పపై పోక్సో కేసు

బాలికపై అత్యాచారానికి పాల్పడ్డారన్న ఆరోపణలపై కర్ణాటక మాజీ సీఎం బీఎస్ యడియూరప్పపై పోక్సో కేసు నమోదైంది.

వివరాలు 6లో ▸



స్టే విధించలేం

నూతన ఈసీల నియామకంపై స్టే విధించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. దీనిపై మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని పేర్కొంది.

వివరాలు 6లో ▸



నేరముఠాల గుప్పిట్లో హైతీ!

ఒక దేశం మొత్తం నేర ముఠాల గుప్పిట్లోకి జారిపోతే? హైతీ దేశ దుస్థితి చూస్తుంటే యావత్ ప్రపంచమే అయ్యో అంటోంది.

వివరాలు 6లో ▸

ఎమ్మెల్సీ కవిత అరెస్ట్

ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో మనీలాండరింగ్ ఆరోపణలతో అరెస్టు చేసిన ఈడీ



ఈడీ అరెస్టు అనంతరం హైదరాబాద్‌లోని తన నివాసం నుంచి బయటకు వస్తూ పార్టీ శ్రేణులకు అభివాదం చేస్తున్న కవిత. చిత్రంలో కేటీఆర్, హరీశ్, బాల్క సుమన్

- శుక్రవారం మధ్యాహ్నం నుంచే కవిత నివాసంలో తనిఖీలు
- సాయంత్రం 5:20 గంటలకు అదుపులోకి తీసుకుంటున్నట్టు ప్రకటన
- కవిత ఇంటికి చేరుకున్న హరీశ్‌రావు, కేటీఆర్, బీఆర్‌ఎస్ నేతలు
- అరెస్టు అక్రమమంటూ ఈడీ అధికారులతో కేటీఆర్ వాగ్వాదం
- పూర్తి ఆధారాలతోనే అరెస్టు చేసినట్టు పేర్కొన్న ఈడీ అధికారులు
- భారీగా చేరుకున్న అభిమానులు.. వారి ఆందోళనతో స్వల్ప ఉద్రిక్తత
- కవితను ప్రత్యేక కాన్వాయ్‌లో ఎయిర్‌పోర్టుకు తీసుకెళ్లిన అధికారులు
- అక్కడి నుంచి విమానంలో 8:45 గంటలకు ఢిల్లీకి తరలింపు
- నేడు అక్కడి రౌస్ అవెన్యూ కోర్టులో హాజరుపర్చనున్న ఈడీ
- నేడు ఢిల్లీకి కేసీఆర్, కేటీఆర్.. న్యాయ నిపుణులతో చర్చించే చాన్స్

సాక్షి, హైదరాబాద్: ఢిల్లీ మద్యం విధానం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ వ్యవహారంలో మనీలాండరింగ్‌కు పాల్పడ్డారన్న ఆరోపణలపై బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఢిల్లీ ఈడీ (ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్) అధికారుల బృందం శుక్రవారం సాయంత్రం అరెస్టు చేసింది. బీఆర్‌ఎస్ శ్రేణుల ఆందోళన, పోలీసుల స్వల్ప లాఠీచార్జ్, నాటకీయ పరిణామాల మధ్య ఈడీ అధికారులు రాత్రి 8:45 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు తీసుకెళ్లి.. విమానంలో ఢిల్లీకి తరలించారు. ఈడీ జాయింట్ డైరెక్టర్ జోగిందర్ నేతృత్వంలోని 12 మంది

మిగతా 2వ పేజీలో ▶

కేసీఆర్‌ను నైతికంగా దెబ్బతీసే కుట్ర

- రాజకీయ లబ్ధి కోసం కాంగ్రెస్, బీజేపీ ప్రయత్నాలు: హరీశ్‌రావు
- నేడు రాష్ట్రవ్యాప్త నిరసనలకు పిలుపు

2లో

కలకలం.. ఉత్కంఠ!

- లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వెలువడే తరుణంలో కవిత అరెస్టుతో రాష్ట్రంలో రాజకీయ కలకలం

అధికార దుర్వినియోగం.. కక్ష సాధింపు: కేటీఆర్

కవిత విషయంలో ఈడీ తొందరపాటు చర్య.. దీనిపై సుప్రీంకోర్టుకు సమాధానం చెప్పాల్సి ఉంటుంది

2లో

కారణాలు చెప్పే అరెస్టు చేశాం

- కవిత సంతకం తీసుకుని వాంగ్మూలం నమోదు చేశాం
- పలు డాక్యుమెంట్లు, 5 ఫోన్లు సీజ్ చేశాం: పంచనామా నివేదికలో ఈడీ

శుక్రవారం హైదరాబాద్‌లోని మీర్జాలగూడ-మల్కాజిగిరి రోడ్ షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ. చిత్రంలో కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, బీజేపీ మల్కాజిగిరి అభ్యర్థి ఈటల రాజేందర్



మోదీ జోష్ షో

మీర్జాలగూడ నుంచి మల్కాజిగిరి దాకా సాగిన రోడ్ షో

మోదీ పక్కన కిషన్‌రెడ్డి, బీజేపీ మల్కాజిగిరి అభ్యర్థి ఈటల

ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రధానికి ప్రజల అభివాదం

సాక్షి, హైదరాబాద్: మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ప్రధాని మోదీ నిర్వహించిన రోడ్ షోకు వివిధ వర్గాల ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. పార్లమెంట్ ఎన్నికలకు ముందు ఏర్పాటు చేసిన ఈ రోడ్‌షో పార్టీ నాయకులు, కేడర్‌లో జోష్ నింపింది. ముఖ్యంగా మహిళలు, చిన్నారులు, ఇతర వర్గాల వారు రోడ్డుకు ఇరువైపులా, ఇళ్లపై, షాపింగ్, కమర్షియల్ కాంప్లెక్స్‌లపై నుంచి ప్లకార్డులు ప్రదర్శిస్తూ మోదీకి అభివాదం తెలిపారు. అబ్‌కీ బార్ 400 పార్...(ఈసారి 400 సీట్లు దాటాలి) ఇతర నినాదాలతో కూడిన ప్లకార్డులు ప్రదర్శించారు. ప్రధానిని ప్రత్యక్షంగా చూసే అవకాశం లభించడంపై పలువురు ఆనందం వ్యక్తం చేశారు. రోడ్‌షో సాగిన మార్గమంతా రెండువైపులా ఉన్న ప్రజలను మోదీ రెండు చేతులు ఊపుతూ పలకరించారు. ఈ సందర్భంగా డప్పు, డోలు, ఇతర వాయిద్య బృందాల ప్రదర్శనలు, తెలంగాణ సాంస్కృతిక కళారూపాలు ఆకట్టుకున్నాయి.

నేడు నాగర్‌కర్నూల్‌కు మోదీ

కేరళ నుంచి బయలుదేరి శుక్రవారం సాయంత్రం బేగంపేట ఎయిర్‌పోర్టులో దిగిన ప్రధానికి కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, ఇతర నేతలు స్వాగతం పలికారు. మోదీ నేరుగా మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని మీర్జాలగూడకు చేరుకున్నారు. అక్కడి నుంచి ప్రత్యేక ఓపెన్‌టాప్ వాహనంలో మల్కాజిగిరి దాకా దాదాపు 1.3 కి.మీ. దూరం

మిగతా 5వ పేజీలో ▶

తొలగిన పచ్చ ముసుగు



- వివేకా వర్ధంతి సాక్షిగా బట్టబయలైన రాజకీయ కుట్ర.. సౌభాగ్యమ్మ, సునీత, షర్మిల.. అంతా పచ్చ తానులో ముక్కలే
- చంద్రబాబు స్క్రిప్ట్ చదువుతూ ప్రజల్ని తప్పుదారి పట్టించే యత్నం
- మొదటి నుంచీ సౌభాగ్యమ్మ, సునీతది రాజకీయ ఆకాంక్షే.. అదే ఆరాటంతో చంద్రబాబు బృందంతో కుమ్మక్కు
- వివేకా ప్రత్యర్థులు, హంతకుల ముఠాతో జట్టు కట్టిన వైనం
- వివేకా రెండో వివాహంతో ఆ కుటుంబంలో తీవ్ర విభేదాలు

10లో



శుక్రవారం హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొంగులేటి, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

మైనారిటీ రిజర్వేషన్లు రద్దు చేయడం మోదీ వల్ల కాదు

- 4 శాతం రిజర్వేషన్ల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేసింది
- వర్సిటీల వీసీ నియామకాల్లో మైనారిటీలకూ అవకాశం కల్పిస్తాం
- మైనారిటీ గురుకులాల సొంత భవనాల నిర్మాణానికి ప్రత్యేకంగా నిధులు
- ఇఫ్తార్ విందులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- వివరాలు 11లో

ఎన్నికల షెడ్యూల్ నేడే

- మధ్యాహ్నం 3 గంటలకు ఎన్నికల సంఘం మీడియా సమావేశం.. ఈసారి నాలుగు లేక ఐదు దశల్లో సార్వత్రిక ఎన్నికలు
- లోక్‌సభతోపాటు ఆంధ్రప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్, ఒడిశా, సిక్కిం అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్
- ఏప్రిల్ రెండు లేదా మూడో వారంలో ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికలు!

6లో



నూతన ఈసీలు సంధూ, జ్ఞానేశ్‌లతో సీఈసీ రాజీవ్ కుమార్ (మధ్యలో)

బీఎస్పీకి రెండు లోక్‌సభ సీట్లు

- పొత్తులో భాగంగా ఇచ్చేందుకు అంగీకరించిన బీఆర్‌ఎస్
- నాగర్‌కర్నూలు, హైదరాబాద్ సీట్లలో బీఎస్పీ పోటీ
- ఇప్పటికే 11 స్థానాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులు ఖరారు
- పెండింగ్‌లో భువనగిరి, నల్లగొండ, సికింద్రాబాద్, మెదక్

10లో

కాంగ్రెస్‌లోకి దానం, పసునూరి!

- సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అయిన బీఆర్‌ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే, ఎంపీ
- 18న కాంగ్రెస్‌లో చేరిక!



సీఎం రేవంత్‌తో దానం

సాక్షి, హైదరాబాద్/బంజారాహిల్స్: బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ఓ సిట్టింగ్ ఎమ్మెల్యే, మరో సిట్టింగ్ ఎంపీ త్వరలో కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు రంగం సిద్ధమయ్యింది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్ శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యారు. దానం నాగేందర్ జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో ఆయన్ను కలిశారు. అరగంట సేపు జరిగిన ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, ఏఐసీసీ కార్యదర్శులు మన్సూర్ అలీఖాన్, విష్ణునాథ్, రోహిత్‌చౌదరి, ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రోహిన్‌రెడ్డి పాల్గొన్నారు. రెండు మూడురోజుల్లో మంచి

మిగతా 10వ పేజీలో ▶

సమగ్ర కులగణనకు సై

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- త్వరలో విధివిధానాలు ఖరారు

- వివరాలు 3లో

కాంగ్రెస్‌లోకి జితేందర్‌రెడ్డి

కేబినెట్ హోదాతో 2 పదవులు కేటాయింపు

5లో

కాంగ్రెస్ పాలన బాగానే ఉంది

శాసనమండలి చైర్మన్ గుత్తా





పొత్తులో భాగంగా తన నియోజక వర్గంలో ప్రచారం చేయించుకొని ఇప్పుడు ఇతని నియోజకవర్గంలో చేయనంటున్నాడట!



సీఎం జగన్‌తో కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం, ఆయన కుమారుడు గిరి

వైఎస్సార్‌సీపీలో చేరిన ముద్రగడ పద్మనాభం

- మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాసులురెడ్డి, జనసేన నేత వెంకటరమణ కూడా..

- వివరాలు 10లో

నేడు వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ప్రకటన

- 175 శాసనసభ, 25 లోక్‌సభ స్థానాలకు వెల్లడించనున్న ఏపీ సీఎం వైఎస్ జగన్
- ఇడుపులపాయలో దివంగత సీఎం వైఎస్సార్ ఘాట్ వద్ద ప్రకటన

10లో

ఢిల్లీ లిక్కర్ విధానం కేసు ఏంటి?

- 2021లో కొత్త విధానాన్ని తెచ్చిన ఢిల్లీ సర్కారు
- మద్యం షాపుల లైసెన్సులు, ఎక్సైజ్, వ్యాట్‌లలో భారీగా రాయితీలు... ఈ వ్యవహారంలో భారీగా ముడుపులు చేతులు మారినట్టు ఆరోపణలు

సాక్షి, న్యూఢిల్లీ: ఇంతకుముందు ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోదియా, ఇప్పుడు కల్వకుంట్ల కవిత వంటి ప్రముఖుల అరెస్టులతో ఢిల్లీ లిక్కర్ విధానం కేసు కలకలం రేపుతోంది. అసలు ఈ కేసు ఏమిటన్నది అంతటా చర్చనీయాంశంగా మారింది. ఢిల్లీలో మద్యం అమ్మకాలకు సంబంధించి అక్కడి ఆప్ ప్రభుత్వం 2021లో నూతన లిక్కర్ పాలసీని అమల్లోకి తెచ్చింది. సాధారణంగా ప్రభుత్వం టెండర్లు పిలిచి ప్రైవేటు వ్యక్తులకు మద్యం షాపులను అప్పగిస్తుంది. ఇందుకోసం లైసెన్స్ ఫీజును, మద్యం అమ్మకాలపై పన్నులను వసూలు చేస్తుంది. అయితే ఢిల్లీ ప్రభుత్వం తెచ్చిన కొత్త పాలసీలో.. మద్యం షాపుల లైసెన్సుల జారీ, పన్నుల్లో అపరిమిత రాయితీలు ఇచ్చింది. ఉదాహరణకు పాత విధానంలో ఒక 750 మిల్లీలీటర్ల మద్యం బాటిల్ హోల్‌సేల్ ధర రూ.166.71 అయితే.. కొత్త విధానంలో రూ.188.41కి పెంచారు. కానీ దానిపై ఎక్సైజ్ సుంకాన్ని రూ.223.89 నుంచి నామమాత్రంగా రూ.1.88కు, వ్యాట్‌ను రూ.106 నుంచి రూ.1.90కు తగ్గించారు. ఇదే సమయంలో షాపుల నిర్వాహకులకు ఇచ్చే మార్జిన్ (లాభం)ను రూ.33.35 నుంచి ఏకంగా రూ.363.27కు పెంచారు. బయటికి మద్యం ధరలు పెరిగినా.. ప్రభుత్వానికి భారీగా ఆదాయం తగ్గి, షాపుల నిర్వాహకులకు అతి భారీ లాభం వచ్చేలా పాలసీ రూపొందింది. దీనికితోడు మద్యం హోం డెలివరీ, తెల్లవారుజామున 3 గంటల దాకా షాపులు తెరిచిపెట్టుకునే వెసులుబాటునూ ప్రభుత్వం కల్పించింది. ఈ పాలసీ కింద 849 మద్యం షాపులను ప్రైవేట్ వ్యక్తులు/ కంపెనీలకు అప్పగించింది. ఇక్కడే ఆప్ ప్రభుత్వ పెద్దలు తమ సన్నిహితులకు భారీగా లాభం జరిగేలా వ్యవహరించారని ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో మద్యం పాలసీలో భారీగా అవకతవకలను గుర్తించిన ఢిల్లీ పోలీసు ప్రత్యేక విభాగం కేంద్రానికి, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌కు ఫిర్యాదు చేసింది. దీనితో ఈడీ, సీబీఐ కేసులు నమోదు చేశాయి.

రూపకల్పన నుంచే అక్రమాలంటూ..

ఢిల్లీలో మద్యం పాలసీ రూపకల్పన సమయం నుంచే అక్రమాలు చోటు చేసుకున్నాయని ఈడీ, సీబీఐ తమ దర్యాప్తులో గుర్తించాయి. కొందరిని అరెస్టు చేసి విచారణ జరిపాయి. ఈ క్రమంలో పలువురు మద్యం దుకాణాలు తమకు వచ్చేలా చేసుకోవడం, భారీగా లాభాలు వచ్చేలా పాలసీని ప్రభావితం చేయడం వంటి చర్యలకు పాల్పడ్డారని.. ఆప్ నేతలకు రూ.వందల కోట్లు ముడుపులు ఇచ్చారని వెల్లడైందని ఈడీ కోర్టులో దాఖలు చేసిన చార్జిషీట్‌లో పేర్కొంది. ఈ వ్యవహారంలో సౌత్ గ్రూపు పేరిట ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతోపాటు మరికొందరు భాగస్వాములు అయ్యారని ఆరోపించింది. వారి మధ్య పెద్ద మొత్తంలో లావాదేవీలు జరిగాయని, ఈ క్రమంలో మనీలాండరింగ్‌కు పాల్పడ్డారని పేర్కొంది. దీనికి సంబంధించి ఇప్పటికే పలుమార్లు కవితను ప్రశ్నించిన ఈడీ.. తాజాగా అరెస్టు చేసింది.



ఇంట్లో నుంచి బయటకు వస్తూ... కార్యకర్తలకు అభివాదం చేస్తున్న కవిత. చిత్రంలో కేకే, కవిత భర్త అనిల్, కేటీఆర్, కవిత కుమారుడు



భర్త అనిల్‌ను భావోద్వేగంతో హత్తుకుంటున్న కవిత



కవితను తీసుకెళ్తున్న వాహనాన్ని అడ్డుకుంటున్న బీఆర్‌ఎస్ కార్యకర్తలు



కవిత నివాసం వద్ద ఆందోళన చేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

ఎమ్మెల్సీ కవిత అరెస్ట్

▶ మొదటి పేజీ తరువాయి

ఢిల్లీ అధికారుల బృందం హైదరాబాద్ ఈడీ అధికారుల సహకారంతో శుక్రవారం మధ్యాహ్నమే హైదరాబాద్ బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 14లోని ఎమ్మెల్సీ కవిత నివాసానికి చేరుకుంది. సుమారు 1.45 గంటల సమయంలో సోదాలు ప్రారంభించారు. కవిత, ఆమె భర్త అనిల్‌కుమార్ సహా అక్కడున్నవారి సెల్‌ఫోన్లను సీజ్ చేశారు. సోదాల్లో పలు పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఢిల్లీ మద్యం విధానం కుంభకోణంలో కవిత మనీలాండరింగ్‌కు పాల్పడినట్టు ఆధారాలు లభించాయని, పీఎంఎల్‌ఏ యాక్ట్ (ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ యాక్ట్-2002)లోని 3, 4 సెక్షన్ల కింద అరెస్టు చేస్తున్నట్టు ఎమ్మెల్సీ కవితకు, ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అరెస్టుకు కారణాలను తెలియజేస్తూ 14 పేజీల కాపీని కవితకు అందజేశారు. తర్వాత సాయంత్రం 5.20 గంటల సమయంలో కవితను ఈడీ బృందం అరెస్టు చేసింది. దీనికి సంబంధించిన సమాచార లేఖను ఆమె భర్త అనిల్‌కుమార్‌కు అందించింది. కవితను ఢిల్లీకి తరలించేందుకు సిద్ధమైంది. ఢిల్లీ నుంచి వచ్చిన 12 మంది ఈడీ అధికారుల బృందంలో ఇద్దరు మహిళా అధికారులు ఉన్నారు.

తీవ్ర ఉద్రిక్తత మధ్య తరలింపు..

ఈడీ సోదాల విషయం తెలుసుకుని భారీ సంఖ్యలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కవిత నివాసం వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. ఈడీ సోదాలు కొనసాగినంత సేపూ నిరసన తెలిపారు. బీజేపీ, ప్రధాని మోదీకి, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సమయంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, హరీశ్‌రావు, ఇతర నేతలు, న్యాయవాదులు కవిత నివాసం వద్దకు చేరుకున్నారు. వారు లోనికి వెళ్లకుండా ఈడీ అధికారులు, పోలీసులు అడ్డుకున్నారు. దీనితో సుమారు ఇరవై నిమిషాల పాటు కేటీఆర్, హరీశ్‌రావు, ఇతర నేతలు గేటు వద్దే వేచి ఉన్నారు. ఒకదశలో బీఆర్‌ఎస్ శ్రేణులు గేటు తోసుకుని కవిత నివాసంలోకి వెళ్లేందుకు ప్రయత్నించాయి. దీనితో పోలీసులు బందోబస్తు పెంచారు. రోప్ పార్టీలను పిలిపించారు. స్వల్పంగా లాఠీచార్జి చేశారు. పలువురిని అదుపులోకి తీసుకున్నారు.



శంషాబాద్ ఎయిర్‌పోర్టులో భర్తతో కవిత

అరెస్టు అక్రమమంటూ వాగ్వాదం!

కొంతసేపటి తర్వాత కేటీఆర్, ఇతర నేతలు కవిత నివాసం లోపలికి వెళ్లారు. కవిత అరెస్టు అక్రమం, చట్టవ్యతిరేకమని ఈడీ అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా ఈడీ అధికారి భానుప్రియ మీనా కల్పించుకుని కేటీఆర్, ఇతర నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తనిఖీలు జరుగుతున్నప్పుడు అనుమతి లేకుండా లోపలికి వచ్చారని మండిపడ్డారు. వారందరినీ వీడియో తీయాలంటూ మరో ఈడీ అధికారిని ఆదేశించారు. ఈ సమయంలో కేటీఆర్ కలగజేసుకుని.. ''మేడం.. సెర్చ్ చేయడం అయిపోయింది. అరెస్టు వారెంట్ ప్రొడ్యూస్ చేసిన తర్వాత కూడా కుటుంబ సభ్యులు లోపలికి రావొద్దని ఎలా చెప్తున్నారు? ఎలాంటి ట్రాన్సిట్ వారెంట్ లేకుండా, మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చకుండానే కేసు చేస్తాను అంటున్నారు. కావాలనే శుక్రవారం వచ్చి అరెస్టు చేస్తున్నారు. మీరు (ఈడీ అధికారులు) ఎలాంటి చర్యలు తీసుకోబోమని సుప్రీంకోర్టుకు అండర్‌టేకింగ్ ఇచ్చారు. ఇప్పుడు దాన్ని మీరే ఉల్లంఘిస్తున్నారు. దీనివల్ల సీరియస్ ట్రబుల్‌లో పడతారు..'' అని కేటీఆర్ స్పష్టం చేశారు.

అందరికీ అభివాదం చేసి..

సుమారు 7 గంటల సమయంలో ఈడీ అధికారులు కవితను శంషాబాద్ విమానాశ్రయానికి తీసుకెళ్లేందుకు బయటికి వచ్చారు. ఈ సమయంలో కవిత ఉద్వేగానికి లోనయ్యారు. అక్కడే ఉన్న తన కుమారుడిని హత్తుకుని ముద్దుపెట్టుకున్నారు. కుమారుడి కన్నీటిని తుడిచి, త్వరగా వస్తానని చెప్పారు. ఆందోళన చేస్తున్న అభిమానులకు నమస్కరించారు. కవితను విమానాశ్రయానికి తీసుకెళ్లేందుకు ఈడీ అధికారులు పోలీసులతో కలసి ప్రత్యేక కాన్వాయ్ సిద్ధం చేశారు. అయితే కవిత తన భర్త అనిల్‌కుమార్ కారులో వస్తానని చెప్పారు. ఈడీ అధికారులు అంగీకరించడంతో భర్తతో కలసి కారులో బయలుదేరారు. ఈ కారు ముందు వెనుక ఈడీ, పోలీసు వాహనాలు కాన్వాయ్‌గా శంషాబాద్‌కు చేరుకున్నాయి. విమానాశ్రయం లోపలికి వెళ్లే సమయంలోనూ కవిత పిడికిలి ఎత్తి అభివాదం చేశారు. ఈడీ అధికారుల బృందం విస్తారా ఎయిర్‌లైన్స్‌కు చెందిన యూకే-870 విమానంలో రాత్రి 8.58 గంటలకు కవితను ఢిల్లీకి తరలించింది.

నేడు కేసీఆర్, కేటీఆర్ ఢిల్లీకి..

ఎమ్మెల్సీ కవిత అరెస్టు నేపథ్యంలో బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్‌రావు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావుతోపాటు మరికొందరు కీలక నేతలు శనివారం ఉదయం ఢిల్లీ వెళ్లనున్నారు. తండ్రిగా కేసీఆర్, సోదరుడిగా కేటీఆర్ నైతికంగా కవితకు అండగా నిలబడేందుకు, న్యాయ నిపుణులతో చర్చించేందుకు వెళ్తున్నట్టు పార్టీ వర్గాలు చెప్తున్నాయి. సుప్రీంకోర్టులో కవిత పిటిషన్ విచారణలో ఉన్న సమయంలో ఈడీ అరెస్టు చేసిన అంశాన్ని అత్యున్నత న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లాలని వారు భావిస్తున్నట్టు తెలిసింది. కవిత అరెస్టుతోపాటు తెలంగాణ, జాతీయ రాజకీయాలు, మోదీ–బీజేపీ విధానాలపై కేసీఆర్ జాతీయ మీడియాతో మాట్లాడే అవకాశం ఉందని సమాచారం.

నేడు కోర్టు ఎదుట హాజరు

కవితను ఢిల్లీకి తరలించిన ఈడీ అధికారులు శుక్రవారం రాత్రి ఆమెను ఈడీ కార్యాలయంలోనే ఉంచారు. శనివారం మధ్యాహ్నం ఆమెను ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో హాజరుపర్చనున్నట్టు సమాచారం.

లిక్కర్ కేసులో అరెస్టులు ఇవీ..

సమీర్ మహేంద్రు (ఇండో స్పిరిట్ యజమాని)	సెప్టెంబర్ 27, 2022
శరత్‌చంద్రారెడ్డి (ట్రైడెంట్ కెంఫర్ లిమిటెడ్)	నవంబర్ 10, 2022
వినయ్‌బాబు (ఫెర్నాడ్ రికార్డ్ కంపెనీ)	నవంబర్ 10, 2022
అభిషేక్ బోయినపల్లి (రాబిన్ డిస్ట్రిబ్యూషన్)	నవంబర్ 14, 2022
విజయ్ నాయర్ (మద్యం వ్యాపారి)	నవంబర్ 14, 2022
అమిత్ అరోరా (బడ్డీ రిటైల్ డైరెక్టర్)	నవంబర్ 30, 2022
గోరంట్ల బుచ్చిబాబు (కవిత మాజీ ఆడిటర్)	ఫిబ్రవరి 9, 2023
గౌతం మల్హోత్రా (మద్యం వ్యాపారి)	ఫిబ్రవరి 9, 2023
మాగుంట రాఘవ (మద్యం వ్యాపారి)	ఫిబ్రవరి 11, 2023
మనీశ్ సిసోదియా (ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం)	ఫిబ్రవరి 26, 2023
కల్వకుంట్ల కవిత (ఎమ్మెల్సీ)	మార్చి 15, 2024

ఈడీ తీరు చట్టవిరుద్ధం: కవిత న్యాయవాది మోహిత్‌రావు

సాక్షి, న్యూఢిల్లీ: ఎమ్మెల్సీ కవిత అరెస్టు విషయంలో ఈడీ చట్టవిరుద్ధంగా వ్యవహరించిందని సుప్రీంకోర్టులో ఆమె తరఫున వాదిస్తున్న న్యాయవాది మోహిత్‌రావు పేర్కొన్నారు. హైదరాబాద్‌లో కవిత అరెస్టు నేపథ్యంలో ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ కేసు విషయంలో సుప్రీంకోర్టులో కవిత వేసిన పిటిషన్ మంగళవారానికి వాయిదాపడిందని.. ఈ కేసులో కవితపై ఎటువంటి కఠిన చర్యలు తీసుకోబోమని ఈడీ గతంలో కోర్టుకు హామీ ఇచ్చిందని వివరించారు. సుప్రీంకోర్టులో విచారణ పూర్తయ్యే వరకు కఠిన చర్యలు తీసుకోబోమన్న ఈడీ హామీ వర్తిస్తుందని చెప్పారు. అయినా ముందస్తు పథకంలో భాగంగా సోదాల పేరిట వచ్చి కవితను అరెస్ట్ చేశారని.. విమానం టికెట్లు కూడా ముందుగానే బుక్ చేశారని ఆరోపించారు. కవిత ముందు న్యాయపరంగా చాలా అవకాశాలు ఉన్నాయని, అరెస్టును సుప్రీంకోర్టులో సవాల్ చేస్తామని తెలిపారు.

కలకలం.. ఉత్కంఠ!

- మరికొన్ని గంటల్లో వెలువడనున్న లోక్‌సభ షెడ్యూల్
- ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టు
- రాష్ట్ర రాజకీయ వర్గాల్లో కలకలం
- ప్రధాని హైదరాబాద్‌లో ఉండగా చోటు చేసుకున్న పరిణామంతో ఉత్కంఠ
- బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను నైతికంగా దెబ్బతీసేందుకేనన్న విమర్శలు

సాక్షి, హైదరాబాద్: పార్లమెంటు ఎన్నికల షెడ్యూల్ మరికొన్ని గంటల్లో వెలువడనుండగా, భారత్ రాష్ట్ర సమితి అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కుమార్తె, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఈడీ అరెస్టు చేయడం రాజకీయంగా తీవ్ర కలకలం సృష్టిస్తోంది. ఢిల్లీ మద్యం కుంభకోణంలో నిందితురాలుగా పేర్కొంటూ శుక్రవారం సాయంత్రం కవితను అరెస్టు చేసిన ఈడీ, రాత్రి ఢిల్లీకి తరలించడం ప్రకంపనలు సృష్టిస్తోంది. ప్రధాని నరేంద్ర మోదీ హైదరాబాద్ పర్యటన సమయంలో కవిత అరెస్టు జరగడం సర్వత్రా ఉత్కంఠను రేపింది. లిక్కర్ స్కామ్ సుమారు ఏడాదిన్నరగా నడుస్తుండగా, ఇప్పుడు సార్వత్రిక ఎన్నికల ముందు కవితను అరెస్టు చేయడం.. తమ పార్టీ అధినేత కేసీఆర్‌ను నైతికంగా దెబ్బతీసేందుకు చేసిన కుట్రగా బీఆర్‌ఎస్ విమర్శనాస్త్రాలు సంధించింది. ప్రజాక్షేత్రంలో రాజకీయంగా, కోర్టులో న్యాయపోరాటం చేస్తామని ఆ పార్టీ ప్రకటించినా, లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కవిత అరెస్టు అంశం రాజకీయ విమర్శలు, ప్రతి విమర్శలకు కేంద్ర బిందువుగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కోల్పోయిన బీఆర్‌ఎస్.. వంద రోజుల్లోనే కాంగ్రెస్, బీజేపీ నుంచి తీవ్ర ఒత్తిళ్లను ఎదుర్కొంటోంది. రాష్ట్రంలో అధికారం చేపట్టిన వెంటనే శ్వేతపత్రాలు, విచారణలు, కేసుల పేరిట కాంగ్రెస్ ముప్పేట దాడి చేస్తోంది. మరోవైపు బీఆర్‌ఎస్‌కు చెందిన సిట్టింగ్ ఎమ్మెల్యేలు, ఎంపీలతో పాటు కీలక నేతలను పార్టీలో చేర్చుకుంటూ ఒత్తిడి పెంచుతోంది. ఇంకోవైపు బీఆర్‌ఎస్‌ను రాజకీయంగా బలహీన పరచడం లక్ష్యంగా పావులు కదుపుతున్న బీజేపీ పార్టీ, బీఆర్‌ఎస్ నుంచి చేరికలను ప్రోత్సహిస్తోంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ కవిత అరెస్టుతో పాటు లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ అనుసరించే వ్యూహంపై పార్టీలోనూ, బయటా ఆసక్తి నెలకొంది.

తొలుత సీబీఐ..తర్వాత ఈడీ

ఢిల్లీ మద్యం కుంభకోణంలో సాక్షిగా పేర్కొంటూ 2022 డిసెంబర్ 3న కవితకు సీబీఐ నోటీసులు జారీ చేసింది. అదే ఏడాది డిసెంబర్ 6న సీబీఐ బృందం హైదరాబాద్‌లోని కవిత నివాసంలో ఆమెను విచారించింది. ఇదే కేసులో సమాంతర విచారణ జరుపుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) 2023 జనవరి నుంచి పలుమార్లు విచారణకు రావాల్సిందిగా నోటీసులు జారీ చేసింది. అయితే సుప్రీంకోర్టులో తన పిటిషన్ విచారణలో ఉన్నందున రాలేనంటూ కవిత పలుమార్లు సమాధానం ఇచ్చారు. చివరకు 2023 మార్చి 9న ఈడీ నోటీసులకు స్పందనగా అదే నెల11, 20 తేదీల్లో విచారణకు హాజరై తన వద్ద ఉన్న ఫోన్లు, సిమ్ కార్డులను అప్పగించారు. ఆ తర్వాత ఈడీ మరోమారు నోటీసు జారీ చేయగా, మహిళలను అరెస్టు చేసే అధికారం ఈడీకి లేదంటూ కవిత సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పలు దఫాలుగా వాయిదా పడుతూ వస్తున్న ఈ కేసు తాజాగా ఈ నెల 19కి వాయిదా పడింది.

ఏడాదిన్నరగా వేడి

కవిత వ్యవహారంపై ఏడాదిన్నరగా బీజేపీ, బీఆర్‌ఎస్ నడుమ విమర్శల యుద్ధం జరుగుతోంది. గత ఏడాది చివరలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు ముందు కవిత 'అరెస్టు'అంశంపై బీజేపీ పలుమార్లు కీలక వ్యాఖ్యలు చేసింది. ఎన్నికల్లోగా కవితను అరెస్టు చేయిస్తామంటూ బీజేపీ ముఖ్య నేతలు పలు సందర్భాల్లో ప్రకటించారు. మరోవైపు ఇప్పటివరకు కవితను అరెస్టు చేయకపోవడం బీజేపీ, బీఆర్‌ఎస్ కుమ్మక్కు రాజకీయాలకు నిదర్శనమని కాంగ్రెస్ విమర్శలు చేస్తూ వచ్చింది.

రాజకీయ, న్యాయ పోరాటం దిశగా బీఆర్‌ఎస్ అడుగులు

రాష్ట్ర సాధన ఉద్యమంలో తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలిగా క్రియాశీలంగా పనిచేసిన కల్వకుంట్ల కవిత, 2014 లోక్‌సభ ఎన్నికల వేదికగా క్రియాశీల రాజకీయాల్లోకి అడుగు పెట్టారు. నిజామాబాద్ ఎంపీ స్థానం నుంచి గెలుపొందిన కవిత 2019 ఎన్నికల్లో ఓటమి చవిచూశారు. ఈ నేపథ్యంలో 2020, 2022లో నిజామాబాద్ నుంచి స్థానిక సంస్థల కోటాలో శాసనమండలి సభ్యురాలిగా ఎన్నికయ్యారు. గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జగిత్యాల లేదా ఆర్మూరు నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తారని భావించినా అలా జరగలేదు. తాజాగా జరిగే లోక్‌సభ ఎన్నికల్లో నిజామాబాద్ నుంచి మరోమారు బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయాలని భావించారు. అయితే రెండు నెలల క్రితమే టికెట్ రేసు నుంచి తప్పుకున్నారు. కాగా కవిత అరెస్టు అంశాన్ని బీజేపీ, కాంగ్రెస్‌లు రాజకీయంగా తమకు అనుకూలంగా మలుచుకునే అవకాశం ఉందని భావిస్తున్న బీఆర్‌ఎస్ ఎదురుదాడి వ్యూహానికి పదును పెడుతోంది. కవిత అరెస్టును రాజకీయంగా ఎదుర్కోవడంతో పాటు న్యాయ పోరాటం చేసే దిశగా అడుగులు వేస్తోంది.

కారణాలు చెప్పే అరెస్టు చేశాం

పంచనామా నివేదికలో పేర్కొన్న ఈడీ అధికారులు

- కవిత సంతకం తీసుకుని వాంగ్మూలం నమోదు చేశాం
- ప్రశాంతంగా తనిఖీలు చేశాం.. పలు ఆస్తుల డాక్యుమెంట్లు, 5 ఫోన్లు సీజ్ చేశాం
- కవిత సోదరుడు, మరికొందరు చట్టవిరుద్ధంగా తనిఖీల చోటికి వచ్చి ఆటంకం కలిగించారు... సాయంత్రం 6.45కు తనిఖీలు ముగించామని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ కీలక నేత, ఎమ్మెల్సీ కవిత ఇంట్లో తనిఖీలు ప్రశాంతంగా సాగాయని, ఆమె వాంగ్మూలాన్ని నమోదు చేశామని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు ప్రకటించారు. శుక్రవారం కవిత నివాసంలో తనిఖీలు ముగిశాక పంచనామా నివేదికను విడుదల చేశారు. ఆ వివరాలు ''పంచ్‌లు (వీరి సమక్షంలో అధికారులు విచారణ చేస్తారు) బ్యాంక్ ఆఫ్ బరోడా చీఫ్ మేనేజర్ పి.శ్రీనివాస్‌రెడ్డి, బ్యాంక్ ఆఫ్ బరోడా సీనియర్ మేనేజర్ ఏద్దుల వివేకానందకుమార్‌రెడ్డి ఎదుట వివరాలు సేకరించాం. ఈడీ అదనపు డైరెక్టర్ కపిల్‌రాజ్ ఆదేశాల మేరకు హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని కవిత నివాసంలో శుక్రవారం తనిఖీలు నిర్వహించాం. మొదట తనిఖీల అధికారిక పత్రంపై కవిత సంతకాన్ని తేదీతో సహా తీసుకున్నాం. తర్వాత అదే పత్రంపై మేం కూడా తేదీతో సహా సంతకం చేశాం. మధ్యాహ్నం 1.45 గంటలకు తనిఖీలు ప్రారంభించాం. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ)-2002లోని సెక్షన్ 17 ప్రకారం కవిత వాంగ్మూలాన్ని నమోదు చేశాం. సెక్షన్ 19 ప్రకారం సాయంత్రం 5.20 గంటలకు ఆమెను అరెస్టు చేశాం. ఎందుకు అదుపులోకి తీసుకుంటున్నామో కారణాలను ఆమెకు వివరించాం. పలు రికార్డులు/ఆస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లతోపాటు 5 ఫోన్ల సీజ్ చేశాం. సాయంత్రం 4.15 గంటలకు అధికారి మమత నారా వెళ్లడంతో మరో అధికారి వరలక్ష్మి వచ్చి పాల్గొన్నారు. సుమారు సాయంత్రం 6 గంటల సమయంలో కవిత సోదరుడు, మరికొందరు వ్యక్తులు, న్యాయవాదులు చట్టవిరుద్ధంగా తనిఖీల ప్రాంతంలోకి వచ్చారు. వారెవరో మాకు వివరాలు చెప్పలేదు. విచారణకు ఆటంకం కలిగించారు. సాయంత్రం 6.45 గంటలకు తనిఖీలు ముగించాం. ప్రశాంతంగా, ఇంట్లోని ఏ వస్తువులకూ ఎలాంటి నష్టం కలగకుండా కొనసాగించాం. ప్రారంభంలో తనిఖీలను కవిత సున్నితంగా తిరస్కరించారు''అని పంచనామాలో ఈడీ అధికారులు వివరించారు. ఈ తనిఖీల్లో ఈడీ అసిస్టెంట్ డైరెక్టర్ జోగేందర్‌తో పాటు డిప్యూటీ డైరెక్టర్ భానుప్రియ, అసిస్టెంట్ డైరెక్టర్ సుమిత్‌గోయల్, అధికారులు విక్రాంత్‌కుమార్, కార్తీక్ మెహ్రా, హిమాన్షు చౌదరి, మమతా నారా, బ్రజేష్ చౌరాసియా పాల్గొన్నట్టు తెలిపారు.

అధికార దుర్వినియోగం.. కక్ష సాధింపు

- కవిత విషయంలో ఈడీ తొందరపాటు చర్య: మాజీ మంత్రి కేటీఆర్
- దీనిపై సుప్రీంకోర్టుకు సమాధానం చెప్పాల్సి ఉంటుంది
- బీజేపీ పాలనలో రాజ్యాంగ వ్యవస్థల దుర్వినియోగం
- చట్టబద్ధంగా పోరాటం కొనసాగిస్తామని వెల్లడి
- తెలంగాణ ఆత్మగౌరవంపై దెబ్బ: ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: పదేళ్ల బీజేపీ పాలనలో రాజకీయ ప్రత్యర్థులపై కక్ష సాధింపు కోసం అధికారాన్ని, రాజ్యాంగ వ్యవస్థలను దుర్వినియోగం చేయడం సర్వసాధారణంగా మారిందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు మండిపడ్డారు. ఎమ్మెల్సీ కవిత అరెస్టు అప్రజాస్వామికమని పేర్కొన్నారు. కవిత అరెస్టుపై కేటీఆర్ 'ఎక్స్ (ట్విటర్)'లో తీవ్రంగా స్పందించారు. ''ఈ కేసులో కవిత అరెస్టు విషయం సుప్రీంకోర్టు పరిధిలో ఉంది. అయినా ఈడీ తొందరపాటుతో, దుందుడుకుగా వ్యవహరించింది. ఈడీ స్వయంగా సుప్రీంకోర్టుకు ఇచ్చిన హామీ (అండర్ టేకింగ్)ని తుంగలో తొక్కి మరీ అరెస్టు చేయడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. దీనిపై ఈడీ సుప్రీంకోర్టుకు సమాధానం చెప్పాల్సి ఉంటుంది. 19వ తేదీన జరిగే సుప్రీంకోర్టు విచారణలో ఈ అంశం పరిగణనలోకి వస్తుందని ఆశిస్తున్నా. కచ్చితంగా న్యాయం గెలుస్తుంది. చట్టబద్ధంగా ఈ అంశంలో పోరాటం కొనసాగిస్తాం..''అని కేటీఆర్ పేర్కొన్నారు.

కవిత అరెస్టు అక్రమం: ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

మోదీ ప్రభుత్వం ఈడీని అడ్డుపెట్టుకుని కవితను అరెస్టు చేయడం అక్రమమని, ఈ బూటకపు అరెస్టును ఖండిస్తున్నామని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ''బీజేపీ కుటిల ఎత్తుగడలకు తలొగ్గకుండా తెలంగాణ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని బీఎస్పీతో బీఆర్‌ఎస్ పొత్తు పెట్టుకుంది. దీంతో మోదీ బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు తెరతీశారు. కవిత అప్రజాస్వామిక అరెస్టు తెలంగాణ ప్రజల ఆత్మగౌరవంపై దెబ్బకొట్టడమే. ఈ దుశ్చర్య కాంగ్రెస్, బీజేపీ లోపాయకారీ ఒప్పందంలో భాగమే..''అని ఆరోపించారు.



కవిత నివాసంలో ఈడీ అధికారులతో కేటీఆర్ వాగ్వాదం. చిత్రంలో హరీశ్‌రావు

ఓటమి భయంతో ప్రతిపక్షాలపై దాడులు

బీజేపీ ఓటమి భయంతో ప్రతిపక్ష పార్టీలు, నేతలను లక్ష్యంగా చేసుకుంటోందని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు, యూపీ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్ ఆరోపించారు. కవిత అరెస్టును ఖండించారు. ఇక శివసేన రాజ్యసభ సభ్యురాలు ప్రియాంక చతుర్వేది కూడా కవిత అరెస్టును ఖండించారు. బీజేపీ అణచివేత విధానాలు, అధికార దుర్వినియోగానికి వ్యతిరేకంగా పోరాడుతామన్నారు.


కేసీఆర్‌ను నైతికంగా దెబ్బతీసే కుట్ర

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఈడీ అరెస్టు చేయడం అప్రజాస్వామికం, అక్రమం, అనైతికమని ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు మండిపడ్డారు. కవిత అరెస్టును బీఆర్‌ఎస్ తీవ్రంగా ఖండిస్తోందని.. ఇది బీఆర్‌ఎస్ పార్టీని, పార్టీ అధినేత కేసీఆర్‌ను నైతికంగా దెబ్బతీసే ప్రయత్నంలో భాగమేనని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో రాజకీయంగా లబ్ధిపొందడానికే బీజేపీ, కాంగ్రెస్ కుమ్మక్కై కుట్ర పన్నాయని ఆరోపించారు. ఎమ్మెల్సీ కవిత అరెస్టు నేపథ్యంలో శుక్రవారం రాత్రి తెలంగాణభవన్‌లో మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి తదితరులతో కలసి హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''మాది ఉద్యమ పార్టీ, వేధింపులు, అరెస్టులు, కుట్రలు మాకు కొత్త కాదు. ఇలాంటి ఎన్నో కుట్రలు, అక్రమ కేసులు, అరెస్టులను ఛేదించి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించాం. కవిత అరెస్టును రాజకీయంగా, న్యాయపరంగా ఎదుర్కొంటాం. బీజేపీ అప్రజాస్వామిక చర్యలకు నిరసనగా శనివారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున నిరసన తెలపాల్సిందిగా బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులకు పిలుపునిస్తున్నాం.

రాజకీయ లబ్ధి కోసం కాంగ్రెస్, బీజేపీ ప్రయత్నాలు: హరీశ్‌రావు

- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టును ఖండిస్తున్నాం
- ఇది రాజకీయ ప్రేరేపితం.. అప్రజాస్వామిక చర్య
- కోర్టుకు సెలవులు ఉండేలా చూసి మరీ అరెస్ట్ చేశారు
- దీనిని రాజకీయంగా, న్యాయపరంగా ఎదుర్కొంటాం
- బీజేపీ దురుద్దేశపూరిత చర్యను ప్రజాక్షేత్రంలో నిలదీస్తామని వెల్లడి
- నేడు రాష్ట్రవ్యాప్త నిరసనలకు బీఆర్‌ఎస్ పిలుపు



మాట్లాడుతున్న హరీశ్‌రావు. చిత్రంలో జగదీశ్‌రెడ్డి, వేముల

ఎన్నికల ముందు కుట్ర: సుప్రీంకోర్టులో కేసు విచారణ జరుగుతుండగా శుక్ర, శనివారాల్లో సెలవు ఉంటుందని తెలిసి మరీ కవితను అరెస్టు చేశారు. రాజకీయంగా బీఆర్‌ఎస్‌ను దెబ్బతీయాలనే దురుద్దేశంతో, కుట్రతో ఈ అరెస్టు జరిగింది. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ ఎంపీలు, ఇతర నేతలు అనేక మార్లు కవితను అరెస్టు చేస్తామంటూ ఈడీ అధికారుల తరహాలో మాట్లాడారు. శనివారం లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వెలువడుతున్న నేపథ్యంలో కవితను అరెస్టు చేసి రాజకీయంగా లబ్ధి పొందేందుకు బీజేపీ కుట్ర పన్నింది.

బీఆర్‌ఎస్‌పై రాజకీయ కక్ష సాధింపు


ఈడీ కేసు అంశం శుక్రవారం సుప్రీంకోర్టులో విచారణకురాగా.. 19వ తేదీకి వాయిదా వేసింది. ఎలాంటి అక్రమ చర్యలకు పాల్పడబోమని సుప్రీంకోర్టుకు ఈడీ హామీ ఇచ్చింది. ఆ హామీని పక్కనపెట్టి శుక్రవారం సాయంత్రం కవితను అరెస్టు చేయడం అక్రమం. రాజకీయ ప్రేరేపితం. కవిత కోర్టుకు వెళ్లకుండా అడ్డుకునేందుకు మధ్యాహ్నం రెండు గంటల తర్వాత తనిఖీలంటూ ఈడీ అధికారులు వచ్చారు. ప్రణాళిక ప్రకారం ముందే విమానం టికెట్లు కూడా బుక్ చేశారు. శని, ఆదివారాల్లో కోర్టుకు సెలవులు కాబట్టి అక్రమ అరెస్టుకు ప్లాన్ చేశారు. ఇది ఎమర్జెన్సీని మించిన పరిస్థితి. గతంలో మా పార్టీకి చెందిన మాజీ మంత్రి గంగుల కమలాకర్ సహా అనేక మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల మీద ఈ తరహా ప్రయత్నాలు జరిగాయి. గతంలో ఎమ్మెల్యేల కొనుగోలుకు బీజేపీ ప్రయత్నాలు చేసింది. ఏడాదిన్నర క్రితం కవితను సాక్షిగా పేర్కొంటూ నోటీసులిచ్చి, ప్రస్తుతం నిందితురాలిగా చేర్చడం వెనుక రాజకీయ దురుద్దేశం దాగి ఉంది. కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు రాజకీయాలు, కుట్రలను బీఆర్‌ఎస్ ప్రజాక్షేత్రంలో ఎదుర్కొంటుంది..''అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

కేసీఆర్‌ను లొంగదీసుకునే ప్రయత్నం: జగదీశ్‌రెడ్డి

బీజేపీ ప్రభుత్వానికి ఎదురొడ్డి నిలిచిన కేసీఆర్‌ను బెదిరించి, లొంగదీసుకుని రాజకీ య లబ్ధి పొందే ఉద్దేశంలో భాగంగానే ఎమ్మెల్సీ కవిత అరెస్టు జరిగిందని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. వివిధ రాష్ట్రాల్లో తమకు అడ్డుగా ఉన్న ప్రతిపక్ష పార్టీల నేతలకు నోటీసులిచ్చి, బీజేపీలో చేరిన వెంటనే వెనక్కి తీసుకున్న ఘటనలు అనేకం ఉన్నాయన్నారు.

సుప్రీంలో విచారణ వాయిదా

కవిత పిటిషన్‌పై ఈ నెల 19న చేపడతామన్న ధర్మాసనం



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసుకు సంబంధించి బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత గతంలో వేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. ఈ కేసులో నళిని చిదంబరం, అభిషేక్ బెనర్జీల పిటిషన్లతోపాటు కవిత పిటిషన్ శుక్రవారం జస్టిస్ బేలా ఎం.త్రివేది, జస్టిస్ పంకజ్ మిత్తల్‌ల ధర్మాసనం ముందుకొచ్చింది. అయితే వీటిపై విచారణను ఈ నెల 19న చేపడతామని ధర్మాసనం పేర్కొంది. ఆ రోజున తొలి విచారణ ఐటమ్‌గా చేర్చాలని కోర్టు రిజిస్ట్రీని ఆదేశించింది.

ఎన్నికలకనుగుణంగా విచారణలుండవు: అమిత్ షా



సాక్షి, న్యూఢిల్లీ: బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత కేసు ఎప్పటి నుంచో జరుగుతోందని, ఆయా కేసుల విచారణ ఎన్నికల టైం టేబుల్‌కి అనుగుణంగా జరగదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. శుక్రవారం ఆయన ఇండియా టుడే కాంక్లేవ్‌లో మాట్లాడారు. విచారణ సంస్థల దుర్వినియోగమనే ప్రశ్న అసలు ఉత్పన్నం కాదని అన్నారు.

ఎల్లుండి నుంచే టెన్త్ పరీక్షలు

పరీక్ష సమయం తర్వాత 5 నిమిషాల వరకు విద్యార్థులకు అనుమతి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పదో తర గతి పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు దాదా పు పూర్తయ్యాయి. ఈ నెల 18 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు జరగనున్న ఈ పరీక్షలకు 11,469 పాఠశాలలకు చెందిన 5,08,385 మంది విద్యార్థులు హాజరు కా నున్నారు. ఇందులో బాలురు 2,57,952 మంది. బాలికలు 2,50,433 మంది ఉ న్నారు. అధికారులు మొత్తం 2,676 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. అధికా రులు పరీక్షలు రాసే విద్యార్థులకు ఇప్పటికే హాల్‌టికెట్లు, ప్రింటెడ్ నామినల్ రోల్స్‌ను పంపిణీ చేశారు. సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుల వద్ద ఈ హాల్‌టికెట్లను పొందే వీలు కల్పించారు. అంతే కాకుండా 'బీఎస్ఈ.తెలంగాణ.జీవోవీ.ఇన్' అనే వెబ్‌సైట్ ద్వారా కూడా హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం ఉంది.

5 నిమిషాల వరకు అవకాశం

పరీక్ష రాసే విద్యార్థులు ఉదయం 8.30 గంటలకల్లా పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని పరీక్షల విభాగం స్పష్టం చేసింది. 9.30 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుందని, మరో ఐదు నిమిషాల వరకు విద్యార్థులను అనుమతిస్తామని తెలిపింది. ఆ తర్వాత అనుమతిం చబోరని తెలిపింది.

సమగ్ర కులగణనకు సై!

ఉత్తర్వులు జారీ... త్వరలో విధివిధానాలు

సాక్షి, హైదరాబాద్: సామాజిక, విద్య, ఆర్థిక, ఉపాధి, రాజకీయాల్లో రాష్ట్రంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీల స్థితిగతులను పరిశీలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేసింది. ఈ ఏడాది ఫిబ్రవరి నాలుగో తేదీన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో సమగ్ర కులగణనకు నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. అదేవిధంగా ఇటీవల జరిగిన రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో భాగంగా అసెంబ్లీలో చర్చించి తీర్మానం చేసిన నేపథ్యం లో తాజాగా ప్రభుత్వం సమగ్ర కులగణనకు సంబంధిం చిన జీఓ ఎంఎస్ 26ను జారీ చేసింది. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం శుక్రవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా డోర్ టు డోర్ సర్వే నిర్వహించనున్నారు.

నిర్వహణకు రూ.150 కోట్లు...: ఈ సర్వే చేపట్టేం దుకు కనీసంగా రూ.150కోట్లు బడ్జెట్ అవసరమని ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించింది. సర్వే ఖర్చు కోసం నిధులను 2024–25 వార్షిక బడ్జెట్‌లో కేటాయిం చింది. ఈమేరకు తాజా ఉత్తర్వుల్లో బడ్జెట్ అంశాన్ని పొం దుపర్చింది. సర్వే నిర్వహణకు సంబంధించిన విధివిధానాలను త్వరలో ప్రకటించనున్నట్లు బీసీ సం క్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశ్వం ఉత్తర్వుల్లో వెల్లడించారు. సర్వే ఫలితాల ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలను బీసీలు, ఎస్సీ, ఎస్టీలకు అందిస్తారు.

జీఓ విడుదల హర్షణీయం: జాజుల శ్రీనివాస్‌గౌడ్

రాష్ట్ర ప్రభుత్వం తాజాగా సమగ్ర కులగణన జీఓ విడుదల చేయడం హర్షణీయమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ శుక్రవారం ఒక ప్రక టనలో పేర్కొన్నారు. బీసీల జనాభా లెక్కలను సేకరించేందుకు ఈ సర్వే ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.



పారదర్శకంగా గురుకుల నియామకాలు

గురుకుల బోర్డు చైర్మన్ ఆయేషా మస్రత్ ఖానమ్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు (టీఆర్ ఈఐఆర్‌బీ) ద్వారా చేపట్టిన నియామకాలన్నీ అత్యంత పారదర్శకంగా జరిగాయని, ఇందులో ఎలాంటి అనుమానాలకు తావులేదని బోర్డు చైర్మన్ ఆయేషా మస్రత్ ఖానమ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులను తప్పుదోవ పట్టించే ఉద్దేశంతో కొన్ని మీడియా సంస్థలు, సామాజిక మాధ్యమాలు ఇలాంటి వార్తలను ప్రచారం చేస్తున్నాయన్నారు. డిగ్రీ లెక్చరర్, జూనియర్ లెక్చరర్ ఫలితాల ప్రకటన, 1:2 నిష్పత్తిలో జాబితా వెల్లడి, వెబ్‌సైట్‌లో నమోదు తదితర ప్రక్రియంతా పారదర్శకంగా జరిగిందన్నారు. డెమో తేదీలను కూడా అదే రోజు ప్రకటించి.. ఫిబ్రవరి 19 నుంచి 22 వరకు పరీక్షలను నిర్వహించామని, ఫిబ్రవరి 28వ తేదీన డీఎల్ ఫలితాలను, 29వ తేదీన జేఎల్ ఫలితాలను ప్రకటించామని వివరించారు. మార్చి 4వ తేదీన అర్హత సాధించిన అభ్యర్థులకు నియామక పత్రాలు అందిం చామన్నారు. అమలులో ఉన్న నిబంధనల మేరకు అన్ని రిజర్వేషన్లు పాటించి ఎం పికలు చేసినట్లు ఆమె స్పష్టం చేశారు.

సింగరేణి టర్నోవర్ రూ.37 వేల కోట్లు

గత ఆర్థిక సంవత్సరంకన్నా 12 శాతం వృద్ధి



సాక్షి, హైదరాబాద్: సింగరేణి సంస్థ రికార్డు స్థాయి టర్నోవర్ నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 12 శాతం ఎక్కువగా 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.37 వేల కోట్లకుపైగా అమ్మకాలను సాధించబోతోంది. గత ఏడాది 33 వేల కోట్ల రూపాయల టర్నోవర్ సాధించిన సింగరేణి సిరులకొండ ఈ సంవత్సరం దానిని అధిగమించింది. ఈ మేరకు సింగరేణి సీఎండీ ఎన్.బలరాం శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. బొగ్గు అమ్మకాల ద్వారా రూ.32,500 కోట్లు, థర్మల్ విద్యుత్ కేంద్రం ద్వారా ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌ను విక్రయించడం ద్వారా రూ.4,500 కోట్ల టర్నోవర్ సాధించామని చెప్పారు. దేశంలోని నవరత్న కంపెనీలకన్నా మిన్నగా సింగరేణి అద్భుత పనితీరు కనబరిచిం దని, గత ఏడాది టర్నోవర్‌ను ఈ ఏడాది ఫిబ్రవరి చివరికే సాధించిందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 7 కోట్ల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయడంతో పాటు, అదే స్థాయిలో రవాణా జరపాలని లక్ష్యంగా నిర్దేశించుకున్న మేరకు రోజుకు 2.45 లక్షల టన్నుల ఉత్పత్తి, రవాణా ద్వారా లక్ష్యాన్ని సాధించబోతున్నామని వెల్లడించారు. 2017–18 తర్వాత తొలిసారిగా ఈ ఆర్థిక సంవత్సంలో 100 శాతం ఉత్పత్తి లక్ష్యాన్ని సింగరేణి చేరుకోబోతోం దన్నారు.

కాజీపేట-బల్లార్షా ప్రాజెక్ట్‌లో 151కి.మీ పనులు పూర్తి

దక్షిణ మధ్య రైల్వే వెల్లడి

సాక్షి, హైదరాబాద్: కాజీపేట –బల్లార్షా ట్రిప్లింగ్, విద్యుదీకరణ ప్రాజెక్ట్‌లో భాగంగా నిర్దేశించిన 202 కిలోమీటర్లలో ప్రస్తుతానికి 151 కిలోమీటర్ల పనులు పూర్తయినట్లు దక్షిణ మధ్య రైల్వే శుక్రవారం వెల్లడిం చింది. అందులో భాగంగానే ఆసిఫాబాద్ – రేచిని మధ్య 19 కిలోమీటర్ల దూరం వరకు విద్యుదీకరణ, మూడవ రైల్వే లైన్ పనులు పూర్తి చేసి ఉపయోగంలోకి తెచ్చినట్లు వివరించింది. గ్రాండ్ ట్రంక్ మార్గంలోని కాజీపేట –బల్లార్షా మధ్య ఉన్న ఈ సెక్షన్ దేశంలోని ఉత్తర ప్రాంతాన్ని దక్షిణ ప్రాంతంతో అనుసంధానించే కీలకమైన రైలు మార్గం. తెలంగాణ, మహారాష్ట్ర మధ్యనున్న ఈ రైలు మార్గం మెయిన్ లైన్ ప్యాసింజర్, సరుకు రవాణా తరలింపును పెంపొందించడానికి దోహదపడుతుందని తెలిపింది. తద్వారా ప్రస్తుతమున్న రెండు లైన్లపై అధిక ఒత్తిడిని తగ్గిస్తుం దని పేర్కొంది. కాగా, 151 కిలోమీటర్ల పనుల పూర్తి, మిగిలిన పనుల్లో పురోగతిపై దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ శ్రీ అరుణ్ కుమార్ జైన్ అధికారులను, సిబ్బందిని అభినందించారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కమిటీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల తోపాటు ఆయా సంఘాల ప్రతినిధు లు ఇచ్చిన వినతులను పరిశీలించి పరిష్కరించేందుకు ముగ్గురు సభ్యు లతో కమిటీ వేయాలని ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్‌చైర్మన్ చిన్నారెడ్డి నేతృత్వంలో రిటైర్డ్ ప్రొఫెసర్ కోదండరాం, ఐఏఎస్ అధికారి దివ్యను సభ్యులుగా నియమించారు.

సింగరేణి వర్కర్లకు ఉన్నత స్థాయి ఉద్యోగాలు

- ఇన్‌సర్వీస్ ఉద్యోగుల నుంచి దరఖాస్తులకు ఆహ్వానం
- 986 పోస్టులకు నోటిఫికేషన్లు
- డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, డిప్లొమా పూర్తిచేసిన వారికి మంచి అవకాశం
- రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో 20 రోజుల వ్యవధిలోనే రెండు నోటిఫికేషన్లు

సాక్షి, హైదరాబాద్: కారుణ్య నియామకాల ద్వారా సింగరేణి భూగర్భ గనుల్లో బదిలీ వర్కర్లు, జనరల్ వర్కర్లుగా పనిచేస్తున్న వారికి ఉన్నతస్థాయి ఉద్యోగాలు లభిం చనున్నాయి. ఇప్పటివరకు సింగరేణిలోని వివిధ విభాగాల్లో ఖాళీ అయిన 986 పోస్టులకు ఇన్‌సర్వీసు ఉద్యోగుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తూ సింగరేణి సంస్థ ఇటీవల రెండు నోటిఫికేషన్లను జారీ చేసింది. ఇందులో 204 అధికార హోదా కలిగిన పోస్టులుండగా, 782 టెక్నికల్ పోస్టులున్నాయి. కారుణ్య నియామకాలు పొందిన 16 వేల మంది యువకుల్లో డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్‌తో పాటు పాలిటెక్నిక్ డిప్లొమా, ఐటీఐలు పూర్తి చేసిన వారు ఎక్కువగా ఉన్నారని, వీరికి ఉన్నత ఉద్యోగావకాశాలు కల్పించేందుకే ఈ నోటిఫికేషన్లు విడుదల చేశామని సింగరేణి కార్యాలయ వర్గాలు శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశం మేరకు సింగరేణి సీఎండీ ఎన్.బలరాం నేతృత్వంలో 20 రోజుల వ్యవధిలోనే ఈ నోటిఫికేషన్లు విడుదల చేశామని తెలిపాయి. వీటితో పాటు మరో 599 ఎక్స్‌టర్నల్ పోస్టుల్లో కూడా సింగరేణి ఇన్‌సర్వీస్ ఉద్యోగులు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించామని, ఈ లెక్కన 1,585 ఉద్యోగాల కోసం సింగరేణి సిబ్బంది పోటీపడే అవకాశం లభించిందని తెలిపాయి. కాగా, సింగరేణి చరిత్రలో తొలిసారి పెద్ద ఎత్తున ఖాళీలు గుర్తించి నోటిఫికేషన్లు విడుదల చేశామని, ఉన్నతస్థాయి డిగ్రీలున్న సింగరేణి ఇన్‌సర్వీసు ఉద్యోగులకు ఇదో గొప్ప అవకాశమని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆ ప్రకటనలో సింగరేణి సీఎండీ ఎన్. బలరాం కోరారు.

న్యాయసేవా సర్వీసులపై లఘు చిత్రాలు

నేడు ప్రారంభించనున్న హైకోర్టు సీజే

సాక్షి, హైదరాబాద్: జాతీయ లీగల్ సర్వీసెస్ అథారిటీపై ప్రజల్లో అవగాహన కల్పిం చేందుకు రూపొందించిన 10 లఘు చిత్రాలను బంజారాహిల్స్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో శనివారం ఉదయం 11 గంటలకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే ప్రారంభించనున్నారు. ప్రజలందరి చెంతకు న్యాయ సేవలు చేరాలని, తద్వారా మెరుగైన జీవనాన్ని గడిపేందుకు అవకాశం కల్పించాలన్నదే ఈ చిత్రాల ప్రధాన ఉద్దేశం. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ రవి గుప్తా, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొంటారని రాష్ట్ర లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ సభ్య కార్యదర్శి ఎస్.గోవర్ధన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

జాతీయ పురస్కారాలను అందుకున్న సజ్జనార్



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు జాతీయ స్థాయిలో దక్కిన ఏఎస్ఆర్‌టీయూ ఎక్స్‌లెన్స్ అవార్డులను టీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ అందుకున్నారు. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ.. అసోసియేషన్ ఆఫ్ స్టేట్ రోడ్డు ట్రాన్స్ పోర్ట్ అండ ర్‌టేకింగ్స్ (ఏఎస్ఆర్‌టీయూ) ప్రతి ఏటా అందించే ప్రతిష్టాత్మకమైన ఐదు ఎక్స్‌లెన్స్ అవార్డు లను టీఎస్ఆర్టీసీ గెలుచుకున్న విషయం తెలిసిందే. 2022–23 ఏడాదికిగాను రహ దారి భద్రత, ఇంధన సామర్థ్య నిర్వహణ, సిబ్బంది సంక్షేమం, సాంకేతికత విని యోగం, తదితర కేటగిరీల్లో ఈ జాతీయస్థాయి పురస్కారాలు టీఎస్ఆర్టీసీకి దక్కాయి. ఢిల్లీలోని ఇండియా హాబిటేట్ సెంటర్‌లో శుక్రవారం జరిగిన నేషనల్ పబ్లిక్ బస్ ట్రాన్స్‌పోర్ట్ ఎక్స్‌లెన్స్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఏఎస్ఆర్‌టీయూ అధ్యక్షుడు, కేంద్ర రోడ్డు రవాణా,రహదారుల శాఖ కార్యదర్శి అనురాగ్ జైన్ ఈ అవార్డులను సజ్జనార్ నేతృత్వంలోని ఆర్టీసీ బృందానికి అందజేశారు.

కొత్తగా మూడు గిరిజన కార్పొరేషన్లు

ఆదివాసీ, ఏకలవ్య, లంబాడా ఫైనాన్స్ కార్పొరేషన్ల ఏర్పాటు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని షెడ్యూల్డ్ కులాల ఆర్థికాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభు త్వం కొత్తగా మూడు సహకార ఆర్థిక సంస్థలను ఏర్పాటు చేసింది. ఆదివాసీల కోసం కుమ్రంభీం – ఆదివాసీ కో–ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్, ఎరుకల సామాజిక వర్గం కోసం ఎరుకల కో–ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్, లంబాడా సామాజిక వర్గం కోసం సంత్ సేవాలాల్ లంబాడా కో–ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్లను ఏర్పాటు చేసింది. ఈ ఫైనాన్స్ కార్పొరేషన్ల ద్వారా ఆయా సామాజిక వర్గాల్లోని వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఆర్థిక చేయూత పథకాలను అమలు చేయనున్నారు. ఈ మేరకు రాష్ట్ర గిరి జన సంక్షేమ శాఖ కార్యదర్శి డాక్టర్ ఎ.శరత్ వేర్వేరుగా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కార్పొరేషన్ల విధివిధానాలను ప్రత్యేకంగా వెల్లడించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఈ నెల 30 నాటికి నివేదిక ఇవ్వండి

వ్యవసాయ కార్పొరేషన్లలో విచారణపై ప్రభుత్వం ఆదేశం

సాక్షి, హైదరాబాద్: గత పదేళ్ల కాలంలో వ్యవసాయశాఖ పరిధిలోని వివిధ కార్పొరేష న్లలో తీసుకున్న నిర్ణయాలు, వాటి ఫలితాలపై ఈ నెల 30వ తేదీ నాటికి నివేదిక ఇవ్వాలని విచారణ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. వివిధ కార్పొరేషన్లలో అక్రమాలు జరిగాయన్న ఫిర్యాదులు, ఆరోపణల నేపథ్యంలో వ్యవసాయశాఖ మం త్రి తుమ్మల నాగేశ్వరరావు ఇటీవల విచారణకు ఆదేశించడం తెలిసిందే. దీంతో విచా రణ అధికారులు ఆయా కార్పొరేషన్ల ఉన్నతాధికారులకు నోటీసులు జారీచేసి లిఖిత పూర్వకంగా సమాచారం కోరారు. కొన్ని కార్పొరేషన్ల వద్దకు వెళ్లి రికార్డులు పరిశీలిం చారు. కొన్ని కార్పొరేషన్లలో అవసరమైన రికార్డులను తీసుకెళ్లి పరిశీలిస్తున్నారు. ఒక కార్పొరేషన్‌కు చెందిన అన్ని ఫైళ్లు తీసుకెళ్లారు. సంబంధిత ఎండీలు, డైరెక్టర్లను కూడా విచారించారు. కొందరు విచారణాధికారులు కఠినంగా వ్యవహరిస్తున్నారని, తమను దొంగల్లా చూస్తున్నారని ఓ అధికారి వాపోయారు. విచారణలో భాగంగా కొన్ని సం స్థల్లో అక్రమాలు జరిగినట్లు ప్రాథమికంగా నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది.



ఓ దేవగణాల్లారా! మేము భగవంతుడిని ఆరాధిస్తూ మా చెవులతో కల్యాణ కారక విషయాలే వినేట్లు చేయండి. కళ్లతో కల్యాణదాయకమైన దృశ్యాలే చూచేట్లు చేయండి.

– ప్రశ్నోపనిషత్తు

సాక్షి

శనివారం, 16 మార్చి 2024

రష్యాలో ఎన్నికల తంతు!

ఆపద్ధర్మ ఏలుబడితో కలుపుకొని ప్రధానిగా, దేశాధ్యక్షుడిగా పాతికేళ్లనుంచి అవిచ్ఛిన్నంగా రష్యా అధికార పీఠాన్ని అంటిపెట్టుకునివున్న వ్లాదిమిర్ పుతిన్ మరోసారి సార్వత్రిక ఎన్నికల తంతుకు తెరలేపారు. మూడురోజులపాటు జరిగే ఈ ఎన్నికలు శుక్రవారం మొదలయ్యాయి. 14 కోట్ల 30 లక్షలమంది జనాభాగల రష్యాతోపాటు 2014లో అది దురాక్రమించిన క్రిమియా... 2022 నుంచీ దాని ఆక్రమణలోవున్న ఉక్రెయిన్‌లోని కొన్ని ప్రాంతాల్లో కూడా ఈ ఎన్నికలు జరుగుతాయి. ప్రభుత్వ మీడియా మినహా మరి దేనికీ చోటీయని రష్యాలో చిన్నపాటి అసమ్మతి వినిపించే ప్రయత్నం చేసినా పెద్ద నేరమవుతుంది. అందుకే ఎన్నికల ముందు నిర్వహించిన సర్వేలన్నీ పుతిన్‌కు 80 శాతం ప్రజల ఆమోదం వున్నదని చాటాయి. కనుక 71 యేళ్ల పుతిన్ మరోసారి విజయం సాధించి అయిదోసారి అధ్యక్షుడవుతారనీ, 2030 వరకూ ఆయనే పాలిస్తారనీ అందరికీ తెలుసు. ఈ ఎన్నికలు సక్రమంగా జరుగుతున్నాయని చెప్పటానికి నామమాత్రంగా ప్రత్యర్థులు కనబడతారు. కానీ వారెవరికీ ప్రజల్లో విశ్వసనీయత లేదు. ఒకప్పుడు దశాబ్దాలపాటు దేశాన్నేలిన కమ్యూనిస్టు పార్టీ ఏనాడో నామ మాత్రావశిష్టమైంది. ఆ పార్టీ తరఫున 75 యేళ్ల నికొలాయ్ ఖరిటోనోవ్ పోటీచేస్తున్నారు. 2004లో పుతిన్‌పై మొదటిసారి ఓడిన ఆయన్నే ఈసారి కూడా ఆ పార్టీ నిలబెట్టింది. ఎటూ గెలవని ఎన్నికల కోసం మరొకరిని ముందుకు తోయటం అనవసరమని ఆ పార్టీ భావించివుండొచ్చు. లిబరల్ డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థి లియోనెడ్ స్లట్‌స్కీ... పుతిన్ మాదిరే జాతీయవాది. ఆయన గెలుపే తన గెలుపని స్లట్‌స్కీ ఇప్పటికే ప్రకటించారు. ఉదారవాదిగా ముద్రపడి ఉక్రెయిన్‌లో 'శాంతి' నెలకొనాలని తరచు చెప్పే న్యూ పీపుల్ పార్టీ అధినేత వ్లాడిస్లావ్ దవాన్‌కోవ్‌ది కూడా అదే తీరు. ఇక ఉక్రెయిన్‌తో తలపడటాన్ని తప్పుబట్టిన చరిత్రగల ఇద్దరు అభ్యర్థులను అధికారులు 'అనర్హులుగా' తేల్చారు.

చాలా దేశాలకు ఇది ఎన్నికల నామ సంవత్సరం. ఇప్పటికే బంగ్లాదేశ్, తైవాన్ ఎన్నికలు పూర్తయ్యాయి. మన దేశంతోపాటు అమెరికా, బ్రిటన్, దక్షిణాఫ్రికా, ఇండొనేసియా తదితర 60 దేశాల్లో ఈ ఏడాదంతా వేర్వేరు నెలల్లో ఎన్నికలుంటాయి. ఈ ఎన్నికల్లో దాదాపు 200 కోట్లమంది ఓటు హక్కు వినియోగించుకుంటారు. అంటే ప్రపంచ జనాభాలో నాలుగోవంతన్నమాట! అయితే విజేతలై గద్దెనెక్కేవారు ప్రజాస్వామ్యబద్ధంగానే పాలిస్తారా అన్నది వేరే సంగతి. ఎందుకంటే ప్రజాస్వామ్యం ముసుగేసుకున్న నియంతలూ, సమాజంలో పరస్పర వైషమ్యాలు రెచ్చగొట్టే నేతలూ, గాలి కబుర్లతో గద్దెనెక్కాలనుకునేవారూ ఈ దేశాలన్నిటా వున్నారు. కానీ పుతిన్ మాదిరి బరితెగించిన నేత ఎక్కడా కనబడరు. క్రితంసారి ఎన్నికలకన్నా ఎక్కువ పోలింగ్ అయిందనీ, పుతిన్‌కు అధిక శాతం మద్దతు లభించిందనీ 'నిరూపించటానికి' అధికారగణం ఎక్కడలేని పాట్లూ పడుతూ వుంటుంది. 2018 ఎన్నికల సమయంలో పోలైన ఓట్లలో పుతిన్‌కు 5 కోట్ల 60 లక్షల ఓట్లు లభించాయి. కనుక ఈసారి అది ఆరు కోట్లు దాటాలన్నది వారి పట్టుదల. తమ అధీనంలోని ఉక్రెయిన్ భూభాగంలో 45 లక్షలమంది ఓటర్లున్నారని అధికారులు చెబుతున్నారు. కానీ నిత్యం బాంబుల వర్షం కురిసేచోట నిజానిజాలు నిర్ధారించేదెవరు? వారందరికీ ఆన్‌లైన్ వోటింగ్‌కు అవకాశం ఇచ్చామని అధికారులు ప్రకటించారు. కనుక రిగ్గింగ్ ఈసారి పాత రికార్డులు బద్దలుకొడుతుందని నిర్ధారణగా చెప్పవచ్చు. వారం పదిరోజుల్లో ఉక్రెయిన్ లెక్క తేల్చి, యుద్ధ విజేతగా చాటుకుని అధ్యక్ష ఎన్నికలకు వెళ్లాలని పుతిన్ తపించారు. కానీ 2022 ఫిబ్రవరిలో యుద్ధం మొదలైన నాటి నుంచీ రష్యాకు అడుగడుగునా అవరోధాలే. అమెరికా ఉక్రెయిన్‌కు భారీయెత్తున సైనిక, ఆర్థిక సాయం అందించటమే కాదు...'ఉక్రెయిన్ తర్వాత మీవంతే' అని నాటో కూటమి దేశాలను బెదరగొట్టి ఆ దేశం పక్షాన నిలబడేలా చేసింది. కనుక యుద్ధం రెండేళ్లుదాటి మూడో సంవత్సరంలోకి ప్రవేశించినా పుతిన్‌కు అక్కడ దారీ తెన్నూ కనబడటం లేదు. పైపెచ్చు ఆ యుద్ధంలో రష్యా సైనికులు భారీ యెత్తున మరణిస్తుండటం, అత్యాధునిక ఆయుధాలు అక్కరకు రాకుండా పోవటం, ఉక్రెయిన్ డ్రోన్ దాడులను నిలువరించటంలో వైఫల్యం వంటివి ఆయనకు నిరాశ కలిగిస్తున్నాయి. కానీ ఆ యుద్ధం వల్ల పుతిన్‌కు జనాల్లో ఆమోదనీయత పెరిగిందని ప్రభుత్వ మీడియా ఊదరగొడుతోంది.

అయితే పుతిన్ ఏలుబడి నల్లేరు మీద నడక కాదు. 2006-08 మొదలుకొని రెండేళ్లనాడు మొదలైన ఉక్రెయిన్ దురాక్రమణ యుద్ధం వరకూ ఏదో పేరిట చెలరేగే నిరసనలు తలనొప్పిగానే వున్నాయి. అవినీతికి వ్యతిరేకంగా, హక్కుల ఉల్లంఘన, దురాక్రమణ యుద్ధాలను నిరసిస్తూ ఈ ఉద్యమాలు సాగాయి. అయితే పుతిన్ వాటన్నిటినీ అణిచేసి, జైళ్లు నింపారు. ప్రస్తుతం రాజకీయ ఖైదీల సంఖ్య 1,16,000 పైమాటే. దేశ పౌరుల్లో పుతిన్ పాలనపై తీవ్ర అసంతృప్తి వుంది. ప్రభుత్వ వ్యయంలో 40 శాతం యుద్ధానికే కేటాయించాల్సివస్తోంది. అయినా ఫలితం నాస్తి. నిరుడు జీడీపీ 3.6 శాతంగా నమోదై జీ-7 దేశాలను అధిగమించింది. రక్షణరంగ పరిశ్రమలు మాత్రమే పచ్చగా వర్ధిల్లుతున్నాయి. అమెరికా ఆంక్షల పర్యవసానంగా దేశంలో అనేక వ్యాపార సంస్థలు కుప్పకూలి మూతబడ్డాయి. వాస్తవాదాయాలు పడిపోయి, నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటి పౌరులు సతమతమవుతున్నారు. దానికితోడు అంతర్జాతీయంగా ఏకాకులమయ్యామన్న అసంతృప్తి అదనం. కానీ అధ్యక్ష ఎన్నికల్లో వీటి ప్రభావం కనబడనీయకపోవటం పుతిన్ ప్రత్యేకత. ఈ రీతి, రివాజు ఎన్నాళ్లు కొనసాగుతుందో, నిజమైన ప్రజాస్వామ్యం రష్యాలో ఎప్పుడు చిగురిస్తుందో చూడాలి.


గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు ఫాల్గుణ మాసం, **తిథి:** శు.సప్తమి తె.2.38 వరకు (తెల్లవారితే ఆదివారం), తదుపరి అష్టమి, **నక్షత్రం:** రోహిణి రా.9.03 వరకు, తదుపరి మృగశిర, **వర్జ్యం:** ప.1.10 నుండి 2.42 వరకు, తదుపరి తె.2.42 నుండి 4.18 వరకు (తెల్లవారితే ఆదివారం), **దుర్ముహూర్తం:** ఉ.6.11 నుండి 7.45 వరకు, **అమృతఘడియలు:** సా.5.57 నుండి 7.37 వరకు.

సూర్యోదయం : 6.10
సూర్యాస్తమయం: 6.06
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

రైతు బాగే దేశ స్వావలంబన

విశ్లేషణ



డా॥ దొంతి నరసింహా రెడ్డి

పంటల ఉత్పత్తి ఖర్చు నిర్ధారణలో అనేక లోపాలు ఉన్నాయి. ఉత్పత్తి ఖర్చును రాష్ట్రాల వారీగా సేకరించి, దానిని దేశ 'సగటు'గా మార్చడం వల్ల రైతులకు నష్టం జరుగుతున్నది. ఒకే పంటకు దేశ వ్యాప్తంగా సాగు ఖర్చులో తేడా ఉంటుంది. ప్రతి పంటలో అనేక వెరైటీలు ఉన్నా ఒకే మద్దతు ధర ఉంటుంది. వరిలో కొన్ని వందల రకాలున్నా, కనీస మద్దతు ధర అన్నింటికీ ఒకటే. ఈ తేడాలను కనీస మద్దతు ధర నిర్ణాయక వ్యవస్థ పరిగణనలోనికి తీసుకునే పరిస్థితి లేదు. ధరలు రాని పంటలను రైతులు వేయడం మానేస్తారు. ఆ పంటలు వేయడం మానేస్తే, పంట పండించే జ్ఞానం, నైపుణ్యం కోల్పోతాము. క్రమంగా, స్వావలంబన కోల్పోతే ఇతర దేశాల పెత్తనానికి దాసోహం కావాల్సి వస్తుంది.

వ్యవసాయ ఖర్చులు ధరల కమిషన్ (సీఏసీపీ) కేవలం మద్దతు ధరను సిఫారసు చేస్తుంది. సిఫారసు చేసిందే కేంద్ర ప్రభుత్వం నిర్ణయించాలని లేదు. ఉదా: 2023–24 రబీ సీజన్లో గోధుమలకు వారు క్వింటాలుకు రూ. 2,300 సిఫారసు చేస్తే, క్యాబినెట్ ఆమోదించింది రూ. 2,125 మాత్రమే. కనీస మద్దతు ధర నిర్ణయంలో కనీసం 12 అంశాలను పరిశీలిస్తారు. అయితే 12 అంశాలలో ఉత్పత్తి ఖర్చు తప్పితే, మిగతా అంశాలు కనీస మద్దతు ధర నిర్ణయంలో ఎటువంటి పాత్ర పోషిస్తాయో స్పష్టత లేదు. పంటల ఉత్పత్తి ఖర్చు నిర్ధారణలో కూడా అనేక లోపాలు ఉన్నాయి. ఉత్పత్తి ఖర్చు రాష్ట్రాల వారీగా సేకరించి, దానిని దేశ 'సగటు'గా మార్చడం వల్ల కూడా రైతులకు నష్టం జరుగుతున్నది. ఒకే పంటకు దేశ వ్యాప్తంగా సాగు ఖర్చులలో తేడా ఉంటుంది. దీనిని సగటు చేస్తే, ఖర్చు ఎక్కువ అవుతున్న రైతులకు నష్టం అవుతున్నది.

సాగు ఖర్చు ఎందుకు పెరుగుతున్నదనే విషయం మీద కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి సమీక్ష ఎన్నడూ చేయలేదు. రైతు ఆత్మ హత్యల తదనంతరం జరిపిన అధ్యయనాలు రైతుల మీద పెరుగుతున్న ఖర్చు, మార్కెట్లో గిట్టుబాటు ధర పరిస్థితి గురించి ప్రధానంగా ప్రస్తావించాయి. రైతు కొనే విత్తనాలు, ఎరువులు, కీటకనాశకాలు అన్ని కంపెనీల లాభాలు అవుతున్నాయి. కృత్రిమ ఎరువులు, రసాయన కీటక నాశకాలు సారవంతమైన మట్టిని విషతుల్యం చేస్తూ, రైతును 'బానిసను' చేస్తున్నాయి.

రాష్ట్రాల వారీగా జరిపే ఉత్పత్తి ఖర్చు నిర్ధారణ కూడా సరిగా, పారదర్శకంగా లేదు. చిన్న రైతు ఎదుర్కొనే అన్ని రకాల ఖర్చులను సేకరించే వ్యవస్థ లేదు. రాష్ట్రాలు అందించే రాష్ట్ర స్థాయి 'సగటు' లెక్కలను సీఏసీపీ తన స్వీయ ఆలోచన మేరకు తగ్గిస్తూ ఉంటుంది. స్థూలంగా, పంటల మీద ఖర్చును దశల వారీగా, వివిధ స్థాయిలలో 'తరుగు' చేస్తున్నది. వ్యవసాయ ఉత్పత్తి ఖర్చుని శాస్త్రీయంగా, పారదర్శకంగా నిర్ధారించే వ్యవస్థ అవసరం. రైతులు కోరుతున్నట్లుగా ధరలకు చట్టబద్ధత కల్పిస్తే, ఈ వ్యవస్థ లోపాలు బయటకు వస్తాయని కూడా విధాన నిర్ణేతల ఆందోళన కావచ్చు. ప్రపంచ వాణిజ్య సంస్థ పరిధిలో విధించిన షరతులు కూడా ఒక కారణం.

కనీస మద్దతు ధర అన్ని పంటలకు ఇవ్వరు. 1964–65లో వరి, గోధుమలకు మాత్రమే కనీస మద్దతు ధరను నిర్ణయించేవారు. కాలక్రమేనా 23 పంటలకు చేరింది. పసుపు, జొన్నలు, తృణధాన్యాలు వంటి పంటలకు లేవు. భారత దేశంలో దాదాపు 600 పంటలు పండించేవారు. అనేక పంటలు కనుమరుగు అయినాయి, అవుతున్నాయి. ఖర్చులు ఎక్కువ, రాబడి తక్కువ, సారవంతమైన మట్టి కనుమరుగు అవ్వడం, కలుషిత నీళ్ళు, నీటి కొరత, పురుగుల బెడద, వన్యప్రాణుల దాడులు, నాణ్యమైన విత్తనాల కొరత, కూలీల కొరత, ఇంకా ఇతర ఆర్థిక, సామాజిక, పర్యావరణ అంశాల నేపథ్యంలో రైతులు క్రమేణా



కొన్ని పంటలకే పరిమితం అవుతున్నారు. ఈ నిర్ణయంలో కనీస మద్దతు ధర పాత్ర కూడా ఉందని అధ్యయనాలు చెబుతున్నాయి.

కనీస మద్దతు ధరల వ్యవస్థ మీద నాలుగు కమిటీలు అనేక సూచనలు ఇచ్చాయి – ఝా కమిటీ (1965), సేన్ కమిటీ (1979), హనుమంతరావు కమిటీ (1990), వై.కే.అలఘ్ కమిటీ (2005). 2007లో ప్రణాళిక సంఘం, 2017లో నీతి ఆయోగ్ నివేదికలు కూడా ఉన్నాయి. ఈ సూచనలను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదు. 2005 కమిటీ వ్యవసాయ ధరల కమిషన్‌కు చట్టబద్ధత కల్పించాలని సిఫారసు చేసింది. అంటే, కనీస మద్దతు ధర చట్టబద్ధతను అది ఆమోదించింది. ధర నిర్ణయంలో నాణ్యత కూడా కీలకం అని ఈ కమిటీ భావించింది.

వివిధ పంటలకు మార్కెట్ కాలం రెండు లేక మూడు నెలలు మాత్రమే ఉంటుంది. రబీ పంటల మార్కెటింగ్ కాలం ఏప్రిల్ నుంచి జూన్ వరకు మాత్రమే. ఆయా పంటల సరఫరా డిమాండ్లతో సంబంధం లేకుండా మద్దతు ధరలు మాత్రం సంవత్సరం పాటు స్థిరంగా ఉంటాయి. ప్రతి పంటలో అనేక రకాల వెరైటీలు ఉన్నా ఒకే మద్దతు ధర ఉంటుంది. వరిలో కొన్ని వందల రకాల విత్తనాలు ఉన్నా, కనీస మద్దతు ధర అన్నింటికీ ఒకటే. వరి రకం బట్టి పంట కాలం ఉంటుంది. ఆ మేరకు ఖర్చులలో కూడా తేడా ఉంటుంది. కొన్ని 80 రోజుల పంట అయితే, ఇంకొన్ని 160 రోజులు ఉంటాయి. ఈ తేడాను కనీస మద్దతు ధర నిర్ణాయక వ్యవస్థ పరిగణనలోనికి తీసుకునే పరిస్థితి లేదు. అంతా స్థిరమైన సగటు.

ధర రాక రైతులు రాబోయే సంవత్సరంలో ఈ పంట వేయడం ఆపేస్తే ఆ పంట సరఫరాపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. దాని మీద ఆధారపడ్డ వినియోగదారులకు, పరిశ్రమలకు (పంట ముడిసరుకుగా వాడే వాటికి) ధర పెరుగుతుంది. ఏదైనా పంట దిగుబడి తగ్గి, సరఫరా తగ్గి, ధర పెరిగితే వెంటనే దిగుమతులకు అనుమతులు ఇస్తుంది ప్రభుత్వం. అయితే ఆ యేడు వరకే దిగుమతులను 'నల్లా తిప్పి బంజేసినట్లు' చేసే పరిస్థితి ఉండదు. సాధారణంగా అంతర్జాతీయ వాణిజ్యంలో సరఫరా ఒప్పందాలు గిట్టుబాటుగా కొన్ని సంవత్సరాల కొరకు చేసుకుంటారు. దిగుమతులు కొనసాగితే దేశీయంగా ధర మళ్లీ పెరిగే అవకాశం లేక రైతులు ఆ పంట వేయడం పూర్తిగా మానేస్తారు. పప్పుల విషయంలో అదే అయ్యింది. 2015లో కొరత ఉందని అనుమతిస్తే సరఫరా ఒప్పందాలు 7 సంవత్సరాలకు చేసుకుని దిగుమతులు పెంచారు. రైతులకు ధర వచ్చే ఆశ లేక పూర్తిగా వేయడం మానేశారు. దరిమిలా పప్పుల ఉత్పత్తిలో అగ్రగామి అయిన భారత్ ఇప్పుడు దిగుమతుల మీద ఆధారపడే పరిస్థితి వచ్చింది. అటు వినియోగదారులకు పప్పుల ధరలు పెరుగుతూనే ఉన్నాయి. పప్పులకు కనీస మద్దతు ధర (ఖర్చుకు అనుగుణంగా) ఇస్తేనే రైతులు మళ్లీ వేస్తారు. అధిక ధరలకు దిగుమతి చేసుకుంటున్న ప్రభుత్వం కనీస మద్దతు పెంచడానికి ఇష్టపడటం లేదు.

వంట నూనె విషయంలో ఇంకో విధంగా మన స్వావలంబన కోల్పోయాం. ముడి పామాయిల్ దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ప్రపంచ వాణిజ్య సంస్థ ఏర్పాటు చేసిన వ్యవస్థ వల్ల ఏర్పడింది. తక్కువ ధరకు పామాయిల్ రావడంతో, తక్కువ ధరకు వినియోగదారులకు అందిస్తే రాజకీయ ప్రయోజనం అని చూసుకుని ప్రభుత్వం ఆయా సంవత్సరాలలో పెరుగుతున్న పామాయిల్ దిగుమతులను పట్టించుకోలేదు. పైగా దిగుమతి సుంకాలను సున్నా చేసింది. ఫలితంగా, మనం పండించే వేరుశనగ, నువ్వులు, ఆముదాలు, ఆవాలు వంటి 9 రకాల వంట నూనె గింజల పంటల విస్తీర్ణం పూర్తిగా తగ్గిపోయింది. వంట నూనె నిత్య అవసరం కాబట్టి ఇప్పుడు ఆ దిగుమతి మానలేము. అది మానకుంటే రైతులకు ధర రాక ఇక్కడ నూనె గింజల ఉత్పత్తి పెరిగే పరిస్థితి లేదు.

డిమాండ్ ఉన్న రకాల పంటలు వేసే ప్రోత్సాహక పరిస్థితి రైతులకు లేకుండా పోయింది. ప్రభుత్వం జోక్యం వల్ల మార్కెట్లకు నష్టం అని భావించేవారు, ఈ పరిస్థితిని ప్రభుత్వ జోక్యం లేకుండా ఎట్లా మారుస్తారో చెప్పాలి. రైతులు ఆ యా పంటలు వేయడం మానేస్తే, పంట పండించే జ్ఞానం, నైపుణ్యం, సామర్థ్యం కోల్పోతాము. ఇప్పుడు చెరుకు కోసే నైపుణ్యం ఉన్న కూలీలు దొరకడం లేదు. తిరిగి ఆ పంట కావాలంటే ప్రభుత్వం పెట్టుబడులు పెట్టాల్సిందే. అప్పుడు పెట్టుబడులు పెట్టే బదులు, ప్రభుత్వం ఇప్పుడే మార్కెట్లో జోక్యం చేసుకుని, రైతులకు గిట్టుబాటు ధర ఇస్తే అందరూ సంతోషంగా ఉంటారు కదా! లేకుంటే మనం కొన్ని ఆఫ్రికన్ దేశాల మాదిరి అయిపోతాం. నిరంతరం సముద్ర తీరాల వైపు చూడాల్సి వస్తుంది. క్రమంగా, స్వావలంబన కోల్పోతే ఇతర దేశాల పెత్తనానికి దాసోహం కావాల్సి వస్తుంది.

వ్యాసకర్త వ్యవసాయరంగ నిపుణులు

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఏమనగలం?



మలప్పురం (కేరళ) సంఘటనలో హైలైట్ అక్కడ జరిగిన హింస కాదు. ఆఫ్రికన్లను మల్లులు 'నల్ల పిల్లి' అని పిలవడం.

– అమిత్ పాండీలియా, కాలమిస్ట్

అమ్ముడమైతే సంతోషమే!



మొత్తానికి హైదరాబాద్ ట్రాఫిక్ జంక్షన్లలో కూడా పుస్తకాలు అమ్ముతున్నారు. కచ్చితంగా అవి పైరేటెడ్ పుస్తకాలే అయివుంటాయి. ఏమైనా పరస్పర విరుద్ధమైన భావోద్వేగాలు.

– శ్రీరామ్ కర్రి, జర్నలిస్ట్

మెరుగైన రంగు



ఎన్నికల బాండ్ల పథకం పరిపూర్ణమైనది కాదనీ, అంతకుముందు ఉన్నదానికన్నా మెరుగైనదనీ 'ఇండియా టుడే కాన్‌క్లేవ్'లో కేంద్ర ఆర్థిక మంత్రి చెబుతున్నారు. నిజమే. గతంలో అది పూర్తిగా నల్లధనం. కాకపోతే ఇప్పుడు దాని రంగు కొద్దిగా నెరిసింది.

– తవ్లీన్ సింగ్, కాలమిస్ట్

రొటీన్



భారత ప్రధానో, ఇంకెవరైనా మంత్రో అరుణాచల్ ప్రదేశ్‌లో పర్యటిస్తూనే ఉంటారు. దీనికి చైనా అభ్యంతరం చెబుతూనే ఉంటుంది. మళ్లీ ఆ అభ్యంతరాన్ని ఇండియా తిరస్కరిస్తూనే ఉంటుంది. ఇదేం కొత్త విషయం కాదు.

– తన్వీ మదన్, సీనియర్ ఫెలో

దేశభక్తుడు



అసాధారణ దేశభక్తుడు నేవీ మాజీ చీఫ్ అడ్మిరల్ రాందాస్. ప్రజాస్వామ్యం, లౌకికవాదం, స్వేచ్ఛ, సమానత్వం లాంటి భారత రాజ్యాంగంలోని మూల సూత్రాల పరిరక్షణలో సాహసోపేత గొంతుక ఆయన. భారత్, పొరుగు దేశాల మధ్య శాంతి, స్నేహాలను సమర్థించారు. ఓం శాంతి! (మార్చ్ 15న మరణించారు.)

– సుధీంద్ర కులకర్ణి, పొలిటికల్ యాక్టివిస్ట్

బాధ్యత ఉండాలిగా!



అపార్ట్‌మెంట్ల లిఫ్టుల్లో పిల్లలను పెంపుడు కుక్కలు కరుస్తున్న ఘటనలను చూస్తున్నాం (ఒక వీడియో వైరల్ అయింది). నిజానికి చాలా రకాల కుక్కలను సరైన శిక్షణతో సౌమ్యంగా ప్రవర్తించేలా చేయవచ్చు. ఇండియాలో చాలామంది పెట్ ఓనర్లు ఫ్యాన్సీ బ్రీడ్లను కొంటారుగానీ, శిక్షకుల కోసం నయాపైసా చెల్లించరు.

– శరణ్ షణ్ముగం, ఆంత్రప్రెన్యూర్

తల్లులూ చదివేలా...



పవిత్ర మాసం రమదాన్ స్ఫూర్తిని ప్రతిఫలించేలా, విద్యకు మద్దతు ఇవ్వడానికి 'మదర్స్ ఎండోమెంట్' ప్రోత్సాహం ప్రకటించారు (దుబాయ్ పాలకుడు) షేక్ మొహమ్మద్ (బిన్ రషీద్ అల్ మఖ్తూమ్). ఇది అందరు తల్లుల పైచదువుల కోసం ఉపకరిస్తుంది. కరుణ, సంఘీభావాలను కలిగివున్న 'ఎమిరాటీ' విలువలకు మనం మద్దతు ఇద్దాం.

– హమ్దాన్ బిన్ మహమ్మద్, దుబాయ్ యువరాజు

ఇన్ బాక్స్

నకిలీ పరిశోధకులను శిక్షించాలి

మన దేశంలో ఇటీవలి కాలంలో శాస్త్ర సాంకేతిక రంగాలలో ప్రచురించే పరిశోధనా పత్రాల సంఖ్య గణనీయంగా పెరుగుతూ వస్తోంది. 'సైనాల్' లెక్కల ప్రకారం 2017–22 మధ్య ఈ పెరుగుదల 55 శాతంగా వుంది. అయితే మన దేశంతో పాటు ప్రపంచంలో అనేక చోట్ల పరిశోధకులు సమర్పించే పరిశోధనా వ్యాసాలు నకిలీవని తేలుతోంది. అందుకే చాలామంది వాటిని ఉపసంహరించుకుంటున్నారు. మనదేశం నుండి ప్రచు రించిన పరిశోధనా పత్రాలను రాసినవారు వెనక్కి తీసుకొంటున్నారు. దానికి కారణం శాస్త్ర విజ్ఞాన చౌర్యమే. 2010 నుండి ఈ ఉపసంహరణలు జరుగుతున్నా, ఇటీవలి కాలంలో ఇవి మరీ ఎక్కువవుతున్నాయి. 2017–19 కాలంలో 595 పత్రాలను శాస్త్ర వేత్తలు ఉపసంహరించుకోగా, 2020 –22 కాలంలో దాదాపు ఇవి రెండున్నర రెట్లు పెరిగాయి (1,550 పత్రాలు). ఈ ఉపసంహరణల్లో మన దేశం 3వ స్థానంలో వుంది. దేశంలోని అత్యున్నత సంస్థలైన ఐఐటీల నుండి కూడా పరిశోధనా పత్రాల ఉపసంహరణలు ఎక్కువగా వుండటం విచారకరం.

ప్రపంచంలోనే మన దేశం అతి పెద్దనకిలీ పరిశోధనా పత్రాల ప్రచురణా నిలయంగా మారింది. దేశంలోపల చూస్తే... మధ్యప్రదేశ్ మిగిలిన రాష్ట్రాల కన్నా ముందంజలో వుంది. ఇది ఒక కుటీర పరిశ్రమలా రూపు దిద్దుకుని, మాఫియా చేతుల్లో నడుస్తోంది అంటే నమ్మ శక్యం కాదు. ఇక్కడ ఎడిటర్లు, ఎడిటోరియల్ బోర్డులు, పరిశీలకులు, పర్య వేక్షకులు ఎవ్వరూ ఉండరు. కేవలం ప్రచురణ కర్తలే ఉంటారు. డబ్బు కోసం ఏ చెత్తనైనా ప్రచురించి దేశం మీదకు వదులుతారు.

అంతర్జాతీయ స్థాయిలో ఇదొక పెద్ద కుంభకోణంగా మారుతోంది. ప్రముఖ ప్రచురణ సంస్థ 'నేచర్' లెక్కల ప్రకారం 2023లో పదివేలకు పైగా పత్రాలు ఉపసంహరణకు గురియ్యాయి. పరిశోధన పత్రాలు సమర్పించిన తరువాత సమీక్షకులు, నిపుణులు లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక పోవటం, పరిశోధనా ఫలితాలు ఆలోచనలు, పద్ధతులు నమ్మశక్యంగా లేకపోవటం వంటి 109 కారణాల వల్ల పరిశోధనా పత్రాలు ఉపసంహరణకు గురి అవుతున్నాయి. నకిలీ పత్రాలను ప్రచురించే వారిని పరిశోధనల్లో పాల్గొనకుండా జీవితం కాలం పాటు నిషేధం విధించాలి. అటువంటి పత్రాలను ప్రచురించే జర్నళ్ళ సంపాదకులను కూడా కఠినంగా శిక్షించాలి. అప్పుడే పరిశోధనల నాణ్యత పెరుగడానికి అవకాశం ఉంది.

– ఈదర శ్రీనివాసరెడ్డి, గుంటూరు

ఉద్యోగాల భర్తీకి తొలగిన న్యాయ చిక్కులు

అభిప్రాయం




కోడెపాక కుమార స్వామి

తెలంగాణ రాష్ట్రం ఏర్పడినంక నిరుద్యోగుల పరిస్థితి పెనంపై నుండి పొయ్యిలో పడినట్లు అయింది. నీళ్లు, నిధులు, నియామకాలే ఎజెండాగా సాగిన ఉద్యమంలో నిరుద్యోగులకు గత ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ల అమలుపై విధానపరమైన నిర్ణయం తీసుకోకుండా కాలయాపన చేయడం వల్ల వేలాది ఉద్యోగాలు, ఉద్యోగ ప్రకటనలకే పరిమితమై భర్తీకి నోచుకోలేదు. పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో 2016లోనే జీవో నెం. 40ని జారీ చేసి ఉద్యోగ నియామకాల్లో మహిళా రిజర్వేషన్లను సమాంతరంగా అమలు చేస్తున్నారు.

నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం క్లిష్టమైనటువంటి మహిళా రిజర్వేషన్ అమలుపై హైకోర్టు ఆదేశానుసారంగా నిర్ణయం తీసుకొని ఉమ్మడి రాష్ట్రంలో ఇచ్చిన మహిళా కోటాకు సంబంధించిన జీవోలను రద్దు చేస్తూ, 3, 35 నంబర్ల జీవోలను జారీ చేసి ఉద్యోగ నియామక ప్రక్రియలు కొనసాగే విధంగా మార్గాన్ని సుగుమం చేసింది. నూతన విధానంలో 100 పాయింట్ల రోస్టర్‌లో మహిళలకు ప్రత్యేక రోస్టర్ పాయింట్లను కేటాయించ కుండా ప్రతీ ఉద్యోగ ప్రకటనలో ఓసీ, బీసీ–ఏ, బీసీ–బీ, బీసీ–సీ, బీసీ–డీ, బీసీ–ఈ, ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్, దివ్యాంగుల, స్పోర్ట్స్, ఎక్స్ సర్వీస్ మెన్ కేటగిరీలకు కలిపి మొత్తం 33.33 శాతం పోస్టులను కేటాయించనున్నారు. అనగా ప్రతీ కేటగిరిలో ప్రతీ నాలుగు పోస్టుల్లో ఒక్క పోస్టు మహిళలకు సమాంతరంగా కేటాయించ బడుతుంది.

భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు 1992 నుండి నేటి వరకు ప్రధాన కేసులైన ఇందిరా సహానీ వర్సెస్ యూనియన్ అఫ్ ఇండియా, రాజేష్ కుమార్ దరియా వర్సెస్ రాజస్థాన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ తదితర తీర్పుల్లో వర్టికల్ రిజర్వేషన్లుగాఎస్సీ, ఎస్టీ, బీసీ,



ఈడబ్ల్యూఎస్ కోటాలను; హారిజాంటల్ రిజర్వేషన్లుగా మహిళా, దివ్యాంగులు, స్పోర్ట్స్, ఎక్స్ సర్వీస్ మెన్, ఎన్‌సీసీ కోటాలను నిర్ధారించింది. అందులో వర్టికల్/ నిలువు/ సామాజిక మరియు హారిజాంటల్/ సమాంతర/ ప్రత్యేక రిజర్వేషన్లను ఏవిధంగా అమలు చెయ్యాలో స్పష్టం చేసింది. వర్టికల్ రిజర్వేషన్లు రాజ్యాంగంలోని ఆర్టికల్ 15(4), 15(5), 15(6), 16(4), 16(6) ద్వారా కల్పిస్తున్నవి. కావున ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు జనరల్ కేటగిరీ పోస్టులకు కూడా పోటీపడి ఎంపిక కావచ్చు. ఫలితంగా వారికి కేటాయించిన రిజర్వేషన్ శాతాన్ని మించి ఎంపిక కావచ్చు. ఆర్టికల్ 15(3)ను అనుసరించి సమాంతర రిజర్వేషన్ పద్ధతిలో మహిళలకు మొత్తం ఉద్యోగాల్లో 33.33 శాతం పోస్టులకు మాత్రమే ఎంపిక అవ్వడానికి ఆస్కారం ఉంది. మహిళలు జనరల్ కేటగిరీ పోస్టులకు ఎన్నికైనా వారిని కూడా ఈ 33.33 శాతం కిందకే తీసుకువస్తారు. అంటే మహిళలు 33.33 శాతానికి మించి ఎంపిక కాకూడదన్నమాట.


అదేవిధంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు 2009లో జూనియర్ సివిల్ జడ్జీల నియామకాలకు సంబంధించిన కేసు: కె. వెంకటేష్ వర్సెస్ గవర్నమెంట్ అఫ్ ఆంధ్రప్రదేశ్, 2020లో తెలంగాణ హైకోర్టు మాచర్ల సురేష్ వర్సెస్ స్టేట్ అఫ్ తెలంగాణ మధ్య జరిగిన కేసుల తీర్పుల్లో మహిళా రిజర్వేషన్లను సమాంతరంగా అమలు చెయ్యాలని ఆదేశించాయి.

దిన పత్రికల్లో 2020 నుండి మహిళా రిజర్వేషన్ల సమస్యపై పతాక శీర్షికల్లో వార్తలు వచ్చినప్పటికీ, గత తెలంగాణ ప్రభుత్వానికి విధానపరమైన నిర్ణయం తీసుకోవడానికి సమయం లేకపోయింది. నేటి కాంగ్రెస్ ప్రభుత్వం అతి తక్కువ సమయంలో నిర్ణయం తీసుకొని 3, 35 నంబర్ల జీవోలను జారీ చేయడం స్వాగతించవలసిన అంశం.

వ్యాసకర్త తెలంగాణ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు
మొబైల్: 94909 59625

విశ్వ మానవ ప్రేమ తత్వం

సర్వమానవాళి గురించి ఆలోచించి పవిత్రత, శాంతి, సమత, న్యాయము అన్న వాటి గురించి అభిప్రాయాలు వ్యక్తీకరించడంలో తిరువళ్ళువర్ అగ్రగణ్యుడు. ఆయన రాసిన 'తిరుక్కురల్' వంటిది మరొకటి లేదనవచ్చు. ఆయన జీవించిన కాలంలో తమవే తిరుగులేని సిద్ధాంతాలని చాటుకుంటున్న వివిధ మతస్థుల మధ్య ఆయన సమన్వయము సాధించాడు. అలనాటి అతి బలీయమైన దురాచారాలను అసమానమైన కవితా శక్తితో ఎదుర్కొన్నాడు.



'జన్మ చేత అందరూ సమానులే. వారు ఆచరించే కర్మలలోని భేదాలే వారికి విలువను, అసమానతను కల్పిస్తున్నాయి' (972) అని చెప్పే ధైర్యం ఆయనది. ఆయనకి జీవితం పట్ల ఎంతటి దృఢమైన వైఖరి ఉందంటే జీవితం భ్రమ కాదు, వాస్తవం అని బలంగా వాదించగలిగాడు. 'కరుణ, దయ, జాలి వంటి వాస్తవ లక్షణాలు ఈ భూమిపై మానవ జీవితంలో అంతర్భాగాలు' అని ప్రవచించాడు.

ఆయన రచనల్లో ప్రస్ఫుటంగా కనిపించే అంశం ప్రేమ. 'మానవుని ఉనికి యొక్క మూలం /ప్రేమ అనే లక్షణం లోనే ఉన్నది /ప్రేమ ఏమిటో ఎరుగని వారు/తోలుకప్పిన అస్థిపంజరాలు' (80). ఇలాంటి పరిపూర్ణ సత్యాలను తమిళుల ఆధ్యాత్మిక నైతిక జీవనంలో ప్రవేశపెట్టిన మహనీయుడు తిరువళ్ళువర్.

'సుగుణం' అనే దానికి గందరగోళం లేని నిర్వచనాన్ని తిరువళ్ళువర్ ఇచ్చాడు. 'మనసులో ఏ విధమైన మలినం లేకపోవడమే సుగుణం, మిగిలినదంతా కేవలం పటాటోప ప్రదర్శనం' (34) అంటారాయన. మరి మన మనస్సులలో మాలిన్యం లేకుండా చేసుకోవడం ఎలా? 35వ కురల్ ఇందుకు జవాబు ఇస్తుంది. అసూయ, లోభం, క్రోధం, దుర్భాషణం అనే నాలుగు లక్షణాలను మనసు నుండి తుడిచివేయగలగాలి. వీటిని తొలగించుకోకుండా ఆనందాన్ని కానీ, కీర్తిని కానీ పొందటం సాధ్యం కాదు అంటాడు. 2000 ఏళ్ల నాటి తమిళ తిరుక్కురల్ కావ్యం అనేక భాషల్లోకి అనువదితమయ్యింది. అందుకే జి.ఎస్. పోప్ ఆయనను 'విశ్వమానవ వైతాళికుడు' అని ప్రస్తుతించాడు.

– సాక్షి

త్వరలో లక్షమందితో మోదీ సభ

- లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎస్టీ మోర్చా కార్యాచరణ

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో...రాష్ట్రంలోని అన్ని ఎంపీ సీట్ల పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్లలో సమావేశాలను నిర్వహించాలని బీజేపీ ఎస్టీ మోర్చా నిర్ణయించింది. ఈ ఎన్నికల సందర్భంగా...త్వరలోనే లక్షమందితో ప్రధాని మోదీ బహిరంగసభ నిర్వహించాలని తీర్మానించింది. బీజేపీ కార్యాలయంలో శుక్రవారం రాష్ట్ర ఎస్టీ మోర్చా అధ్యక్షుడు కల్యాణ్ నాయక్ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర పదాధికారులు, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, జిల్లా ఇన్‌చార్జ్‌ల సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారు. ఇటీవలే ఎస్టీ రాష్ట్ర కమిటీ ఏర్పడిన నేపథ్యంలో...జిల్లా, మండల, గ్రామస్థాయి కమిటీలు పటిష్టం చేయాలని, బూత్ ఇన్‌చార్జ్, సహ ఇన్‌చార్జ్‌లను నియమించనున్నట్లు కల్యాణ్ నాయక్ తెలిపారు. ప్రతి నియోజకవర్గం పరిధిలోని సుమారు వంద గూడెంలు, తండ సంపర్క్ అభియాన్ కార్యక్రమాలు చేపట్టేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు.

కాంగ్రెస్‌లోకి మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి

- ఆయన కుమారుడు మిథున్‌రెడ్డి కూడా
- చేరిన వెంటనే కేబినెట్ మంత్రి హోదాతో రెండు పదవులు
- ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా, క్రీడా వ్యవహారాల సలహాదారుగా నియామకం


సీఎం రేవంత్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన జితేందర్‌రెడ్డి, ఆయన కుమారుడు మిథున్‌రెడ్డి. చిత్రంలో ఉత్తమ్, దీపాదాస్ మున్షీ, భట్టి

సాక్షి, హైదరాబాద్: బీజేపీ నేత, మాజీ ఎంపీ ఏపీ జితేందర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీజేపీ నుంచి మహబూబ్‌నగర్ ఎంపీ టికెట్ ఆశించి భంగపడిన జితేందర్, ఆయన కుమారుడు మిథున్ రెడ్డి శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మహబూబ్‌నగర్ లోక్‌సభ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి, జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. అంతకు ముందు జితేందర్‌తో పాటు మిథున్‌రెడ్డి కూడా బీజేపీకి రాజీనామా చేశారు. ఈ మేరకు బీజేపీ అధిష్టానానికి తమ రాజీనామా లేఖలు పంపారు. కాంగ్రెస్‌లో చేరిన వెంటనే జితేందర్‌రెడ్డికి కేబినెట్ మంత్రి హోదాతో కూడిన రెండు పదవులు లభించాయి. ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా, రాష్ట్ర ప్రభుత్వానికి క్రీడా వ్యవహారాల సలహాదారుగా నియమిస్తూ అధికారిక ఉత్తర్వులు కూడా జారీ అయ్యాయి.

బండిని తప్పించడంతోనే తిరోగమనం..: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బండి సంజయ్ ఉండగా పార్టీ రాష్ట్రం బలం పుంజుకుని రాజకీయశక్తిగా ఎదిగిందని మాజీ ఎంపీ ఏపీ జితేందర్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర నాయకత్వం మార్పు జరిగాక బీజేపీకి తీవ్రంగా నష్టం జరిగిందని, ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 25 సీట్లలో గెలవాల్సిందిపోయి 8 స్థానాలకే పరిమితమైందని తెలిపా రు. బీజేపీకి రాజీనామా చేసిన సందర్భంగా పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీనడ్డాకు పంపించిన రాజీనామా లేఖలో ఆయా అంశాలను ప్రస్తావించారు. తనకు బీజేపీలో ఇన్నాళ్లు పనిచేసేందుకు అవకాశం కల్పించినందుకు ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, జేపీనడ్డాలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

కాంగ్రెస్ పాలన బాగానే ఉంది

- ప్రజల అభిప్రాయం, నా అభిప్రాయం అదే
- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి
- అమిత్ పార్టీ మార్పు ఊహాజనితమే



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: రాష్ట్రంలో వంద రోజుల కాంగ్రెస్ పార్టీ పాలన బాగానే ఉందని ప్రజలు అనుకుంటున్నారని, తన అభిప్రాయం కూడా అదేనని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నల్లగొండలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. తన కుమారుడు గుత్తా అమిత్ రెడ్డి కాంగ్రెస్‌లోకి వెళతారనేది, ఎంపీ లేదా ఎమ్మెల్సీ వంటి పదవుల విషయంలో ఏదైనా హామీ లభిస్తే వెళతారా? అన్నది ఊహా జనితమేనని పేర్కొన్నారు. అయితే అమిత్ విషయంలో కాంగ్రెస్ నుంచి నెల రో జుల కిందట ఒక ప్రతిపాదన వచ్చిందని, దానిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని తెలిపారు. తమకు కాంగ్రెస్‌లోకి వెళ్లే ఆలోచన లేదని గుత్తా స్పష్టం చేశారు. కాంగ్రెస్‌లో ఒకరు చెబితే నడవదని, వేం నరేందర్ రెడ్డి తమకు అల్లుడు అవుతారని, ఆయన్ను అమిత్ కలవడంలో ప్రత్యేకత ఏమీ లేదని అన్నారు.

బీఆర్‌ఎస్‌లో క్రమశిక్షణ లోపం: జిల్లాలో తమ పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని అమిత్ బీఆర్‌ఎస్ నుంచి ఎంపీగా పోటీ చేయకూడదనే నిర్ణయానికి వచ్చామని, ఇదే విషయం పార్టీ అధిష్టానానికి తెలియజేశామని గుత్తా చెప్పారు. స్థానిక పరిస్థితులు సహకరించక పోవడం, ఓడిపోయిన అభ్యర్థులు నియోజకవర్గాలకు రాకపోవడం, సైదిరెడ్డి లాంటి వారు వెళ్లిపోయిన నేపథ్యంలో.. ఎవరు వస్తారో, ఎవరు పోతారో తెలియ దని వ్యాఖ్యానించారు. క్రమశిక్షణ బీఆర్‌ఎస్‌లో లోపించిందని, అందువల్లే గందరగోళం ఏర్పడిందని చెప్పారు. తాను రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్నానని, తాను ఏ పార్టీ కండువా కప్పుకోనని చెప్పారు.

ప్రజలకు దగ్గరగా పాలన: మంత్రి జూపల్లి

సాక్షి, హైదరాబాద్: గత పాలకుల తీరుకు భిన్నంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో వంద రోజుల పరిపాలన ప్రజల ఆకాంక్షలకు అద్దం పట్టిందని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. నియంతృత్వానికి దూరంగా ప్రజలకు దగ్గరగా పాలన కొనసాగుతోందని శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజా పాలనే లక్ష్యంగా బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ పాలన కొనసాగుతుందని తెలిపారు. అవినీతి, అక్రమాలకు తావు లేకుండా సీఎం రేవంత్‌రెడ్డి తన పాలనను కొనసాగిస్తున్నారని కొనియాడారు. 100 రోజుల పాలనపై బీఆర్‌ఎస్ నేతలు అవాకులు, చెవాకులు మాట్లాడుతున్నారని, వారు ఎంత గీ పెట్టినా ప్రజలు వారిని నమ్మే పరిస్థితి లేదని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్‌ఎస్ కనుమరుగు కావడం ఖాయమని మంత్రి జూపల్లి జోస్యం చెప్పారు.

ఉద్యమకారుల ఆకాంక్షలు నెరవేర్చేందుకే

- టీఎస్ నుంచి టీజీగా మార్పు: మల్లు రవి

సాక్షి, న్యూఢిల్లీ: ఉద్యమకారుల ఆకాంక్షలు నెరవేర్చేందుకే వాహనాల రిజిస్ట్రేషన్ నెంబర్‌ను టీఎస్ నుంచి టీజీగా మార్చామని కాంగ్రెస్ సీనియర్ నేత మల్లు రవి చెప్పారు. తెలంగాణ ఉద్యమ సమయంలో రాష్ట్రం ఏర్పడితే టీజీ ఉండాలని అందరూ కోరుకున్నారని, అయితే స్వార్థం కోసమే అప్పటి సీఎం కేసీఆర్ టీఎస్‌గా మార్చారని దుయ్యబట్టారు. టీఎస్‌ను టీజీగా మార్చుతూ కేంద్రం గెజిట్ విడుదల చేయడం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషికి నిదర్శనమన్నారు. శుక్రవారం ఢిల్లీలో మల్లు రవి విలేకరులతో మాట్లాడుతూ.. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి ఒక్క సీటు కూడా రాదని చెప్పారు. బీజేపీలో టికెట్ రాక అసంతృప్తిగా ఉన్న జితేందర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరుతారనే.. రేవంత్‌రెడ్డి ఆయన్ను కలిశారని తెలిపారు. జంట నగరాల్లో దశాబ్దాలుగా ఉన్న ట్రాఫిక్ సమస్యలు తీర్చేందుకు కొత్త కారిడార్ నిర్మిస్తున్నామన్నారు. కండ్లకోయ జంక్షన్ మీదుగా కారిడార్‌కు శంకుస్థాపన జరిగిందని, కొత్త కారిడార్ మీదుగా రెండో దశ మెట్రో రైలు మార్గం ఉంటుందని రవి వెల్లడించారు.

రేపు ఏఐఎస్‌టీఎఫ్ జాతీయ కార్యవర్గ సమావేశం

సాక్షి, హైదరాబాద్: ఆల్ ఇండియా సెకండరీ టీచర్స్ ఫెడరేషన్ (ఏఐఎస్‌టీఎఫ్) జాతీయ కార్యవర్గ సమావేశం ఈనెల 17న కాచిగూడలోని స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్టీయూ) భవన్‌లో జరుగుతుందని ఏఐఎస్‌టీఎఫ్ జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇంద్రశేఖర్ మిశ్రా, సదానంద్‌గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి వర్కింగ్ ప్రెసిడెంట్‌తో పాటు తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, ఒడిశా, జమ్మూకశ్మీర్ ప్రతినిధులు హాజరు కానున్నట్లు తెలిపారు. సమావేశంలో ఉద్యోగుల సీపీఎస్ రద్దు, ఐటీ అంశాలపై చర్చ జరుగుతుందని చెప్పారు.

ఆదాయం పెంపు ఎలా? | భూముల విలువలు పెంచుదామా?

- కేబినెట్ సబ్‌కమిటీ భేటీలో చర్చ
- భూసేకరణకు ఇబ్బంది లేకుండా అధ్యయనం చేయాలని మంత్రుల సూచన


సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. చిత్రంలో మంత్రులు జూపల్లి, ఉత్తమ్, శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ల చార్జీలు తగ్గించి, భూముల విలువలు పెంచడం ద్వారా ప్రజలపై భారం తగ్గించవచ్చని రెవెన్యూ ఉన్నతాధికారులు సూచించారు. ఆదాయ వనరుల సమీకరణపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం భేటీలో ఈ మేరకు అధికారులు తమ అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. ఈ ప్రతిపాదనపై మంత్రులు స్పందిస్తూ భూముల విలువల పెంపుతో భూసేకరణ పరిహారం కింద ఎక్కువ మొత్తాన్ని చెల్లించాల్సి వస్తుందని అభ్యంతరం చెప్పారు. భూసేకరణకు ఇబ్బంది లేకుండా భూముల విలువలు పెంపు అంశంపై అధ్యయనం చేయాలని ఉన్నతాధికా రులకు సూచించారు. శుక్రవార సచివాల యంలో కమిటీ చైర్మన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, డి.శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావుతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్ అరికట్టాలని, స్పిరిట్ తయారీ ఉత్పత్తి, రవాణాలో అక్రమాలపై దృష్టి సారించాలని ఇందుకు సంబంధించిన రిపోర్టును ప్రతి వారం ఇవ్వాలని ఎక్సైజ్ అధికారులకు మంత్రులు సూచించారు. రియల్టీ రంగం స్తబ్దుగా ఉన్న నేపథ్యంలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను వీలున్నంత త్వరగా పరిష్క రించాలని హెచ్‌ఎండీఏ, జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. జీఎస్టీ ఆదా యాన్ని పెంచాలని, తెలంగాణ మార్కెట్ లోకి జీరో సరుకు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రులు సూచించారు. ఏయే రంగాల నుంచి తక్కువ ఆదాయం వస్తుందో పరిశీలించాలని, జ్యువెలరీ, వస్త్ర వ్యాపారంపై ఓ కన్నేసి ఉంచాలని మంత్రులు సూచించారు. ఇసుకతో పాటు మైనింగ్ మాఫియాను అరికట్టాలని, కొత్త ఇసుక పాలసీ తీసుకురావాలని మంత్రులు సంబంధిత అధికారులను ఆదేశించినట్టు సమాచారం.

మోదీ జోష్ షో

▶ మొదటి పేజీ తరువాయి

రోడ్‌షో నిర్వహించారు. ఆయన వెంట జీప్‌లో ఓ వైపు కిషన్‌రెడ్డి మరోవైపు బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు, మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ మాత్రమే (ఇద్దరు భద్రతా సిబ్బంది మినహా) రోడ్‌షోలో పాల్గొన్నారు. అంతకుముందు చేవెళ్ల, భువనగిరి, హైదరాబాద్ ఎంపీ అభ్యర్థులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బూర నర్సయ్యగౌడ్, మాధవీలతలను మోదీకి పరిచయం చేశారు. ఈ రోడ్‌షో మొదలు, చివరి పాయింట్ల వద్ద పలువురు బీజేపీ కార్పొరేటర్లు, పార్టీ నాయకులు స్వాగతం పలికేలా లైనప్‌లు ఏర్పాటు చేశారు. కాగా రోడ్‌షో ముగియగానే మోదీ రాజ్‌భవన్ బసకు చేరుకున్నారు. ప్రధాని శనివారం ఉదయం 10 గంటల ప్రాంతంలో బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి నాగర్‌కర్నూల్‌కు చేరుకుంటారు. అక్కడ బహిరంగ సభ ముగిసిన తర్వాత హెలికాప్టర్‌లో కర్ణాటకలోని గుల్బర్గా వెళతారు.


రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసైతో మాట్లాడుతున్న ప్రధాని మోదీ

ఎకో టూరిజం అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలి

- అటవీశాఖ సమీక్షలో రేవంత్‌రెడ్డి


సమీక్షలో మాట్లాడుతున్న సీఎం రేవంత్. చిత్రంలో మంత్రి కొండా సురేఖ

సాక్షి, హైదరాబాద్: పర్యావరణ అనుకూల పర్యాటక అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అటవీశాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. పర్యాటకులను ఆకట్టుకునేలా వైవిధ్యమున్న ప్రాంతాలను గుర్తించి, అవసరమైన సౌకర్యాల కల్పనపై దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. శుక్రవారం సచివాలయంలో అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖతో కలిసి ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సమీక్షించారు. పర్యాటక ప్రాంతాలకు అంతర్జాతీయస్థాయి గుర్తింపు సాధించేలా, అవసరమైతే ప్రత్యేకంగా కన్సెల్టెన్సీలు నియమించి ప్రతిపాదనలు రూపొందించాలని చెప్పారు. అటవీశాఖ నుంచి డిప్యు టేషన్‌పై వెళ్లి ఇతర విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల వివరాలు వెంటనే సమర్పించాలని సీఎం ఆదేశించారు. వారిని వెనక్కి రప్పించే చర్యలు చేపడుతామని చెప్పారు. రాష్ట్రానికి మంజూరైన 81 మంది ఐఎఫ్‌ఎస్ పోస్టుల్లో ప్రస్తుతం 55 మంది మాత్రమే ఉన్నారని, మిగతా 26 ఐఎఫ్ఎస్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని అధికారులు సీఎం దృష్టికి తీసుకురాగా, ఖాళీలు భర్తీ చేయాలని కేంద్రాన్ని కోరనున్నట్టు సీఎం తెలిపారు

కవిత అరెస్టుపై ఏది పడితే అది మాట్లాడొద్దు

- బీజేపీ శ్రేణులకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సూచన



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్ట్ విషయంలో ఏది పడితే అది మాట్లాడొద్దని పార్టీ నాయకులకు కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం రాత్రి కవిత అరెస్ట్ నేపథ్యంలో రాష్ట్రపార్టీ నేతలతో ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ అరెస్ట్‌తో బీజేపీకి ఎలాంటి సంబంధం లేదన్నారు. అలానే మన రాష్ట్రానికి సంబంధించిన విషయం కూడా కాదన్నారు. అంతకు ముందు మల్కాజిగిరి రోడ్‌షోలో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ 'ఏ నేరం చేయనప్పుడు కవితకు భయమెందుకు? ఈడీ విచారణకు కవిత స హకరించాలి'అని సూచించారు. 'ఇన్నాళ్లు విచారణకు సహకరించకుండా కవిత తప్పించు కుని తిరిగి సహకరించలేదు కాబట్టే.. ఈడీనే ఆమె ఇంటికి వెళ్ళింది''అని వ్యాఖ్యానించారు. కవిత నివాసంలో జరిగిన ఈడీ దాడులు కేంద్రం కక్ష పూరితంగా చేసింది కాదని మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ స్పష్టం చేశారు.

ఎన్నికల్లో లబ్ధిపొందేందుకే కవిత అరెస్టు: కోమటిరెడ్డి



నల్లగొండ: లిక్కర్ కేసులో ఇంతకాలం కవితను అరెస్టు చేయకుండా.. ఎంపీ ఎన్నికల షెడ్యూల్ విడుదల సమయంలో అరెస్టు చేయడం ఎన్నికల్లో లబ్ధిపొందేందుకే అని రోడ్లు, భవనాల శాఖమంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి ఆరోపించారు. ఇది ముమ్మాటికీ బీఆర్‌ఎస్, బీజేపీ మ్యాచ్ ఫిక్సింగే అన్నారు. శుక్రవారం నల్లగొండలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం కలెక్టరేట్ వద్ద కోమటిరెడ్డి మీడియాతో మాట్లాడారు. లిక్కర్ కేసులో ఢిల్లీ డిప్యూటీ సీఎం, ఇతర ఎంపీలు అరెస్టయిన సందర్భంలో కవితను ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. మోదీ, కేడీలు గల్లీలో కొట్లాడుకుంటూ ఢిల్లీలో మాత్రం దోస్తులవుతున్నారని కోమటిరెడ్డి ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమి గెలుస్తుందని, రాహుల్‌గాంధీ ప్రధాని అవుతారని ధీమా వ్యక్తంచేశారు.

విధ్వంసం నుంచి ప్రజాపాలనలోకి

- ప్రజల నమ్మకాన్ని, విశ్వాసాన్ని నిలబెట్టుకున్నాం
- వంద రోజుల పాలనపై మంత్రి పొంగులేటి వ్యాఖ్య



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన డిసెంబర్ 7వ తేదీ చరిత్రాత్మకమని, తెలంగాణ ఆత్మ గౌరవం పెంపొందించిన రోజని రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అభివర్ణించారు. వంద రోజుల కాంగ్రెస్ హయాంలో తెలంగాణ విధ్వంసం నుంచి ప్రజాపాలనలోకి అడుగుపెట్టిందన్నారు. గతంలో జరిగిన తప్పిదాలను సరిదిద్దుతూ, గాడి తప్పిన ఆర్థిక వ్య వస్థను సరిచేస్తూ లక్ష్యం దిశగా పనిచేస్తున్నామని వెల్లడించారు. 'గత పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రం ఆర్థిక, సామాజిక విధ్వంసాలకు గురైంది. విధ్వంసానికి గురైన వ్యవస్థలను పునర్నిర్మించుకోవడం అంత తేలికైన పని కాదు. రాష్ట్రాన్ని బాగు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం శక్తినంతా కూడగట్టుకుంటూ ప్రజలకిచ్చిన వాగ్దానాలను తూచా తప్పకుండా అమలు చేస్తూ విజయవంతంగా ముందుకు సాగుతోంది. తెలంగాణ ప్రజానీకం సంతృప్తి చెందేలా కాంగ్రెస్ వందరోజుల పాలన సాగింది. ఈ వందరోజుల్లోనే ప్రతి పౌరుని హృదయంలో గొప్ప స్థానాన్ని సాధించుకున్నాం. ప్రజల నమ్మకాన్ని, విశ్వాసాన్ని నిలబెట్టుకున్నాం. రానున్న ఐదేళ్లలో తెలంగాణలోని పేదలకు 20లక్షల ఇళ్లు నిర్మిస్తాం' అని పొంగు లేటి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు.

వంద రోజుల్లో శిథిలావస్థకు వ్యవసాయం

- సీఎం రేవంత్‌పై మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం
- రాష్ట్రంలో కరువు పెంచేందుకు ముఖ్యమంత్రి ప్రయత్నిస్తున్నారు



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ పాలనలో వ్యవసాయ రంగాన్ని కేసీఆర్ శిఖరాగ్రాన నిలబెడితే, అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే సీఎం రేవంత్‌రెడ్డి శిథిలావస్థకు చేర్చారని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. సీఎంగా తెలంగాణ పరువు పెంచేందుకు కేసీఆర్ ప్రయత్నిస్తే, రేవంత్ రాష్ట్రంలో కరువు పెంచేందుకు పోటీ పడుతున్నారని ఎద్దేవా చేశారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల అమల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. వంద రోజుల పాలనలో సీఎం రేవంత్ రాష్ట్ర ప్రజలను దారుణంగా మోసగించారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పాలన మూడు విచారణలు, ఆరు వేధింపులు అన్నట్లుగా సాగుతోందన్నారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో పార్టీ నేతలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు.

పదేళ్ల తర్వాత పంటలకు మంటలు: దేశమంతా కరువు ఉందని చెప్తూ రైతుల నోట్లో రేవంత్ ప్రభుత్వం మట్టి కొడుతోందని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో కొనసాగుతున్నది కాలం తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ తెచ్చిన కరువు అని పేర్కొన్నారు. పదేళ్ల తర్వా త రాష్ట్రంలో పంటలకు మంటలు పెట్టే పరిస్థితి తలెత్తిందని ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు అయినట్టుగా రేవంత్ చేసిన 'బడే భాయ్' వ్యాఖ్యలతో స్పష్టమైందని హరీశ్‌రావు పేర్కొన్నారు. పార్టీలు మారితే రాళ్లతో కొట్టాలని చెప్పిన రేవంత్, స్వయంగా బీజేపీ నేతల ఇళ్లకు వెళ్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ గేట్లు ఎత్తితే బీఆర్‌ఎస్‌లో ఒక్కరూ మిగలరని అంటున్న రేవంత్.. దమ్ముంటే ప్రాజెక్టుల గేట్లు ఎత్తి సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, చింత ప్రభాకర్, నాయకులు దేవీప్రసాద్, అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి, మల్కాపురం శివకుమార్ పాల్గొన్నారు.

రిటైర్డ్ నేవీ చీఫ్ అడ్మిరల్ రాందాస్ కన్నుమూత



రసూల్‌పురా (హైదరాబాద్)/ సాక్షి, హైదరా బాద్: భారత నావికాదళం రిటైర్డ్ చీఫ్ అడ్మిరల్ లక్ష్మీ నారాయణ రాందాస్ (90) శుక్రవారం ఉదయం కన్ను మూశారు. కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన తిరుమలగిరిలోని మిలటరీ ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచారు. శనివారం తిరుమలగిరి స్వర్గ వాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రాందాస్‌కు భార్య లలిత, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. 1971 ఇండో–పాకిస్తాన్ యుద్ధ సమయంలో ఐఎన్‌ఎస్ బియాస్ యుద్ధ నౌకకు రాందాస్ నేతృత్వం వహించారు. తమ సైనికులను తరలించుకునేందుకు పాకిస్తాన్ చేసిన ప్రయత్నాలను విఫలం చేశారు. 1990 నుంచి 1993 వరకు నేవీ చీఫ్‌గా పనిచేశారు. ఆయన చేసిన సేవలకు రాష్ట్రపతి విశిష్ట సేవా పతకం, అతి విశిష్ట సేవా పతకం, వీరచక్రతోపాటు రామన్ మెగసెసే తదితర అవార్డులు పొందారు. రాందాస్ మృతి పట్ల సీఎం రేవంత్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే సోదరుడు మధు అరెస్టు

- అక్రమ మైనింగ్ కేసులో రిమాండ్


గూడెం మధును తీసుకెళ్తున్న పోలీసులు

పటాన్ చెరు టౌన్, పటాన్‌చెరు: అక్రమ మైనింగ్ కేసులో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి సోదరుడు గూడెం మధుసూదన్ రెడ్డిని సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పోలీసులు శుక్రవారం తెలవారుజామున అరెస్టు చేశారు. పటాన్‌చెరు మండలం లక్డారం గ్రామంలో మధుసూదన్ రెడ్డికి చెందిన సంతోష్ సాండ్ అండ్ గ్రానైట్‌పై వచ్చిన ఆరోపణలపై సంగారెడ్డి ఆర్డీవో ఆధ్వర్యంలోని టాస్క్‌ఫోర్స్ తనిఖీలు చేపట్టి అక్రమాలు నిజమేనని తేల్చింది. దీంతో పటాన్‌చెరు తహసీల్దార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు 379, 447, 427, 409, 420 ఐపీసీ సెక్షన్ 3 పీడీపీపీ యాక్ట్ సెక్షన్ 21, 23, 4 క్లాస్ (1),4 క్లాస్ (1)ఏ కేసు నమోదు చేసి శుక్రవారం తెల్లవారుజామున గూడెం మధును అరెస్టు చేశారు. రిమాండ్‌కు తరలించే ముందు ఆయన్ను వైద్య పరీక్షల నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా, బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఆందోళనకు దిగడంతో ఉద్రిక్తత నెలకొంది. దీంతో పోలీసులు పటాన్‌చెరుకు కాకుండా సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం సంగారెడ్డి జిల్లా కోర్టులో హాజరుపరచగా మూడో అదనపు మేజిస్ట్రేట్ 14 రోజులపాటు రిమాండ్ విధించారు. అనంతరం కందిలోని జిల్లా జైలుకు తరలించారు.

మంత్రి దామోదర ఆదేశాలతోనే అక్రమ కేసులు: ఎమ్మెల్యే హరీశ్‌రావు

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సోదరుడుమధుసూదన్ రెడ్డి అరెస్టును మాజీమంత్రి, ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం విపక్ష నేతలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని మండిపడ్డారు. ''కాంగ్రెస్ పార్టీలో చేరాలి.. లేకుంటే అక్రమ కేసులు నమోదు చేస్తాం'' అన్న విధంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. జిల్లాకు చెందిన మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాలతోనే తమ పార్టీ ఎమ్మెల్యేను టార్గెట్ చేస్తున్నారని ఆరోపించారు.

బెదిరింపులకు భయపడం?: ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

తాను తప్పు చేస్తే మూడుసార్లు గెలిచేవాడిని కాదని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో పదేళ్లలో ఎవరి మీద కక్ష సాధింపు చర్యలకు పాల్పడలేదన్నారు. 2012–13లో అప్పటి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో పూర్తి అనుమతితోనే క్వారీలను ప్రారంభించామని గుర్తు చేశారు. చట్టపరంగా ఎదుర్కోవడానికి తాము సిద్ధంగా ఉన్నామని, బెదిరింపులకు భయపడబోమన్నారు. సమావేశంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

బాండ్లపై పూర్తి వివరాలు ఎందుకివ్వలేదు

ఎస్‌బీఐపై సుప్రీంకోర్టు ఆగ్రహం

న్యూఢిల్లీ: ఎలక్టోరల్ బాండ్ల విషయంలో పూర్తి సమాచారం ఎన్నికల సంఘానికి ఎందుకు ఇవ్వలేదని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ)ను సుప్రీంకోర్టు ప్రశ్నించింది. దాతల నుంచి రాజకీయ పార్టీలు స్వీకరించిన బాండ్లపై ఉన్న విశిష్ట ఆల్ఫా న్యూమరిక్ నెంబర్లను ఎందుకు బహిర్గతం చేయలేదని నిలదీసింది. బాండ్ల రూపంలో ఏ పార్టీకి ఎవరెవరు ఎంతెంత సొమ్ము ఇచ్చారో స్పష్టంగా తెలియడం లేదని పేర్కొంది. దీనిపై వివరణ ఇవ్వాలని ఎస్‌బీఐకి నోటీసు జారీ చేసింది. ఎలక్టోరల్ బాండ్ల అంశంపై ఎన్నికల సంఘం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. బాండ్లపై ఈ నెల 11న ఇచ్చిన తీర్పులో కొంత సవరణ చేయాలని కోరుతూ ఎన్నికల సంఘం ఈ పిటిషన్ దాఖలు చేసింది. ఎలక్టోరల్ బాండ్ల కొనుగోలుదారులు, వాటి విలువ, కొనుగోలు చేసిన తేదీ, బాండ్ల నెంబర్ వంటి అన్ని వివరాలు ఎన్నికల సంఘానికి అందజేయాలని తాము ఆదేశించినప్పటికీ ఎందుకు ఇవ్వలేదంటూ ధర్మాసనం ఎస్‌బీఐపై ఆగ్రహం వ్యక్తం చేసింది. విధి నిర్వహణకు కట్టుబడి ఉండాలని, ఎలక్టోరల్ బాండ్లకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడించాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 18వ తేదీకి వాయిదా వేసింది.

ఈసీల నియామకంపై స్టే విధించలేం

సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ



న్యూఢిల్లీ: ఇద్దరు నూతన ఎన్నికల కమిషనర్ల(ఈసీలు) నియామకంపై స్టే విధించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఒక చట్టంపై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయలేమని స్పష్టం చేసింది. 2023 నాటి చట్టం ప్రకారం ఇద్దరు ఎన్నికల కమిషనర్లను కేంద్ర ప్రభుత్వం నియమించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ అగస్టీన్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. ఇద్దరు ఈసీల నియామకాన్ని తాత్కాలికంగా నిలిపివేయాలని, స్టే విధించాలని పిటిషనర్లు విజ్ఞప్తి చేశారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సభ్యుడిగా లేని కమిటీ చేపట్టిన ఈ నియామకం సరైంది కాదని పేర్కొన్నారు. ఇందుకు ధర్మాసనం అంగీకరించలేదు. తదుపరి విచారణను ఈ నెల 21వ తేదీకి వాయిదా వేసింది. 'చీఫ్ ఎలక్షన్ కమిషనర్, అదర్ ఎలక్షన్ కమిషనర్స్ (అపాయింట్‌మెంట్, కండీషన్స్ ఆఫ్ సర్వీస్ అండ్ టర్మ్ ఆఫ్ ఆఫీసు) యాక్ట్–2023'ను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లన్నింటినీ కలిపి విచారిస్తామని ప్రకటించింది. కేంద్ర ఎన్నికల సంఘంలో ఖాళీగా ఉన్న రెండు కమిషనర్ పోస్టులను ప్రభుత్వం గురువారం భర్తీ చేసిన సంగతి తెలిసిందే. జ్ఞానేశ్ కుమార్, సుఖ్‌బీర్ సంధూను ఎన్నికల కమిషనర్లుగా నియమించింది.

ఎన్నికల షెడ్యూల్ నేడే

మధ్యాహ్నం 3 గంటలకు ఎన్నికల సంఘం మీడియా సమావేశం

- ఈసారి నాలుగు లేక ఐదు దశల్లో సార్వత్రిక ఎన్నికలు
- లోక్‌సభతోపాటు ఆంధ్రప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్, ఒడిశా, సిక్కిం అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్
- ఏప్రిల్ రెండు లేక మూడో వారంలో ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికలు!

సాక్షి, న్యూఢిల్లీ: ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ శనివారం వెలువడనుంది. ఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో మధ్యాహ్నం 3 గంటలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ప్రకటించనుంది. లోక్‌సభతోపాటు ఆంధ్రప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్, ఒడిశా, సిక్కిం శాసనసభ ఎన్నికల షెడ్యూల్‌ను సైతం ప్రకటిస్తారు. అలాగే తెలంగాణలో ఖాళీగా ఉన్న ఒక అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశం ఉంది. ఈ మేరకు ఎన్నికల సంఘం శుక్రవారం పత్రికా ప్రకటన విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్ శాసనసభకు ఏప్రిల్ రెండు లేక మూడో వారంలో ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. షెడ్యూల్ వెలువడిన వెంటనే దేశవ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి(ఎలక్షన్ కోడ్) అమల్లోకి వస్తుంది. ప్రస్తుత లోక్‌సభ పదవీకాలం జూన్ 16వ తేదీతో ముగుస్తుండగా, అంతకంటే ముందు కొత్త సభను ఏర్పాటు చేయాల్సి ఉంది. గత లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ను 2019 మార్చి 10న ప్రకటించారు. ఏప్రిల్ 11 నుంచి ఏడు దశల్లో ఎన్నికలు జరిగాయి. మే 23న ఫలితాలు వెలువడ్డాయి. ఈసారి నాలుగు నుంచి ఐదు దశల్లోనే లోక్‌సభ ఎన్నికలను పూర్తి చేయాలని భావిస్తున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం వర్గాలు తెలియజేశాయి. దేశవ్యాప్తంగా 97 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. సార్వత్రిక ఎన్నికల కోసం 12 లక్షలకు పైగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయబోతున్నారు.

బాధ్యతలు చేపట్టిన కొత్త ఎన్నికల కమిషనర్లు

నూతన ఎన్నికల కమిషనర్లుగా నియమితులైన సుఖ్‌బీర్ సింగ్ సంధూ, జ్ఞానేశ్ కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఢిల్లీలోని నిర్వాచన్ సదన్‌లో ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ సమక్షంలో వీరు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎన్నికల షెడ్యూల్‌కు సంబంధించి అధికారులతో కీలక భేటీ జరిగింది. ఎన్నికల సన్నద్ధత, కేంద్ర బలగాల మోహరింపు, వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖలతో సమన్వయం, ఆయా రాష్ట్రాల్లో ప్రస్తుత పరిస్థితులపై సమీక్షించారు. ఆ తర్వాత కొద్దిసేపటికే ఈ నెల 16న జరిగే మీడియా సమావేశం, ఎన్నికల షెడ్యూల్‌కు సంబంధించిన ప్రకటన వెలువడింది.

నేర ముఠాల గుప్పిట్లో హైతీ!

ఒక నేర ముఠా ఒక ప్రాంతాన్ని తన అధీనంలోకి తీసుకుని అరాచకం సృష్టిస్తే భద్రతాబలగాలు రంగంలోకి దిగి ఉక్కుపాదంతో అణచేయడం చాలా దేశాల్లో చూశాం. కానీ ఒక దేశం మొత్తమే నేర ముఠాల గుప్పెట్లోకి జారిపోతే ఎలా? హైతీ దేశ దుస్థితి చూస్తుంటే యావత్ ప్రపంచమే అయ్యో పాపం అంటోంది. పోర్ట్ ఎ ప్రిన్స్ రాజధానిసహా దేశాన్నే గడగడలాడిస్తున్న గ్యాంగ్‌లకు అసలేం కావాలి?. కెన్యా సాయం కోసం వెళ్లి రాజధాని ఎయిర్‌పోర్ట్ నేరముఠాలవశం కావడంతో స్వదేశం తిరిగిరాలేక అమెరికాలో చిక్కుకుపోయిన దేశ ప్రధాని ఏరియల్ హెన్రీ చివరకు పదవికి రాజీనామా చేశారు. దీంతో దేశ ప్రజల పరిస్థితి మరింత అధ్వాన్నంగా తయారైంది. ఇళ్ల నుంచి బయటకురావడానికే జనం భయపడుతున్నారు.



జీ9 ఫ్యామిలీ గ్యాంగ్ సభ్యులు.(ఇన్‌సెట్లో) బార్బెక్యూ జిమ్మీ

హైతీలో ప్రధాన గ్యాంగ్‌లు ఎన్ని?

హైతీలో దాదాపు 200 వరకు నేరముఠాలు ఉన్నాయి. అయితే మాజీ పోలీస్ అధికారి జిమ్మీ 'బార్బెక్యూ' చెరీజియర్ నేతృత్వంలోని జీ9 ఫ్యామిలీ అండ్ అలీస్ అలయన్స్, గేబ్రియల్ జీన్ పెర్రీ నేతృత్వంలోని జీపెప్ నేరముఠాలు ప్రధానమైనవి. ఇవి ప్రజలను హింసిస్తూ దేశాన్ని నరకానికి నకళ్లుగా మార్చేశాయి. రాజధాని సమీప ప్రాంతాలపై పట్టుకోసం చాన్నాళ్లుగా ఈ రెండు వైరి వర్గముఠాలు ప్రయత్నిస్తున్నాయి. ఎంతో మందిని సజీవ దహనం చేశాడని జిమ్మీని స్థానికంగా బార్బెక్యూ అని పిలుస్తుంటారు. నరమేధం, దోపిడీ, ఆస్తుల ధ్వంసం, లైంగిక హింసకు జీ9, జీపెప్ నేరముఠాలు పాల్పడ్డాయి. దీంతో ఈ ముఠా లీడర్ల లావాదేవీలు, కార్యకలాపాలపై ఐరాస, అమెరికా ఆంక్షలు విధించాయి. దీంతో రెండు గ్యాంగ్‌లు ఉమ్మడిగా ఒక ఒప్పందం చేసుకున్నాయి. కలిసి పనిచేసి ప్రధానిని గద్దెదింపేందుకు కుట్ర పన్నాయి.

అసలు ఇవి ఎలా పుట్టుకొచ్చాయి?

మురికివాడల్లో దారుణాలు చేశాడన్న ఆరోపణలపై జిమ్మీని పోలీస్ ఉద్యోగం నుంచి తీసేశాక నేరసామ్రాజ్యంలో అడుగు పెట్టాడు. దేశంలోని రాజకీయ పార్టీలు, నేతలు, పారిశ్రామికవేత్తలు తమ అనైతిక పనులకు అండగా ఉంటారని ఇలాంటి చిన్న చిన్న నేరగాళ్లను అక్కున చేర్చుకుని పెద్ద ముఠా స్థాయికి ఎదిగేలా చేశారు. 2021 జులైలో హత్యకు గురైన హైతీ మాజీ అధ్యక్షుడు జొవెనెల్ మొయిసెకు చెందిన పార్టీ హైతియన్ టెట్ కాలే(పీహెచ్‌టీకే)తో జిమ్మీకి చాలా దగ్గరి సంబంధాలు ఉన్నాయి. ఒకానొక దశలో జిమ్మీని ప్రధాని పీఠంపై కూర్చోబెట్టాలని మొయిసె భావించారు. జీపెప్ ముఠా సైతం విపక్ష పార్టీలతో అంటకాగింది. దీంతో ఆర్థికంగా, ఆయుధపరంగా రెండు ముఠాలు బలీయమయ్యాయి.

హింస ఎప్పుడు మొదలైంది?

హైతీ మాజీ అధ్యక్షుడు ఫ్రాంకోయిస్ 'పాపా డాక్' డ్యువేలియర్, అతని కుమారుడు జీన్‌క్లాడ్ డ్యువేలియర్‌ల 29 ఏళ్ల నియంతృత్వ పాలనాకాలంలోనే ఈ గ్యాంగ్‌లు పురుడుపోసుకున్నాయి. డ్యువేలియర్లు ఒక సమాంతర మిలటరీ(టోంటోన్స్ మకౌటీస్)ని ఏర్పాటు చేసి వైరి పార్టీల నేతలు, వేలాది మంది సామాన్య ప్రజానీకాన్ని అంతమొందించారు. 'హైతీలో నేరముఠాలకు దశాబ్దాల చరిత్ర ఉంది. కానీ ఇప్పుడున్న నేరముఠాల వైఖరి గతంతో పోలిస్తే దారుణం' అని వర్జీనియా విశ్వవిద్యాలయ అధ్యాపకుడు, హైతీ వ్యవహారాల నిపుణుడు రాబర్ట్ ఫాటన్ విశ్లేషించారు.

నేతలనూ శాసిస్తారు

బెదిరింపులు, కిడ్నాప్‌లు, మాదకద్రవ్యాల అక్రమ రవాణాలతో నేరముఠాలు ఆర్థికంగా బలపడ్డాయి. ఆయుధాలను సమకూర్చుకున్నారు. గత వారం రాజధానిలోని రెండు జైళ్లపై అధునాతన డ్రోన్లతో దాడికి తెగబడ్డాయి. శిక్ష అనుభవిస్తున్న వేలాది మంది కరడుగట్టిన నేరగాళ్లను విడిపించుకు పోయారు. సాయుధముఠాలు ఇప్పుడు ఏకంగా రాజకీయపార్టీలు, నేతలనే శాసిస్తున్నాయి.

పరిపాలన వాంఛ

అక్రమ మార్గాల్లో సంపదను మూటగట్టుకున్న నేర ముఠాలు ఇప్పుడు రాజ్యాధికారంపై కన్నేశాయి. 2021లో దేశాధ్యక్షుడు మొయిసె హత్యానంతరం వీటి రాజకీయ డిమాండ్లు ఎక్కువయ్యాయి. ముఠాలు ప్రధాని హెన్రీని గద్దె దింపాయి. దేశాన్ని పాలిస్తానని బార్బెక్యూ జిమ్మీ పరోక్షంగా చెప్పాడు. అంతర్జాతీయంగా తన పేరు మార్మోగాలని విదేశీ మీడియాకు ఇంటర్వ్యూలిచ్చాడు. విదేశీ జోక్యం వద్దని, విదేశీ బలగాలు రావద్దని హుకుం జారీచేశాడు. ప్రస్తుత సంక్షోభాన్ని ఒంటిచేత్తో పరిష్కరిస్తానని ప్రకటించాడు. రాజకీయ శక్తులుగా ఎదిగితేనే తమ మనుగడ సాధ్యమని ముఠాలు భావిస్తున్నాయి.

సంకీర్ణ బలగాలు వస్తున్నాయా?

కెన్యా నేతృత్వంలోని సంకీర్ణ బలగాలను హైతీకి పంపించి సంక్షోభానికి ఫుల్‌స్టాప్ పెట్టాలని అమెరికాసహా పలుదేశాలు నిర్ణయించాయి. ఐరాస ఇందుకు అంగీకారం తెలిపింది. అయితే కెన్యా కోర్టుల జోక్యంతో ప్రస్తుతానికి ఆ బలగాల ఆగమనం ఆగింది. హైతీ ప్రధాని రాజీనామా నేపథ్యంలో నూతన ప్రభుత్వ కొలువు కోసం కౌన్సిల్ ఏర్పాటు, అన్ని భాగస్వామ్యపక్షాల సంప్రతింపుల ప్రక్రియ ముగిసేదాకా వేచిచూసే ధోరణిని అవలంబిస్తామని కెన్యా అధ్యక్షుడు విలియం రూటో చెప్పారు. మరి కొద్దిరోజుల్లోనే ఎన్నికల కోసం కౌన్సిల్ ఏర్పాటు ప్రక్రియ మొదలవుతుందని అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ చెప్పారు.

మన వాళ్లను వెనక్కి రప్పిస్తాం: భారత విదేశాంగ శాఖ

హైతీలో దాదాపు 90 మంది భారతీయులు ఉన్నట్లు సమాచారం. వీరిలో డాక్టర్లు, ఇంజనీర్లు, టెక్నీషియన్లు ఉన్నారు. 60 మంది ఇప్పటికే హైతీకి వచ్చేందుకు సిద్ధమయ్యారు. హైతీలో భారతీయ రాయబార కార్యాలయం, కాన్సులేట్ లేవు. దీంతో సమీపాన ఉన్న డొమినికన్ రిపబ్లిక్ రాజధాని శాంటో డొమినిగోలోని ఇండియన్ మిషన్ ద్వారా హైతీలోని భారతీయులతో మోదీ సర్కార్ సంప్రతింపులు జరుపుతోంది. వీలైనంత త్వరగా స్వదేశానికి తీసుకొస్తామని భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ శుక్రవారం ఢిల్లీలో చెప్పారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

బీజేపీలోకి ఇద్దరు టీఎంసీ ఎంపీలు

న్యూఢిల్లీ: పశ్చిమ బెంగాల్‌లోని అధికార తృణమూల్‌కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీలు అర్జున్ సింగ్, దివ్యేందు అధికారి బీజేపీలో చేరారు. వీరు బారక్‌పూర్, తామ్లుక్ నియోజకవర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. శుక్రవారం ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వీరు బీజేపీ కండువా కప్పుకున్నారు. అర్జున్ సింగ్ 2019లో టీఎంసీని వీడి బీజేపీలో చేరారు. అప్పటి ఎన్నికల్లో బారక్‌పూర్‌లో టీఎంసీ అభ్యర్థిని ఓడించారు. ఆ తర్వాత తిరిగి టీఎంసీ గూటికి చేరారు. టీఎంసీ విడుదల చేసిన అభ్యర్థుల జాబితాలో పేరు లేకపోవడంతో మళ్లీ బీజేపీ పక్షాన చేరారు.

మంత్రి వర్గాన్ని విస్తరించిన సీఎం నితీశ్

పట్నా: బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ శుక్రవారం తన మంత్రి వర్గంలోకి మరో 21 మందిని చేర్చుకున్నారు. దీంతో, మొత్తం మంత్రుల సంఖ్య 30కి చేరుకుంది. కొత్తగా చేర్చుకున్న వారిలో బీజేపీ సీనియర్ నేత, మాజీ డిప్యూటీ సీఎం రేణు దేవి ఉన్నారు. రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ రాజేంద్ర అర్లేకర్ వీరతో ప్రమాణం చేయించారు.

సాయం కోసం ఎదురు చూస్తుండగా దాడి.. 20 మంది పాలస్తీనియన్ల మృతి

డెయిర్–అల్–బలాహ్: గాజా నగరంలోని ఆహార పంపిణీ కేంద్రం సమీపంలో ఇజ్రాయెల్ బలగాలు జరిపిన దాడిలో 20 మంది చనిపోగా మరో 155 మంది గాయపడినట్లు పాలస్తీనా ఆరోగ్య శాఖ తెలిపింది. గాజా ఉత్తర ప్రాంతంలో గురువారం ఈ ఘటన చోటుచేసుకున్నట్లు వెల్లడించింది. సాయం కోసం ఎదురు చూస్తున్న వారిపై ఇజ్రాయెల్ దాడికి పాల్పడిందని పేర్కొంది. అయితే, అదంతా అబద్ధమంటూ ఇజ్రాయెల్ ఆర్మీ కొట్టిపారేసింది.

కోర్టులో కేజ్రీవాల్‌కు దక్కని ఊరట

న్యూఢిల్లీ: మద్యం కుంభకోణం కేసులో మనీ లాండరింగ్ ఆరోపణలకు సంబంధించి ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు సెషన్స్ కోర్టులో ఊరట లభించలేదు. ఈడీ పలుమార్లు జారీ చేసిన సమన్లను పట్టించుకోలేదనే కారణంతో తనపై చర్యలు తీసుకోకుండా స్టే విధించాలంటూ ఆయన వేసిన పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది. సమన్లపై కేజ్రీవాల్ స్పందించకపోవడంతో ఈడీ మెట్రోపాలిటన్ కోర్టులో పిటిషన్ వేసింది. విచారించిన అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ దివ్యా మల్హోత్రా మార్చి 16వ తేదీన కోర్టులో హాజరు కావాలని ఆదేశించారు. దీనిని సవాల్ చేస్తూ కేజ్రీవాల్ సెషన్స్ కోర్టులో పిటిషన్ వేశారు. శుక్రవారం విచారించిన అదనపు సెషన్స్ జడ్జి రాకేశ్.. చర్యలపై స్టే ఇచ్చేందుకు నిరాకరించడంతోపాటు ప్రత్యక్ష హాజరు నుంచి మినహాయింపు కోసం తిరిగి మెట్రోపాలిటన్ కోర్టుకే వెళ్లాలని సూచించారు.

అది కేవలం ఊహ మాత్రమే: సీతారామన్

న్యూఢిల్లీ: విచారణలో భాగంగా కేంద్ర దర్యాప్తు సంస్థలు చేసే సోదాలకు ఎలక్టోరల్ బాండ్ల కొనుగోలుదార్లకు మధ్య సంబంధం ఉందనడం ఊహ మాత్రమేనని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. ఈడీ సోదాల తర్వాత బాండ్ల రూపంలో పార్టీలకు నిధులు వచ్చి ఉంటే అది కాకతాళీయమే తప్ప మరో ఉద్దేశం ఉండే అవకాశం లేదని తేల్చిచెప్పారు. గతంలో రాజకీయా పార్టీలకు విరాళాల రూపంలో నిధులు అందేవని గుర్తుచేశారు. అందులో లోపాలు ఉండడంతో పారదర్శకత కోసం కేంద్రం ఎలక్టోరల్ బాండ్లను తీసుకొచ్చిందని వెల్లడించారు. 2013లో అప్పటి యూపీఏ ప్రభుత్వం ప్రారంభించిన ఎలక్టోరల్ ట్రస్టుల స్కీమ్‌లో ఎన్నో లోపాలు ఉన్నాయని పేర్కొన్నారు.



కన్యాకుమారిలో సభలో మాట్లాడుతున్న ప్రధాని మోదీ

కేరళలో కమలం వికసిస్తుంది

పథనంతిట్ట: కేరళలో బీజేపీ క్షేత్రస్థాయిలో మరింత బలపడి ఈసారి ఎక్కువ సీట్లు కైవసం చేసుకోగలదని ప్రధాని మోదీ అభిలషించారు. గత కొద్దిరోజులుగా దక్షిణ భారత రాష్ట్రాల్లో సుడిగాలి పర్యటనలు చేస్తున్న ప్రధాని మోదీ శుక్రవారం సైతం తమిళనాడు, తెలంగాణ, కేరళలో పర్యటించారు. కేరళలోని క్రైస్తవుల మెజారిటీ ఎక్కువగా ఉండే పథనంతిట్ట జిల్లాలో మోదీ పర్యటించి అక్కడ క్రైస్తవులను కలిసి మాట్లాడారు. కాంగ్రెస్ నుంచి బీజేపీలోకి వచ్చిన మాజీ కేంద్ర మంత్రి ఏకే ఆంటోనీ తనయుడు అనిల్ కె.ఆంటోనీని యువతకు ప్రతిరూపంగా మోదీ కొనియాడారు. కేరళ రాజకీయాలకు ఇలాంటి యువ రాజకీయ ప్రతిభావంతులే కావాలని అన్నారు. పథనంతిట్ట ఎంపీ స్థానం నుంచి బీజేపీ తరఫున ఈసారి అనిల్‌ను బీజేపీ బరిలో నిలిపింది. తర్వాత ఎన్‌డీఏ కార్యకర్తలతో సమావేశంలో మోదీ మాట్లాడారు. ' 2019 లోక్‌సభ ఎన్నికల్లో కేరళలో బీజేపీ రెండంకెల స్థాయిలో ఓట్ల శాతం సాధించింది. ఈసారి రెండెంకల స్థాయిలో సీట్లనూ గెల్చుకోనుంది. కేరళలో ఈసారి కమలం వికసించడం ఖాయం'' అని మోదీ వ్యాఖ్యానించారు.

ఈ ప్రభుత్వాలు పోతేనే అభివృద్ధి వస్తుంది

సీపీఎం నేతృత్వంలోని ఎల్‌డీఎఫ్ కూటమి, కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటములను విమర్శించారు. '' ఈ రెండు కూటముల అవినీతి, అసమర్థ ప్రభుత్వాల హయాంలో కేరళ ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు'అంటూ ఎల్‌డీఎఫ్ హయాంలో దౌత్యమార్గాల్లో బంగారం స్మగ్లింగ్, యూడీఎఫ్ హయాంలో సోలార్ ప్యానెల్ కుంభకోణాలు జరిగాయని విమర్శలు ఎక్కుపెట్టారు. 'ఎల్‌డీఎఫ్ ఆ తర్వాత యూడీఎఫ్. మళ్లీ ఎల్‌డీఎఫ్. ఇలా కూటమి ప్రభుత్వాలు కొలువుతీరడం ఆగిపోతే రాష్ట్రంలో అభివృద్ధి మొదలవుతుంది. ఈ కూటములు ఓటు బ్యాంక్ రాజకీయాలకు కేంద్రస్థానాలు. ఈ కూటములు కాలం చెల్లిన సిద్ధాంతాలను పట్టుకుని వేలాడుతున్నాయి. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి అధ్వాన్నంగా తయారైంది. కమ్యూనిస్ట్ గూండాలకు అడ్డాలుగా కళాశాలలు విరాజిల్లుతున్నాయి' అని తూర్పారబట్టారు.

ప్రధాని మోదీ ధీమా

ఆశయాలు నెరవేరుస్తాం

'లోక్‌సభ ఎన్నికల్లో గత రికార్డులను తిరగరాస్తూ మూడోసారి అధికారంలోకి వస్తాం. అలాగే కేరళలో ఈసారి బీజేపీని ఆశీర్వదించండి. మీ మద్దతును ఓట్లుగా మార్చి ఎక్కువ స్థానాల్లో గెలిపించండి. పూర్తి మద్దతు పలికితే రాష్ట్రాభివృద్ధికి ఎదురవుతున్న అవరోధాలను అధిగమించి మీ ఆశయాలను నెరవేరుస్తాం. ఇది మోదీ గ్యారెంటీ. ప్రపంచంలో ఎక్కడ భారతీయుడు ఇబ్బందిపడినా మోదీ సర్కార్ వెంటనే ఆపన్నహస్తం అందించింది' అని మోదీ అన్నారు.

తమిళనాడు భవిష్యత్తుకు డీఎంకేనే పెద్ద శత్రువు

తమిళనాడు రాష్ట్ర భవిష్యత్తుకు అధికారంలోని ద్రవిడ పార్టీయే అతిపెద్ద అవరోధమని ప్రధాని మోదీ విమర్శలు ఎక్కుపెట్టారు. శుక్రవారం తమిళనాడులోని కన్యాకుమారిలో జరిగిన బీజేపీ బహిరంగ సభలో మోదీ ప్రసంగించారు. ' భారత దేశ సంస్కృతి, ఘన వారసత్వం అంటే డీఎంకేకు అస్సలు గిట్టదు. అయోధ్యలో భవ్యరామమందిర ప్రాణప్రతిష్ఠ క్రతువును రాష్ట్రంలో బహిరంగ ప్రదేశాల్లో స్క్రీన్‌లపై చూడకుండా నిషేధించాలని డీఎంకే ప్రయత్నించింది. ఈ విషయంలో సుప్రీంకోర్టు చీవాట్లు పెట్టింది. తమిళ పవిత్ర సెంగోల్‌కు మా ప్రభుత్వం పార్లమెంట్‌లో స్థానం కల్పించింది. కానీ, దేశం, దేశ చరిత్ర, వారసత్వం, మహానుభావుల పట్ల డీఎంకే నేతలకు ఉన్న ద్వేషం ఎలాంటిదో ఇట్టే తెల్సిపోతుంది. అన్నాడీఎంకే చీఫ్, దివంగత జె.జయలలితను డీఎంకే పార్టీ నేతలు ఎంతగా అవమానించారో మీకందరికీ తెలుసు. అదే సంస్కృతి ఇప్పుడూ కొనసాగుతోంది. తమిళనాట మహిళలపై నేరాలు ఎక్కువయ్యాయి. నాడు జల్లికట్టును నిషేధించినపుడు డీఎంకే, కాంగ్రెస్ ఎందుకు మౌనం వహించాయి?. మహిళా రిజర్వేషన్ బిల్లు తెస్తే ఈ పార్టీలు మద్దతివ్వలేదు. మహిళా వ్యతిరేక పార్టీలు ఇవి' అని విమర్శించారు.

కోయంబత్తూర్ రోడ్ షోకు హైకోర్టు ఓకే

చెన్నై: ఈ నెల 18వ తేదీన తమిళనాడులోని కోయంబత్తూర్ నగరంలో నాలుగు కిలోమీటర్ల మేర సాగాల్సిన ప్రధాని మోదీ రోడ్ షోకు మద్రాస్ హైకోర్టు షరతులతో కూడిన అనుమతి మంజూరు చేసింది. మతపరంగా సున్నితమైన ప్రాంతం అనే కారణంతో కోయంబత్తూర్ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ రోడ్ షోకు అనుమతి నిరాకరించడం సహేతుకంగా లేదని హైకోర్టు పేర్కొంది. ప్రధానమంత్రికి నిరంతరం స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ భద్రత ఉంటుందని గుర్తు చేసింది. 'ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి వంటి ఉన్నత హోదా కలిగిన నాయకులను ప్రజలు ఎన్నుకున్నారు. కాబట్టి, తమను ఎన్నుకున్న వారిని కలవకుండా నేతలను ఆపడం సరికాదు'అని అభిప్రాయపడింది. కొన్ని ప్రాంతాల్లో సాయంత్రం 5 గంటల తర్వాత రోడ్ షో జరగనున్నందున పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందీ ఉండదన్నారు. రోడ్ షోకు అనుమతి నిరాకరిస్తూ పోలీస్ కమిషనర్ పురమ్ రంగే తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ జిల్లా బీజేపీ అధ్యక్షుడు రమేశ్ కుమార్ వేసిన పిటిషన్‌పై జస్టిస్ ఎస్.ఆనంద్ వెంకటేశ్ శుక్రవారం విచారణ జరిపారు. రోడ్ షోకు షరతులతో కూడిన అనుమతివ్వాలని కమిషనర్‌ను ఆదేశించారు.

రష్యాలో మొదలైన అధ్యక్ష ఎన్నికల పోలింగ్

మాస్కో: రష్యాను అప్రతిహతంగా పాలిస్తున్న పుతిన్ మరో ఆరేళ్లపాటు అధికారంలో ఉంటారా లేదా అని తేల్చే దేశాధ్యక్ష ఎన్నికలు శుక్రవారం మొదలయ్యాయి. సుదూర ప్రాంతాలు, 11 అంతర్జాతీయ కాలామానాల్లో రష్యా ఉన్న కారణంగా 1,00,000 పోలింగ్ స్టేషన్లలో మూడ్రోజులపాటు పోలింగ్ కొనసాగనుంది. రష్యా దురాక్రమణ తర్వాత తమ పరమైన ఉక్రెయిన్ ప్రాంతాల్లోనూ అధ్యక్ష ఎన్నికలు నిర్వహిస్తోంది. ఈ ఎన్నికల్లో తొలిసారిగా ఆన్‌లైన్ ఓటింగ్ ప్రవేశపెట్టడంతో మాస్కోలో 2,00,000కుపైగా పౌరులు ఇప్పటికే ఆన్‌లైన్‌లో ఓటేశారు. ఏళ్ల పుతిన్‌కు పోటీగా లిబరల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ రష్యా(ఎల్‌డీపీఆర్) తరఫున లియోనిడ్ స్లట్‌స్కీ, న్యూ పీపుల్ పార్టీ తరఫున వ్లాదిస్లేవ్ దవాన్‌కోవ్, కమ్యూనిస్ట్ పార్టీ తరఫున నికోలే ఎన్నికల బరిలో నిలిచారు.

యడియూరప్పపై పోక్సో కేసు

ఆరోపణలను ఖండించిన కర్ణాటక మాజీ సీఎం



సాక్షి, బెంగళూరు: బీజేపీ సీనియర్ నేత, కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి బీఎస్ యడియూరప్ప(81)పై పోక్సో కేసు నమోదైంది. బాలికపై అత్యాచారానికి పాల్పడినట్లు అందిన ఫిర్యాదు మేరకు యడియూరప్పపై పోక్సో చట్టంతోపాటు ఐపీసీ 354ఏ కింద కేసులు నమోదయ్యాయి. ఫిబ్రవరి 2వ తేదీన 17 ఏళ్ల తన కుమార్తెపై యడ్యూరప్ప అత్యాచారానికి పాల్పడ్డారంటూ ఆమె తల్లి గురువారం రాత్రి ఫిర్యాదు చేసిందని బెంగళూరు పోలీసులు తెలిపారు. ఈ ఆరోపణలను యడియూరప్ప తీవ్రంగా ఖండించారు. చట్టపరంగా ముందుకు వెళతానన్నారు. పోలీసులు డాలర్స్ కాలనీలోని యడియూరప్ప నివాసానికి వెళ్లి ఆయన నుంచి లిఖిత పూర్వక వివరణ తీసుకున్నారని డీజీపీ అలోక్ మోహన్ శుక్రవారం చెప్పారు. తదుపరి దర్యాప్తు కోసం వెంటనే కేసును సీఐడీకి అప్పగించామన్నారు. ఈ పరిణామంపై హోం మంత్రి జి.పరమేశ్వర మాట్లాడారు. బాధితురాలి తల్లి మానసిక పరిస్థితి సరిగా లేదని కొందరు చెప్పారన్నారు. ఫిబ్రవరి 2వ తేదీన తల్లితో కలిసి యడియూరప్పను ఆయన నివాసంలో కలవడానికి వెళ్లినప్పుడు బాలిక చిత్రీకరించిన రెండు వీడియోలు సామాజిక మాధ్యమాల్లో ప్రత్యక్షమయ్యాయి.

ఆమె ఏడుస్తూ సాయం అర్థించింది

కేసు నమోదు కావడంపై యడియూరప్ప స్పందించారు. ఈ కేసుకు సంబంధించి చట్టపరంగా ముందుకెళతానన్నారు. 'ఆ మహిళ ఏడుస్తూ నా దగ్గరికి వచ్చింది. ఆమెను లోపలికి రమ్మని చెప్పి, సమస్య తెలుసుకున్నా. ఆ వెంటనే పోలీస్ కమిషనర్ దయానందతో ఫోన్‌లో మాట్లాడి, ఆమెకు న్యాయం చేయాలని కోరా. ఆ వెంటనే ఆమె నన్ను విమర్శించడం మొదలుపెట్టింది. దీంతో, ఏదో తేడాగా ఉందని అనుమానం వచ్చింది'అని చెప్పారు. ఆమె పోలీస్ కమిషనర్‌ను కలిశాక, వ్యవహారం మలుపు తిరిగిందని పేర్కొన్నారు.

సీఏఏ అంతర్గత వ్యవహారం

అమెరికా వ్యాఖ్యలను తిప్పికొట్టిన భారత్

న్యూఢిల్లీ: పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ)పై అమెరికా స్టేట్ డిపార్టుమెంట్ అధికార ప్రతినిధి మాథ్యూ మిల్లర్ చేసిన వ్యాఖ్యలను భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ గట్టిగా బదులిచ్చారు. భారత దేశ బహుళ సంప్రదాయాలను, దేశ విభజన తర్వాత ఇక్కడి చరిత్రను అర్థం చేసుకోలేని వారు తమకు పాఠాలు చెప్పొద్దని చురక అంటించారు. పౌరసత్వ సవరణ చట్టం తమ దేశ అంతర్గత వ్యవహారమని హితవు పలికారు. ఇక్కడ మైనార్టీలపై ఎలాంటి వివక్ష లేదన్నారు. పొరుగుదేశాల్లో మతహింసకు, వేధింపులకు గురై, వలస వచ్చిన ముస్లిమేతరులకు పౌరసత్వం కల్పించేందుకు సీఏఏ తెచ్చామన్నారు. సీఏఏపై మాథ్యూ చేసిన వ్యాఖ్యలపై ఇండియాలో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ''ఇండియాలో సీఏఏను ఎలా అమలు చేయబోతున్నారన్నది గమనిస్తున్నాం. అన్ని మతాల స్వేచ్ఛను గౌరవించాలి. చట్ట ప్రకారం అన్ని మతాలను సమానంగా చూడడం అనేది ప్రాథమిక ప్రజాస్వామ్య సూత్రం' అని మిల్లర్ వ్యాఖ్యానించారు.

ఎలక్టోరల్ బాండ్లు.. అతిపెద్ద కుంభకోణం

- సమగ్ర దర్యాప్తు జరిపించాలి
- కాంగ్రెస్ పార్టీ డిమాండ్

బెంగళూరు: మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఎలక్టోరల్ బాండ్ల పథకం స్వతంత్ర భారతదేశంలో అతిపెద్ద కుంభకోణమని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేసింది. దర్యాప్తు పూర్తయ్యేదాకా అధికార బీజేపీ బ్యాంకు ఖాతాలను స్తంభింపజేయాలని స్పష్టం చేసింది. ఎలక్టోరల్ బాండ్ల రూపంలో బీజేపీ వేల కోట్ల రూపాయలు నొక్కేసిందని కాంగ్రెస్ చీఫ్ ఖర్గే మండిపడ్డారు. నేను తినను, ఇతరులను తిననివ్వనంటూ ప్రగల్భాలు పలికిన మోదీ ఇప్పుడేం సమాధానం చెబుతారని నిలదీశారు. పెట్టుబడిదారులు, వ్యాపారవేత్తలు బీజేపీకి ఇంత సొమ్ము ఎందుకిచ్చారు? అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి లబ్ధి పొందిన కాంట్రాక్టర్లు, అవినీతికి పాల్పడిన బడా వ్యక్తులు ఎలక్టోరల్ బాండ్లు కొనుగోలు చేసి, బీజేపీకి సమర్పించుకున్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ శుక్రవారం ఆరోపించారు. దర్యాప్తు సంస్థల భయంతో బీజేపీకి లొంగిపోయారని అన్నారు. ఎలక్టోరల్ బాండ్ల కుంభకోణంపై ప్రజాక్షేత్రంలో వెళ్లి పోరాటం సాగిస్తామని తెలిపారు. ఎలక్టోరల్ బాండ్ల స్కామ్‌పై విచారణకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ డిమాండ్ చేశారు. ఈ బాండ్ల వ్యవహారంలో క్విడ్ ప్రో కో చోటుచేసుకుందని, అవకతవకలు జరిగాయని అన్నారు.

ఇదొక వసూళ్ల రాకెట్: రాహుల్

ఎలక్టోరల్ బాండ్ల స్కీమ్ ప్రపంచంలోనే అతి పెద్ద బలవంతపు వసూళ్ల రాకెట్ అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ పథకం కింద వసూలు చేసిన సొమ్మును వివిధ రాష్ట్రాల్లో పార్టీలను చీల్చడానికి, ప్రభుత్వాలను పడగొట్టడానికి బీజేపీ దుర్వినియోగం చేసిందని రాహుల్ ఆరోపించారు. ఆయన శుక్రవారం మహారాష్ట్రలోని థానేలో మీడియాతో మాట్లాడారు. బీజేపీ మినహా ఇతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ఇచ్చిన కాంట్రాక్టులకు, ఎలక్టోరల్ బాండ్లకు మధ్య ఎలాంటి సంబంధం లేదన్నారు.

కెనడాలో భారత సంతతికి చెందిన ముగ్గురు అనుమానాస్పద మృతి

ఒటావా: కెనడాలోని ఒంటారియో ప్రావిన్స్‌లో భారత సంతతికి చెందిన దంపతులు, వారి కుమార్తె అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. ఈ నెల 7వ తేదీ రాత్రి బ్రాంప్టన్‌లోని వారి నివాసంలో మంటలు చెలరేగి సజీవ దహనమయ్యారు. గుర్తు పట్టలేనంతగా కాలిపోయిన మృతదేహాలకు పోలీసులు పరీక్షలు జరిపి మృతులను ఆ ఇంట్లో నివాసం ఉండే రాజీవ్ వరికూ(51), భార్య శిల్ప కొత్త(47), వారి కుమార్తె మహెక్ వరికూ(16)గా నిర్ధారించారు. మంటలు చెలరేగటానికి ముందుగా ఆ ఇంట్లో పెద్ద శబ్దంతో పేలుడు సంభవించినట్లు చుట్టుపక్కల వారు తెలిపారు. ఘటనను అనుకోకుండా జరిగిన అగ్ని ప్రమాదంగా భావించడం లేదని ఫైర్ అధికారులు తెలిపారు.

సాక్షి కరీంనగర్

శనివారం । 16 । మార్చి । 2024



క్వింటాల్ పత్తి రూ.7,800

జమ్మికుంట: స్థానిక మార్కెట్లో పత్తి క్వింటాల్‌కు గరిష్టంగా రూ.7,800 పలికింది. 497 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తెచ్చారు. మార్కెట్‌కు రెండు రోజులు సెలవు ఉండనుంది.



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
శని 6:25	ఆది 4:54

వాతావరణం

గరిష్టం/కనిష్టం 36.0/24.0

జిల్లాలో నేడు సాధారణ వాతావరణం ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఎండ తీవ్రత, ఉక్కపోత కొనసాగుతుంది.



కొత్తపల్లిలో సబ్‌స్టేషన్ శంకుస్థాపన సందర్భంగా మట్టి మోస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

విటమిన్ గార్డెన్లు ఏర్పాటు చేయండి

- పోషకాహార ప్రాముఖ్యంపై అవగాహన కల్పించండి
- కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్: జిల్లాలోని పాఠశాలల్లో పోషకాహారంపై అవగాహన కల్పించేందుకు విటమిన్ గార్డెన్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో పోషణ పక్షోత్సవాలపై సన్నాహక సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ విటమిన్ గార్డెన్లల్లో పోషకాహార కూరగాయలు పండించాలన్నారు. మహిళలు, విద్యార్థులకు పోషకాహార ప్రాముఖ్యత పై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. 6, 7, 8 తరగతుల విద్యార్థులకు ప్రతి వస్తువుపై ఉన్న లేబుల్స్ తెలిసేలా వారంలో ఒకరోజు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా, మండలస్థాయిలో ఫుడ్ తయారీపై కాంపిటీషన్ పోటీలు నిర్వహించాలని తెలిపారు.

బాలికల్లో ఆత్మ స్థైర్యాన్ని పెంపొందించాలి

చదువులోనే కాకుండా వ్యక్తిగత పరిశుభ్రత, సమాజంలో నెలకొన్న మూఢనమ్మకాలపై బాలికలకు అవగాహన కల్పిస్తూ, వారిలో ఆత్మ స్థైర్యాన్ని పెంచేలా అందరూ కృషి చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో యూనిసెఫ్ ఆధ్వర్యంలో రుతుస్రావ పరిశుభ్రతపై అవగాహన కల్పించే అంశంపై జిల్లాస్థాయి అధికారుల కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ బాలికలు, మహిళలు రుతుస్రావ శుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా అవగాహన కల్పించాలని అన్నారు. కొన్ని ప్రైవేట్ హాస్పిటల్‌లో అనవసరమైన ఆపరేషన్లు నిర్వహిస్తున్నారని, దీంతో మహిళలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. వీటిని నియంత్రించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అమ్మ ఆదర్శ కమిటీలతో ప్రతి గ్రామాల్లో వ్యక్తిగత పరిశుభ్రతపై పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై ఏర్పాటు చేసిన బోర్డును ప్రారంభించారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లా వైద్యాధికారి సుజాత, జెడ్పీ సీఈవో శ్రీనివాస్, డీపీవో రవీందర్, డీఈవో జనార్దన్ రావు, డీఆర్డీవో శ్రీధర్ పాల్గొన్నారు.

ఆరంభం అంతం ఇక్కడే..!

'ట్యాపింగ్' కలకలం!

- 2021లో కరీంనగర్‌లోనే ప్రణీత్‌రావుపై రేవంత్ ఆరోపణలు
- సీఎం రేవంత్ సన్నిహితుడు సత్తు మల్లేశ్ ఫోన్ ట్యాప్
- డీఎస్పీ ప్రణీత్‌రావు చాటింగ్ రీట్రైవ్‌లో వెల్లడైన విషయం
- మల్లేశ్ ద్వారా పలువురు కాంగ్రెస్ లీడర్ల సంభాషణలు రికార్డ్
- జాబితాలో మేడిపల్లి, కవ్వంపల్లి, ఆది, అడ్లూరి, చింతకుంట?

సాక్షిప్రతినిధి,కరీంనగర్:

ఫోన్ ట్యాపింగ్ కలకలం సృష్టించిన డీఎస్పీ దుగ్యాల ప్రణీత్‌రావు వ్యవహారం ఆరంభం ఉమ్మడి జిల్లాలోనే జరగడం.. ఆయన అరెస్టు కావడం ఇక్కడే కావడం విశేషం.ట్యాపింగ్‌లో కేసులో సస్పెండైన డీఎస్పీ దుగ్యాల ప్రణీత్‌రావు అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత సీఎం రేవంత్ లక్ష్యంగా పలువురు కాంగ్రెస్ నేతల ఫోన్లను ట్యాపింగ్ చేశారన్న కేసులో అరెస్టు అయిన సంగతి తెలిసిందే. ఉగ్ర సంస్థలు, దేశవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారి ఫోన్లను ట్యాప్ చేసేందుకు స్పెషల్ ఇంటలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) అధికారులకు అనుమతి ఉంటుంది. ఆ సాకుతో డీఎస్పీ ప్రణీత్‌రావు తన ఉన్నతాధికారులు అందించిన జాబితాలోని రాజకీయ నేతల ఫోన్లను ట్యాప్ చేశారన్న విషయం కలకలం రేపుతోంది. దాదాపు 2 లక్షలకుపైగా కాల్స్‌ను రికార్డ్ చేసినట్లు అధికారులు గుర్తించారు. ఇటీవల ప్రణీత్‌రావును అరెస్టు చేసిన సమయంలో స్వాధీనం చేసుకున్న ఫోన్‌లో డిలిట్ చేసిన వాట్సాప్ చాట్‌ను రీట్రైవ్ చేయగలిగారు. అందులో ఉమ్మడి జిల్లాకు చెందిన, ముఖ్యంగా ప్రస్తుతం సీఎంకు సన్నిహితుడిగా పేరొందిన కాంగ్రెస్ సీనియర్ లీడర్ సత్తు మల్లేశ్ నంబరు ఉండటం కలకలం రేపుతోంది.

ఎవరీ సత్తు మల్లేశ్?

జిల్లాలోని కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నేత. అంతకుముందు టీడీపీలో రేవంత్‌తో కలిసి పనిచేశారు. రేవంత్‌తోపాటు కాంగ్రెస్‌లో చేరారు. అప్పటి నుంచి రేవంత్‌కు సన్నిహితుడిగా, ఆంతరంగికుడిగా కొనసాగుతున్నారు. ఎన్నికల సమయంలో సత్తు మల్లేశ్ ఫోన్ కూడా ట్యాపింగ్ జరిగినట్లు రీట్రైవ్ చేసిన వాట్సాప్ చాట్ ద్వారా వెల్లడైంది. ఇతను ఎన్నికల సమయంలో ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు కాంగ్రెస్ నేతలతో పలుమార్లు సంభాషణలు జరిపారు. అంతేకాకుండా సత్తు మల్లేశ్ ఏం మాట్లాడుతున్నారు? ఎవరిని కలుస్తున్నారు? ఏమేం వ్యూహాలు రూపొందిస్తున్నారు? ఎక్కడెక్కడికి వెళ్తున్నారు? అన్న విషయాలను నిరంతరం గమనించారు. ఈ క్రమంలో సత్తు మల్లేశ్ ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులతో సంభాషణలు జరిపారు. ఈజాబితాలో ప్రస్తుత చొప్పదండి, మానకొండూర్, వేములవాడ, పెద్దపల్లి, ధర్మపురి ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, ఆదిశ్రీనివాస్, చింతకుంట విజయరమణారావు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తదితర నాయకులు ఉన్నారని సమాచారం. ఎన్నికల సందర్భంగా వీరితో మాట్లాడిన ప్రతీ కాల్‌ను ప్రణీత్‌రావు అండ్ టీమ్ ట్యాప్‌చేసి ఉంటారని పేరు తెలిపేందుకు ఇష్టపడని ఓ ఉన్నతాధికారి వెల్లడించారు. ఇష్టానుసారంగా సాగిన ఈ వ్యవహారంపై కాంగ్రెస్ నేతలంతా మండిపడుతున్నారు.

సిరిసిల్లలో నాలుగు రోజులే..

ఇటీవల డీఎస్పీ ప్రణీత్‌రావును సిరిసిల్లకు బదిలీ చేశారు. ఈ క్రమంలో తన కంటే ముందు పనిచేసిన ఓ డీఎస్పీ ఉన్న ఇంట్లోనే ప్రణీత్ అద్దెకు దిగినట్లు తెలిసింది. డీసీఆర్‌బీ విభాగంలో రిపోర్ట్ చేసిన ఆయన అక్కడ కేవలం నాలుగు రోజులే పనిచేశారు. అనంతరం ఒకరోజు బందోబస్తు విధుల్లోనూ పాల్గొన్నారు. ఈ క్రమంలోనే ఆయనపై సస్పెన్షన్ వేటు పడింది. 2007 ఎస్సై బ్యాచ్‌కు చెందిన ప్రణీత్‌రావుకు డీఎస్పీగా పదోన్నతి రావడం అత్యంత గోప్యంగా జరిగింది. ఆయన బ్యాచ్ చెందిన సహచరులు దాదాపు 250 మందికిపైగా ఉండగా.. కేవలం ఇతనికి మాత్రమే డీఎస్పీ పదోన్నతి రావడం వెలుగుచూడగానే అతని బ్యాచ్‌మేట్లు అవాక్కయ్యారు. ప్రణీత్‌రావు ఎస్సైగా పనిచేస్తున్న సమయంలో ఎస్పీగా పనిచేసిన అధికారే అతన్ని ఎస్ఐబీలోకి తీసుకుని ప్రోత్సహించినట్లుగా ఉన్నతాధికారులు గుర్తించారు. ఈక్రమంలో ఈనెల 12న సిరిసిల్లలోని ప్రణీత్ రావు నివాసం నుంచి ఆయన్ను పోలీసులు అరెస్టు చేసి హైదరాబాద్‌కు తరలించారు.



2021లో ఇక్కడే వెల్లడించిన రేవంత్

ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలను 2021, అక్టోబరు 24వ తేదీన అప్పటి పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి కరీంనగర్ వేదికగానే సంధించారు. ఆ వేదిక మీద మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణలూ ఉన్నారు. హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో పాల్గొనడానికి వచ్చిన రేవంత్ స్థానిక మైత్రీ హోటల్లో జరిగిన పాత్రికేయుల సమావేశంలో తొలిసారిగా ఈ ఫోన్‌ట్యాపింగ్‌పై బాంబు పేల్చారు. పోలీసు డిపార్ట్‌మెంటు రెండు వర్గాలుగా చీలిపోయిందని, అప్పటి డీజీపీ మహేందర్‌రెడ్డి ఫోన్లు కూడా ట్యాప్ అవుతున్నాయని సంచలన ఆరోపణలు చేశారు. అదే వేదిక మీద నుంచి విశ్రాంత డీఎస్పీ వేణుగోపాల్ రావు, ఇన్‌స్పెక్టర్ దుగ్యాల ప్రణీత్ రావు (ప్రస్తుతం సస్పెండైన డీఎస్పీ) ట్యాపింగ్ వ్యవహారాన్ని 30 మందితో పర్యవేక్షిస్తున్నారని కూడా ధ్వజమెత్తారు. కరీంనగర్ వేదికగా రేవంత్‌రెడ్డి అన్న మాటలు.. ఇప్పుడు జరుగుతున్న పరిణామాలు సరిపోలడం గమనార్హం.

బలహీనవర్గాల గొంతుకనవుతా

- కార్పొరేషన్‌లతో తొలి అడుగు
- గమ్యం చేరేదాక విశ్రమించొద్దు
- బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ కార్పొరేషన్/కొత్తపల్లి: బీసీబిడ్డగా బడుగు, బలహీనవర్గాల గొంతుకనవుతానని బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బీసీ కులాల ఆర్థిక పురోగతికి కార్పొరేషన్ ఏర్పాటు తొలి అడుగుగా అభివర్ణించారు. బీసీ కులగణన చేయాలని అసెంబ్లీలో తీర్మాణం చేసేలా కృషి చేసినందుకు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు బీసీ కుల సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ వైద్యుల అంజన్‌కుమార్ ఆధ్వర్యంలో ఆత్మీయ అభినందన సభ ఏర్పాటు చేశారు. శుక్రవారం నగరంలోని పద్మనగర్ ఇందిరాభవన్‌లో ఏర్పాట చేసిన కార్యక్రమంలో బీసీ కుల సంఘాలు పెద్ద ఎత్తున హాజరై ఘనంగా సన్మానించాయి. మంత్రి మాట్లాడుతూ బలహీనవర్గాల బిడ్డనైన తనను ఆశీర్వదించేందుకు ఇంతపెద్ద సంఖ్యలో కుల సంఘాల రావడం మరింత శక్తి నిస్తోందన్నారు. తన రాజకీయ జీవితం తెరిచిన పుస్తకమన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కుల కార్పొరేషన్‌లు గత ప్రభుత్వంలో మాదిరిగా ఉత్సవ విగ్రహాలు కావన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిధులు, ఉపాధి కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కుల వృత్తులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించుకోవాలని సూచించారు. బీసీ కుల సంఘాల ప్రతినిధులు కేశిపెద్ది శ్రీధర్‌రాజు, ఎ.కిరణ్‌కుమార్, వి.గణేశ్‌బాబు, మెతుకు సత్యం, లక్కాకుల సురేందర్‌రావు, వీర దేవేందర్ పటేల్, రాచకొండ చక్రధర్‌రావు, కర్ర రాజశేఖర్, మర్రి శ్రీనివాస్ యాదవ్, పూసల సంపత్‌కుమార్, మడుపు మోహన్, సింగిరాల వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.



మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సన్మానిస్తున్న కుల సంఘాల నాయకులు

కరీంనగర్‌ను అగ్రభాగాన నిలుపుతాం

తెలంగాణలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాను అన్ని రంగాల్లో ఎమ్మెల్యేల సహకారంతో అగ్రభాగాన నిలుపుతామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం కొత్తపల్లిలో రూ. 150కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ప్రభుత్వ మెడికల్ కాలేజీ నూతన భవన నిర్మాణానికి మంత్రి పొన్నం ప్రభాకర్ మానకొండూర్, చొప్పదండి ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి శంకుస్థాపన చేశారు. రాజకీయాలకతీతంగా మెడికల్ కాలేజ్ ను తీర్చిదిద్దుతామని అన్నారు. అదేవిధంగా ఖాజీపూర్ (సాయినగర్)లో నూతనంగా నిర్మించిన 33/11 కె.వి విద్యుత్ ఉప కేంద్రాన్ని ప్రారంభించారు. వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని రైతులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఆర్డీవో కే.మహేశ్వర్, ఎంపీపీ పిల్లి శ్రీలత, ఎస్పీడీసీఎల్ ఎస్ఈ గంగాధర్ పాల్గొన్నారు.

నాణ్యత... వినియోగదారుల హక్కు

- అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్



కరీంనగర్ అర్బన్: వినియోగదారులకు నాణ్యమైన వస్తువులు పొందేందుకు సకల హక్కులున్నాయని అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ అన్నారు. శుక్రవారం ప్రపంచ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా 'వినియోగదారుల న్యాయమైన బాధ్యతాయుతమైన కృత్రిమ మేధస్సు'' అంశంపై చర్చా సమావేశం నిర్వహించారు. వినియోగదారుల రక్షణ చట్టం-2019పై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని అన్నారు. కొనుగోళ్లలో మోసం జరిగినప్పుడు న్యాయం కోసం పోరాటం చేయాలని సూచించారు. డిజిటల్ యుగంలో న్యాయమైన చెల్లింపులు జరిగేలా చూసుకోవాలని తెలిపారు. ఏ వస్తువు కొనుగోలు చేసినా రశీదు తీసుకోవాలని సూచించారు. పౌరసరఫరాల సంస్థ డీఎం మంగాళరపు రజనీకాంత్, తూనికలు, కొలతల శాఖ ఏసీ విజయసారథి, జిల్లా సరఫరాల అధికారి గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటింగ్‌శాతం పెరిగేలా చర్యలు చేపట్టండి



కరీంనగర్ అర్బన్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరిగేలా అధికారులు కృషి చేయాలని డీఆర్వో పవన్‌కుమార్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లాస్థాయి స్వీప్ కోర్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కళాశాలలతో పాటు స్వశక్తి మహిళా సంఘాల్లోని మహిళలను చైతన్యవంతులను చేయాలని సూచించారు. రెండు చోట్ల ఓటు హక్కు ఉంటే తొలగించాలని, వయసు పైబడినవారు ఓటరుగా దరఖాస్తు చేస్తే పూర్తి వివరాలు తెలుసుకున్నాకే నమోదు చేయాలని స్పష్టం చేశారు. పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ గణనీయంగా పెరగాల్సిన అవసరముందని వివరించారు. ఈ కార్యక్రమంలో డీపీవో రవీందర్, మెప్మా పీడీ రవీందర్, మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్, డీఈవో జనార్దన్‌రావు, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, డీఎంహెచ్‌వో సుజాత పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్: రాష్ట్ర మైనారిటీస్ స్టడీ సర్కిల్, మైనారిటీల సంక్షేమ శాఖ హైదరాబాద్ వారు యూపీఎస్సీ-సీఎస్ఏటీ పరీక్ష కోసం వందమంది మైనార్టీస్ అభ్యర్థుల ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీస్ సంక్షేమ అధికారి పి.పవన్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ పూర్తి చేసిన వారు సంబంధింత వెబ్‌సైట్ ద్వారా ఏప్రిల్ 12వరకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 28న స్క్రీన్‌టెస్ట్ ఉంటుందని, వివరాలకు 9849152516 నంబర్‌ను సంప్రదించవచ్చునని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

ఉచిత వైఫై ఉత్తదేనా?



కరీంనగర్ అర్బన్: కలెక్టరేట్‌కు వచ్చే ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన వైఫై సేవలు అలంకారప్రాయంగా మిగిలాయి. స్మార్ట్‌సిటీలో భాగంగా కలెక్టరేట్‌లో నాలుగు వైఫై పరికరాలను అమర్చారు. ఇందులో రెండు అధికారులు, ఉద్యోగుల కోసం కాగా మరో రెండు ప్రజల కోసం ఏర్పాటు చేశారు. అధికారులు, ఉద్యోగుల కోసం ఏర్పాటు చేసిన పరికరాలు పని చేస్తుండగా ప్రజల కోసం ఏర్పాటు చేసిన వాటిపై పర్యవేక్షణ కరవైంది.

పబ్లిక్ స్కూల్‌కు ఇద్దరు ఎంపిక

కరీంనగర్:జిల్లాలోని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ కార్యాలయంలో శుక్రవారం హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ 1వ తరగతికి లక్కీ డ్రా ద్వారా ఇద్దరు విద్యార్థులను అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్ ఎంపిక చేశా రు. జాడి దేవాన్ష్, చిల్లుముల సుషాంత్ ఎంపికయ్యారు. డిప్యూటీ డైరెక్టర్ పి.నతానియేల్ ఉన్నారు.

సీఐల బదిలీ

కరీంనగర్ క్రైం: పలువురు సీఐలను బదిలీ చేస్తూ శుక్రవారం ఐజీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. జి.జాన్‌రెడ్డి(ఏసీబీ)ని కరీంనగర్ 3టౌన్‌కు, వై.చంద్రశేఖర్ గౌడ్ (కరీంనగర్ 3టౌన్)ను మల్టీజోన్ ఐజీ కార్యాలయానికి అటాచ్ చేశారు. బి.రమేశ్‌కు తిరిగి హుజూరాబాద్‌లో పోస్టింగ్ ఇచ్చారు. ఏ.రాంబాబు(హుజూరాబాద్‌టౌన్)ను మల్టీజోన్ ఐజీ కార్యాలయానికి అటాచ్ చేశారు.

రెవెన్యూ అక్రమాలు ఇన్నిన్ని కాదయా!

- అటకెక్కిన జాబ్‌చార్ట్
- ఏళ్లుగా ఒకే చోట విధులు
- వ్యవస్థాగత లోపాలే కారణాలు!
- కలెక్టర్ గారూ.. ప్రక్షాళన చేయండి

కరీంనగర్ అర్బన్: తహసీల్దార్.. మండలానికి మెజిస్ట్రేట్. జిల్లాకు కలెక్టర్ ఎలాగో మండలానికి అదే తరహా అధికారం గల పోస్టు. నేరుగా ప్రజలతో సంబంధాలుండే హోదా.. ప్రభుత్వ నిబంధనలను అమలు చేస్తూ.. కీర్తిప్రతిష్ఠలు తెస్తూ ఆదర్శంగా నిలవాల్సిన వారే అక్రమాలకు తెరలేపుతున్నారు. కంచే చేను మేసిన చందంగా వ్యవహరిస్తున్నారు.. దీంతో రెవెన్యూ వ్యవస్థకు 'అవినీతి' మచ్చ పడుతుండగా జిల్లాలో వరుసగా తహసీల్దార్ల అక్రమాల బాగోతం బయటపడుతుండటం కలకలం రేపుతోంది.

అగ్రభాగాన రెవెన్యూశాఖ

ఏసీబీకి వచ్చే ఫిర్యాదుల్లో రెవెన్యూశాఖ అగ్రభాగాన నిలుస్తోంది. ప్రజలతో సత్సంబంధాలు నెరపాల్సిన శాఖకు అవినీతి మాయని మచ్చలా మిగులుతోంది. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణల కేసులో బుధవారం జమ్మికుంట తహసీల్దార్ రజని అరెస్టయ్యారు. ఉమ్మడి జిల్లాలో గత 15ఏళ్లలో తహసీల్దార్లలో ఏసీబీ కేసులైన వ్యక్తుల్లో ఈమె 15వ వ్యక్తి. ఇక నాయబ్ తహసీల్దార్లు, గిర్దావర్లు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు పట్టుబడిన ఘటనలు లేకపోలేదు. అవినీతి ఆరోపణలు, భూకబ్జాదారులకు కొమ్ముకాయడం వంటి అపఖ్యాతిని మూటగడుతున్నారు. గతంలో శంకరపట్నం తహసీల్దార్‌గా పనిచేసిన వెంకటరమణ నుంచి కోరుట్ల తహసీల్దార్‌గా వ్యవహరించిన శంకర్, రాంబాబు(మానకొండూరు), రమేశ్(ధర్మారం) నుంచి మొన్న చిల్లా శ్రీనివాస్(కొత్తపల్లి), నిన్న తిరుమల్‌రావు(వీణవంక) ప్రస్తుతం జమ్మికుంట తహసీల్దార్ రజని వరకు ఏసీబీ, పోలీస్ కేసుల్లో చిక్కారు. ప్రజలకు భూమి సంపాదించడం కన్నా దానికి రికార్డు సంపాదించడమే కష్టంగా తయారైంది. లంచం ఇవ్వకుండా రెవెన్యూశాఖ నుంచి చిన్న కాగితమైనా నిర్దేశిత గడువులో పొందడం అసాధ్యమన్నది బాధితుల ఆవేదన.

జాబ్‌చార్టుకు జవాబుదారీ ఏదీ?

రెవెన్యూశాఖలో జవాబుదారీతనం లోపించింది. పదేళ్ల క్రితం వరకు దాదాపు అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో పౌరసేవల పట్టిక దర్శనమిచ్చేది. ప్రస్తుతం చాలా చోట్ల సదరు పట్టిక అటకెక్కించారు. ఇక రికార్డులు సరిగా నిర్వహించాల్సిన వ్యక్తుల తప్పులతో భూములు కొనుగోలు చేసిన వారు గతంలో తీవ్రంగా నష్టపోయారు. ఇప్పటికి సదరు సమస్యల పరిష్కారానికి న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారు. ఇక కార్యాలయాల్లో దళారులే శాసించే పరిస్థితి పలు చోట్ల ఏర్పడింది.

కలెక్టరేట్‌లోనూ పాతుకుపోతున్నారు..

కలెక్టరేట్‌తో పాటు అన్ని మండలాల్లో పని చేసే రెవెన్యూ అధికారులు ఒకచోట చేరారంటే అక్కడి నుంచి కదలడం లేదు. సంఘాల పలుకుబడితో కొద్దికాలం ఒక చోట పనిచేసినట్లు చేసి అంతలోనే పాత స్థావరాలకు వచ్చేస్తున్నారు. కలెక్టరేట్‌లో దశాబ్దాలుగా పనిచేస్తున్న అధికారులకు కొదువే లేదు. ఇక్కడే జూనియర్ అసిస్టెంట్‌గా ప్రస్థానం ప్రారంభించి తహసీల్దార్ వరకు ఇక్కడే ఉండటం వీరికే చెల్లు. కలెక్టర్లు రెండేళ్లకోసారి మారుతుండగా వచ్చిన కలెక్టర్లకు తప్పుడు సమాచారమిస్తూ ఇక్కడే పోస్టింగ్ కొట్టేస్తున్నారు. ఒక సెక్షన్ నుంచి మరో సెక్షన్‌కు మారుతుండగా ఇతర ప్రాంతాలకు వెళితే అద్భుతమే. ఇటీవల అరెస్టయి జైలుకు వెళ్లిన చిల్లా శ్రీనివాసే అందుకు ఉదాహరణ. టైపిస్టు నుంచి తహసీల్దార్ వరకు కరీంనగర్‌లో పనిచేయగా నగరంలోని భూములపై పూర్తిస్థాయిలో పట్టుసాధించి అక్రమాలకు పాల్పడ్డారు.



ప్రతీ పనికి ఆమ్యామ్యాలే

రెవెన్యూశాఖలో ఏ పని కావాలన్నా, పలుకుబడి ఉన్నా వీరి ముందు బలాదూరే. ప్రతి పనికి ఇంతరేటుగా చలామణి అవుతోంది. ఓ రెవెన్యూ అధికారి తెలిపిన వివరాల ప్రకారం.. మ్యుటేషన్‌కు రూ.3వేల నుంచి రూ.50వేల వరకు, భూరికార్డుల్లో తప్పుల సవరణకు రూ.2వేలు, పట్టాదారు పాసుపుస్తకాల జారీకి ఎకరానికి రూ.2వేల నుంచి రూ6వేలు, టైటిల్ డీడుకు రూ.3వేలు, పట్టణ ప్రాంతాలైతే రూ.4వేల నుంచి రూ.6వేలు, 1బీ రికార్డులో పేరు నమోదుకు రూ.3వేల నుంచి రూ.5వేలు, పహాణీ ప్రతులకు రూ.వెయ్యి, అలాగే సరిహద్దు వివాదాలున్న సర్వే పత్రాలివ్వాలన్న, కుటుంబసభ్యుల ధ్రువీకరణ పత్రాల జారీ, నాలా కోసం నిరభ్యంతర పత్రం, భూముల సర్వేకు అడిగినకాడికి ఇవ్వాల్సిందే. లేకుంటే పని ఏళ్ల గడిచినా కాదని తెలుస్తోంది.

ఇలా చేస్తే ప్రయోజనం

- ప్రతి ఉద్యోగి, అధికారి తాము పనిచేసే చోటే నివాసముండేలా చర్యలు చేపట్టాలి. చట్టంలో స్పష్టంగా ఉన్నా అమలవడం లేదు.
- ఒక కార్యాలయంలో పనిచేసిన ఉద్యోగి, అధికారి మళ్లీ సదరు కార్యాలయానికి బదిలీ చేయకూడదు. తదనుగుణంగా బుక్‌ను నిర్వహించాలి.
- రెవెన్యూ శాఖను గాడిన పెట్టేందుకు గతంలో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల కేంద్రం కొంతమేరకు సత్ఫలితాలిచ్చింది. అప్పట్లో జేసీగా పనిచేసిన అరుణ్‌కుమార్ కలెక్టరేట్లో ఫిర్యాదుల కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.
- టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసి ప్రజలు నేరుగా సదరు నంబర్‌కు ఫిర్యాదు చేయడం, సంబంధిత సిబ్బంది వివరాలను నమోదు చేసుకుని గోప్యంగా ఉంచి ఉన్నతాధికారులకు తెలియజేయడం జరిగింది. అతని బదిలీతో కేంద్రాన్ని ఎత్తివేశారు.
- రెవెన్యూశాఖలోని ఉద్యోగులందరికీ విధులపై పునశ్చరణ తరగతులు నిర్వహించాలి. గిర్దావర్లకు తమ పరిధిలోని సర్వే నంబర్లు, వాటి హద్దులు, ప్రభుత్వ ఆస్తుల వివరాలపై పూర్తి అవగాహన వచ్చేలా సర్వే విభాగంలో శిక్షణనివ్వాలి. కుల, జనన, స్థానికత ధ్రువ పత్రాలను జారీ చేసే బాధ్యతలను వీలైనంత తగ్గించాలి.

క్లుప్తంగా

విద్యార్థులను ప్రేరేపించిన 'ప్రేరణ'



నృత్యం చేస్తున్న విద్యార్థులు

రామడుగు: రామడుగు మండలం వెదిర అల్ఫోర్స్ బాలుర ఇంటర్నేషనల్ రెసిడెన్షియల్ పాఠశాలలో 'ప్రేరణ' పేరిట పదోతరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం ఘనంగా జరిగింది. లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ సమన్వయకర్త కెప్టెన్ డాక్టర్ బి.మధుసూదన్‌రెడ్డి, అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. విద్యార్థులకు వివిధ కళలపై అవగాహన కల్పించడమే కాకుండ వాటిలో పాల్గొనేలా ప్రోత్సాహాన్ని అందించడం చాలా స్ఫూర్తి దాయకమని అన్నారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

తల్లీకూతురు అదృశ్యం

మెట్‌పల్లిరూరల్(కోరుట్ల): తల్లీకూతురు అదృశ్యమైన ఘటనపై కేసు నమోదు చేసినట్లు మెట్‌పల్లి ఎస్సై చిరంజీవి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మెట్‌పల్లి మండలం మెట్లచిట్టాపూర్ గ్రామానికి చెందిన లాస్యకు వెంకట్రావుపేటకు చెందిన జక్కుల నరేశ్‌తో వివాహం జరిగింది. వీరికి ఏడేళ్ల వయస్సు గల కూతురు ఉంది. కాగా లాస్య, నరేశ్‌కు మనస్పర్థలు రావడంతో కొంతకాలంగా ఆమె తన కూతురితో తల్లిగారి ఇంటి వద్దే ఉంటుంది. ఈ క్రమంలో ఈ నెల 13న బంధువుల ఇంట్లో శుభకార్యానికి కూతురితో కలిసి వెళ్లిన లాస్య ఇంటికి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబసభ్యులు పలుచోట్ల వెతికారు. ఆచూకీ దొరక్కపోవడంతో ఆమె తండ్రి లక్ష్మీరాజం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అదృశ్యం కేసు నమోదు



జమ్మికుంట: పట్టణానికి శ్రీరామోజు రాజేశ్ అనే వ్యక్తి గురువారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో శుక్రావారం అదృశ్యం కేసు నమోదు చేశామని టౌన్ సీఐ వరగంటి రవి తెలిపారు. బంధువులను సంప్రదించినా ఆచూకీ లభించలేదని, భార్య దివ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

విధులు ముగించుకొని వస్తూ..

- బైక్ పై నుంచి పడి ప్రభుత్వ ఉపాధ్యాయుడి మృతి



జగదీశ్వరాచారి (ఫైల్)

ఎలిగేడు(పెద్దపల్లి): మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న శ్రీరామోజు జగదీశ్వరాచారి (56) శుక్రవారం తన విధులు ముగించుకొని ఇంటికి వెళ్తుండగా ద్విచక్ర వాహనంపై నుంచి పడి మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరామోజు జగదీశ్వరచారి శుక్రవారం సాయంత్రం పాఠశాల నుంచి విధులు ముగించుకుని ద్విచక్రవాహనంపై ఎలిగేడు నుంచి కరీంనగర్‌కు వస్తుండగా సుల్తాన్‌పూర్ ఎస్సీ కాలనీ స్పీడ్‌బ్రేకర్ వద్ద కిందపడి మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని జూలపల్లి ఎస్సై శ్రీధర్ పరిశీలించి, మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లోని వైర్ చోరీ

జమ్మికుంట: ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ వైర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని గండ్రపల్లి గ్రామ శివారు రైల్వేలైన్ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి రూ.అరవై వేలు విలువ చేసే కాపర్ వైర్‌ను దొంగిలించారు. విద్యుత్ లైన్‌మెన్ కోడూరి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని టౌన్ సీఐ వరగంటి రవి వివరించారు.

నిరుద్యోగులకు సింగరేణి గుడ్‌న్యూస్



సింగరేణి ఉద్యోగులు

- సింగరేణిలో భారీగా రిక్రూట్‌మెంట్‌కు శ్రీకారం
- ఇంటర్నల్ 813 పోస్టులు, ఎక్స్‌టర్నల్ 327పోస్టులు

గోదావరిఖని: సింగరేణిలో మరో భారీ ఉద్యోగాల భర్తీకి యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. మొదటి దఫాగా ఉద్యోగాల భర్తీకి ఈనెల 6న నోటిఫికేషన్ జారీ చేసిన యాజమాన్యం కేవలం 8రోజుల వ్యవధిలోనే మరో నోటిఫికేషన్ ఇచ్చింది. సంస్థలో ఖాళీగా ఉన్న 327 పోస్టులను ప్రత్యక్ష నియామకాల పద్ధతిలో బయటి అభ్యర్థుల ద్వారా, 813 పోస్టులను సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగుల ద్వారా భర్తీ చేసేందుకు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈపోస్టుల కోసం ఏప్రిల్ 15 నుంచి మే 5వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొంది. పూర్తి వివరాల కోసం ఏప్రిల్ 15 తేదీ నుంచి సింగరేణి సంస్థ వెబ్‌సైట్ (https://scclmines.com)లో చూసుకోవాలని తెలిపారు. ఇంటర్నల్ పోస్టుల కోసం ఈనెల 20 నుంచి 30 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. పూర్తి వివరాల కోసం మార్చి 20వ తేదీ నుంచి సింగరేణి సంస్థ వెబ్‌సైట్ (https://scclmines.com)లో చూడవచ్చని తెలిపారు.

ఇటీవల ఇచ్చిన నోటిఫికేషన్

సింగరేణి యాజమాన్యం ఈనెల 6న సంస్థలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ జారీ చేసింది. మొదటి నోటిఫికేషన్‌లో 173 అంతర్గత పోస్టులు, రెండో నోటిఫికేషన్‌లో 813, ఎక్స్‌టర్నల్ విభాగంలో మొదటి నోటిఫికేషన్‌లో 272, రెండో నోటిఫికేషన్‌లో 327పోస్టుల భర్తీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈలెక్కన 986ఇంటర్నల్, 599 ఎక్స్‌టర్నల్ పోస్టుల భర్తీకి సిద్ధం చేసింది. మరో 200పోస్టులను ప్రమోషన్స్ పద్ధతిలో అతిత్వరలో భర్తీ చేస్తామని ప్రకటించారు. అలాగే 60ఈపీ ఆపరేటర్ల పోస్టుల భర్తీ చేస్తామని తెలిపారు.

నేరుగా భర్తీ చేసే ఉద్యోగాలు

ఎగ్జిక్యూటివ్ క్యాడర్	
ఈఅండ్ఎం మేనేజ్‌మెంట్ ట్రెయినీ	42
సిస్టమ్స్ మేనేజ్‌మెంట్ ట్రెయినీ	7
నాన్–ఎగ్జిక్యూటివ్ క్యాడర్	
జేఎంఈటీ జూనియర్ ఇంజనీర్ ట్రెయినీ	100
మెకానికల్ అసిస్టెంట్ ఫోర్‌మెన్ ట్రెయినీ	09
ఎలక్ట్రికల్ అసిస్టెంట్ ఫోర్‌మెన్ ట్రెయినీ	24
ఫిట్టర్ ట్రెయినీ	47
ఎలక్ట్రీషియన్ ట్రెయినీ	98

సింగరేణి ఉద్యోగులతో భర్తీ పోస్టులు

ఎగ్జిక్యూటివ్ క్యాడర్	
మైనింగ్ గ్రాడ్యుయేట్ ట్రెయినీ	22
అండర్ మేనేజర్	20
జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్	06
నాన్ఎగ్జిక్యూటివ్ క్యాడర్	
జూనియర్ అసిస్టెంట్	360
జూనియర్ మైనింగ్ఇంజనీర్ ట్రెయినీట్రైనీ	100
ట్రెయినీ అసిస్టెంట్ ఫోర్‌మెన్(మెకానికల్)	10
అసిస్టెంట్ ఫోర్‌మెన్(ఎలక్ట్రికల్)	25
ట్రెయినీ ఫిట్టర్	123
ట్రెయినీ ఎలక్ట్రీషియన్	133,
ట్రెయినీ వెల్డర్ ట్రైనీ పోస్టులు	14

మెరిట్ ఆధారంగా ఎంపిక



పోస్టులన్నీ వ్రాతపరీక్ష ఆధారంగా పూర్తిగా మెరిట్‌పై ఆధారపడి ఉంటుంది. దళారులను నమ్మి ఎవరు మోసపోవద్దు. ఎవరైనా సామాజిక మాధ్యమాల్లో మెసేజ్, ఫోన్ చేసి ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పే వారివద్ద ప్రలోభాలకు గురికావద్దు. వెంటనే ఏసీబీ, సింగరేణి విజిలెన్స్‌కు సమాచారం అందించాలి. వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.

– ఎన్.బలరాం, సీఅండ్ఎండీ, సింగరేణి

నేటి నుంచి ఇంటర్ స్పాట్ షురూ

- రెండు కేంద్రాల్లో క్యాంపు
- 1,800 మంది ఎగ్జామినర్లు
- 5.50 లక్షల జవాబు పత్రాలు
- నాలుగు విడతల్లో స్పాట్



కరీంనగర్: ఇంటర్ పరీక్షల జవాబుపత్రాల స్పాట్ శనివారం నుంచి ప్రారంభం కానుంది. ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల పరీక్షలు గురువారంతో ముగిశాయి. దీంతో స్పాట్ ప్రారంభించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాకు సంబంధించిన ఇంటర్ మూల్యాంకనం రెండు కేంద్రాల్లో, నాలుగు విడతల్లో పూర్తి చేయనున్నారు.

నాలుగు విడతల్లో

నాలుగు విడతల్లో మూల్యాంకన ప్రక్రియ పూర్తి చేయనున్నారు. ఇంగ్లిష్, తెలుగు, హిందీ, గణితం, పౌరశాస్త్రం సబ్జెక్టులను మొదటి విడతలోనే చేపట్టనున్నారు. శనివారం నుంచి మొదటి విడత మూల్యాంకనం ప్రారంభించనున్నారు. పద్మనగర్‌లోని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కార్యాలయంలో ఇంగ్లిష్, హిందీ సబ్జెక్టులు, బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గణితం, పౌరశాస్త్రం, తెలుగు సబ్జెక్టులు మూల్యంకనం చేపట్టనున్నారు. ఈ నెల 20 తేదీ నుంచి రెండో విడతలో భాగంగా ఫిజిక్స్, ఎకనామిక్స్, 22 నుంచి మూడో విడతలలో కెమిస్ట్రీ, కామర్స్ 24 నుంచి నాలుగో విడతలో చరిత్ర, బాటనీ, జువాలజీ సబ్జెక్టుల పేపర్లు దిద్దేలా అధికారులు ప్రణాళిక రూపొందించారు.

1,800 మంది ఎగ్జామినర్లు

ఇంటర్ మూల్యాంకనం కోసం నాలుగు విడతల్లో జవాబు పత్రాలను దిద్దేందుకు 1,800 మంది ఎగ్జామినర్లు, ఇతరత్రా సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. జిల్లా కేంద్రంలో 5 లక్షల 50 వేల మంది విద్యార్థుల పేపర్లు దిద్దేందుకు అధికారులు క్షేత్రస్థాయి సిబ్బందిని సన్నద్ధం చేశారు.

బోర్డు ఆదేశాలకు అనుగుణంగా

ఇంటర్ బోర్డు ఆదేశాలకు అనుగుణంగా మూల్యాంకన ప్రక్రియ సక్రమంగా నిర్వహించేందుకు క్యాంపు పర్సనల్స్‌గా నలుగురు అధికారులను నియమించారు. వీరితోపాటు క్యాంపు ఆఫీసర్ ఉంటారు. సమాధాన పత్రాలు కేంద్రానికి రాగానే కోడింగ్ చేస్తారు. దీనివల్ల సమాధాన పత్రం ఏ విద్యార్థిది, ఏ కళాశాల అనే వివరాలు దిద్దేవారికి తెలియదు. ఇంటర్ బోర్డు నుంచి నియామకపత్రాలు అందిన అధ్యాపకులు విధిగా మూల్యాంకన విధుల్లో చేరాల్సి ఉంటుంది. ఎగ్జామినర్లకు కేటాయించిన ఆయా మూల్యాంకన కేంద్రాలకు సకాలంలో హాజరుకావాలని సూచించారు.

ఒకేషనల్‌లో 160 మంది గైర్హాజరు

ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం వొకేషనల్ పరీక్షలో శుక్రవారం 160 మంది గైర్హాజరైనట్లు డీఐఈవో జగన్మోహన్‌రెడ్డి వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా 1229 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 160 మంది విద్యార్థులు గైర్హాజరు కాగా 1069 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని డీఐఈవో వెల్లడించారు.

నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు



మూల్యాంకన ప్రక్రియను నిర్వహించేందుకు అవసరమైన వసతులు ఏర్పాటు చేశాం. ఇంటర్ బోర్డు అధికారులు ఇక్కడికి వచ్చి అన్నీ పరిశీలించాకే ఏర్పాటుకు ఉత్తర్వులు జారీచేశారు. సిబ్బంది తమకు కేటాయించిన తేదీల్లో నిర్దేశిత కేంద్రానికి వచ్చి రిపోర్టు చేయాలి. నిర్లక్ష్యం చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

– జగన్మోహన్‌రెడ్డి, జిల్లా ఇంటర్ విద్యాధికారి

నిమ్స్‌లో మైనర్ బాలిక

- కోమాలోకి వెళ్లిందంటున్న బంధువులు
- వేములవాడలో అత్యాచార ఘటన
- దళిత సంఘాల ఆందోళన



కలెక్టర్ యాస్మిన్ బాషాను కలిసిన దళిత నేతలు

కోరుట్ల/మేడిపల్లి: వారం క్రితం మేడిపల్లి మండలం వెంకట్రావ్‌పేటకు చెందిన బాలిక(14)ను అదే గ్రామానికి చెందిన మైదం సాయికుమార్(23) కిడ్నాప్ చేసి వేములవాడలోని ఓ లాడ్జిలో అత్యాచారానికి పాల్పడగా అక్కడి పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపిన విషయం తెలిసిందే. అత్యాచారానికి గురైన బాలిక తీవ్ర అస్వస్థతకు గురి కాగా, కరీంనగర్ సివిల్ ఆసుపత్రికి తరలించి మూడు రోజుల పాటు చికిత్స అందించారు. అయినప్పటికీ బాలిక పరిస్థితి మెరుగుపడకపోగా, గురువారం ఆమెను హైదరాబాద్ నిమ్స్‌కు తరలించి చికిత్స చేయిస్తున్నారు. ఈ క్రమంలో బాలిక కోమాలోకి వెళ్లిందని బంధువులు ఆరోపించడం కలకలం రేపింది. అత్యాచారం ఘటన వెనక కేవలం ఒక్కరి పాత్ర లేదని మరికొందరు ఉన్నారని బాలిక బంధువులు ఆరోపిస్తున్నారు. మైనర్ బాలికను కిడ్నాప్ చేసి అత్యాచారానికి పాల్పడి ప్రాణాపాయ స్థితికి కారకుడైన యువకున్ని ఉరి తీయాలని కోరుతూ గురువారం జగిత్యాలలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద దళిత సంఘాల అధ్వర్యంలో ధర్నా , రాస్తారోకో నిర్వహించారు. ఈ సంఘటన జగిత్యాల జిల్లాలో కలకలం రేపింది.

కలెక్టర్‌కు వినతి పత్రం

అత్యాచారానికి గురైన దళిత బాలికకు న్యాయం చేయాలని కోరుతూ దళిత సంఘాల నాయకులు కలెక్టర్ యాస్మిన్‌బాషాను కలిసి విన్నవించారు. ఘటన వివరాలు తెలిపి నిందితునిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితురాలికి మెరుగైన వైద్య సాయం అందించాలని కలెక్టర్‌ను కోరారు.

కాంగ్రెస్‌లోకి కొత్తపల్లి జెడ్పీటీసీ సభ్యురాలు

- మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో చేరిక



జెడ్పీటీసీ కరుణకు కండువా కప్పుతున్న మంత్రి

కరీంనగర్ కార్పొరేషన్: కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో బీఆర్‌ఎస్‌కు తొలి షాక్ తగిలింది. కొత్తపల్లి జెడ్పీటీసీ సభ్యురాలు పిట్టల కరుణ ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి, కాంగ్రెస్‌లో చేరారు. శుక్రవారం నగరంలోని ఓ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ ఆమెకు పార్టీ కండువా కప్పి, ఆహ్వానించారు. అలాగే మత్స్యపారిశ్రామిక సంఘం అధ్యక్షుడు పిట్టల రవీందర్, వార్డు సభ్యులు పిట్టల విష్ణు, పిల్లి శ్రీధర్, గుర్రం సత్యం, కోమలతోపాటు కొత్తూరి వెంకట్‌రాజయ్య, ముస్కు అంజిరెడ్డి, గుగులోతు దివ్య, బానోతు రవినాయక్, శ్రవణ్‌నాయక్, గంగాధర కనకయ్య కాంగ్రెస్‌లో చేరినవారిలో ఉన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కొత్తపల్లి జెడ్పీటీసీ సభ్యురాలి చేరికతో కాంగ్రెస్ మరింత బలోపేతం అవుతుందన్నారు. ముదిరాజ్ కులస్తుల అభ్యున్నతికి కృషి చేస్తామని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో ముదిరాజ్‌లకు న్యాయం జరగలేదని, అందుకే కాంగ్రెస్‌లో చేరామని జెడ్పీటీసీ సభ్యురాలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నగర శాఖ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఉచితంగా.. ప్రైవేట్‌కు దీటుగా

- ప్రభుత్వ ఆసుపత్రిలో మోకాలు, తుంటి మార్పిడి చికిత్సలు
- మెడికల్ కళాశాల ఏర్పాటుతో పెరిగిన సౌకర్యాలు
- నిరుపేదలకు ఖరీదైన వైద్యం



తుంటి మార్పిడి శస్త్రచికిత్స చేయించుకున్న సుభద్ర

కరీంనగర్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధానాసుపత్రి మోకీలు, తుంటి మార్పిడి శస్త్రచికిత్సలకు కేరాఫ్‌గా మారింది. లక్షల రూపాయలు ఖరీదైన మోకీలు, తుంటి మార్పిడి శస్త్రచికిత్సలను ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా చేస్తున్నారు. మోకీలు, తుంటి మార్పిడి శస్త్రచికిత్సలే కాకుండా అత్యంత ఖరీదైన అన్ని విభాగాల శస్త్రచికిత్సలపై దృష్టి సారించారు. జిల్లా ఆసుపత్రి మెడికల్ కళాశాలగా మారడంతో వైద్యులు, ప్రొఫెసర్ల సంఖ్య భారీగా పెరిగింది. అన్ని విభాగాలకు సరిపడేంత మంది వైద్యులు అందుబాటులో ఉన్నారు. రోజూ మోకీలు మార్పిడి, తుంటి మార్పిడి, ల్యాప్రోస్కోపిక్ సర్జరీలు నిర్వహిస్తూ నిరుపేదలకు ఖరీదైన వైద్యం అందిస్తున్నారు. ఆరోగ్యశ్రీ పథకం కింద ఆపరేషన్లకు సంబంధించిన పరికరాలు సమకూర్చుకుంటూ ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో జరిగే అన్ని ఖరీదైన ఆపరేషన్లు ప్రభుత్వాసుపత్రిలో పైసా ఖర్చు లేకుండా చేస్తున్నారు.

అన్ని రకాల ఆపరేషన్లు

దశలవారీగా అన్ని రకాల శస్త్రచికిత్సలను రోగులకు అందించేలా కార్యాచరణ చేపట్టారు. రెండేళ్ల క్రితం వరకు కోవిడ్ కారణంగా పలు ఆపరేషన్లపై తీవ్ర ప్రభావం పడడమే కాకుండా, కోవిడ్ ఆసుపత్రి అనే నేపథ్యంలో పేషెంట్లు కూడా విముఖత చూపారు. దీంతో శస్త్ర చికిత్సలు చేయలేని పరిస్థితుల్లో హైయ్యర్ సెంటర్‌లకు రెఫర్ చేసే పద్ధతి ఉండేది. ప్రస్తుతం సాధారణ శస్త్ర చికిత్సలతో పాటు అన్ని రకాల ఖరీదైన శస్త్రచికిత్సలు చేస్తూ పేద రోగులకు అండగా నిలుస్తున్నారు.

నిరంతరం శస్త్రచికిత్సలు

గతంలో అడపాదడపా శస్త్రచికిత్సలు జరిగేవి. ఇటీవల అన్ని సౌకర్యాలు సమకూరడం, వైద్యకళాశాల పుణ్యమా అని సరిపడా వైద్యులు రావడంతో నిరంతరం శస్త్రచికిత్సలు జరుగుతున్నాయి. ప్రభుత్వ ప్రధానాసుపత్రిలో ఖరీదైన శస్త్రచికిత్సలు చేసేందుకు అత్యాధునిక ఆపరేషన్ థియేటర్ సైతం ఉంది. ఇటీవల కాలంలో తుంటి ఎముకలు విరిగిన వారికి సైతం తుంటి ఎముక మార్పిడి శస్త్ర చికిత్సలు విజయవంతంగా చేశారు. మోకీలు మార్పిడి శస్త్రచికిత్సలతో పాటు శరీరంపై కోతలు, కుట్లు లేకుండా అత్యాధునిక ల్యాప్రోస్కోపిక్ ఆపరేషన్లు ఆరోగ్యశ్రీ పథకం కింద చేస్తున్నారు.

ఆపరేషన్, ఫిజియోథెరపీ



మాది జగిత్యాల జిల్లా వెల్గటూరు. మూడేళ్లుగా మోకాలు నొప్పితో బాధపడుతున్నా. బలవంతంగా నడుస్తుంటే కాలు వంకర అయింది. రెండేళ్లుగా నడవలేని పరిస్థితి నెలకొంది. కార్పొరేట్ ఆసుపత్రికి వెళ్తే రూ.2.5 లక్షలు ఖర్చవుతుందని తెలిపారు. దీంతో కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన. ఇక్కడ ఉచితంగా ఆపరేషన్ చేయడమే కాకుండా ఫిజియోథెరపీ చేస్తున్నారు.

– సురమల్ల శాంతమ్మ, వెల్గటూరు

చిన్ననాటి నుంచే సమస్య..



నాకు పదేళ్ల వయస్సు ఉన్నప్పుడే కిందపడితే కాలు విరి గింది. తుంటి ఎముకకు సిమెంట్‌పట్టీ వేశారు. కానీ సమస్య అట్లనే ఉంది. 35 ఏండ్లుగా నడవడానికి ఇబ్బంది పడుతూనే ఉన్న. ఆపరేషన్‌కు ప్రైవేటులో రూ.4 లక్షలు అవుతుందని తెలిపారు. దీంతో తెలిసిన వారి సహాయంతో కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన. ఇక్కడ తుంటి ఎముక ఆపరేషన్ చేశారు. ఇప్పుడు బాగానే ఉంది.

– సుభద్ర, రాంపూర్, వరంగల్‌జిల్లా

సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వాసుపత్రిలో అందుబాటులో ఉన్న మెషనరీలతో మోకీలు, తుంటి మార్పిడి శస్త్రచికిత్సలు చేస్తున్నాం. ఆధునిక చికిత్సలు అందించేందుకు కృషి చేస్తున్నాం. ప్రైవేటులో జరిగే ఎంతటి ఖరీదైన శస్త్రచికిత్సలైనా ప్రభుత్వాసుపత్రిలో చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. నిరుపేదలు ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లి ఆర్థికంగా నష్టపోకుండా ప్రభుత్వాసుపత్రిని సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ నారగోని కుమార్‌గౌడ్, ఆర్థోపెడిక్ హెడ్

గుండ్లపల్లిలో హైమాస్ట్ లైట్లు ప్రారంభం



లైట్లు ప్రారంభిస్తున్న ఎంపీ సంజయ్‌కుమార్

గన్నేరువరం: ప్రజాహిత యాత్రలో భాగంగా బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ మండలంలోని గుండ్లపల్లిలో మహాత్మాగాంధీ విగ్రహానికి శుక్రవారం పూలమాల వేశారు. అనంతరం ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. రాజన్నసిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం నుంచి గుండ్లపల్లి వద్దకు చేరుకోగా పార్టీ మండల అధ్యక్షుడు నగునూరి శంకర్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. హైమాస్ట్ లైట్లు ప్రారంభించి అనంతరం హైదరాబాద్‌లో ప్రధాని నరేంద్ర మోదీ రోడ్డు షో కు వెళ్లారు. గన్నేరువరం నుంచి బెజ్జంకి మండలం వరకు డబుల్ రోడ్డుకు రూ.32 కోట్లు మంజూరు, రూ.72 లక్షలతో అంతర్గత రహదారుల అభివృద్ధి, పది గ్రామాల్లో రూ.పది లక్షలతో హైమాస్ట్ లైట్లు, రూ.ఐదలక్షలతో గన్నేరువరం ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణం ఎంపీ నిధులతో చేపట్టనున్నామని నాయకులు తెలిపారు. నిధులు మంజూరు చేసినందుకు ఎంపీ చిత్రపటానికి గన్నేరువరంలో క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మానసాదేవి ఆలయ కమిటీ చైర్మన్ ఏలేటి చంద్రారెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సాయిని మల్లేశం, మాజీ సర్పంచ్ సొల్లు అజయ్‌వర్మ, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు అన్నాడి రాజిరెడ్డి, మునిగంటి సత్తయ్య, తాళ్లపల్లి పర్శరామ్‌గౌడ్, వీరగోని వెంకటేశం, ఆటికం రామచంద్రం, తిప్పరి నికేష్, బూట్ల జగన్మోహన్, గూడెల్లి మల్లేశం, పంగిడి మహేందర్, మురళీకృష్ణ పాల్గొన్నారు.

యమపాశమైన విద్యుత్ తీగ

- ఒడ్డుపై నుంచి నడిచి వెళ్తుండగా కాలికి తగిలిన కరెంటు తీగ
- అక్కడికక్కడే మృతి చెందిన రైతు
- కరీంనగర్ జిల్లా దేవంపల్లిలో ఘటన



మల్లయ్య మృతదేహం

మానకొండూర్: విద్యుత్ తీగ రైతు పాలిట యమపాశమైంది. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం నిండు ప్రాణాలు బలిగొంది. పొలం ఒడ్డుపై నుంచి నడిచి వెళ్తున్న రైతు కాలికి తెగిపడిన విద్యుత్ వైరు తగలడంతో అక్కడికక్కడే చనిపోయాడు. ఈ ఘటన కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం దేవంపల్లిలో చోటు చేసుకుంది. దేవంపల్లి గ్రామానికి చెందిన మంద మల్లయ్య(53) వ్యవసాయంతో పాటు ఉపాధిహామీ కూలీ పనులు చేస్తుంటాడు. ఎప్పటిలాగే శుక్రవారం ఉదయం వ్యవసాయం బావి వద్ద పంట పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లాడు. అక్కడి నుంచి ఉపాధిహామీ పనులకు పొలంగట్టుపై నుంచి నడుచుకుంటూ వెళ్తుండగా ఒడ్డుపై తెగిపడిన విద్యుత్ తీగ మల్లయ్య కాలుకు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మధ్యాహ్నం వరకు మల్లయ్య పనులకు, ఇంటికి వెళ్లకపోవడంతో కుటుంబసభ్యులు పంటపొలం వద్దకు వెళ్లారు. అక్కడ మల్లయ్య విగతజీవిగా పడి ఉన్నాడు. వెంటనే విద్యుత్ అధికారులకు, పోలీసులకు సమాచారం అందించగా విద్యుత్ సరఫరా నిలిపివేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కరీంనగర్ తరలించారు. లూజ్‌లైన్లతో ఇబ్బందులు ఉన్నాయని పలుమార్లు విద్యుత్ సిబ్బందికి చెప్పినా వినిపించుకోలేదని మృతుడి కుటుంబసభ్యులు ఆరోపించారు. మృతుడి కొడుకు రమేశ్ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు బీసీ సామాజిక సమ్మేళనాలు

కరీంనగర్‌టౌన్: బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో శనివారం జిల్లా వ్యాప్తంగా బీసీ సామాజిక సమ్మేళనాలు నిర్వహిస్తున్నట్లు ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్ తెలిపారు. ఉదయం 11 గంటలకు హుజూరాబాద్ అసెంబ్లీకి సంబంధించిన కార్యక్రమం జమ్మికుంటలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ పైన, మధ్యాహ్నం 12 గంటలకు హుస్నాబాద్ అసెంబ్లీ పరిధిలోని (సైదాపూర్, చిగురుమామిడి) సమ్మేళనం సైదాపూర్‌లో, 3 గంటలకు మానకొండూరు అసెంబ్లీ కార్యక్రమం తిమ్మాపూర్‌లో, సాయంత్రం 5 గంటలకు కరీంనగర్ అసెంబ్లీకి సంబంధించిన కార్యక్రమం కరీంనగర్ పార్లమెంట్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గత పదేళ్లుగా ప్రజలకు, కులవృత్తులకు అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ముఖ్యఅతిథిగా ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందం దివాకర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్లు హాజరవుతారని అన్నారు. ఓబీసీ మోర్చా మండల కమిటీలు, బీసీ సంఘాల ప్రతినిధులు హాజరై, విజయవంతం చేయాలని కోరారు.

స్టడీ మెటీరియల్ ఖర్చు కోసం దరఖాస్తు చేసుకోండి

కరీంనగర్: ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థులకు రూ.1,500 చొప్పున బుక్ ఫండ్ లేదా స్టడీ మెటీరియల్ ఖర్చు అందించడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ రవికుమార్ తెలిపారు. టీచర్స్ రిక్రూట్‌మెంట్–2024కు దరఖాస్తు చేసుకున్న కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలకు చెందిన 10 వేల మంది బీసీ అభ్యర్థులకు ఇవ్వనున్నామన్నారు. అర్హులు www. tsbcstudy circle.cgg.gov.in లో ఏప్రిల్ 5లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 040–24071178, 040–2707 7929 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

కలెక్టరేట్‌లో కుక్కల బెడద



కలెక్టరేట్‌లో శునకాలు

కరీంనగర్ అర్బన్: కలెక్టరేట్‌లో కుక్కల బెడద తీవ్రమవుతోంది. ప్రధాన ద్వారం, ఆడిటోరియం, ఆర్డీవో కార్యాలయాల వద్ద సేద తీరుతూ స్వైరవిహారం చేస్తుండటంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్: కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల షెడ్యూల్డ్ కులాలకు చెందిన అభ్యర్థులకు రెండు నెలల డీఎస్సీ ఉచిత రెసిడెన్షియల్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ డీడీ పి.నతానియేలు, స్టడీ సర్కిల్ డైరెక్టర్ హనరరీ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 26వ తేదీలోగా www.tsstudycircle.co.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. టెట్, బీఈడీ, డైట్ ఉత్తీర్ణులై ఉండాలని, ఎంపికైన వారికి భోజన వసతి కల్పించనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 98852 18053, 91776 05511 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సాయిబాబా ఆలయ హుండీల లెక్కింపు



డబ్బులు లెక్కిస్తున్న సిబ్బంది

కరీంనగర్ కల్చరల్: దేవాదాయ శాఖ పరిధిలోని సాయినగర్ విజయ గణపతి సాయిబాబా దేవాలయ హుండీలను శుక్రవారం పెద్దపల్లి జిల్లా ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ సుజాత పర్యవేక్షణలో ఆలయంలో లెక్కించారు. హుండీల ద్వారా రూ.4.73 లక్షలు, బస్టాండ్ హుండీ ద్వారా రూ.43,564 ఆదాయం వచ్చినట్లు ఈవో మారుతి తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ నలువాల ప్రకాశ్, వ్యవస్థాపక ధర్మకర్తలు చిట్టుమల్ల కొండయ్య, ఆయిందాల లక్ష్మయ్య, జూనియర్ అసిస్టెంట్లు శ్రీనివాస్, అంజయ్య, అర్చకులు, గోవిందపతి శ్రీవారి సేవాసమితి కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు 'గంగలో విషనాగులు' పుస్తక పరిచయ సభ

కరీంనగర్ కల్చరల్: రాజీవ్ మల్హోత్రా, విజయ విశ్వనాథ్ రచించిన ద స్నేక్స్ ఇన్ గంగ తెలుగు అనువాదం గంగలో విషనాగులు పుస్తక పరిచయ సభ ఆదివారం నిర్వహిస్తున్నట్లు మందల నగేశ్ రెడ్డి, గాజుల రవీందర్, తడిగొప్పుల శంకరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా ఆర్డీవో మహేశ్వర్, ప్రధాన వక్తగా పుస్తక తెలుగు అనువాదకుడు డాక్టర్ బొమ్మరాజు సారంగపాణి తదితరులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. నగరంలోని వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో ప్రజ్ఞాభారతి, జాతీయ సాహిత్య పరిషత్, సమాచార భారతి ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు కార్యక్రమం ఉంటుందన్నారు. సాహిత్యాభిమానులు, కవులు, రచయితలు హాజరై, విజయవంతం చేయాలని కోరారు.

బీర్ కంపెనీ సందర్శన



క్రౌన్ బీర్ కంపెనీ వద్ద కిమ్స్ విద్యార్థులు

కరీంనగర్‌సిటీ: కిమ్స్ డిగ్రీ, పీజీ కళాశాల ఫుడ్ సైన్స్, మైక్రోబయాలజీ విద్యార్థులు శుక్రవారం సంగారెడ్డిలోని క్రౌన్ బీర్ కంపెనీని సందర్శించారని విద్యాసంస్థల వైస్ చైర్మన్ సాకేత్ రామారావు తెలిపారు. బడ్వైజర్ ప్రీమియం, బడ్వైజర్ మాగ్నమ్ బీర్ల తయారీ విధానం, కావాల్సిన ముడి పదార్థాలు, క్వాలిటీ కంట్రోల్ ల్యాబ్ గురించి ప్రత్యక్షంగా తెలుసుకున్నారని పేర్కొన్నారు. ఇలాంటి పరిశ్రమల సందర్శనల వల్ల విద్యార్థులు మేధస్సుతోపాటు ఉద్యోగావకాశాలపై అవగాహన ఏర్పడుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ అర్జున్‌రావు, విభాగాధిపతి మహేశ్, అధ్యాపకులు సంపత్‌కుమార్, ప్రణయ, అంజలి, దీపిక పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ



సప్తగిరికాలనీ: మేము సైతం యువసేన ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కరీంనగర్‌లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వాటర్ బాటిళ్లు, పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షురాలు చకిలం స్వప్న, ప్రతినిధులు రూప, హనురూప్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్‌లో టార్గెట్.. 10 జీపీఏ

- పరీక్షలకు సిద్ధమవుతున్న సుభాష్‌నగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు
- వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రణాళిక రూపొందించిన టీచర్లు



ప్రత్యేక తరగతుల్లో చదువుతున్న విద్యార్థులు

సప్తగిరికాలనీ: కరీంనగర్‌లోని సుభాష్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థులు 10 జీపీఏ లక్ష్యంగా కొన్ని నెలలుగా సాధన చేస్తున్నారు. 2023లో మొత్తం 83 మంది విద్యార్థులు వార్షిక పరీక్షలకు హాజరవగా 84 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. 9.7 జీపీఏను పాఠశాల కైవసం చేసుకుంది. ఈ విద్యాసంవత్సరం మొత్తం 79 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. వీరికి టీచర్లు కొన్ని నెలలుగా ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేసి, బోధన సాగిస్తున్నారు.

విద్యార్థులకు ప్రాజెక్టు వర్క్..

టీచర్లు వందశాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ప్రణాళిక రూపొందించారు. పాఠ్యాంశాలకు సంబంధించి విద్యార్థులతో ప్రాజెక్టు వర్క్ చేయించి, వారిలో నైపుణ్యం పెంచేందుకు చర్యలు తీసుకున్నారు. అన్ని సబ్జెక్టుల్లో ఉపాధ్యాయులు తమ మేధస్సుకు పదునుపెట్టి, ప్రశ్నలు తయారు చేశారు. వాటికి సమాధానాలు రాసేలా పిల్లలను సిద్ధం చేశారు.

10 జీపీఏ సాధిస్తా..



నేను బాగా చదువుతున్నా. ప్రస్తుతం 9 జీపీఏ పైనే వస్తున్నాయి. పరీక్షల నేపథ్యంలో మార్నింగ్, ఈవినింగ్ ప్రిపేరవుతున్నా. మా సార్‌లు మమ్మల్ని ప్రోత్సహిస్తున్నారు. 10 జీపీఏ సాధిస్తానన్న నమ్మకం ఉంది. – జి.ఓంకార్

రోజుకో పరీక్ష..



మా టీచర్లు ఉదయం, సాయంత్రం వేళల్లో బాగా చదివిస్తున్నారు. రోజుకో పరీక్ష పెడుతున్నారు. బిట్స్ ఎలా రాయాలో చెబుతున్నారు. స్టడీ క్లాస్‌లు ఉపయోగపడుతున్నాయి. 10 జీపీఏ సాధిస్తా. – ఎల్.హర్షిక

వెనకబడిన విద్యార్థులపై దృష్టి



మా పాఠశాలలో ఉపాధ్యాయులందరం వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాం. అందరూ ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికలు రూపొందించాం. పిల్లలను గ్రూపులుగా విభజించి, ప్రత్యేక మెటీరియల్ తయారు చేసి, ఇచ్చాం. – ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, తెలుగు ఉపాధ్యాయుడు

ఒత్తిడికి గురికావొద్దు



విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యే ముందు ఎలాంటి ఒత్తిడికి గురికావొద్దు. నిర్భయంగా ఉన్నప్పుడే బాగా రాసే అవకాశం ఉంటుంది. లక్ష్యంతో పరీక్షలు రాస్తే విజేతలుగా నిలుస్తారు. పలువురు 10 జీపీఏ సాధిస్తారనుకుంటున్నాం. – ఖాజా నసీరొద్దీన్, ప్రధానోపాధ్యాయుడు

శాస్త్రవేత్త స్వామినాథన్‌ను స్ఫూర్తిగా తీసుకోండి

- వ్యవసాయంలో సాంకేతిక విప్లవం సృష్టించాలి
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్
- వ్యవసాయ కళాశాల భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన



మాట్లాడుతున్న మంత్రి ప్రభాకర్, పక్కన ఎమ్మెల్యే సత్యనారాయణ

కరీంనగర్‌రూరల్: శాస్త్రవేత్త స్వామినాథన్‌ను స్ఫూర్తిగా తీసుకొని, వ్యవసాయ విద్యార్థులు ముందుకెళ్లాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం కరీంనగర్ మండలంలోని మొగ్దుంపూర్‌లో రూ.3 కోట్లతో చేపట్టనున్న మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల వ్యవసాయ మహిళా డిగ్రీ కళాశాల భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాబోయే కాలంలో నిరుద్యోగం పెరిగి, అందరూ వ్యవసాయం చేయాల్సి వస్తుందన్నారు. విద్యార్థులు చదువు పూర్తి చేసుకొని, ఏఈవోలు, ఏవోలుగా రైతులకు క్షేత్రస్థాయిలో సేవలందించాలని పేర్కొన్నారు. సాగులో సాంకేతిక పద్ధతులను వినియోగించి, రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి సహకరించాలని సూచించారు. వ్యవసాయ కళాశాల మంజూరు చేయించిన ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కార్యక్రమంలో పాల్గొంటే బాగుండేదన్నారు. అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని, రాజకీయాలకతీతంగా పనులను చేస్తున్నట్లు తెలిపారు. కాగా, ప్రొటోకాల్ వివాదంపై మంత్రి ప్రభాకర్‌ను బీఆర్‌ఎస్ కార్యకర్తలు అడ్డుకుంటారన్న సమాచారంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అయితే, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ రావడం లేదన్న సమాచారంతో పలు వురు బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరుకాలేదు. మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యురాలు దేవనపల్లి పుష్ప, కళాశాల ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డి, ఆర్డీవో మహేశ్వర్, తహసీల్దార్ నవీన్‌కుమార్, ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి, గ్రామ ప్రత్యేక అధికారి సత్యం, కార్యదర్శి సల్మాన్ తదితరులున్నారు.

సీఎం, మంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం, మంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రెడ్డి సంఘం నాయకులు

కరీంనగర్‌రూరల్: రెడ్డి కార్పొరేషన్‌కు ఏర్పాటుకు రాష్ట్ర కేబినెట్ నిర్ణయించడంపై రెడ్డి సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు మూల వెంకటరవీందర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో తీగలగుట్టపల్లిలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. స్వీట్లు పంచుకున్నారు. కార్యక్రమంలో నాయకులు ఆకారపు భాస్కర్‌రెడ్డి, మూల ప్రభాకర్‌రెడ్డి, పాకాల రాంరెడ్డి, ద్యావ నారాయణరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, మధుకర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బాల్య వివాహాల అనర్థాలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

శిఖం భూమిలో కార్పొరేటర్ కబ్జా!

కరీంనగర్ కార్పొరేషన్: ఎల్ఎండీ సమీపంలోని నగర శివారు ప్రాంతంలో ఓ కార్పొరేటర్ శిఖం భూమిని కబ్జా చేసిన వ్యవహారం సోషల్ మీడియాల్లో హల్‌చల్ చేస్తోంది. ఓ సామాజిక కార్యకర్త సమాచార హక్కు చట్టం కింద తీసుకున్న సమాచారం మేరకు ఈ కబ్జా వెలుగుచూసింది. సర్వే నెంబర్ 1026 లోని శిఖం భూమిలో సదరు కార్పొరేటర్ కబ్జా చేసి భవన నిర్మాణం కూడా చేసినట్లు శుక్రవారం వాట్సప్ గ్రూప్ ల్లో చక్కర్లు కొడుతుండడం కలకలం సృష్టించింది.

పవర్ కట్ ప్రాంతాలు

కొత్తపల్లి: విద్యుత్ పనుల్లో భాగంగా శనివారం గోదాంగడ్డ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–2 ఏడీఈ సుధీర్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

'ఉపాధి' కూలీలకు డబ్బులు చెల్లించాలి

మానకొండూర్: ఉపాధి కూలీలకు డబ్బులు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు డిమాండ్ చేశారు. మానకొండూర్‌లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను శుక్రవారం పరిశీలించి, కూలీల సమస్యలు తెలుసుకున్నారు. వారం రోజుల్లో పని డబ్బులు చెల్లించాలని, ప్రమాదబీమా పథకం అమలు చేయాలని కోరారు. కొత్త జాబ్‌కార్డులు ఇవ్వాలని, పని ప్రదేశంలో వసతులు కల్పించాలని, 200 రోజుల పనిదినాలు కల్పించాలన్నారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం




తీగలగుట్టపల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ కార్పొరేషన్: విలీన, శివారు డివిజన్‌లలో తాగునీటి సమస్యకు నాలుగు నెలల్లో శాశ్వత పరిష్కారం చూపుతామని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. శుక్రవారం నగరంలోని 1, 10వ డివిజన్‌లలో రూ.42లక్షలతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. 1వ డివిజన్ పరిధిలోని స్టార్ హాస్పిటల్, తిలక్‌నగర్‌లలో రూ.30 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలకు స్థానిక కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్‌తో కలిసి భూమిపూజ చేశారు. అలాగే 10వ డివిజన్ కట్టరాంపూర్‌లో రూ.12 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణం పనులకు స్థానిక కార్పొరేటర్ ఆనంద్‌తో కలిసి మేయర్ పనులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాబోయే ఐదు నెలల్లోగా విలీన గ్రామల డివిజన్ల లో పూర్తి స్థాయిలో తాగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని తెలిపారు. తీగలగుట్టపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జ్ పనులు త్వరగా పూర్తి చేస్తామన్నారు. 10,11 డివిజన్లలోని పలు కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ, అభివద్ధి పనులు కూడ చాలా వరకు పూర్తి చేశామని తెలిపారు. గతంలోనే గణేష్ నగర్ బైపాస్ రోడ్డు రూ.30 కోట్లతో నిర్మించి ఈ ప్రాంత సమస్యను శాశ్వతంగా పరిష్కరించామన్నారు. కోతిరాంపూర్ నుండి గిద్దెపెరుమాండ్ల దేవాలయం రోడ్డును కట్టరాంపూర్ వరకు స్మార్ట్ రోడ్డుగా మార్చుతున్నట్లు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం: నగరానికి చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడని వన్ టౌన్ పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం... కరీంనగర్‌లోని హనుమాన్ నగర్‌కు చెందిన చెప్యాల ఎల్లయ్య గౌడ్ రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఏఆర్ హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. ఆయనకు భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. కుమారుడు అశ్విత్‌కుమార్(23) ఇంటర్ ఫెయిలవడంతో సప్లిమెంటరీ పరీక్ష రాశాడు. కానీ, మళ్లీ ఫెయిల్ అయ్యాడు. తర్వాత ఓపెన్ ఇంటర్ రాసి, పాసయ్యాడు. ఈ క్రమంలో చదువులో వెనకబడుతున్నానని అప్పుడప్పుడు బాధ పడుతుండేవాడు. శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. సాయంత్రం తల్లి, సోదరి ఇంటికి వచ్చేసరికి తలుపులు వేసి ఉన్నాయి. ఎంత పిలిచినా తీయకపోవడంతో అనుమానం వచ్చి, స్థానికుల సహాయంతో పగులగొట్టారు. లోపలికి వెళ్లగా ఉరితాడుకు వేలాడుతూ కనిపించాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, అశ్విత్‌కుమార్ మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మిల్లెట్ ఫుడ్‌పై అవగాహన



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, టీచర్లు, తల్లులు

కరీంనగర్: పోషణ వారోత్సవాల్లో భాగంగా లక్ష్మీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయ శుక్రవారం మిల్లెట్ ఫుడ్‌పై అవగాహన కల్పించారు. బిడ్డ పుట్టినప్పటి నుంచి 6 నెలల వరకు తల్లిపాలే ఇవ్వాలన్నారు. ఏడో నెల నుంచి అనుబంధ ఆహారం తప్పనిసరిగా అందించాలని సూచించారు. కార్యక్రమంలో కరీంనగర్ అర్బన్ సీడీపీవో, అంగన్‌వాడీ టీచర్, తల్లులు పాల్గొన్నారు.

సమాజహితం.. ఆయన అభిమతం

- ద్రోణహృదయం, హృదయ తరంగిణి పుస్తకాల రచన
- లఘుచిత్రాల్లోనూ నటన
- పలు అవార్డులు అందుకున్న ఇన్‌కంట్యాక్స్ ప్రాక్టీషనర్ ద్రోణాచారి



ద్రోణహృదయం సంపుటి ముఖచిత్రం



ఆచార్య దేవోభవ లఘు చిత్రంలో..



ద్రోణాచారిని సన్మానిస్తున్న రాష్ట్ర తొలి స్పీకర్ మధుసూదనాచారి

విద్యానగర్: ఆయన ఆలోచనలన్నీ సమాజహితం కోసమే.. కరీంనగర్‌లో ఇన్‌కంట్యాక్స్ ప్రాక్టీషనర్‌గా పని చేస్తున్నారు.. ఎన్నీల ముచ్చట్లు ద్వారా కవిగా పరిచయమై తన మదిలో మెదిలిన భావా లను ప్రజాబహుల్యానికి పరిచయం చేస్తున్నారు వేములవాడ ద్రోణాచారి. ఆచార్య దేవోభవ, అల్లరి పిల్ల, అల్లిబిల్లి ఆంజనేయులు, అమ్మలేని బతుకు, మేముసైతం, గోమాత పాటలు–2, శ్రీనివాస మంగాపురం, మజిలీ, ప్రేమించే మనసు, మా చెల్లి పెళ్లికి మీ బలగంతో రండి వంటి లఘు చిత్రాల్లో నటించారు. ద్రోణహృదయం, హృదయ తరంగిణి పేరిట పుస్తకాలు రచించారు. పుష్ప విలాపం, దిక్సూచి, శ్రీ దుర్గాభవానీ శతకం ముద్రణకు సిద్ధమవుతున్నాయి. బంధహీనుని భాగ్యం ఎంతున్నా పరిశీలించి చూస్తే అది నిర్భాగ్య జీవితం అని మానవీయ విలువలు, మానవ సంబంధాలపై తన అభిప్రాయాన్ని ద్రోణహృదయం సంపుటిలో ఆవిష్కరించారు. అక్షరాలు సత్య ధర్మాలవంటి హితవులనందించాలన్నదే ఆయన అభిమతం. ఆ కోణంలోనే సాగిన మరో భావధార హృదయ తరంగిణి. సంపదనంతా తన సంతానానికిస్తే ఆ సంతానమే తనను వెక్కిరించిందని, జీవితం అంటే కుటుంబమే కాదు సమాజం కూడా ముఖ్యమేనని తన రచనలో తెలిపారు. పలు సేవా సంఘాల్లోనూ ప్రధాన బాధ్యతలు నిర్వహిస్తూ, దైవ కార్యాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు.

స్వగ్రామం మైలారం..

వేములవాడ ద్రోణాచారి గన్నేరువరం మండలంలోని మైలారంలో జన్మించారు. కరీంనగర్ ఎస్సారార్ కాలేజీలో బీకాం, ఔరంగాబాద్ యూనివర్సిటీలో న్యాయవాద విద్యనభ్యసించారు. ప్రస్తుతం కరీంనగర్ రాఘవేంద్రనగర్‌లో స్థిరపడ్డారు.


అందుకున్న అవార్డులు..

మలేసియా తెలుగు అసోసియేషన్ వారి సాహిత్య పురస్కారం, గుంటూరు విశ్వకర్మ శ్రీ పీఠం వారి కళా సామ్రాట్ బిరుదు, విశ్వ జ్యోతిర్లింగ పీఠం ఖమ్మం వారి పద పద్య గద్య కవి బిరుదు అందుకున్నారు.

'కళాశాల విద్య ప్రిన్సిపాల్స్' డైరీ ఆవిష్కరణ

కరీంనగర్ సిటీ: కరీంనగర్‌లోని ఎస్సారార్ కళాశాలలో శుక్రవారం కళాశాల విద్య జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం నిర్వహించారు. కమిటీ చైర్మన్, టీజీసీజీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సురేందర్ రెడ్డి కళాశాల విద్య ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ డైరీని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ప్రిన్సిపాళ్లు, బోధన, బోధనేతర సిబ్బంది సమన్వయం ఆయా కళాశాలల అభ్యున్నతికి దోహదపడుతుందని తెలిపారు. రాష్ట్రంలోని ప్రిన్సిపాళ్లు, అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి టీజీసీజీటీఏ కృషి చేస్తోందన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి జి.రాజారెడ్డి మాట్లాడుతూ.. ప్రిన్సిపాళ్ల సంఘం డిగ్రీ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి మార్గదర్శకాలు రూపొందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాలల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్ రాష్ట్ర అధ్యక్షుడు వి.కామరాజు, నాన్ టీచింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.నాగరాజు, ప్రిన్సిపాళ్లు సత్యనారాయణ, లక్ష్మీనరసయ్య, సంతోష్, మల్లేశం, అధ్యాపకులు శ్రీనివాస్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రసాయన గతిశాస్త్రంపై సదస్సు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కరుణాకర్

కరీంనగర్ సిటీ: స్థానిక ఎస్సారార్ ప్రభుత్వ కళాశాలలో రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో రసాయన గతిశాస్త్ర ప్రాముఖ్యత అనే అంశంపై శుక్రవారం సదస్సు నిర్వహించారు. కెమిస్ట్రీ అసిస్టెంట్ ప్రొఫెసర్, జగిత్యాల జీడీసీ తాండ్ర కరుణాకర్ ప్రధాన వక్తగా హాజరై, మాట్లాడారు. రసాయన చర్యల వేగాన్ని, విధానాన్ని అధ్యయనం చేయడంలో రసాయన గతిశాస్త్రం ఉపయోగపడుతుందని తెలిపారు. అందులోని పలు పదాలను ఉదాహరణతో వివరించారు. ప్రిన్సిపాల్ రామకృష్ణ ఆయన సన్మానించారు. రసాయన శాస్త్ర విభాగం ఇన్‌చార్జి ఎం.శ్రీధర్, విభాగం అధ్యాపకులు భాస్కర్, శ్రీనివాస్, సాయిమధుకర్, మహిపాల్ రెడ్డి, గోపి, విద్యార్థులు పాల్గొన్నారు.

అలరించిన వీడ్కోలు వేడుక



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కొత్తపల్లి: మండలంలోని ఆసిఫ్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థులకు శుక్రవారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. తిరుమల డయాగ్నోస్టిక్స్ అధినేత కాసర్ల జీవన్‌రెడ్డి విద్యార్థులకు పరీక్ష సామగ్రి, ఇంగ్లిష్ టీచర్ ఏంజలీన్ జామెట్రీ బాక్సులను అందజేశారు. హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులున్నారు.

పేద విద్యార్థినులకు సైకిళ్లు అందజేత



ఊటూర్ పాఠశాలలో సైకిళ్లు పంపిణీ చేస్తున్న వేణుగోపాల్

మానకొండూర్‌రూరల్: మండలంలోని ఊటూర్ ప్రభుత్వ పాఠశాలలోని పేద విద్యార్థినులకు రోటరీ క్లబ్ ఆఫ్ ఎలగందల్ ఫోర్ట్ అధ్యక్షుడు పట్నం వేణుగోపాల్ శుక్రవారం సైకిళ్లను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రోటరీక్లబ్ ఆఫ్ హైదరాబాద్ నార్త్ సంయుక్తంగా వెల్లన్ సంస్థ సహకారంతో దూరప్రాంతంలో చదువుకునే పేద విద్యార్థినులను గుర్తించి సైకిళ్లు అందజేస్తున్నామని అన్నారు. ఈసందర్భంగా రొటేరియన్ ఎర్రం రాజిరెడ్డి మాట్లాడుతూ.. మహిళా సాధికారతలో భాగంగా ఇలాంటి వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నామని, విద్యార్థులు బాగా చదివి ఉన్నతంగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం స్వరూపరాణి, ఉపాధ్యాయులు, నాయకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

మరో ఏడాది చౌక విమానయానం

'వీజీఎఫ్'కింద విమాన సర్వీసులు నడిపేందుకు 'ఇండిగో' అంగీకారం

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం రాయలసీమ ప్రజలకు మరో ఏడాదిపాటు చౌక విమానయానం అందుబాటులోకి తీసుకొచ్చింది. కడప, కర్నూలు విమానాశ్రయాల నుంచి చౌక విమాన సర్వీసులను నడిపేలా వయబులిటీ గ్యాప్ ఫండ్ (వీజీఎఫ్) పథకాన్ని మరో ఏడాదిపాటు పొడిగిస్తూ శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కడప నుంచి హైదరాబాద్‌కు, కర్నూలు నుంచి బెంగళూరు, చెన్నై, విశాఖలకు వీజీఎఫ్ కింద సర్వీసులను నడపడానికి ఇండిగో ఎయిర్‌లైన్స్ ముందుకు వచ్చింది. ప్రస్తుతం ఉన్న వీజీఎఫ్ పథకం స్కీం గడువు ముగియనుండటంతో దీన్ని మార్చి, 2025 వరకు పొడిగిస్తూ రాష్ట్ర మౌలిక వసతులు, పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ ఉత్తర్వులు జారీ చేశారు.

భువనగిరి పార్లమెంట్ స్థానానికి సీపీఎం పోటీ

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వీరయ్య




భువనగిరిటౌన్: భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గానికి సీపీఎం పోటీ చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎస్.వీరయ్య చెప్పారు. శుక్రవారం భువనగిరి జిల్లా కేంద్రంలో జరిగిన పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల మధ్య ఐక్యత భావాన్ని దెబ్బతీసి సెక్యులర్ భారత దేశంలో మతాలు, కులాల పేరుతో బీజేపీ ప్రజల మధ్య చీలికలు తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తోందని మండిపడ్డారు. ఎలక్టోరల్ బాండ్ల పేరుతో బీజేపీకి వందల కోట్ల రూపాయలు విరాళాలు అందాయని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ.. ప్రజల తరపున కొట్లాడే సీపీఎంను పార్లమెంటు ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. సమావేశంలో సీపీఎం భువనగిరి జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్, రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహ, బట్టుపల్లి అనురాధ తదితరులు పాల్గొన్నారు.

'రజాకార్'తో అమరవీరులకు అవమానం

రావి ప్రతిభారెడ్డి మండిపాటు



సాక్షి, హైదరాబాద్: రజాకార్ సినిమాతో అమరవీరులకు అవమానం జరిగిందని తెలంగాణ సాయుధ రైతాంగపోరాట అమరవీరుల ట్రస్ట్ సభ్యురాలు రావి ప్రతిభారెడ్డి విమర్శించారు. భూమి, భుక్తి, విముక్తి కోసం నిజాం రాజుపై సాయుధ పోరాటం చేసి నాలుగువేల మందికిపైగా ప్రాణాలు అర్పించిన రైతుకూలీల త్యాగాలను అవమానించారని మండిపడ్డారు. శుక్రవారం విడుదల అయిన సినిమాలో తెలంగాణ చరిత్రను పూర్తిగా వక్రీకరించి, మతం రంగు పూసే ప్రయత్నం చేశారని ప్రతిభారెడ్డి ఆరోపించారు. హైదరాబాద్ సంస్థానంలో బానిస బతుకుల తిరుగుబాటు, నాలుగువేల గ్రామాల్లో ప్రజారాజ్యాలను ఏర్పాటు చేస్తే, పోరాట చరిత్రను కప్పిపుచ్చేలా కేవలం ఎన్నికల్లో లబ్ధికోసం సినిమా తీసినట్లుగా ఉందని మండిపడ్డారు. చరిత్ర వక్రీకరణపై తాము పోరాటం చేస్తామని ప్రతిభారెడ్డి హెచ్చరించారు.



తిరుమల శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి శుక్రవారం దర్శించుకున్నారు.

ధ్యానంతోనే మనస్సు నియంత్రణ

ప్రపంచ ఆధ్యాత్మిక సమ్మేళనంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

సాక్షి, హైదరాబాద్/నందిగామ: ధ్యానంతోనే మనస్సు నియంత్రణలో ఉంటుందని భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం కాన్హా శాంతివనంలో కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వశాఖ, హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ ఆధ్యాత్మిక సమ్మేళనానికి శుక్రవారం ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ద్రౌపదీ ముర్ము మాట్లాడుతూ ప్రపంచశాంతికి మొదటగా మనలో మనం మార్పు చెందాలని, అనంతరమే ఇతరుల్లో మార్పు వచ్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. వ్యక్తులంతా నిస్వార్థంగా పనిచేస్తే మానవాళి సరైన మార్గంలో నడిచేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రపంచంలోని సర్వమతాలకు చెందిన ఆధ్యాత్మికవేత్తలను ఒక చోటకు తీసుకురావడం, అందరూ శాంతికి పాటుపడటం గొప్ప విషయమన్నారు. అన్ని మతాల్లోని వారిని చైతన్యం చేయడమే ఆధ్యాత్మిక చైతన్యమని, ఎలాంటి వివక్షకు తావులేకుండా 'ప్రపంచమంతా ఒకే కుటుంబం' అనే అంశాన్ని దృష్టిలో పెట్టుకొని విశ్వశాంతికి ఈ సమ్మేళనం నిర్వహించడం అభినందించదగ్గ విషయమని పేర్కొన్నారు. బుద్ధుడు, జగద్గురు శంకరాచార్య, కబీర్, సంత్ రవిదాస్, గురునానక్‌తోపాటు స్వామి వివేకానంద ప్రపంచానికి ఆధ్యాత్మిక సారం అందించారని రాష్ట్రపతి గుర్తుచేశారు. మహాత్మాగాంధీ రాజకీయాల్లో ఆధ్యాత్మిక విలువలను సమగ్రపరిచారని, అందుకే అయన్ను సబర్మతీ సంత్ అని పిలుస్తామన్నారు. ఈ కార్యక్రమానికి అన్ని మతాలకు చెందిన ఆధ్యాత్మికవేత్తలు ఒకే వేదికపైకి రావడం హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ గురుజీ దాజీ గొప్పదనం అని ఆమె కొనియాడారు. కేంద్ర సాంస్కృతిక శాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘావాల్ మాట్లాడుతూ ప్రపంచానికి 21వ శతాబ్దంలో ఆర్థికపరంగా, ఆధ్యాత్మికంగా మన దేశం మార్గదర్శకంగా నిలుస్తుందని వందేళ్లకు పూర్వమే స్వామి వివేకానంద జోస్యం చెప్పారన్నారు. రామచంద్రమిషన్ అధ్యక్షుడు కమలేశ్ డీ పటేల్ (దాజి) మాట్లాడుతూ మతాలకతీతంగా మానవజాతి దృఢంగా ఏకం కావాల్సిన అవసరం ఉందని ఆకాంక్షించారు. చినజీయర్ స్వామి మాట్లాడుతూ ప్రతి మనసు ప్రేమమయం కావాలని, ప్రతి పువ్వు మధురమైన మకరందాన్ని నింపుకున్నట్లు ప్రతి మనిషి ప్రేమ తత్వాన్ని మనసులో నింపుకోవాలన్నారు. ఆధ్యాత్మికవేత్తలు స్వామీగౌరంగదాస్, స్వామీ చిదానందసరస్వతి, స్వామి ముకుందానంద, యోగి నిరంజన్‌దాస్, నమ్రముని మహరాజ్ దాస్, దాజీ, దేవి చిత్రలేఖ, తారాచంద్ కంటాలే, డాక్టర్ భవానీరావు, దిల్షాద్, టోనీలాడర్, అభ్యాసీలు పాల్గొన్నారు. అంతకుముందు రాష్ట్రపతికి ఎయిర్‌పోర్టులో గవర్నర్ తమిళిసై, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలు ఘనంగా స్వాగతం పలికారు.



ఎయిర్‌పోర్టులో రాష్ట్రపతి ముర్ముకు స్వాగతం పలుకుతున్న రేవంత్, తమిళి సై

నేడు వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ప్రకటన

175 శాసనసభ, 25 లోక్‌సభ స్థానాలకు వెల్లడించనున్న సీఎం వైఎస్ జగన్



సాక్షి, అమరావతి: వచ్చే శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ శనివారం ప్రకటించనున్నారు. ఈ మేరకు సీఎం ఉదయం 10.45 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయ చేరుకుంటారు. అక్కడ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఘాట్ వద్ద ప్రత్యేక ప్రార్థనల అనంతరం మధ్యాహ్నం ఒకేసారి 175 శాసనసభ, 25 లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటిస్తారు. అనంతరం ఇడుపులపాయ నుంచి బయలుదేరి తాడేపల్లి చేరుకుంటారు. మరోవైపు గత ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసి సీఎం వైఎస్ జగన్ విశ్వసనీయతను చాటుకున్నారు. వచ్చే ఎన్నికల మేనిఫెస్టో ప్రక్రియ తుది దశకు చేరుకుంది. మేనిఫెస్టోను ప్రకటించాక.. ఆ వెంటనే పేదింటి భవిష్యత్తును మరింత గొప్పగా మార్చేందుకు మరోసారి చారిత్రక విజయంతో అధికారంలోకి రావడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ ప్రచార భేరి మోగించనున్నారు. ఈ నెల 18 నుంచి ప్రచారాన్ని ప్రారంభించే అవకాశం ఉంది. వేర్వేరు ప్రాంతాల్లో రోజుకు రెండు లేదా మూడు బహిరంగసభలు, రోడ్ షోలు నిర్వహించేలా ప్రచార ప్రణాళికను రూపొందించారని తెలుస్తోంది. ఓవైపు సీట్ల పంపకాలు, అభ్యర్థుల ఎంపికపై టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిలో అసంతృప్తి జ్వాలలు చెలరేగుతున్నాయి. మరోవైపు వైఎస్సార్‌సీపీ రెట్టించిన ఉత్సాహంతో ప్రచారంలో దూసుకెళ్లే దిశగా అడుగులేస్తోంది.

వైఎస్సార్‌సీపీలో చేరిన ముద్రగడ

సాక్షి, అమరావతి: కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం వైఎస్సార్‌సీపీలో చేరారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో ముద్రగడ పద్మనాభం, ఆయన కుమారుడు గిరి వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి సీఎం వైఎస్ జగన్ వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రీజనల్ కో-ఆర్డినేటర్ పీవీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కురసాల కన్నబాబు (వైఎస్సార్‌సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు), ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే.. ఏలూరు జిల్లా ఉంగుటూరుకు చెందిన జనసేన పార్టీ నాయకుడు నవుడు వెంకటరమణ, చిత్తూరు జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్సీ యండపల్లి శ్రీనివాసులురెడ్డి కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు.

తొలగిన పచ్చ ముసుగు

వివేకా వర్ధంతి సాక్షిగా బట్టబయలైన రాజకీయ కుట్ర

సాక్షి, అమరావతి: ఎన్నికల షెడ్యూల్ విడుదల వేళ పచ్చ ముసుగులు తొలిగాయి! వైఎస్ వివేకా సతీమణి సౌభాగ్యమ్మ, కుమార్తె సునీత తమ రాజకీయ ఆకాంక్షలను బయట పెట్టుకున్నారు. రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమని, కొంతకాలంగా తాము చదువుతోంది చంద్రబాబు స్క్రిప్టేనని చాటుకున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వ్యతిరేకంగా సాగుతున్న పచ్చ కుట్రలో తాము భాగస్వాములమని తేల్చేశారు. టీడీపీ తరపునో, ఆ పార్టీ మద్దతుతోనో ఎన్నికల్లో పోటీ చేయడమే తమ అంతర్యమని కుండబద్ధలు కొట్టారు. ఇక షర్మిల కూడా తానూ ఆ పచ్చతానులో ముక్కనేనని విస్పష్టంగా ప్రకటించారు. వైఎస్ వివేకా ఐదో వర్ధంతి కార్యక్రమం సందర్భంగా సౌభాగ్యమ్మ, సునీత, షర్మిల ఒకే లయ, ఒకే తాళంతో చంద్రబాబు ఐదేళ్లుగా పాడుతున్న పాచిపాటనే మళ్లీ పాడారు.

బాబు కుట్రలో పాత్రధారుల ప్రవేశం ఇలా...

వైఎస్ వివేకా 2019 మార్చి 15న హత్యకు గురైన వెంటనే వైఎస్ జగన్ లక్ష్యంగా చంద్రబాబు ప్రచారంలోకి తెచ్చిన కట్టుకథను ప్రజలు ఎన్నికల్లో తిప్పికొట్టారు. దాంతో ఎన్నికల తరువాత చంద్రబాబు రూటు మార్చారు. తాము చేసిన నిరాధార ఆరోపణలనే వివేకా కుటుంబ సభ్యులతో పలికించే కుయుక్తులకు తెరతీశారు. ముందుగా వివేకా కుమార్తె నర్రెడ్డి సునీతను రంగంలోకి దించారు. ఆ డ్రామా దాదాపు మూడేళ్లకుపైగా కొనసాగిన తరువాత చంద్రబాబు స్క్రిప్ట్ ప్రకారమే షర్మిల రాజకీయ తెరపైకి వచ్చారు. సునీత నిరాధార ఆరోపణలనే ఆమె కూడా వినిపిస్తున్నారు. ఈ నాటకం రక్తి కట్టక పోవడంతో చివరి పాత్రధారిగా వివేకా సతీమణి సౌభాగ్యమ్మను చంద్రబాబు తెరపైకి తెచ్చారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందు ఆమె పాత్రను ప్రవేశపెట్టడం చంద్రబాబు టైమింగ్‌కు నిదర్శనం. ఎన్నికల వేళ సౌభాగ్యమ్మ, సునీత తమలో గూడు కట్టుకున్న రాజకీయ ఆకాంక్షను బయటపెట్టారు. వీరిద్దరూ కొద్ది రోజుల క్రితం సీఎం రమేశ్ ద్వారా చంద్రబాబుతో హైదరాబాద్‌లో భేటీ అయ్యారు. కడప ఎంపీగా పోటీ చేయాలనే తమ ఆకాంక్షను గుర్తు చేశారు. నాలుగేళ్లుగా ఈ డ్రామా నడుపుతున్న చంద్రబాబు అందుకు సరే అన్నారు. వారం క్రితమే నర్రెడ్డి సునీత తానుగానీ తన తల్లి గానీ ఎన్నికల్లో పోటీ చేస్తామనే సంకేతాలు ఇచ్చారు. వైఎస్సార్‌సీపీని ఓడించాలన్నారు. పచ్చ సీరియల్‌లో తరువాత ఎపిసోడ్ వివేకా వర్ధంతి కార్యక్రమాన్ని పులివెందులో పక్కా స్క్రిప్ట్‌తో నిర్వహించారు. అందులో సౌభాగ్యమ్మ, సునీత, షర్మిల ప్రసంగాలు ఒకే రాజకీయ లక్ష్యంతో సాగడం గమనార్హం. టీడీపీ తరపున పోటీ చేసేందుకు ఇప్పటికే రంగం సిద్ధం చేసుకున్న సౌభాగ్యమ్మ కడప ఎంపీగా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు పేర్కొన్నారు.

రెండో వివాహంతో రగడ

వివేకా రెండో వివాహంతో ఆ కుటుంబంలో విభేదాలు తలెత్తాయి. తాను రెండో వివాహం చేసుకున్న షమీమ్ అనే మహిళకు ఆస్తిలో వాటా ఇవ్వడంతోపాటు ఆమె ద్వారా జన్మించిన కుమారుడిని తన రాజకీయ వారసుడిగా ప్రకటించాలని వివేకా భావించారు. దీన్ని సౌభాగ్యమ్మ, సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి, పెద్ద బావమరిది నర్రెడ్డి శివప్రకాశ్‌రెడ్డి తీవ్రంగా వ్యతిరేకించారు. వైఎస్ వివేకా ఆస్తితోపాటు రాజకీయ వారసత్వం తమకే దక్కాలని పంతం పట్టారు. వివేకా హత్య తరువాత ఆయన పేరిట ఉన్న భూములు, ఇతర ఆస్తులను సునీత హడావుడిగా తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఆస్తులు హస్తగతమయ్యాక రాజకీయ వారసత్వంపై సౌభాగ్యమ్మ, సునీత కన్నేశారు. వివేకా జీవితాంతం రాజకీయంగా విభేదించిన చంద్రబాబుతో చేతులు కలిపారు. 2017లో వైఎస్సార్ జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి పూర్తి మెజార్టీ ఉన్నప్పటికీ ఆ పార్టీ అభ్యర్థిగా ఉన్న వివేకాను అప్పటి సీఎం చంద్రబాబు, మంత్రిగా ఉన్న ఆదినారాయణ రెడ్డి కుట్రపూరితంగా ఓడించారు. వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులకు ప్రలోభాలకు గురిచేసి పులివెందులకే చెందిన టీడీపీ అభ్యర్థి బీటెక్ రవిని గెలిపించారు. వివేకాను కుట్రతో ఓడించిన చంద్రబాబు, ఆదినారాయణరెడ్డి, బీటెక్ రవిలపట్ల నాలుగేళ్లుగా సౌభాగ్యమ్మ, సునీత సన్నిహితంగా ఉంటున్నారు.

హత్య అనంతరం... ఆద్యంతం సందేహాస్పదం

వైఎస్ వివేకా హత్య అనంతరం సౌభాగ్యమ్మ, సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, పెద్ద బావమరిది నర్రెడ్డి శివప్రకాశ్‌రెడ్డి వ్యవహరించిన తీరు సందేహాస్పదంగా ఉంది. వివేకా గుండెపోటుతో చనిపోయారనే ప్రచారం వెనుక ఆయన కుమార్తె సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, పెద్ద బావమరిది నర్రెడ్డి శివప్రకాశ్‌రెడ్డి ప్రధాన పాత్ర పోషించారు. 2019, మార్చి 15న ఉదయం వివేకా తలపై తీవ్ర గాయాలతో మృతిచెందారని ఆయన పీఏ పీఏ కృష్ణారెడ్డి మొదటగా గుర్తించారు. ఆ వెంటనే వివేకా సతీమణి, కుమార్తె, అల్లుడులకు సమాచారం ఇచ్చారు. రక్తపు మడుగులో పడి ఉన్న వివేకా మృతదేహం ఫొటోలు తీసి వాట్సాప్ చేశారు. అయినప్పటికీ ఆయన పెద్ద బావమరిది శివప్రకాశ్‌రెడ్డి అప్పటి టీడీపీ ప్రభుత్వంలో మంత్రి ఆదినారాయణరెడ్డికి ఫోన్ చేసి వివేకానందరెడ్డి గుండెపోటుతో మరణించారని చెప్పారు. అదే విషయాన్ని ఆదినారాయణరెడ్డి మీడియాకు వెల్లడించారు. దాంతో వివేకా గుండెపోటుతో మరణించారనే అసత్య సమాచారం బయటకు వచ్చింది. టీవీ చానళ్లలో ప్రసారమైంది. ఇక వివేకా రాసిన లేఖను బయటపెట్టవద్దని పీఏ కృష్ణారెడ్డిని ఆదేశించడం ద్వారా గుండెపోటుతో మరణించారన్న ప్రచారాన్ని ఆయన కుమార్తె, అల్లుడు కొనసాగించారు. ఆ లేఖను వెంటనే పోలీసులకు అప్పగించమని వారు చెప్పి ఉంటే వివేకాని హత్య చేశారన్న విషయం వెంటనే అందరికీ తెలిసిపోయేది. కానీ ఆ లేఖను ఉద్దేశపూర్వకంగానే గోప్యంగా ఉంచారు. ఆ రోజు మధ్యాహ్నం దాదాపు 1 గంట సమయంలో పులివెందుల చేరుకున్న సునీత, ఆమె భర్త రాజశేఖరరెడ్డికి ఆ లేఖను, సెల్‌ఫోన్‌ను కృష్ణారెడ్డి ఇచ్చారు. వారు ఆ లేఖను చదివిన వెంటనే దాన్ని పోలీసులకు అప్పగించలేదు. సునీత ఆదేశాలతో సాయంత్రం 5 గంటలకు కృష్ణారెడ్డి ఆ లేఖ, సెల్‌ఫోన్‌ను పోలీసులకు అందచేశారు. లేఖను సునీత, ఆమె భర్త రాజశేఖరరెడ్డి ఎందుకు గోప్యంగా ఉంచారన్నది ఈ కేసులో కీలక అంశం. వివేకా గుండెపోటుతో మరణించారని ప్రచారం చేసే ఉద్దేశంతోనే ఆ లేఖను బయట పెట్టకూడదని వారు నిర్ణయించారా? అన్నది ఇక్కడ అందరికీ కలిగే సందేహం. ప్రత్యక్ష సాక్షి వాచ్‌మేన్ రంగయ్య చెప్పిన వివరాల ప్రకారం 2019, మార్చి 14 అర్ధరాత్రి వివేకాను హత్య చేసిన తరువాత హంతకులు ఆ నివాసంలో ఆస్తి పత్రాలు, రౌండ్ సీల్ కోసం వెతికారు. దీంతో వివేకా తన రెండో భార్యకు రాసిచ్చిన ఆస్తి పత్రాలను ఆ ఇంటి నుంచి తీసుకువెళ్లారన్నది స్పష్టమైంది. వివేకా ఆస్తి కోసం, రాజకీయ వారసత్వం కోసమే ఆయన సొంత కుటుంబ సభ్యులే ఈ హత్యకు పన్నాగం పన్ని ఉంటారన్నది స్పష్టమవుతోంది.

'బీటెక్'.. సాగని ఆటలు

పులివెందుల నియోజకవర్గంలో కొద్దోగొప్పో పట్టు సాధించాలన్నది టీడీపీ నేత బీటెక్ రవి లక్ష్యం. టీడీపీ అధికారంలో ఉండటంతో 2019 ఎన్నికల్లో యథేచ్ఛగా అక్రమాలు సాగించవచ్చని పథకం వేశారు. కానీ నాడు వివేకా వైఎస్సార్‌సీపీకి పెద్దదిక్కుగా నిలబడటంతో బీటెక్ రవి ఆటలు సాగలేదు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను దొంగదెబ్బ తీసిన బీటెక్ రవికి పులివెందుల అసెంబ్లీ ఎన్నికల్లో డిపాజిట్ కూడా దక్కకుండా చేయాలని వివేకా పంతం పట్టారు. ఈ నేపథ్యంలోనే ఆయన హత్యకు గురయ్యారు. హత్యకు ముందు రోజు కొమ్మారెడ్డి పరమేశ్వర రెడ్డి (ఈయనతో వివేకాతో ఆర్థిక విభేదాలు తలెత్తాయి)తో బీటెక్ రవి రెండుసార్లు సమావేశమయ్యారు. ఈ భేటీలో పాల్గొన్న శ్రీనివాసరెడ్డి కొద్ది రోజులకే అనుమానాస్పద రీతిలో మృతి చెందారు. నార్కో పరీక్ష నిర్వహించాలని సిట్ దర్యాప్తులో నిర్ణయించినా పరమేశ్వరరెడ్డి మొండికేయడం సందేహాస్పదమే.

దస్తగిరి.. హంతకుడి హైడ్రామా

వివేకాను ఎంత పాశవికంగా హత్య చేశాడో పూసగుచ్చి చెప్పిన దస్తగిరితో వివేకా కుమార్తె సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి అత్యంత సన్నిహితంగా ఉండటం ఎవరికైనా విభ్రాంతి కలిగించకమానదు. వివేకాను హత్య చేసిన నలుగురిలో దస్తగిరి ఉన్నాడన్నది నిర్ధారణ అయ్యింది. అదే దస్తగిరిని అప్రూవర్‌గా మార్చి ఎంపీ అవినాశ్‌రెడ్డి, ఆయన తండ్రి భాస్కరరెడ్డిపై నిరాధారణ ఆరోపణలు చేయిస్తున్నారంటే... దీని వెనుక ఎవరున్నారన్నది కీలకం. చంద్రబాబు, ఆదినారాయణరెడ్డి, బీటెక్ రవి, సునీత, నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, నర్రెడ్డి శివ ప్రకాశ్ రెడ్డి...ఇలా అందరూ దస్తగిరికి బహిరంగంగానే సహకరిస్తున్నారు. వివేకా హత్యకు ముందు రూ.500 కోసం కూడా అప్పులు చేసిన దస్తగిరి ప్రస్తుతం ఓ కాన్వాయ్‌తో కూడిన బొలేరో కొనుగోలు చేసి దర్జాగా తిరుగుతున్నాడు. దస్తగిరి దుష్ప్రచారాన్ని పదే పదే టీడీపీ అనుకూల మీడియా ప్రసారం చేస్తోంది. మరి దస్తగిరి కట్టుకథలు, అసత్య ఆరోపణల వెనుక చంద్రబాబు ముఠా, సునీత కుటుంబమే ఉందన్నది స్పష్టమవుతోంది కదా!

బద్ధ శత్రువులతో ఒకే వేదికపై

పులివెందులలో శుక్రవారం నిర్వహించిన వివేకా వర్ధంతి కార్యక్రమంలో సౌభాగ్యమ్మ, సునీతతో పాటు ఆదినారాయణరెడ్డి, బీటెక్ రవి ఒకే వేదికపై ఆశీనులయ్యారు. వివేకాకు జీవితాంతం బీటెక్ రవి ప్రత్యర్థిగానే ఉన్నారు. 2017 ఎన్నికల్లో అక్రమంగా ఓడించారు. ఆ రాజకీయ కుట్రను ఆదినారాయణ రెడ్డి పర్యవేక్షించారు. 2019లో వివేకాను హత్య చేసివారికి వీరిద్దరూ పూర్తి అండదండలు అందిస్తున్నారు. అటువంటి వారు సౌభాగ్యమ్మ, సునీతకు అత్యంత ఆప్తులయ్యారు. వారిద్దరినీ ఆహ్వానించి వివేకా వర్ధంతి వేడుకలను నిర్వహించడం విభ్రాంతికరమే కాదు రాజకీయాలంటేనే జుగుప్స కలిగిస్తున్నాయని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

ఒంటరిని చేసి.. పస్తులు ఉంచి..

వివేకా జీవించి ఉండగా ఆయన్ని పట్టించుకోని కుటుంబ సభ్యులు ప్రస్తుతం రాజకీయ ప్రయోజనాల కోసం పాకులాడుతున్నారు. హత్యకు గురి కావడానికి చాలా ఏళ్ల ముందు నుంచే వివేకాను ఆయన సతీమణి, కుమార్తె, అల్లుడు విస్మరించారు. వివేకా షమీమ్‌ను రెండో వివాహం చేసుకోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన సౌభాగ్యమ్మ, సునీత ఆయన్ని చాలా ఏళ్లుగా పులివెందులలో ఒంటరిగా వదిలేశారు. సౌభాగ్యమ్మ చాలా ఏళ్లుగా హైదరాబాద్‌లో తన కుమార్తె నివాసంలో ఉంటున్నారు. వివేకా చెక్ పవర్‌ను కూడా రద్దు చేసి ఆయన రోజువారీ ఖర్చుల కోసం ఇబ్బంది పడే పరిస్థితి కల్పించారు. వివేకాకు ఇంట్లో వండి పెట్టేవారే లేని దుస్థితి కల్పించారు. చివరికి రెండు చపాతీలు కూడా ఇచ్చేవారు లేక ఆయన పనివాళ్ల మీద ఆధారపడాల్సి వచ్చేది. తిండి లేకుండానే నిద్రపోయిన రోజులూ ఉన్నాయి. ఈ విషయాలేవీ ఎవరికీ తెలియవన్నట్టుగా సౌభాగ్యమ్మ, సునీత వ్యవహరించి నిజాలకు పాతరేసేందుకు యత్నించారు.

ఆ నిర్ణయాలు సరైనవేనా?

- యాదాద్రి, భద్రాద్రి విద్యుత్ ప్లాంట్లు, ఛత్తీస్‌గఢ్‌తో ఒప్పందంపై కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ ఏర్పాటు
- ఇంధన శాఖ ఉత్తర్వులు.. మార్గదర్శకాల జారీ
- బాధ్యుల్ని తేల్చాలని, ఆర్థిక నష్టాలను నిర్ధారించాలని సూచన

సాక్షి, హైదరాబాద్: పోటీ (కాంపిటీటివ్) బిడ్డింగ్‌కు వెళ్లకుండా నామినేషన్ల ప్రాతిపదికన యాదాద్రి, భద్రాద్రి విద్యుత్ కేంద్రాల నిర్మాణం పనులను కాంట్రాక్టర్లకు అప్పగించడం, ఛత్తీస్‌గఢ్ డిస్కంల నుంచి 1,000 మెగావాట్ల విద్యుత్ కొనుగోలుకు ఒప్పందం కుదుర్చుకోవడంపై న్యాయ విచారణకు కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ ఏర్పాటయ్యింది. పాట్నా హైకోర్టు రిటైర్డ్ చీఫ్ జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డిని 'కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ'గా నియమిస్తూ రాష్ట్ర ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్ఏఎం రిజ్వీ ఉత్తర్వులు జారీ చేశారు. భారీ ఖర్చుతో కూడిన ప్రభుత్వ కాంట్రాక్టుల విషయంలో ప్రజాధనాన్ని ఇష్టారాజ్యంగా ఖర్చు చేయరాదని, అత్యుత్తమ ధరతో పారదర్శక విధానంలో కొనుగోళ్లు జరపాలని సుప్రీంకోర్టు పదే పదే స్పష్టం చేసిందని ఆ ఉత్తర్వుల్లో ప్రభుత్వం గుర్తు చేసింది. ప్రజాధనం వినియోగంలో ప్రభుత్వానికి అపరిమిత విచక్షణాధికారాలు ఉండవని, కాంట్రాక్టుల అప్పగింత సహా అన్ని రకాల ప్రభుత్వ చర్యలు రాజ్యాంగంలోని ఆర్టికల్ 14కి అనుగుణంగా ఉన్నాయా? లేదా? అనే అంశంపై పరీక్షను ఎదుర్కోవాల్సిందేనని సుప్రీం పేర్కొన్నట్లు తెలిపింది. యాదాద్రి, భద్రాద్రి విద్యుత్ కేంద్రాల నిర్మాణం, ఛత్తీస్‌గఢ్‌తో విద్యుత్ ఒప్పందం విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం సక్రమంగా, సరైన రీతిలో నిర్ణయాలు తీసుకుందా ?లేదా? అనే అంశంపై విచారణ జరపాల్సిందిగా జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్‌ను ప్రభుత్వం కోరింది. ఈ మేరకు వేర్వేరుగా మార్గదర్శకాలు జారీ చేసింది.

'ఛత్తీస్‌గఢ్'తో తీవ్ర నష్టం

కాంపిటీటివ్ బిడ్డింగ్ ప్రక్రియను అనుసరించకుండా నామినేషన్ల విధానంలో ఛత్తీస్‌గఢ్ డిస్కం నుంచి ప్రభుత్వం 2014లో 1000 మెగావాట్ల విద్యుత్ కొనుగోలు చేసింది. అయితే కేవలం 1000 మెగావాట్ల ఒప్పందం ఆధారంగా, 2000 మెగావాట్ల అంతర్రాష్ట్ర ట్రాన్స్‌మిషన్ లైన్ల (కారిడార్) బుకింగ్ కోసం పవర్ గ్రిడ్ కార్పొరేషన్ (పీజీసీఎల్)కు దరఖాస్తు చేసుకోవాలని డిస్కంలకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఆదేశాలపై విచారణ జరపాలని ప్రభుత్వం సూచించింది. ఛత్తీస్‌గఢ్ నుంచి 1000 మెగావాట్ల విద్యుత్‌కి బదులు చాలా తక్కువ విద్యుత్ సరఫరా అయినా, పీజీసీఎల్‌కు మొత్తం 1000 మెగావాట్ల కారిడార్ చార్జీలు చెల్లించడంతో రాష్ట్రానికి భారీ నష్టం వాటిల్లిందని పేర్కొంది. 'మణుగూరులో 1080 మెగావాట్ల సామర్థ్యంతో భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని కేవలం రెండేళ్ల వ్యవధిలో నిర్మించడం కోసం.. సూపర్ క్రిటికల్ టెక్నాలజీకి బదులుగా కాలం చెల్లిన సబ్ క్రిటికల్ టెక్నాలజీని అనుసరించారు. నిర్మాణం ఏడేళ్లలో పూర్తికావడంతో ప్రాజెక్టు వ్యయం భారీగా పెరిగింది. ఓపెన్ కాంపిటీటివ్ బిడ్డింగ్‌కి బదులుగా పూర్తిగా నామినేషన్ల విధానంలో భద్రాద్రి విద్యుత్ కేంద్రం పనులను ఈపీసీ విధానంలో కాంట్రాక్టర్లకు అప్పగించారు.

యాదాద్రికి 'బొగ్గు' భారం

సింగరేణి గనులకు 179–388 కి.మీల దూరంలోని దామెరచర్లలో 4వేల మెగావాట్ల యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్మాణానికి నిర్ణయం తీసుకోవడంతో బొగ్గు రవాణా వ్యయం పెరగనుంది. యాదాద్రి విద్యుత్ కేంద్రం నుంచి రాష్ట్ర డిస్కంలకు అధిక ధర విద్యుత్ సరఫరా జరగనుంది. ఓపెన్ కాంపిటీటివ్ బిడ్డింగ్ ప్రక్రియకు బదులుగా నామినేషన్ ప్రాతిపదికన విద్యుత్ కేంద్రం నిర్మాణ పనులను కాంట్రాక్టర్లకు అప్పగించారు..' అని ప్రభుత్వం తెలిపింది. పైన పేర్కొన్న అంశాలపై విచారణ జరపాలని, గుర్తించే తప్పిదాలకు బాధ్యులను సైతం తేల్చాలని, ఆ తప్పిదాలతో జరిగిన/జరగనున్న ఆర్థిక నష్టాలను కూడా నిర్ధారించాలని కోరింది. కమిషన్ హైదరాబాద్‌లో విచారణలు (సిట్టింగ్స్) నిర్వహించాలని, వచ్చే జూన్ 30లోగా విచారణ పూర్తి చేసి నివేదిక సమర్పించాలని సూచించింది.

కాంగ్రెస్‌లోకి దానం, పసునూరి!

▶ మొదటి పేజీ తరువాయి

ముహూర్తం చూసుకుని కాంగ్రెస్‌లో చేరనున్నట్లు ఈ సందర్భంగా నాగేందర్ తెలిపారు. ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన దానం రెండుసార్లు మంత్రిగా పనిచేశారు. ఇక పసునూరి దయాకర్ సచివాలయంలో ముఖ్యమంత్రితో సమావేశమయ్యారు. మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్, పాలకుర్తి కాంగ్రెస్ నాయకురాలు ఝాన్సీరెడ్డి ఈ భేటీలో పాల్గొన్నారు. కాగా ఇద్దరు నేతలు ఈనెల 18న కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్నట్లు తెలిసింది. దానం నాగేందర్‌ను సికింద్రాబాద్ ఎంపీగా బరిలో నిలిపే ఆలోచనలో కాంగ్రెస్ పార్టీ ఉందని గాంధీభవన్ వర్గాలంటున్నాయి. మరోవైపు పీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఎంఆర్జీ వినోద్‌రెడ్డి శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. తనకు సికింద్రాబాద్ నుంచి పోటీచేసే అవకాశం కల్పించాలని ఆయన కోరినట్లు సమాచారం.

బీఎస్పీకి రెండు లోక్‌సభ సీట్లు

పొత్తులో భాగంగా ఇచ్చేందుకు అంగీకరించిన బీఆర్ఎస్

సాక్షి, హైదరాబాద్: పార్లమెంటు ఎన్నికల్లో రాష్ట్రంలోని 17 స్థానాలకు గాను రెండు లోక్‌సభ సీట్లను పొత్తులో భాగంగా బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ)కి ఇవ్వాలని భారత రాష్ట్ర సమితి నిర్ణయించింది. ఈ మేరకు హైదరాబాద్, నాగర్‌కర్నూలు లోకసభ స్థానాలను ఇచ్చేందుకు బీఆర్ఎస్ అంగీకరించింది. బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావుతో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం ఇటీవల రెండు పర్యాయాలు చర్చలు జరిపిన విషయం తెలిసిందే. ఈ చర్చల్లో నాగర్‌కర్నూలుతో పాటు మరో రెండు స్థానాలను బీఎస్పీ కోరినప్పటికీ రెండు సీట్లు మాత్రమే ఇచ్చేందుకు బీఆర్ఎస్ సుముఖత వ్యక్తం చేసింది. బీఎస్పీకి కేటాయించిన రెండు స్థానాల్లో అభ్యర్థుల ఎంపికను ఆ పార్టీ చేసుకుంటుందని బీఆర్ఎస్ ప్రకటించింది. కేసీఆర్‌తో జరిగిన చర్చల సారాంశాన్ని తమ పార్టీ జాతీయ అధ్యక్షురాలు మాయావతికి వివరించిన అనంతరం బీఆర్ఎస్ ప్రతిపాదనకు అంగీకరిస్తున్నట్లు బీఎస్పీ ప్రకటించింది. కాగా, 15 ఎంపీ సీట్లలో బీఆర్ఎస్ పోటీ చేయనుంది. ఇప్పటికే 11 స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు ఖరారయ్యారు. భువనగిరి, నల్లగొండ, మెదక్, సికింద్రాబాద్ లోక్‌సభ స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులను ఇంకా ఖరారు చేయాల్సి ఉంది. ఆయా స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఖరారు అయిన తర్వాతే బీఆర్ఎస్ జాబితా వెల్లడయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది.

భట్టి పాదయాత్రకు ఏడాది

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ పేరుతో నాటి కాంగ్రెస్ శాసనసభా పక్ష (సీఎల్పీ) నేత హోదాలో చేపట్టిన పాదయాత్రకు ఏడాది పూర్తయింది. గత ఏడాది మార్చి 16వ తేదీన ఆయన ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గంలోని పిప్పిరి గ్రామం నుంచి ఈ పాదయాత్రను చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ కేడర్‌ను కదిలించి అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా ఆయన చేపట్టిన యాత్ర 109 రోజుల పాటు 1,364 కిలోమీటర్లు సాగింది. 36 అసెంబ్లీ నియోజకవర్గాలు, 17 జిల్లాల్లో 700 పైగా గ్రామాల్లో నిర్వహించిన ఈ యాత్రలో 100కు పైగా కార్నర్‌మీటింగ్‌లు, మంచిర్యాల, జడ్చర్ల, ఖమ్మంలలో భారీ బహిరంగ సభలు నిర్వహించారు. పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ముగింపు సందర్భంగా గత ఏడాది జూలై 2న ఖమ్మం నగరంలో నిర్వహించిన భారీ బహిరంగసభకు ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ హాజరయ్యారు. ప్రస్తుత రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తన అనుచరులతో పార్టీలో చేరిన ఈ సభ ద్వారా కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం వచ్చిందని, అప్పటి నుంచే రాష్ట్రంలో కాంగ్రెస్ గ్రాఫ్ పెద్ద ఎత్తున పెరిగిందనే చర్చ జరిగింది. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క పీపుల్స్‌మార్చ్ స్మృతులను గుర్తు చేసుకున్నారు. తన యాత్ర అనుభవం తెలంగాణ ప్రజల అభ్యున్నతి కోసం ఉపయోగపడుతుందని, అనేక సమస్యల పరిష్కారానికి ఈ పాదయాత్రే పునాది వేసిందని భట్టి అభిప్రాయపడ్డారు.

ఇప్పటికివే కరెంట్ చార్జీలు

కొత్త టారిఫ్ ఆర్డర్ జారీ చేసే వరకు కొనసాగింపు

సాక్షి, హైదరాబాద్: 2024–25 ఆర్థిక సంవత్సరంలో ప్రస్తుత విద్యుత్ చార్జీలనే.. కొత్త టారిఫ్ ఉత్తర్వులు జారీ చేసే వరకు కొనసాగించేందుకు రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లకు రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(ఈఆర్సీ) అనుమతిచ్చింది. కొత్త టారిఫ్ ఉత్తర్వులను జారీ చేసేందుకు సత్వరంగా విద్యుత్ టారిఫ్ సవరణ, వార్షిక ఆదాయ అవసరాల(ఏఆర్ఆర్)కు సంబంధించిన ప్రతిపాదనలు సమర్పించాలని డిస్కంలను ఆదేశించింది. ఈ మేరకు ఈఆర్సీ చైర్మన్ టి.శ్రీరంగారావు, సభ్యులు మనోహర్‌రాజు, బి.కృష్ణయ్యలు శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. సంబంధిత విద్యుత్ సంస్థలు 2024–25కి సంబంధించిన పిటిషన్లు వేసే వరకు ప్రస్తుత ఎస్ఎల్‌డీసీ చార్జీలు, ట్రాన్స్‌మిషన్ చార్జీలు, జెన్‌కో విద్యుత్ కేంద్రాల విద్యుత్‌కి సంబంధించిన స్థిర, చర వ్యయాలు, వీలింగ్ చార్జీలు యథాతథంగా కొనసాగుతా యని ఈఆర్సీ వేర్వేరు ఉత్త ర్వులు జారీ చేసింది.

అదనపు చార్జీకి రూ.1.40

ఓపెన్ యాక్సెస్ (బహిరంగ విప ణి) నుంచి కరెంట్ కొనుగోలు చేసే వినియోగదారుల నుంచి యూనిట్‌కు రూ.1.40 పైసలు చొ ప్పున అదనపు సర్‌చార్జీ వసూలు చేసుకోవడానికి ఈఆర్సీ అనుమతినిచ్చింది. యూ నిట్‌కు రూ.1.95 వసూలు చేసుకోవడానికి డిస్కంలు అనుమతి కోరగా, రూ.1.40 పైసలకు తగ్గిస్తూ అదనపు సర్‌చార్జీలపై ఉత్తర్వులు జారీ చేసింది. గ్రీన్ ఎనర్జీ ఆధారిత విద్యుత్ కొనుగోలు చేసేవారిపై అదనపు సర్‌చార్జీ విధించరాదని స్పష్టం చేసింది.

జీరో బిల్లుపై నేడు ఉత్తర్వులు

గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు అర్హులైన లబ్ధిదారులకు ఉచిత విద్యుత్ అందించేందుకు అనుమతి కోరుతూ రాష్ట్ర డిస్కంలు సమర్పించిన ప్రతిపాదనలపై శనివారం ఈఆర్సీ నిర్ణయం తీసుకోనుంది. ముందస్తుగా ప్రభుత్వం సబ్సిడీని విడుదల చేస్తే తప్ప జీరో బిల్లు జారీ చేయడానికి వీల్లేదని ఎలక్ట్రిసిటీ యాక్ట్ నిబంధనలు చెబుతున్నాయి. ఈ మేరకు ఈఆర్సీ ప్రభుత్వానికి స్పష్టమైన ఉత్తర్వులు ఇచ్చే అవకాశం ఉంది.

క్లుప్తంగా...

వాతావరణ మార్పులపై మీడియా అకాడమీ శిక్షణ

- రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి వెల్లడి



అవార్డు అందుకుంటున్న సాక్షి విశాఖపట్నం ప్రతినిధి బి.కోటేశ్వరరావు

సాక్షి, హైదరాబాద్: వాతావరణ మార్పులపై విస్తృత కథనాలను ప్రజల్లోకి తీసుకెళ్లే జర్నలిస్టులకు మెరుగైన అవగాహన కల్పించే దిశగా రాష్ట్ర మీడియా అకాడమీ త్వరలో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. యూఎస్ కాన్సులేట్ జనరల్ సహకారంతో వ్యూస్ స్వచ్ఛంద సంస్థ, తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ సంయుక్తంగా నిర్వహించిన రెండ్రోజుల వర్క్‌షాప్ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. యునైటెడ్ స్టేట్స్ కాన్సులేట్ జనరల్ ప్రజా వ్యవహారాల అధికారి అలెగ్జాండర్ మెక్‌లార్సన్ మాట్లాడుతూ వాతావరణ మార్పులపై అప్రమత్తం చేసేందుకు మీడియా ముందుంటుందన్నారు. ఈ సందర్భంగా వాతావరణ మార్పులపై కథనాలు రాసిన సాక్షి దినపత్రిక విశాఖపట్నం ప్రతినిధి బి.కోటేశ్వరరావు బెస్ట్ జర్నలిస్ట్ అవార్డు అందజేశారు.

టీఎస్ఈడబ్ల్యూఐడీఎస్ కార్యాలయంలో అగ్నిప్రమాదం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర విద్య, సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (టీఎస్ఈడబ్ల్యూఐడీఎస్) కార్యాలయంలో గురువారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం జరిగింది. కార్పొరేషన్ చైర్మన్ చాంబర్ పూర్తిగా తగలబడిపోయింది. చీఫ్ ఇంజనీర్ కార్యాలయంలోని పలు ఫైళ్లు కూడా అగ్నికి ఆహుతైనట్టు సమాచారం. నాంపల్లిలోని ఎల్బీ స్టేడియం పక్కన ఎస్‌సీఈఆర్‌టీ కార్యాలయం వెనుకభాగంలో ఈ భవనం ఉండడంతో ప్రమాదాన్ని ఎవరూ గుర్తించలేదు. శుక్రవారం ఉదయం కార్యాలయానికి వచ్చిన ఉద్యోగులు ఈ ఘటనను చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. టీఎస్ఈడబ్ల్యూఐడీఎస్ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్(వీసీఎండీ)గా డాక్టర్ మల్లయ్యభట్టు గురువారం సాయంత్రం నాలుగు గంటలకు చార్జ్ తీసుకొని వెళ్లిపోయారు. నిన్నటి దాకా ఇన్‌చార్జులతో కొనసాగిన ఈ విభాగానికి పూర్తిస్థాయి అధికారి వచ్చాక ప్రమాదం చోటుచేసుకోవడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

ప్రణీత్‌రావు ఇన్‌ఫార్మర్లలో మీడియా పెద్దలు!

అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రతిపక్షాల కదలికలపై ప్రణీత్ దృష్టి

- రేవంత్‌రెడ్డి, ఆయన కుటుంబీకుల సమాచారం సేకరించిన చానల్ పెద్ద
- వాట్సాప్ చాటింగ్ స్క్రీన్ షాట్లు సోషల్ మీడియాలో వైరల్

సాక్షి, హైదరాబాద్: స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరోలో (ఎస్ఐబీ) డీఎస్పీగా పని చేస్తూ, నమ్మక ద్రోహానికి పాల్పడినట్లుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న దుగ్యాల ప్రణీత్‌రావు కేసు దర్యాప్తులో అనేక కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. గత ఏడాది అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రతిపక్షాల నగదు లావాదేవీలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టిన ఇతను కొందరు మీడియా పెద్దలను సైతం ఇన్‌ఫార్మర్లుగా వాడుకున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన వాట్సాప్ చాటింగ్‌గా భావిస్తున్న స్క్రీన్ షాట్లు శుక్రవారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అప్పటివరకు ఎస్ఐబీ ఓఎస్డీ టి.ప్రభాకర్‌రావు కింద పని చేసిన ప్రణీత్ రావు గత ఏడాది నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో పదోన్నతి పొందాడు. కొందరు కీలక బీఆర్ఎస్ పార్టీ నాయకుల ఆదేశాల మేరకు తన ప్రైవేట్ సైన్యంతో కలిసి వార్ రూమ్ కేంద్రంగా కథ నడిపాడు. ప్రతిపక్ష నేతలు, వారి మద్దతుదారులకు సంబంధించిన కదలికలు, ఆర్థిక లావాదేవీలపై ప్రధానంగా దృష్టి పెట్టి పని చేశాడు. ఆ వివరాలను ఎప్పటికప్పుడు బీఆర్ఎస్ నేతల ద్వారా కొన్ని ప్రత్యేక విభాగాలకు అందించాడు. ఈ క్రమంలో ప్రణీత్‌రావు కొందరు మీడియా పెద్దల సహకారం కూడా తీసుకున్నట్లు తెలిసింది. ఓ చానల్‌కు నేతృత్వం వహిస్తున్న వ్యక్తి అప్పటి ప్రతిపక్ష నేత రేవంత్‌రెడ్డితో పాటు ఆయన



కుటుంబీకులు, వీరికి అండగా నిలుస్తున్న వారి వివరాలను తన నెట్‌వర్క్ ద్వారా సేకరించాడు. ఈ వివరాలన్నీ ఎప్పటికప్పుడు వాట్సాప్ ద్వారా ప్రణీత్‌రావుకు పంపాడని వైరల్‌గా మారిన స్క్రీన్ షాట్లు స్పష్టం చేస్తున్నాయి.

వార్ రూమ్ నుంచి పర్యవేక్షణ

ప్రతిపక్ష నేతలు ఎక్కడకు వెళ్తున్నారు? వారిని ఎవరు కలుస్తున్నారు? తదితర అంశాలను ఎస్ఐబీలోని తన వార్ రూమ్ నుంచి ప్రణీత్ రావు పర్యవేక్షించారు. ఇతడి నేతృత్వంలోని బృందం ప్రతిపక్ష నేతల పైనే కాకుండా బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులనూ టార్గెట్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. ప్రతిపక్షాలతో సంప్రదింపులు జరుపుతారని, సంబంధాలు ఉన్నాయని భావించిన నాయకులపై నిఘా ఉంచినట్లు తెలుస్తోంది. వీరి సంఖ్య 100 వరకు ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. ప్రణీత్‌రావును కస్టడీలోకి తీసుకుని విచారిస్తే మరిన్ని కీలకాంశాలు వెలుగులోకి వస్తాయని అంటున్నారు.

మూడు ఫోన్లు, ల్యాప్‌టాప్ స్వాధీనం


ప్రణీత్‌రావు నుంచి మూడు సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్ స్వాధీనం చేసుకున్నట్లు పంజగుట్ట పోలీసులు తమ రిమాండ్ రిపోర్టు ద్వారా కోర్టు దృష్టికి తీసుకువెళ్లారు. నిందితుడు ప్రధానంగా సాక్ష్యాధారాలు మాయం, ప్రజా ఆస్తుల ధ్వంసం, సాంకేతిక ఆధారాల మార్పి డి లాంటి నేరాలకు పాల్పడినట్లు తెలిపారు. ఎస్ఐబీకి చెందిన రహస్య సమాచారాన్ని ప్రణీత్‌రావు తన వ్యక్తిగత పెన్‌డ్రైవ్‌లు, డిస్క్‌ల్లోకి కాపీ చేసుకున్నారని ఆరోపించారు. మరికొందరితో కలిసి ఈ అక్రమాలకు పాల్పడ్డ ప్రణీత్‌రావు అవి వెలుగులోకి రాకుండా చూసేందుకు గత ఏడాది డిసెంబర్ 4న రాత్రి ఎస్ఐబీ కార్యాలయంలో విధ్వంసానికి పాల్పడ్డాడని తెలిపారు. జూబ్లీహిల్స్ ఏసీపీ పి.వెంకటగిరి నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల బృందం ఈ కేసు దర్యాప్తు జరుపుతోంది.

‘క్యారీ ఓవర్’పై ట్రిబ్యునలే తేల్చాలి

- అంగీకరించిన వాటా కన్నా ఎక్కువే వాడారు
- తెలంగాణకు స్పష్టం చేసిన కృష్ణాబోర్డు

సాక్షి, హైదరాబాద్: శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లోని మొత్తం 82.788 టీఎంసీల నిల్వల్లో 45 టీఎంసీలు ఏపీ, 35 టీఎంసీలను తెలంగాణకు కేటాయిస్తూ త్రిసభ్య కమిటీ నిర్ణయించగా, కేటాయింపులకు మించి తెలంగాణ 4.748 టీఎంసీలను ఆదనంగా వాడుకుందని కృష్ణానది యాజమాన్య బోర్డు స్పష్టం చేసింది. 2023 అక్టోబరు 1 నుంచి 2024 మార్చి 10 వరకు శ్రీశైలం జలాశయం నుంచి 26.571 టీఎంసీలు, నాగార్జునసాగర్ నుంచి 15.383 టీఎంసీలు మొత్తం 41.954 టీఎంసీలను ఏపీ వినియోగించుకోగా, శ్రీశైలం జలాశయం నుంచి 16.762 టీఎంసీలు, సాగర్ నుంచి 22.981 టీఎంసీలు కలిపి మొత్తం 39.743 టీఎంసీలను తెలంగాణ వినియోగించిందని పేర్కొంది. వచ్చే జూన్, జూలైలో తాగునీటి అవసరాల కోసం 2,788 టీఎంసీలు నిల్వ ఉంచామన్నారు. ఉమ్మడి జలాశయాల్లో సాగు, తాగునీటి అవసరాలకు సరిపడా నిల్వలు లేవని గుర్తించాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ కార్యదర్శికి కృష్ణా బోర్డు సభ్యకార్యదర్శి డీఎం రాయిపూరే తాజాగా లేఖ రాశారు. సాగర్, శ్రీశైలం నుంచి నీటిని తరలించకుండా ఏపీని అడ్డుకోవాలని కోరుతూ తెలంగాణ రాసిన లేఖకు జవాబుగా ఈ లేఖ పంపించారు. తాగునీటి అవసరాలకు కేటాయించే నీటిలో 20 శాతాన్ని మాత్రమే లెక్కించాలనే తెలంగాణ వాదనపై బోర్డు సమావేశంలో ఏకాభిప్రాయం కుదరనందువల్లే నిర్ణయం తీసుకోలేకపోయామని ఆ లేఖలో పేర్కొంది. ఒక నీటి సంవత్సరంలో వాడుకోని వాటాజలాలను తదుపరి సంవత్సరంలోకి మళ్లించాలని తెలంగాణ చేసిన విజ్ఞప్తిపై నిర్ణయం తీసుకునే అధికారాన్ని బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ (కృష్ణా ట్రిబ్యునల్-2)కు కేంద్రం అప్పగించిందని గుర్తు చేసింది. పాలేరు, కోటిపల్లి వాగు, చెట్టివాగు, పాకాల తదితర ప్రాజెక్టుల నీటి వినియోగపు లెక్కలను బోర్డు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించింది.

టమా‘రా’..!



టమాటా ధరలు భారీగా పడిపోయాయి. ఈ యాసంగి సీజన్‌లో సంగారెడ్డి జిల్లాలో 522 ఎకరాల్లో టమాటా పంట సాగైంది. అన్ని కలిసి ఎకరాకు సుమారు రూ.60 వేల నుంచి రూ.70 వేల వరకు ఖర్చవుతుందని రైతులు అంటున్నారు. ప్రస్తుతం ధరలు ఒక్కసారిగా పడిపోవటంతో 25 కేజీల బాక్సు ధర రూ.80లోపే వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో తెంపిన టమాటాలను రైతులు రోడ్డు పక్కన పారబోస్తున్నారు. – ఝరాసంగం(జహీరాబాద్)

మైనారిటీ రిజర్వేషన్లు రద్దు చేయడం మోదీ వల్ల కాదు

ఇఫ్తార్ విందులో సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ‘బీజేపీ అధికారంలోకి వస్తే మైనారిటీ రిజర్వేషన్లు రద్దు చేస్తామని ఇటీవల కేంద్ర హోంమంత్రి అన్నారు. మైనారిటీ రిజర్వేషన్లు రద్దు చేసే సత్తా అమిత్ షాకు లేదు. ప్రధానమంత్రి నరేంద్రమోదీకి కూడా సాధ్యం కాదు’ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రంజాన్ ఉపవాస దీక్షల సందర్భంగా శుక్రవారం మైనారిటీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఎల్బీ స్టేడియంలో ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఎం రేవంత్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ‘మైనారిటీలకు రాష్ట్ర ప్రభుత్వం నాలుగుశాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నది. వైఎస్ హయాంలో కాంగ్రెస్ ఎంతో మంది న్యాయ నిపుణులతో చర్చించి రిజర్వేషన్లు అమల్లోకి తెచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక మైనారిటీలకు అన్ని రంగాల్లో అవకాశాలను మెరుగుపర్చాం. అదనపు అడ్వొకేట్ జనరల్, మైనారిటీ సలహాదారు, ముఖ్యమంత్రి కార్యాలయం, వక్ఫ్‌బోర్డు చైర్మన్, టీఎస్‌పీఎస్సీ సభ్యుడిగా మైనారిటీలను నియమించాం. మైనారిటీల సంక్షేమానికి మా ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలు చేపడుతోంది. ఒక యూని



వర్సిటీకి వీసీగా మైనారిటీలకు అవకాశం కల్పిస్తామని ఈ సందర్భంగా హామీ ఇస్తున్నా. హైదరాబాద్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. పాతబస్తీని గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. నిజానికి అది ఓల్డ్ సిటీ కాదు..ఒరిజినల్ సిటీ..అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తాం. మైనారిటీ గురుకులాలకు అత్యాధునిక హంగులతో శాశ్వత భవనాలను నిర్మిస్తాం. ప్రభుత్వ ఉద్యోగ నియామకాల ప్రక్రియ ఎల్బీస్టేడియం వేదికగా నిర్వహిస్తున్నాం. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టింది ఎల్బీ స్టేడియం నుంచే. అదే స్ఫూర్తితో ఇక్కడి నుంచే పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నాం’ అని సీఎం వివరించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తదితరులు పాల్గొన్నారు.

యాదగిరి గుట్ట పులిహోర ప్రసాదంలో ఎలుక!

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో తయారు చేసే పులిహోర ప్రసాదంలో ఎలుక వచ్చినట్లు సోషల్ మీడియాలో శుక్రవారం చక్కర్లు కొట్టింది. ఓ కుటుంబానికి చెందిన భక్తులు శుక్రవారం ఉదయం శ్రీస్వామి వారిని దర్శించుకొని, అక్కడే ఉన్న ప్రసాద విక్రయ శాలలో లడ్డూ, పులిహోర ప్రసాదం కొనుగోలు చేశారు. ఆ ప్రసాదాన్ని మొదటి ఘాట్ రోడ్డులో కూర్చుని తింటున్న క్రమంలో.. చనిపోయిన ఎలుక పులిహోరలో ప్రత్యక్షమైంది. దీంతో కంగుతిన్న భక్తు లు, వెంటనే ఆలయాధికారుల వద్దకు తీసు కెళ్లారు. భక్తులను ఆలయ అధికారులు సము దాయించి, వేరే పులిహోర ప్రసాదం అందజేసి, అక్కడి నుంచి పంపించారు. ఈ విషయాన్ని ప్రసాదం సెక్షన్ అధికారి అశోక్ కుమార్‌ను వివరణ కోరగా.. పులిహోర ప్రసాదంలో ఎలు క వచ్చినట్లు తమ దృష్టికి వచ్చిందని, దీనిపై విచారణ చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ విష యాన్ని ఈవో దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు.



ప్రెస్‌క్లబ్ డైరీని ఆవిష్కరించిన సీఎం రేవంత్‌రెడ్డి

శుక్రవారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్–2024 డైరీని ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో ప్రెస్ క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేణుగోపాల్ నాయుడు, రవికాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రావు, ఉపాధ్యక్షురాలు సి.వనజ, కోశాధికారి రాజేశ్, సంయుక్త కార్యదర్శులు హరిప్రసాద్, రమేశ్ వైట్ల, ఈసీ సభ్యులు తదితరులు – సాక్షి, హైదరాబాద్

కరువుపై బహిరంగ చర్చకు సిద్ధం

- ప్రకృతి తెచ్చిన కరువు ఇది
- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



వ్యవసాయ డిగ్రీ కాలేజీ భవనానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, చిత్రంలో కవ్వంపల్లి

కరీంనగర్‌రూరల్: కాంగ్రెస్ తెచ్చిన కరువు అనే మూర్ఖులు, అజ్ఞానులు దమ్ముంటే కరువుపై బహిరంగ చర్చకు రావాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సవాల్ విసిరారు. కరీంనగర్ మండలం మొగ్దుంపూర్‌లో రూ.3కోట్లతో మహాత్మా జ్యోతిబా పూలే వ్యవసాయ మహిళా డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఎస్సారెస్పీ నీళ్లు రాక పంటలు ఎండిపోతున్నాయని పలువురు రైతులు మంత్రి ప్రభాకర్ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సెప్టెంబరులో సరైన వర్షాలు పడకపోవడంతోనే ప్రస్తుతం కరువు ఏర్పడిందన్నారు. సీఎం, మంత్రులుగా చేసిన నాయకులు కాంగ్రెస్‌తో కరువు వచ్చిందనడం సిగ్గుచేటన్నారు. మేడిగడ్డలోని పిల్లర్లు కుంగిపోవడంతో నీళ్లు ఎత్తిపోసే అవకాశం లేక అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం సముద్రంలోకి విడిచిపెట్టిందని గుర్తు చేశారు. కేసీఆర్ అనాలోచిత నిర్ణయంతోనే కరువు పరిస్థితులు వచ్చాయని స్పష్టం చేశారు. పంటలకు నీరందించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కరీంనగర్‌లో పార్టీలకతీతంగా భూకబ్జాదారులపై కేసులు పెడుతున్న పోలీసులపై మాజీ సీఎం కేసీఆర్ ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్, సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిని తిరుపతి, మండలాధ్యక్షుడు కె.రాంరెడ్డి, మూల రవీందర్‌రెడ్డి, ఎం.శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

టూరిజం స్పాట్‌గా జోడేఘాట్

- రాష్ట్ర మంత్రి సీతక్క
- భీమ్ విగ్రహానికి నివాళులు



కుమురం భీం విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి సీతక్క

కెరమెరి(ఆసిఫాబాద్): కుమురంభీం పోరాటం సాగించిన జోడేఘాట్‌ను టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేసి, ఆయన చరిత్ర ప్రపంచానికి తెలిసేవిధంగా కార్యాచరణ రూపొందిస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క అన్నారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఎస్పీ సురేశ్‌కుమార్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో కలిసి శుక్రవారం జిల్లాలోని కెరమెరి మండలం జోడేఘాట్‌ను సందర్శించారు. కుమురం భీం విగ్రహానికి నివాళులర్పించి, ఆయన సమాధి వద్ద పూజలు చేశారు. అనంతరం మ్యూజియంలోని విగ్రహాలు, దేవతలను పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో జంగుబాయి పుణ్యక్షేత్రం, కుమురంభీం స్మారక కేంద్రం, నాగోబా ఆలయం, తదితర దర్శనీయ కేంద్రాలు ఉన్నాయన్నారు. వీటిని మరింత అభివృద్ధి చేసి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను టూరిస్ట్ సర్క్యూట్‌గా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. జోడేఘాట్ తోపాటు నిజాం ప్రభుత్వంతో పోరు సాగించిన 12 గ్రామాల్లో పక్కా ఇళ్లు, రోడ్లు, తాగునీటి సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. పర్యాటకులకు కావాల్సిన సౌకర్యాలపై కలెక్టర్ ద్వారా నివేదిక తెప్పిస్తామన్నారు. ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించి ఇక్కడి డబుల్ బెడ్రూం ఇళ్లకు సంబంధించి బిల్లులు రిలీజ్ చేయించారని, కుమురంభీం పేరుతో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ఆసిఫాబాద్ నుంచి నేరుగా జోడేఘాట్‌కు వచ్చేందుకు 15 కిలోమీటర్ల రోడ్డు మంజూరు చేయిస్తామన్నారు. అంతకు ముందు కుమురం సూరు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుమురంభీం మనుమడు కుమురం సోనేరావు, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, ఇన్‌చార్జి జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు, డీటీడీవో రమాదేవి, తహసీల్దార్ దత్తు ప్రసాద్, ఎంపీడీవో కృష్ణారావు, సీఐ శ్రీనివాస్, క్యూరెటర్ దండేరావు పాల్గొన్నారు.

గిరిజన క్యాంటీన్‌ను ప్రారంభించిన మంత్రి, ఎమ్మెల్యే



క్యాంటీన్‌లో భోజనాలు వడ్డిస్తున్న మంత్రి

ఉట్నూర్‌రూరల్: ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లోని సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ) ఆధ్వర్యంలో గిరిజన భవన్‌లో ఏర్పాటు చేసిన గిరిజన క్యాంటీన్‌ను మంత్రి సీతక్క ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌తో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్లేట్ మిల్స్ రూ.5కే అందిస్తామని, మధ్యాహ్నం 12గంటల నుంచి 2గంటల వరకు ఉంటుందని తెలిపారు. క్యాంటీన్ ఏర్పాటుతో నలుగురు కొలాం గిరిజనులకు ఉపాధి లభించిందని అన్నారు. శాశ్వత షెడ్డు కోసం టెండర్ ఖరారు చేశామన్నారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌస్ ఆలం, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా పాల్గొన్నారు.

ఎన్టీపీసీ కార్మికుల శ్రేయస్సుకు జీవితం అంకితం

- ఎన్టీపీసీ ఉద్యోగుల హక్కుల కోసం ఉద్యమిస్తా
- జాతీయ ఎన్టీపీసీ ఫెడరేషన్ అధ్యక్షుడు బాబర్ సలీం పాషా



బాబర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఐఎన్టీయూసీ నాయకులు

జ్యోతినగర్: ఎన్టీపీసీ సంస్థ కార్మికుల శ్రేయస్సుకు నా జీవితం అంకితమని జాతీయ ఎన్టీపీసీ ఫెడరేషన్(ఐఎన్టీయూసీ)అధ్యక్షుడు బాబర్ సలీంపాషా అన్నారు. శుక్రవారం ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని మజ్దూర్ యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. దేశ వ్యాప్తంగా ఉన్నా ఎన్టీపీసీ సంస్థ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికుల హక్కుల సాధన కోసం తనవంతుగా ఉద్యమిస్తానని అన్నారు. సంస్థ ప్రయోజనాలు, ఉద్యోగుల హక్కులను కాపాడేందుకు ఐఎన్‌టీయూసీ కృషి చేస్తోందని వెల్లడించారు. సంస్థలో చాలా నెలలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సంస్థలో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించి 40 ఏళ్లు అయిన సందర్భంగా వేడుకలను ఘనంగా జరుపుకోవాల్సిన అవశ్యకత ఉందని అన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న కార్మికుల సమస్యలు పరిష్కరించడంతో పాటు వాటి అమలుపై దిశానిర్దేశం కోసం ఏప్రిల్ 16 నుంచి 19వ తేదీ వరకు ఇండోనేషియాలో జరుగనున్న ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ సదస్సుకు ఐఎన్టీయూసీ పక్షాన తాను హాజరుకానున్నట్లు తెలిపారు. అనంతరం నూతనంగా జాతీయ ఎన్టీపీసీ ఫెడరేషన్(ఐఎన్టీయూసీ) అధ్యక్షుడిగా ఎన్నికైన బాబర్‌ను సంస్థ ఉద్యోగ గుర్తింపు సంఘం నాయకులు పూలమాలలు వేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ గుర్తింపు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటస్వామి, ప్రధానకార్యదర్శి కనకయ్య, స్వామి, ఆరెపల్లి రాజేశ్వర్, రాజనర్సయ్య, వేముల కృష్ణయ్య, కొలని వెంకటరెడ్డి, భాస్కర్ యాదవ్ పాల్గొన్నారు.

మావోయిస్టుల కదలికలపై నిఘా

- ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు కృషి
- రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాసులు
- సరిహద్దు ప్రాంతాల పోలీస్ అధికారులతో సమావేశం



మాట్లాడుతున్న రామగుండం సీపీ శ్రీనివాసులు

మంచిర్యాలక్రైం/జైపూర్: రాబోయే పార్లమెంటు ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు మావోయిస్టులు, పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని రామగుండం పోలీసు కమిషనర్ ఎం.శ్రీనివాసులు అన్నారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్‌ప్లాంటు గెస్ట్‌హౌజ్‌లో మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల పోలీసు అధికారులు, ఎస్పీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. మావోయిస్టుల కదలికలు, సరిహద్దు ప్రాంతాల్లో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని, మావోయిస్టుల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని తెలిపారు. సంబంధిత సమాచారాన్ని చేరవేసుకుని పోలీసు అధికారులు సమన్వయంతో పని చేయాలని చెప్పారు. డబ్బు, మద్యం, ఇతర వస్తువులు అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. గుర్తు తెలియని, అనుమానాస్పద వ్యక్తులు, పాత నేరస్తులను బైండోవర్ చేయాలని తెలిపారు. సరిహద్దు ప్రాంతంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎన్నికల సందర్భంగా ఎవరు నిర్లక్ష్యంగా వ్యవహరించినా శాఖాపరమైన చర్యలు ఉంటాయని అన్నారు. ఈ సమావేశంలో మహారాష్ట్ర గడ్చిరోలి జిల్లా ఎస్పీ నీలోత్పాల్, అడిషనల్ ఎస్పీ యతీష్ దేశ్‌ముఖ్(ఆపరేషన్), అడిషనల్ ఎస్పీ రమేష్, మంచిర్యాల డీసీపీ అశోక్‌కుమార్, భూపాలపల్లి, కుమురంభీం ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాల ఎస్పీలు, అదనపు ఎస్పీలు, ఏసీపీలు ప్రకాష్, రవికుమార్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బీ–థర్మల్ విద్యుత్ కేంద్రంలో మళ్లీ నిలిచిన విద్యుత్ ఉత్పత్తి

రామగుండం: రామగుండంలో 62.5 మెగావాట్ల సామర్థ్యం గల బీ–థర్మల్ విద్యుత్ కేంద్రంలో గురువారం అర్ధరాత్రి బాయిలర్ ట్యూబ్స్ పగలిపోవడంతో మళ్లీ విద్యుత్ ఉత్పత్తి నిలిచింది. గురువారం సాయంత్రం 6.30 గంటలకు విద్యుత్ కేంద్రాన్ని ఉత్పత్తి దశలోకి తీసుకువచ్చిన ఇంజినీర్ల బృందం ఆరు గంటల వ్యవధిలోనే అదే బాయిలర్ ట్యూబ్స్ పగిలి విద్యుత్ కేంద్రం షట్‌డౌన్ అయింది. మళ్లీ పునరుద్ధరణకు కనీసం 36 గంటలు సమయం పట్టే అవకాశం ఉందని పలువురు ఇంజినీర్లు పేర్కొన్నారు. ఇటీవల బీ–థర్మల్ కేంద్రంలోని బాయిలర్, మిల్స్ విభాగంలో తరచూ సమస్యలు తలెత్తడం, విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోవడం, తిరిగి పునరుద్ధరణ చర్యలకు లక్షలాది నిధులు వెచ్చించడం, ఉత్పత్తి అవుతున్న విద్యుత్ ఉత్పత్తి ఆదాయం కంటే అదనంగా మరమ్మతులకు వ్యయం చేయాల్సి వస్తుందని పలువురు బాహటంగా పేర్కొనడం గమనార్హం. ఏది ఏమైనప్పటికీ ఆర్థిక సంవత్సరాంతంలో ఉత్పత్తిలో మొరాయించడంతో ఇంజినీర్లు, ఉద్యోగులు తీవ్ర నిరాశ చెందుతుండగా బీ–థర్మల్ భవితవ్యంపై నీలినీడలు కమ్ముకునే అవకాశాలు లేకపోలేదనే చర్చ సర్వత్రా వినిపిస్తోంది. పునరుద్ధరణ చర్యలు చేపడుతున్నప్పటికీ ఇంకా ఎంతకాలం ఈ పరిస్థితి ఉంటుందో తెలియడంలేదు.



వదిలించుకుందాం ఇలా...

ఒక్కోసారి మనం బాస్‌తో, సహోద్యోగులతో, స్నేహితులతోనో మాట్లాడే సమయంలో లేదా ఏమయినా ముఖ్యమైన పనులలో ఉన్నప్పుడు తల దురద పెడుతుంటుంది. ఆ సమయంలో కలిగే ఇబ్బంది ఇంతా అంతా కాదు. తల దురదకు కేవలం పేలు లేదా చుండ్రు వంటివి మాత్రమే కాదు, అలర్జీ కూడా కారణం కావచ్చు. అలర్జీ అనేది కేవలం శరీరంపై దద్దుర్ల రూపేణా మాత్రమే వస్తుందనుకోవడానికి వీలు లేదు. తలలో కూడా వస్తుంది. ముందుగా ఈ దురద ఎందుకు వచ్చిందో తెలుసుకుంటే దాన్ని నివారించడం సులభమవుతుంది.

కొన్ని రకాల క్రిముల వల్ల, కొంతమందికి సాధారణంగానే అరచేతులు, అరికాళ్లలో ఎక్కువ చెమట పడుతుంది. ఎప్పటికప్పుడు చెమటను తుడుచుకుంటూ పొడిగా ఉండేలా చూసుకోవాలి. లేకపోతే ఇన్ఫెక్షన్స్‌కు దారి తీస్తుంది. కొంతమంది ఎక్కువగా నీటిలో నానుతూ పనిచేస్తుంటారు. నీటిలో అదేపనిగా నానడం కూడా అలర్జీకి కారణమవుతుంది. కొన్ని సార్లు డిటర్జెంట్‌లు కూడా కొంతమందిలో అలర్జీకి కారణమవుతాయి. అదేవిధంగా కొన్ని రకాలైన నూనెలు, ఎరువులు, ఇంధనాలతో కూడా ఈ సమస్య వస్తుంది.

పరిష్కారాలు: ఇలా ఇబ్బంది పెట్టే తల దురద నుంచి తప్పించుకోవటానికి మిరియాలు బాగా ఉపయోగపడుతాయి. అర స్పూన్ మిరియాలు, అర స్పూన్ పాలతో కలిపి బాగా నూరాలి. తర్వాత కొద్దిగా నీళ్లలో ఉడికించి పేస్టు మాదిరిగా చేసి దాన్ని ఆరబెట్టి కొద్దిగా వేడి ఉండగానే తలకు రుద్దాలి. అరగంట తర్వాత శీకాయ పొడితో తలస్నానం చేయాలి. ఈవిధంగా వారానికి మూడు, నాలుగు సార్లు చేస్తే తల దురద పూర్తిగా పోతుంది.

ఆహారం ద్వారా: ఉప్పు, పులుపు, కారం తక్కువగా ఉండే, బలమైన ఆహారాన్ని తీసుకోవాలి. విటమిన్లు అధికంగా ఉండే తాజా పళ్ళు, గ్రీన్ సలాడ్‌లను తీసుకోవడం మంచిది. మంచినీరు బాగా తాగడం, తగినంత వ్యాయామం, ధ్యానం చేయడం ద్వారా కూడా దురదలను తగ్గించుకోవచ్చు.

దురద, దద్దుర్లు నిరోధించేందుకు మరికొన్ని జాగ్రత్తలు: దురద సమస్య ఎక్కువగా ఉంటే ముందు జాగ్రత్తగా తీపి పదార్థాలను తినటం తగ్గించాలి.

శరీరాన్ని ఎప్పుడూ శుభ్రంగా ఉండేలా చూసుకోవాలి: మనం వంటికి రుద్దుకునే సబ్బు లేదా తలకు రాసుకునే నూనె, మనం వాడే స్ప్రే లేదా కొత్త మోడల్ దుస్తులకు ఉపయోగించే మెటీరియల్ కూడా మన చర్మానికి సరిపడకపోవచ్చు. అందువల్ల ఉన్నట్టుండి దురదలు వస్తుంటే, మన అలవాట్లలో కొత్తగా వచ్చిన మార్పేమిటో తెలుసుకుని దాని నుంచి దూరంగా ఉండటం ఉత్తమం.

కొంతమంది ఎప్పుడూ ఉసూరుమంటూ ఉంటారు. టార్చి లైటు వేసి చూసినా, వారి ముఖంలో ఉత్సాహం కనిపించదు. ఇంకొందరేమో ఉత్సాహానికి మారుపేరులా... ఎప్పుడూ నవ్వుతూ తుళ్లుతూ ఉంటారు. మనం తీసుకునే ఆహారం మన ప్రవర్తనపైన, పనితీరుపైనా ప్రభావం చూపుతుందనడానికి అదొక తార్కాణం. కొన్ని రకాల ఆహార పదార్థాలను నిత్యం తింటుండటం వల్ల ఉత్సాహంగా... ఉల్లాసంగా ఉండడంతోపాటు మెరుపులీనే చర్మం, మంచి ఆరోగ్యం మన సొంతం అవుతాయి. అవేమిటో చూద్దామా...



తినండి... ఉల్లాసంగా... ఉత్సాహంగా

ఉత్సాహంగా ఉంచే ఆహారం అనగానే అదేదో ఖరీదైన తిండేమో అని అనుకోనక్కరలేదు. ఇంకా చెప్పాలంటే మిగిలిన వాటితో పోల్చితే అవి కాస్తంత చవగ్గానే దొరుకుతాయి.




టొమాటో: దీనిలోని లైకోపిన్ కాన్సర్ నిరోధకంగా పనిచేస్తుంది. గుండె, రక్తనాళాలకి సంబంధించిన అనారోగ్యాన్ని కూడా నిరోధిస్తుంది. మన చర్మానికి ఎండ తాలూకు ప్రభావాలనుండి రక్షించడంలో మిగతా పోషకాలతో పాటు టమాటోల పాత్ర చెప్పుకోదగినదే.

నట్స్: ముఖ్యంగా వాల్‌నట్స్‌లో ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్, ప్లాంట్ స్టెరోల్స్ సమృద్ధిగా ఉంటాయి. కొలెస్టరాల్ లెవల్ తగ్గించడంలో వీటి పాత్ర అమోఘం. వాల్నట్స్‌లో పీచుపదార్థం అధికం. మెగ్నీషియం, కాపర్, ఫోలేట్, విటమిన్-ఇ, ఉండి శక్తిమంతమైన యాంటి ఆక్సిడెంట్స్‌ని అందిస్తాయి. బ్లడ్ ప్రెషర్‌ను తగ్గిస్తుంది. ఆస్టియోపొరోసిస్ రాకుండా ఆపుతుంది. గుండె ఆరోగ్యాన్ని, చర్మానికి ఎండనుండి కలిగే హానినుండి కాపాడుతుంది. ఆల్మండ్స్ చర్మకాంతికి తోడ్పడతాయి. రోజూ గుప్పెడు నట్స్ తింటూ ఉంటే ఉత్సాహం ఉరకలు వేస్తుంది.

గ్రీన్ టీ: ఇది ఓ సూపర్ డ్రింక్. రక్తపోటును నియంత్రణలో ఉంచుతుంది. చర్మాన్ని అంత త్వరగా ముడతలు పడనివ్వదు. కళ్ళకు మెరుపు అందిస్తుంది. కేటరాక్ట్ ముదరటాన్నీ నెమ్మదింపచేస్తుంది. కప్పు గ్రీన్ టీ తీసుకోగానే కొత్త ఉత్సాహం పరవళ్ల తొక్కుతున్నట్లనిపిస్తుంది.



యోగర్ట్ లేదా పెరుగు: మనం కర్డ్ లేదా పెరుగు అంటాం కానీ, విదేశాలలో దీనినే యోగర్ట్ అంటారు. అయితే మన పెరుగుకూ దానికీ ఉన్న తేడా ఏమిటంటే... పెరుగు కాస్త పలచగా ఉంటుంది. యోగర్ట్ గట్టిగా ఉంటుంది. పెరుగు కాస్తంత పుల్లదనాన్ని కలిగి ఉంటుంది. యోగర్ట్‌లో ఏమాత్రం పులుపు ఉండదు. కస్టర్డ్ పౌడర్ కలిపినట్టుగా గడ్డగా... కొద్దిపాటి తియ్యగా ఉంటుంది. ఈ రెండూ కూడా ప్రోటీన్, కాల్షియం, విటమిన్-బి లను కలిగి ఉంటాయి. ఇవన్నీ కలిసి రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తాయి. ఇన్ఫెక్షన్ కలగకుండా పోరాడతాయి. యోగర్ట్ మన శరీర ఆరోగ్యానికి, జీర్ణ వ్యవస్థకు, నాడీ వ్యవస్థకు మేలుచేస్తుంది. క్యాన్సర్, ఎలర్జీలు, అధిక రక్తపోటు, హై-కొలెస్టరాల్ బారిన పడకుండా కాపాడుతుంది.



బీన్స్: ప్రోటీన్స్, పీచుపదార్థం, విటమిన్లు, మినరల్స్, ఫైటోన్యూట్రియెంట్స్. ఇవన్నీ బీన్స్‌లో సమృద్ధిగా ఉంటాయి. అలాగే కొవ్వుకు సంబంధించిన చెడు లక్షణాలు ఉండవు. బీన్స్ ఆరోగ్యానికి మేలు చేస్తుంది. షుగర్ లెవల్స్ సమతుల్యంగా ఉండేటట్లు చూస్తూనే సురక్షితమైన, నిలకడ అయిన నెమ్మదిగా ఖర్చయ్యే శక్తిని అందిస్తుంది. కొలెస్టరాల్ లెవెల్స్‌ని కొంతమేరకు తగ్గిస్తాయి. బీన్స్‌తో చేసిన కూరలు తిన్నప్పుడు కడుపు నిండినట్లు అనిపిస్తుంది. అయితే ఇందులో అధిక క్యాలరీలు లేకపోవడం వలన బరువు పెరిగే సమస్యే ఉండదు.



బెర్రీస్: ముఖ్యంగా నేరేడు పండ్లు: వృద్ధాప్యం త్వరగా రాకుండా చేస్తాయి. వృద్ధులవుతున్న కొద్దీ మెదడు నెమ్మదించే అవకాశం ఉంది. అలాంటి అనారోగ్యల నుంచి బెర్రీస్ కాపాడుతాయి. వీటిలో యాంటీ ఆక్సిడెంట్స్, క్యాన్సర్ నిరోధకాలు ఉంటాయి.

ఆకుకూరలు: ఆకుకూరలు చాలా రకాల క్యాన్సర్‌ల నుండి కాపాడుతాయి. వీటిలో విటమిన్ బి, సి, ఇ, ఫోలేట్, పొటాషియం, పీచుపదార్థం సమృద్ధిగా ఉంటాయి. ఎముకల ఆరోగ్యానికి మంచిది. కాల్షియంని శరీరం ఇముడ్చుకోవటానికి తోడ్పతాయి. కేటరాక్ట్‌ను నిరోధించడంలో పాలకూర తోడ్పడుతుంది.

వీలయినంత వరకూ వీటిలో కొన్నింటిని అయినా రోజువారీ ఆహారంలో భాగంగా చేసుకుంటే ఉత్సాహంగా ఉండవచ్చు.



ఇంట్లో నుంచి కాలు బయట పెట్టినప్పటి నుంచి తిరిగి ఇంటికి వచ్చేవరకు మన పాదాలను అంటిపెట్టుకుని ఉండి, జాగ్రత్తగా కాపాడేది పాదరక్షలే కాబట్టి ఎలాంటి పాదరక్షలను, ఎప్పుడు ఎంచుకోవాలి అనే విషయాలపై అవగాహన అవసరం. చెప్పుకోవడానికి ఇది చాలా సిల్లీగా కనిపిస్తుంది కానీ చెప్పుకోకపోతే తిప్పలు తప్పవు. అందుకే కొన్ని సంగతులు చెప్పుకుందాం.

చెప్పుకుందాం..!

దుస్తులు మాత్రం అందరూ సరయిన కొలతల్లోనే ఉండేలా చూసుకుంటారు కానీ, చెప్పుల విషయంలో అంతగా పట్టించుకోరు. నిజానికి దుస్తులకు ఎంత ప్రాధాన్యత ఇస్తామో, పాదరక్షలకు కూడా అంతే ప్రాధాన్యత ఇవ్వాలి.

పాదరక్షలు సౌకర్యంగా లేకపోతే ఎవరికైనా ఇబ్బందే కానీ ముఖ్యంగా ఆర్థోపెడిక్, డయాబెటిస్ రోగులు, ఆపరేషన్లు చేయించుకున్న వాళ్లె మరిన్ని ఇబ్బందులు పడతారు.

చిన్నసైజు వద్దు...

పాదం పరిమాణం కంటే చిన్నగానూ, బిగుతుగానూ ఉండే చెప్పులు ధరిస్తే అనారోగ్య సమస్యలను కొని తెచ్చుకున్నట్లే. సరైన చెప్పులు వేసుకోకపోతే పాదాలకు పగుళ్లు, ఇన్ఫెక్షన్లూ తప్పవు. బిగుతైన బూట్లు ధరించడం వల్ల గోళ్ల పెరుగుదల నిలిచిపోవడమే కాక గోటి చివర్లు వేళ్లలోనికి గుచ్చుకుని ఇన్ఫెక్షన్ల బారిన పడాల్సి వస్తుంది. షుగర్ రోగులకు ఇలాంటివి తీవ్రంగా మారే ప్రమాదం ఉంది. అలాగని పెద్ద సైజు చెప్పులు, బూట్లు వేసుకోవడమూ ఏమంత మంచిది కాదు. మడమల సమస్యలు ఎదురవుతాయి. వీటి మూలంగా కాళ్లు బెణకడం, నడకలో తేడా రావడం తప్పవని నిపుణుల హెచ్చరిక.

సాయంత్రాలే సరి

గుండె సంబంధిత వ్యాధులు, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు, బీపీ, డయాబెటిస్ వంటి లైఫ్‌స్టైల్ సంబంధిత రోగులకు సహజంగానే కాళ్ల వాపులుంటాయి. అలాగే ఎక్కువసేపు కుర్చీలో కూర్చొని పనిచేసే వాళ్లకు సైతం పాదాల వాపు సర్వసాధారణం. ఇది ఎక్కువగా సాయంత్రం సమయంలో ఉంటుంది. ఈ సమయంలో చెప్పులు కొనుగోలు చేస్తే సాధారణ సైజు కంటే కొంచెం పెద్దవి తీసుకునే అవకాశం ఉంటుంది. పనివేళలో సరైన సైజ్ చెప్పులు, బూట్లు వేసుకోవడం వల్ల సౌకర్యంగా ఉండటంతోపాటు పాదాలు కూడా పదిలంగా ఉంటాయి.

ఒక కాలితో ట్రయల్ వద్దే వద్దు...

పాదరక్షలు కొనుగోలు చేసేటప్పుడు ఒక కాలికి మాత్రమే ట్రయల్ వేసి సరిపోయిందని సంతృప్తి పడవద్దు. మొహమాటం లేకుండా రెండు కాళ్లకూ వేసుకుని నాలుగడుగులు అటూ ఇటూ నడిచి, అవి సౌకర్యంగా అనిపిస్తేనే కొనుగోలు చేయాలి. అదేవిధంగా బూట్లు కొనేటప్పుడు సాక్స్ తొడుక్కోకుండా ట్రయల్ చేయడం సరి కాదు. బూట్లకు ముందు కనీసం అర అంగుళం ఖాళీగా ఉండేలా చూసుకోవాలి. లేకుంటే కాలిగోర్ల పెరుగుదల నిలిచిపోవడం, తద్వారా ఇన్ఫెక్షన్ల సమస్య తలెత్తే అవకాశం ఉంటుంది. అదే విధంగా పాదరక్షలు ఎప్పుడూ శుభ్రంగా ఉండేలా చూసుకోవడం కూడా ఎంతో అవసరం.

మంచి రంగు కూడా ముఖ్యమే!

చెప్పుల రంగు మామూలుగా ఉందో లేదో గమనించండి. సాధారణంగా మంచి నాణ్యత గల చెప్పుల రంగు ముదురుగా ఉండదు. అదే చవక రకం చెప్పుల రంగు చాలా ప్రకాశవంతంగా ఉంటుంది, ఈ రంగులలో ఎక్కువగా కాడ్మియం, సీసం, ఇతర హెవీ మెటల్ అంశాలు ఉంటాయి, ఇది పిల్లల ఆరోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తుంది.

గట్టి చెప్పులు

కొంతమంది తల్లిదండ్రులు మెత్తటి చెప్పులయితే నడక సరిగా ఉండదనే అపోహతో పిల్లలకు బిగుతుగా ఉండే గట్టి చెప్పులు కొంటారు. నిజానికి, బిగుతైన చెప్పులు ధరించిన పిల్లలు పాదాల, కాలి వేళ్ల పెరుగుదలకు ఆటంకం కలిగించినట్లే. స్లిప్పర్ లోపల ఉన్న పొడవు పిల్లల పాదం పొడవు కంటే కనీసం ఒక సెంటీమీటరు పొడవుగా ఉండాలని నిపుణుల సలహా.

భారంగా వద్దు

మీరు కొనాలనుకుంటున్న చెప్పులను ఒకసారి చేతితో పట్టుకుని చూడండి. బరువు తక్కువగా ఉండి, చేతుల్లో భారమైన అనుభూతి లేనట్లయితే, అది కొత్త మెటీరియల్‌తో తయారయిందని చెప్పవచ్చు. బరువుగా అనిపిస్తే వాటిని కొనుగోలు చేయవద్దు.

చివరగా ఒక మాట... చెప్పులే కదా అని చులకనగా చూడొద్దు. వీటి గురించి చెప్పుకోవాలంటే బోలెడన్ని సంగతులున్నాయి.

సినిమా

ఎప్పటికీ కృతజ్ఞతగా...


● అమితాబ్ బచ్చన్

అమితాబ్ బచ్చన్ ఆస్పత్రిలో చేరారనే వార్త గుప్పుమనడంతో అభిమానులు ఆందోళన పడ్డారు. అయితే ఆ తర్వాత కంగారు పడాల్సిందేమీ లేదనే వార్త కూడా రావడంతో కూల్ అయ్యారు. ఇంతకీ విషయం ఏంటంటే... శుక్రవారం తెల్లవారుజాము అమితాబ్ శ్వాస తీసుకోవడానికి ఇబ్బందిపడటంతో కుటుంబ సభ్యులు ఆయన్ను ఆస్పత్రిలో చేర్పించారట. అమితాబ్‌కి యాంజియోప్లాస్టీ సర్జరీ చేశారని సమాచారం. కాలికి ఒకచోట రక్తం గడ్డ కట్టడంతో యాంజియోప్లాస్టీ చేశారట. ఇక శుక్రవారం మధ్యాహ్నమే అమితాబ్ ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ఆ తర్వాతే 'ఇన్ గ్రాటిట్యూడ్ ఎవర్' (ఎప్పటికీ కృతజ్ఞతగా..) అని ఎక్స్‌లో పోస్ట్ చేసినట్లున్నారు అమితాబ్. అంటే... ఆరోగ్యంగా బయటపడినందుకు ఆయన ఇలా పోస్ట్ చేసి ఉంటారని ఊహించవచ్చు. ఇక ఇటీవల ప్రభాస్ 'కల్కి 2898 ఏడీ', రజనీకాంత్ 'వేట్టయాన్' చిత్రాల షూటింగ్స్‌లో అమితాబ్ పాల్గొన్న సంగతి తెలిసిందే.


● మధుబాల

'ప్యార్ కియా తో డర్నా క్యా..' అంటూ 'మొఘల్ ఎ అజం' (1960) చిత్రంలో వెండితెరపై అనార్కలిగా ప్రేమ కురిపించిన మధుబాలను నాటి తరం అంత సులువుగా మర్చిపోదు. ఈ తరం ప్రేక్షకుల కోసం ఆమె జీవితం వెండితెరకు రానుంది. 'ఇండియన్ సినిమా సౌందర్య దేవత'గా కితాబులందుకున్న మధుబాల తన ఇరవయ్యేళ్ల కెరీర్‌లో అరవైకి పైగా చిత్రాల్లో నటించారు. 'మిస్టర్ అండ్ మిసెస్ 55, హాఫ్ టికెట్, మహల్, బాదల్'.. ఇలా పలు చిత్రాల్లో తన అందం, అభినయంతో ఆకట్టుకున్నారు మధుబాల. 1933లో జన్మించిన మధుబాల అతి చిన్న వయసు (36)లోనే కన్ను మూశారు. ఈ 36 ఏళ్ల జీవితంలో మధుబాల సినీ, వ్యక్తిగత జీవితం గురించి

మధుభాల బయోపిక్ షురూ

తెలియని చాలా విషయాలను బయోపిక్‌లో చూపించనున్నారు. ప్రముఖ నటుడు దిలీప్‌కుమార్‌తో అనుబంధం, ప్రముఖ గాయకుడు, నటుడు కిశోర్‌కుమార్‌తో వివాహం వంటి విషయాలూ ఈ చిత్రంలో ఉంటాయట. అలియా భట్‌తో 'డార్లింగ్స్' చిత్రాన్ని తెరకెక్కించిన జస్మీత్ కె రీన్ మధుబాల బయోపిక్‌కి దర్శకురాలు. ఈ చిత్రాన్ని మధుబాల వెంచర్స్ పతాకంపై మధుబాల సోదరి మధుర్ బ్రిజ్ భూషణ్ నిర్మించనున్నారు. సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్, బ్రూయింగ్ థాట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కూడా నిర్మాణ భాగస్వాములుగా ఉంటాయి. ''ఈ చిత్రంతో ఎవరి మనోభావాలనూ దెబ్బ తీయాలనే ఆలోచన లేదు. మధుబాల జీవితం గురించి ఉన్న కొన్ని అపోహలను ఈ చిత్రం తొలగిస్తుంది. సినిమా కోసం కొంత స్వేచ్ఛ తీసుకున్నప్పటికీ నిజాయితీగానే రూపొందిస్తాం'' అని మధుర్ పేర్కొన్నారు. ఇంకా కథానాయిక ఖరారు కాలేదు. కాగా శుక్రవారం ఈ బయోపిక్ ప్రకటన వచ్చినప్పట్నుంచి మధుబాలగా నటించే చాన్స్ ఏ కథానాయికకు దక్కుతుందనే చర్చ మొదలైంది.

రామ్‌చరణ్ పెద్ది?



రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు సన దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. రూరల్ స్పోర్ట్స్ డ్రామాగా రూపొందనున్న ఈ సినిమాలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తారు. కాగా ఈ నెల 20న హైదరాబాద్‌లో ఈ చిత్రం ప్రారంభోత్సవం జరగనుందని తెలిసింది. ఈ సినిమాకు 'పెద్ది' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారని, ఈ నెల 27న రామ్‌చరణ్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా టైటిల్‌పై స్పష్టత వచ్చే చాన్స్ ఉందని భోగట్టా. అలాగే ఈ సినిమాలో కన్నడ స్టార్ శివరాజ్ కుమార్ ఓ కీలక పాత్రలో కనిపిస్తారనే టాక్ వినిపిస్తోంది. కాగా ప్రస్తుతం వైజాగ్‌లో జరుగుతున్న 'గేమ్‌చేంజర్' చిత్రం షూటింగ్‌తో బిజీగా ఉన్నారు రామ్‌చరణ్. శంకర్ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు.

భీమాని హిట్ చేసిన ప్రేక్షకులకు థ్యాంక్స్ - గోపీచంద్


● మారుతి, గోపీచంద్, సంపత్ నంది

''భీమా' సినిమా బాగుంది. యాక్షన్, కామెడీ అద్భుతంగా ఉంటాయి. ఈ సినిమాలో రెండు క్యారెక్టర్స్‌లో మంచి వేరియేషన్స్ చూపించారని మంచి అప్లాజ్ వస్తోంది. ఇంత మంచి విజయాన్నిచ్చిన ప్రేక్షకులకు థ్యాంక్స్'' అని గోపీచంద్ అన్నారు. గోపీచంద్ హీరోగా కన్నడ దర్శకుడు ఎ. హర్ష దర్శకత్వంలో కేకే రాధామోహన్ నిర్మించిన చిత్రం 'భీమా'. ప్రియా భవానీ శంకర్, మాళవికా శర్మ హీరోయిన్లుగా నటించారు. ఈ చిత్రం ఈ నెల 8న విడుదలైంది. ఈ సందర్భంగా శుక్రవారం జరిగిన థ్యాంక్స్ మీట్‌లో దర్శకులు మారుతి, సంపత్ నంది అతిథులుగా పాల్గొని, ఈ సినిమా విజయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. గోపీచంద్ మాట్లాడుతూ– ''భీమా' వంటి సినిమాను తెలుగు ప్రేక్షకులకు ఇచ్చిన దర్శకుడు హర్షకు, నిర్మాత రాధామోహన్‌గారికి ధన్యవాదాలు'' అన్నారు. ''భీమా'కు ఆడియన్స్ నుంచి లభిస్తోన్న స్పందన సంతోషాన్నిస్తోంది'' అన్నారు హర్ష. ''రోజు రోజుకీ మా సినిమా వసూళ్లు పెరుగుతున్నాయి. విద్యార్థుల పరీక్షలు పూర్తయ్యాయి. చూడనివారు మా సినిమాను చూడండి'' అన్నారు రాధామోహన్. మాళవికా శర్మ మాట్లాడారు.

యూత్‌ఫుల్ డ్యూయెట్


● 'డ్యూయెట్'లో ఆనంద్ దేవరకొండ

'డ్యూయెట్' పాడుతున్నారు మదన్. ఆనంద్ దేవరకొండ, రితికా నాయక్ జంటగా నటిస్తున్న యూత్‌ఫుల్ లవ్ ఎంటర్‌టైనర్ 'డ్యూయెట్'. మిథున్ వరదరాజ కృష్ణన్‌ను దర్శకుడిగా పరిచయం చేస్తూ కేఈ జ్ఞానవేల్ రాజా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఓ డిఫరెంట్ లవ్‌స్టోరీగా తెరకెక్కుతున్న ఈ సినిమా రెగ్యులర్ చిత్రీకరణ జరుపుకుంటోంది. శుక్రవారం ఆనంద్ దేవరకొండ బర్త్ డే. ఈ సందర్భంగా 'డ్యూయెట్'లో మదన్ క్యారెక్టర్‌లో ఆనంద్ నటిస్తున్నట్లుగా వెల్లడించి, కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్ కుమార్, సహనిర్మాత: మధుర శ్రీధర్ రెడ్డి. మరోవైపు ఆనంద్ దేవరకొండ నటిస్తున్న యాక్షన్ ఫిల్మ్ 'గం..గం..గణేశా'. ఉదయ్ శెట్టి దర్శకత్వంలో కేదార్ సెలగంశెట్టి, వంశీ కారుమంచి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమా కొత్త పోస్టర్ కూడా విడుదలైంది.

ఫిఫ్టీ ప్లస్‌లో ఫస్ట్ చాన్స్!


● కే హుయ్ క్వాన్

ఐదు పదుల వయసు దాటిన తర్వాత హీరో అవుతున్నారు ఆస్కార్ విన్నింగ్ హాలీవుడ్ యాక్టర్ కే హుయ్ క్వాన్. 'ది అవెంజర్స్', 'జాన్ విక్', 'డెడ్‌పూల్ 2' వంటి సినిమాల్లోని యాక్షన్ సీక్వెన్స్‌లకు స్టంట్ కో ఆర్డినేటర్‌గా చేసిన జోనాథన్ యుసేబియా 'విత్ లవ్' అనే ఓ యాక్షన్ ఫిల్మ్‌తో దర్శకునిగా తొలిసారి మెగాఫోన్ పట్టారు. ఈ చిత్రంలోనే కే హుయ్ క్వాన్ మెయిన్ లీడ్ రోల్ చేస్తున్నారు. నటుడిగా దాదాపు నాలుగు దశాబ్దాల కెరీర్ ఉన్న కే హుయ్ క్వాన్‌కు హీరోగా ఇదే తొలి చిత్రమని హాలీవుడ్ సమాచారం. అలాగే ఫిఫ్టీ ప్లస్ ఏజ్‌లో ఉన్న జోనాథన్ యుసేబియా దర్శకత్వం వహిస్తున్న తొలి సినిమా ఇదే కావడం విశేషం. ఇక ప్రస్తుతం 'విత్ లవ్' సినిమా చిత్రీకరణ జరుగుతోంది. ఈ సినిమాను 2025 ఫిబ్రవరి 7న విడుదల చేయనున్నట్లుగా మేకర్స్ ప్రకటించారు. 'ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్' సినిమాలో ఓ కీలక పాత్రలో నటించారు క్వాన్. ఈ సినిమాకు గాను ఆయన ఉత్తమ సహాయ నటుడు విభాగంలో 2023లో జరిగిన 95వ ఆస్కార్ అవార్డ్స్‌లో అవార్డు అందుకున్నారు.

అర్జునుడి గీతోపదేశంలో...


● వరలక్ష్మీ శరత్‌కుమార్

వరలక్ష్మీ శరత్‌కుమార్ ప్రధాన పాత్రలో నటించనున్న సినిమాకు 'అర్జునుడి గీతోపదేశం' టైటిల్‌ను ఖరారు చేశారు. అఖిల్ రాజ్, దివిజా ప్రభాకర్, రాజీవ్, ఆదిత్యా శశికుమార్ కీలక పాత్రల్లో నటించనున్న ఈ సినిమాతో సతీష్ గోగాడ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. త్రిలోక్‌నాథ్. కె, ప్రదీప్ రెడ్డి .వి నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రారంభోత్సవం శుక్రవారం హైదరాబాద్‌లో జరిగింది. తొలి సన్నివేశానికి మల్లాల సీతారామరాజు కెమెరా స్విచ్చాన్ చేయగా, కె. అమ్మిరాజు క్లాప్ ఇచ్చారు. లక్కంశెట్టి వేణుగోపాల్ గౌరవ దర్శకత్వం వహించారు. అనంతరం సతీష్ గోగాడ మాట్లాడుతూ– ''దర్శకుడిగా నా తొలి చిత్రం ఇది. మొదటి షెడ్యూల్‌ను మార్చి 20న అమలాపురంలో మొదలుపెడుతున్నాం. ఆ తర్వాత వైజాగ్, హైదరాబాద్, చెన్నై లొకేషన్స్‌లో చిత్రీకరణ ప్లాన్ చేశాం'' అన్నారు. ''ఈ సినిమా ప్రేక్షకులను అలరించేలా ఉంటుంది'' అన్నారు నిర్మాతలు. రాజీవ్, దివిజ మాట్లాడారు. ఈ చిత్రానికి సంగీతం: చరణ్ అర్జున్.

నవ్వులే నవ్వులు


● శ్రీహర్ష, శ్రీవిష్ణు

''ప్రేక్షకులను నవ్వించాలనే ఉద్దేశంతోనే 'ఓం భీమ్ బుష్' సినిమా చేశాం. రెండు వందల శాతం ఆడియన్స్ పిచ్చి పిచ్చిగా నవ్వుతారు. ప్రేక్షకుల నవ్వులతో థియేటర్స్ బద్దలైపోతాయి'' అని హీరో శ్రీవిష్ణు అన్నారు. శ్రీవిష్ణు, ప్రీతీ ముకుందన్ జంటగా, ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ, అయేషా ఖాన్, ప్రియా వడ్లమాని, శ్రీకాంత్ అయ్యంగార్ ముఖ్య పాత్రల్లో నటించిన ఈ సినిమాకు శ్రీహర్ష కొనుగంటి దర్శకత్వం వహించారు. యూవీ క్రియేషన్స్, వీ సెల్యూలాయిడ్ పతాకాలపై సునీల్ బలుసు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 22న విడుదల కానుంది. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో శ్రీవిష్ణు మాట్లాడుతూ– ''దర్శకుడు హర్ష ఈ సినిమాను హిలేరియస్‌గా తీశాడు. అవకాశం ఇచ్చిన యూవీ వంశీ అన్న, సునీల్‌గారికి ధన్యవాదాలు'' అన్నారు. ''ట్రైలర్‌లో ఉన్న ఎనర్జీ కంటే సినిమాలో వంద రెట్లు ఎనర్జీ ఉంది'' అన్నారు శ్రీహర్ష. ''ఈ సినిమాతో డబుల్ డోస్ ఎంటర్‌టైన్మెంట్ ఇస్తామని ప్రామిస్ చేస్తున్నాం'' అన్నారు ప్రియదర్శి. ''ఓం భీమ్ బుష్' ప్రేక్షకులను అలరిస్తుంది'' అన్నారు సునీల్.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	454	72,643
నిఫ్టీ ▽	123	22,024

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	15,956	▽	172
డోజోన్స్	38,672	▽	234
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,727	▽	16
డాక్స్	17,937	▽	5
షాంఘై	3,054	△	16
నికాయ్	38,705	△	100

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారట్)	64,550
బంగారం (22 క్యారట్)	61,480
వెండి (కేజీ)	80,000

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	భారతీయరూ.	81.19	84.48
£	బ్రిటన్ పౌండ్	భారతీయరూ.	103.88	108.12
€	యూరో	భారతీయరూ.	88.12	91.90
¥	జపాన్ ఎన్ (100)	భారతీయరూ.	47.00	64.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	భారతీయరూ.	52.07	56.58
S$	సింగపూర్ డాలర్	భారతీయరూ.	60.13	64.88
SAR	సౌదీ రియాల్	భారతీయరూ.	21.21	22.74
UAE D	యూఏఈ దిర్హామ్	భారతీయరూ.	21.65	23.43
¥	చైనా యువాన్	భారతీయరూ.	10.28	12.29

దక్షిణాదిపై యస్ బ్యాంక్ మరింత దృష్టి

- మైక్రోఫైనాన్స్ కార్యకలాపాలపైనా కసరత్తు
- యస్ బ్యాంక్ ఎండీ ప్రశాంత్ కుమార్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రైవేట్ రంగ యస్ బ్యాంక్ దక్షిణాదిలో కార్యకలాపాలపై మరింతగా దృష్టి పెడుతోంది. ఇందులో భాగంగా హైదరాబాద్‌లోను శాఖలను విస్తరిస్తోంది. ప్రస్తుతం 25గా ఉన్న బ్రాంచీల సంఖ్యను మార్చి ఆఖరు నాటికి 29కి పెంచుకోనున్నట్లు, తదుపరి మరో రెండు కొత్త శాఖలను ప్రారంభించనున్నట్లు బ్యాంక్ ఎండీ ప్రశాంత్ కుమార్ శుక్రవారం మిక్కడ మీడియాకు తెలిపారు. దేశవ్యాప్తంగా తమకు 1,200 పైచిలుకు శాఖలు ఉండగా.. దక్షిణాదిలో 216 ఉన్నాయన్నారు. మైక్రోఫైనాన్స్ విభాగంలోకి ప్రవేశించడంపైనా కసరత్తు చేస్తున్నామని ఆయన చెప్పారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో కుదిరితే ఏదైనా సూక్ష్మ రుణాల సంస్థను కొనుగోలు చేస్తామని లేదా సొంతంగానైనా కార్యకలాపాలు ప్రారంభిస్తామని ఆయన పేర్కొన్నారు. పేటీఎం పరిణామాలపై స్పందిస్తూ దానికి సంబంధించి నాలుగు బ్యాంకులకు వచ్చే వ్యాపారంలో తమకు పాతిక శాతం వాటా రాగలదని ప్రశాంత్ కుమార్ పేర్కొన్నారు. మరోవైపు, చిన్న, మధ్య తరహా పరిశ్రమల విభాగంపైనా (ఎంఎస్‌ఎంఈ) దృష్టి పెడుతున్నామన్నారు. ప్రస్తుతం తమ పోర్ట్‌ఫోలియోలో దీని వాటా 30 శాతంగా ఉండగా వచ్చే రెండు, మూడేళ్లలో 35 శాతం వరకు పెంచుకోనున్నట్లు ప్రశాంత్ కుమార్ చెప్పారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో డిపాజిట్లలో 18 శాతం, రుణాల్లో 15 శాతం వరకు వృద్ధిని అంచనా వేస్తున్నట్లు వివరించారు.

హైదరాబాద్ మార్కెట్‌పై స్పందిస్తూ డిపాజిట్లు వార్షిక ప్రాతిపదికన 16.6 శాతం వృద్ధి చెంది రూ. 8,887 కోట్లకు చేరాయని, స్థూల రుణాలు 24 శాతం వృద్ధితో రూ. 11,157 కోట్లకు పెరిగాయని ప్రశాంత్ కుమార్ చెప్పారు. కొత్త కాసా (కరెంట్ అకౌంటు, సేవింగ్స్ అకౌంటు) అకౌంట్లు 14 శాతం వృద్ధి చెందాయన్నారు. దక్షిణాదిలో తమ కాసా డిపాజిట్లలో నగరానికి 14 శాతం వాటా ఉందని పేర్కొన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
16-3-2024	
విశాఖ	425-00
చిత్తూరు	463-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	420-00
విజయవాడ	420-00
రిటైల్ ధర (డజను)	72.00
15-3-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	395-00
వరంగల్	397-00
రిటైల్ ధర	4.55

కొత్త ఈవీ పాలసీ



కేంద్రం ఆమోదం • కనీస పెట్టుబడి విలువ రూ. 4,150 కోట్లు
• దిగుమతులపై సుంకాలపరమైన మినహాయింపులు
• టెస్లా తదితర సంస్థల ఎంట్రీకి మార్గం సుగమం ..

న్యూఢిల్లీ: టెస్లా వంటి అంతర్జాతీయ విద్యుత్ వాహనాల దిగ్గజాల నుంచి పెట్టుబడులను ఆకర్షించే దిశగా కేంద్ర ప్రభుత్వం కొత్త ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) పాలసీకి ఆమోదముద్ర వేసింది. దీని ప్రకారం దేశీయంగా తయారీ యూనిట్లపై కనీసం 500 మిలియన్ డాలర్లు (రూ. 4,150 కోట్లు) ఇన్వెస్ట్ చేసే సంస్థలకు సుంకాలపరమైన ప్రోత్సాహకాలు ఇవ్వనుంది. అధికారిక ప్రకటన ప్రకారం ఈవీ ప్యాసింజర్ కార్లను ఏర్పాటు చేసే కంపెనీలు 35,000 డాలర్లకు పైబడి విలువ చేసే వాహనాలపై 15 శాతం సుంకాలతో పరిమిత సంఖ్యలో కార్లను దిగుమతి చేసుకునేందుకు వీలుంటుంది.

ప్రభుత్వం అనుమతి లేఖ ఇచ్చిన తేదీ నుంచి అయిదేళ్ల వ్యవధికి ఇది వర్తిస్తుంది. ప్రస్తుతం పూర్తి స్థాయి కారును (సీబీయూ)ని దిగుమతి చేసుకుంటే.. ఇంజిన్ పరిమాణం, ఖరీదు, బీమా, రవాణా (సీఐఎఫ్) మొదలైనవి కలిపి విలువను బట్టి 70 శాతం నుంచి 100 శాతం దాకా కస్టమ్స్ సుంకాలు ఉంటున్నాయి. దీనికి 40,000 డాలర్ల విలువను ప్రామాణికంగా పరిగణిస్తున్నారు. ఎలక్ట్రిక్ వాహనాల తయారీకి భారత్‌ను గమ్యస్థానంగా మార్చేందుకు, పేరొందిన అంతర్జాతీయ ఈవీల తయారీ సంస్థల నుంచి పెట్టుబడులను ఆకర్షించేందుకు ఈ పాలసీ ఉపయోగపడగలదని కేంద్రం పేర్కొంది. భారత్‌లో ఎలక్ట్రిక్ వాహనాల మార్కెట్ పెరుగుతుండటం, అమెరికాకు చెందిన టెస్లా, వియత్నాం సంస్థ విన్‌ఫాస్ట్ మొదలైనవి ఇక్కడ ఇన్వెస్ట్ చేయడంపై ఆసక్తిగా ఉన్న నేపథ్యంలో కొత్త విధానం ప్రాధాన్యం సంతరించుకుంది.

స్కీముకి సంబంధించి మరిన్ని వివరాలు..

- ఆమోదం పొందిన దరఖాస్తుదారులు ఎలక్ట్రిక్ 4 వీలర్ల ఉత్పత్తి కోసం భారత్‌లో కనీసం రూ. 4,150 కోట్ల (500 మిలియన్ డాలర్ల) పెట్టుబడితో తయారీ ప్లాంటు నెలకొల్పాలి.
- కేంద్ర భారీ పరిశ్రమల శాఖ అనుమతి మంజూరు చేసిన తేదీ నుంచి 3 సంవత్సరాల్లోగా ప్లాంటును ఏర్పాటు చేయాలి. ప్రాథమికంగా దేశీయంగా కనీసం 25 శాతం విలువను (డీవీఏ) జోడించాలి. అయిదేళ్లలో దీన్ని 50 శాతానికి పెంచాలి. డీవీఏని 50 శాతానికి పెంచి, కనీసం రూ. 4,150 కోట్లు ఇన్వెస్ట్ చేయడం పూర్తయిన తర్వాతే బ్యాంక్ గ్యారంటీలను ప్రభుత్వం వాపసు చేస్తుంది.
- తక్కువ సుంకాలతో గరిష్ఠంగా ఏడాదికి 8,000 ఎలక్ట్రిక్ ఫోర్ వీలర్లను దిగుమతి చేసుకోవచ్చు. వార్షిక పరిమితి కన్నా తక్కువగా దిగుమతి చేసుకుంటే మిగతాది తర్వాత ఏడాదికి క్యారీఫార్వార్డ్ చేసుకునేందుకు వీలుంటుంది.
- స్కీమును నోటిఫై చేసిన సుమారు 120 రోజుల్లో దరఖాస్తులను ఆహ్వానిస్తారు. కంపెనీలు దరఖాస్తు చేసుకున్న 120 రోజుల్లోగా వాటిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది.

తెలుగు రాష్ట్రాల్లో ముత్తూట్ మైక్రోఫిన్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మైక్రోఫైనాన్స్ రంగంలో ఉన్న ముత్తూట్ మైక్రోఫిన్ తెలంగాణలో అడుగుపెడుతోంది. భువనగిరి, జనగాం, హన్మకొండ, పరకాలలో శాఖలను ఈ నెలలో తెరుస్తున్నట్లు శుక్రవారం ప్రకటించింది. జూన్‌లోగా ఆంధ్రప్రదేశ్‌కు సేవలను విస్తరిస్తామని ముత్తూట్ మైక్రోఫిన్ సీఈవో సదాఫ్ సయీద్ వెల్లడించారు. కొచ్చి కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ముత్తూట్ మైక్రోఫిన్ 18 రాష్ట్రాలకు విస్తరించింది. 1,424 శాఖలతో సేవలు అందిస్తోంది. సుమారు 33 లక్షల మంది కస్టమర్లు ఉన్నారు.

లాభాలు ఒకరోజుకే పరిమితం

- సెన్సెక్స్ 454 డౌన్
- నిఫ్టీకి 123 పాయింట్లు నష్టం
- ఆయిల్ అండ్ గ్యాస్, ఐటీ, ఫైనాన్స్ షేర్లలో అమ్మకాలు



ముంబై: స్టాక్ మార్కెట్ లాభాలు ఒక రోజుకే పరిమితమయ్యాయి. అమెరికా వడ్డీరేట్ల తగ్గింపు వాయిదా ఆందోళనలతో ఫైనాన్షియల్, ఆటో, ఐటీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. స్మాల్, మిడ్ క్యాప్ ఫండ్ల నిర్వహణ సామర్థ్యాలను పరీక్షించేందుకు స్ట్రెస్ టెస్ట్ నిర్వహించాలని సెబీ ఆదేశాలు జారీ చేసింది. ఆ ఫలితాలూ ట్రేడింగ్‌పై ప్రతికూల ప్రభావం చూపాయి. ఫలితంగా సెన్సెక్స్ 454 పాయింట్లు పతనమై 72,643 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 123 పాయింట్లు నష్టపోయి 22,024 వద్ద నిలిచింది. ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 612 పాయింట్లు క్షీణించి 72,485 వద్ద, నిఫ్టీ 215 పాయింట్లు పతనమై 21,932 వద్ద ఇంట్రాడే కనిష్టాలకు దిగివచ్చాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.849 కోట్ల షేర్లను విక్రయించారు. ఆయిల్ అండ్ గ్యాస్, ఇంధన, క్యాపిటల్ గూడ్స్, వినిమయ షేర్లూ అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.682 కోట్ల షేర్లు అమ్మేశారు. వారం మొత్తంగా సెన్సెక్స్, నిఫ్టీ 2% చొప్పున నష్టపోయాయి. బీఎస్‌ఈ స్మాల్ క్యాప్ సూచీ 6%, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 4% క్షీణించాయి.

క్రిప్టోలను కరెన్సీగా గుర్తించం..

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



న్యూఢిల్లీ: క్రిప్టో కరెన్సీలపై భారత్ విధానం మారబోదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. కరెన్సీలను ప్రభుత్వం లేదా సెంట్రల్ బ్యాంకులే జారీ చేయాలే తప్ప క్రిప్టోలను కరెన్సీగా గుర్తించే ప్రసక్తే లేదన్నారు. ఇటువంటి అసెట్స్‌ను నియంత్రించే దిశగా సమగ్రమైన ఫ్రేమ్‌వర్క్ రూపొందించే అంశాన్ని జీ20 కూటమి పరిశీలిస్తోందని మంత్రి పేర్కొన్నారు. మరోవైపు, ప్రపంచ మార్కెట్లు అనేక ఒడిదుడుకులకు లోనవుతున్నా దేశీయంగా స్టాక్ మార్కెట్ స్థిరంగానే వ్యవహరిస్తోందని ఆమె పేర్కొన్నారు. కాబట్టి మార్కెట్‌ను దాని మానాన వదిలేయాలని అభిప్రాయపడ్డారు. స్మాల్, మిడ్ క్యాప్ స్టాక్స్‌లో బబుల్ తరహా పరిస్థితులు ఉన్నాయని, వాటిపై చర్యాపత్రాన్ని తెచ్చే అవకాశాలు ఉన్నాయని మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి ఇటీవల తెలిపిన నేపథ్యంలో మంత్రి వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

ఎగుమతులు రికార్డ్



న్యూఢిల్లీ: భారత వస్తు ఎగుమతులు ఫిబ్రవరిలో రికార్డు సృష్టించాయి. 11 నెలల గరిష్ట స్థాయిలో 41.40 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. 2023 ఏప్రిల్‌తో ప్రారంభమైన ఆర్థిక సంవత్సరంలో ఈ స్థాయిలో ఎగుమతుల వృద్ధి నమోదుకావడం ఇదే తొలిసారి. ఇంజనీరింగ్ గూడ్స్, ఎలక్ట్రానిక్, ఫార్మా ఎగుమతులు పెరగడం మొత్తం సానుకూల గణాంకాలకు దారితీసింది. ఇక ఇదే కాలంలో దిగుమతులు 12.16 శాతం పెరిగి 60.11 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. వెరసి ఎగుమతులు-దిగుమతుల మధ్య నికర వ్యత్యాసం వాణిజ్యలోటు 18.70 బిలియన్ డాలర్లు.

- పసిడి దిగుమతులు ఫిబ్రవరిలో గణనీయంగా 133.82% పెరిగి, 6.15 బిలియన్ డాలర్లకు చేరాయి. ఆర్థిక సంవత్సరం 11 నెలల్లో 39% పెరిగి 44 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.
- ఇంజనీరింగ్ గూడ్స్ ఎగుమతులు ఫిబ్రవరిలో 15.9 శాతం పెరిగి 9.94 బిలియన్ డాలర్లకు చేరాయి. ఎలక్ట్రానిక్ గూడ్స్ ఎగుమతులు 55 శాతం ఎగసి 3 బిలియన్ డాలర్లకు ఎగశాయి.
- 2023 ఏప్రిల్ నుంచి 2024 ఫిబ్రవరి వరకూ ఎగుమతుల (వస్తువులు, సేవలు) విలువ 0.83 శాతం వృద్ధితో 709.81 బిలియన్ డాలర్లు. ఇదే కాలంలో దిగుమతుల విలువ 782.05 బిలియన్ డాలర్లు.
- 2021-22లో ఎగుమతుల విలువ 422 బిలియన్ డాలర్లయితే, దిగుమతుల విలువ 613 బిలియన్ డాలర్లు. 2022-23లో వస్తు ఎగుమతులు 450 బిలియన్ డాలర్లు, దిగుమతులు 714 బిలియన్ డాలర్లు.





సెమీస్‌లో అల్‌కరాజ్

ఇండియన్ వెల్స్ మాస్టర్స్ సిరీస్-1000 టెన్నిస్ టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్ అల్‌కరాజ్ (స్పెయిన్) సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. కాలిఫోర్నియాలో జరిగిన క్వార్టర్ ఫైనల్లో రెండో ర్యాంకర్ అల్‌కరాజ్ 6-3, 6-1తో ఆరో ర్యాంకర్ జ్వెరెవ్ (జర్మనీ)పై గెలిచాడు. మరో క్వార్టర్ ఫైనల్లో ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేత సినెర్ (ఇటలీ) 6-3, 6-3తో లెహెస్కా (చెక్ రిపబ్లిక్)పై నెగ్గి అల్‌కరాజ్‌తో సెమీఫైనల్ పోరుకు సిద్ధమయ్యాడు.

ఫస్ట్ క్లాస్ క్రికెట్‌కు మాథ్యూ వేడ్ గుడ్‌బై



పరిమిత ఓవర్ల ఫార్మాట్‌పై మరింత దృష్టి సారించేందుకు.... ఫస్ట్ క్లాస్ (మూడు లేదా అంత కంటే ఎక్కువ రోజుల మ్యాచ్‌లు) క్రికెట్ నుంచి వీడ్కోలు తీసుకుంటున్నట్లు ఆస్ట్రేలియా జట్టు వికెట్ కీపర్ మాథ్యూ వేడ్ ప్రకటించాడు. 2012లో ఆస్ట్రేలియా తరఫున అరంగేట్రం చేసిన 36 ఏళ్ల వేడ్ 36 టెస్టులు ఆడి నాలుగు సెంచరీలతో కలిపి 1613 పరుగులు సాధించాడు.

భళా బెంగళూరు

- ఆఖర్లో అనూహ్య విజయంతో ఫైనల్‌కు అర్హత
- పరుగుల వేటలో ముంబై ఇండియన్స్ బోల్తా
- రాణించిన ఎలీస్ పెరీ, శ్రేయాంక, ఆశ
- రేపు జరిగే ఫైనల్లో ఢిల్లీతో ఆర్‌సీబీ అమీతుమీ

న్యూఢిల్లీ: గెలుపు వాకిట ముంబై ఇండియన్స్ బోల్తా పడింది. ఉన్నపళంగా ఉత్కంఠ రేపిన ఆఖరి ఓవర్లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) 5 పరుగుల తేడాతో గట్టెక్కింది. తద్వారా మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) రెండో సీజన్‌లో స్మృతి మంధాన నాయకత్వంలోని బెంగళూరు జట్టు ఫైనల్ చేరింది. డిఫెండింగ్ చాంపియన్ ముంబై ఇండియన్స్ సులువుగా గెలవాల్సిన మ్యాచ్‌లో ఎలిమినేట్ అయ్యింది. ముందుగా బెంగళూరు 20 ఓవర్లలో 6 వికెట్లకు 135 పరుగులు చేసింది. అనంతరం ముంబై ఇండియన్స్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 130 పరుగులకే పరిమితమై ఓడిపోయింది. ఆదివారం జరిగే ఫైనల్లో ఢిల్లీ క్యాపిటల్స్‌తో బెంగళూరు తలపడుతుంది.



హర్మన్‌ప్రీత్

మలుపు తిప్పిన శ్రేయాంక...

శుక్రవారం జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం 17వ ఓవర్ ముగిసేవరకు గెలిచే స్థితిలోనే ఉంది. 18 బంతుల్లో 20 పరుగులు సులువైన సమీకరణం కాగా... 18వ ఓవర్ వేసిన శ్రేయాంక పాటిల్ 4 పరుగులిచ్చి కీలకమైన హర్మన్‌ప్రీత్ వికెట్‌ను పడగొట్టింది. దాంతో ముంబై విజయసమీకరణం 12 బంతుల్లో 16 పరుగులుగా మారింది. 19వ ఓవర్ వేసిన సోఫీ మోలినెక్స్ నాలుగే పరుగులిచ్చి సజన (1) వికెట్‌ను తీసింది. ఇక చివర్లో 6 బంతుల్లో 12 పరుగులు చేయడం కూడా ముంబై జట్టుకు కష్టం కాదు. కానీ లెగ్ స్పిన్నర్ ఆశ శోభన మాయాజాలం చేసింది. తొలి 3 బంతులకు 4 పరుగులే ఇచ్చింది. ఆశ వేసిన నాలుగో బంతికి పూజ వస్త్రకర్ ముందుకొచ్చి ఆడి (4) స్టంపౌట్ అయ్యింది. దాంతో ముంబై నెగ్గాలంటే 2 బంతుల్లో 8 పరుగులు చేయాలి. కొత్త బ్యాటర్ అమన్‌జ్యోత్ ఐదో బంతికి ఒక పరుగు తీసింది. చివరి బంతికి ముంబై 7 పరుగులు చేయాలి.



శ్రేయాంక, ఆశ

క్రీజులో అమెలియా కెర్ ఉంది. సిక్స్ కొడితే స్కోర్లు సమమై 'సూపర్ ఓవర్'కు దారి తీస్తుందా అని ఉత్కంఠ కలిగింది. కానీ ఆశ వేసిన ఆఖరి బంతికి అమెలియా ఒక్క పరుగు మాత్రమే తీయగలిగింది.



ఎలీస్ పెరీ

దాంతో ఓడిపోతుందనుకున్న మ్యాచ్‌లో బెంగళూరు 5 పరుగులతో గెలిచి తొలిసారి డబ్ల్యూపీఎల్ ఫైనల్‌కు దూసుకెళ్లింది.

ఆదుకున్న పెరీ...

అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న బెంగళూరు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 135 పరుగులు చేసింది. ఓపెనర్లు స్మృతి (10), సోఫీ డివైన్ (10), దిశ (0), హిట్లర్లు రిచా ఘోష్ (14), సోఫీ మోలినెక్స్ (11) అంతా నిరాశపరిచారు. 15 ఓవర్లలో ఆర్‌సీబీ స్కోరు 84/5! కనీసం వంద కూడా చేయలేదు. ఈ దశలో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఎలీస్ పెరీ (50 బంతుల్లో 66; 8 ఫోర్లు, 1 సిక్స్) ఒంటరి పోరాటం చేసింది. ఆఖర్లో జార్జియా వేర్‌హమ్ (10 బంతుల్లో 18 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్) బ్యాట్ ఝుళిపించింది. హేలీ మాథ్యూస్, నటాలీ సీవర్ బ్రంట్, సైకా ఇషాక్ తలా 2 వికెట్లు తీశారు. అనంతరం సునాయాసమైన లక్ష్యాన్ని ఛేదించలేక ముంబై 20 ఓవర్లలో 6 వికెట్లకు 130 పరుగులకే పరిమితమైంది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (30 బంతుల్లో 33; 4 ఫోర్) టాప్ స్కోరర్ కాగా.. అమెలియా కెర్ (25 బంతుల్లో 27 నాటౌట్; 2 ఫోర్లు), నటాలీ సీవర్ బ్రంట్ (17 బంతుల్లో 23; 4 ఫోర్లు) 20 పైచిలుకు పరుగులు చేశారంతే! శ్రేయాంక (4-0-16-2) జట్టుకు అవసరమైన స్పెల్ వేయగా, పెరీ, సోఫీ, వేర్‌హమ్, ఆశ తలా ఒక వికెట్ తీశారు.

స్కోరు వివరాలు

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: స్మృతి (సి) ఇస్మాయిల్ (బి) సీవర్ 10; సోఫీ డివైన్ (బి) హేలీ 10; పెరీ (సి) సీవర్ (బి) సైకా 66; దిశ (సి) పూజ (బి) సైకా 0; రిచా ఘోష్ (సి) సీవర్ (బి) హేలీ 14; సోఫీ మోలినెక్స్ (బి) సీవర్ 11; వేర్‌హమ్ (నాటౌట్) 18; శ్రేయాంక (నాటౌట్) 3; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 135. వికెట్ల పతనం:** 1-20, 2-20, 3-23, 4-49, 5-84, 6-126. **బౌలింగ్:** షబ్నిమ్ 4-1-30-0, హేలీ మాథ్యూస్ 4-0-18-2, నటాలీ సీవర్ బ్రంట్ 4-0-18-2, సైకా ఇషాక్ 3-0-27-2, పూజ వస్త్రకర్ 3-0-21-0, అమెలియా కెర్ 2-0-18-0.

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: యస్తిక (బి) పెరీ 19; హేలీ (సి) వేర్‌హమ్ (బి) శ్రేయాంక 15; నటాలీ సీవర్ (బి) వేర్‌హమ్ 23; హర్మన్‌ప్రీత్ (సి) డివైన్ (బి) శ్రేయాంక 33; అమెలియా కెర్ (నాటౌట్) 27; సజన (స్టంప్డ్) రిచా ఘోష్ (బి) సోఫీ మోలినెక్స్ 1; పూజ (స్టంప్డ్) రిచా ఘోష్ (బి) ఆశ శోభన 4; అమన్‌జోత్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 130. వికెట్ల పతనం:** 1-27, 2-50, 3-68, 4-120, 5-123, 6-128. **బౌలింగ్:** రేణుక 1-0-6-0, శ్రేయాంక పాటిల్ 4-0-16-2, సోఫీ డివైన్ 1-0-9-0, ఎలీస్ పెరీ 4-0-29-1, సోఫీ మోలినెక్స్ 4-0-16-1, వేర్‌హమ్ 4-0-37-1, ఆశ శోభన 2-0-13-1.

వన్డే, టి20ల్లో 'స్టాప్ క్లాక్'

దుబాయ్: పురుషుల జట్టు బ్యాటింగ్‌లో ఎడాపెడా దంచేసినా, చుక్కలు చూపించినా పర్లేదు. కానీ బౌలింగ్ సమయంలో మాత్రం జాగ్రత్త పడాలి. ఓవర్‌కు ఓవర్‌కు మధ్య నిక్కచ్చిగా 60 సెకన్ల సమయాన్ని మాత్రమే తీసుకోవాలి. నింపాదిగా బౌలింగ్ చేస్తానంటే ఇకపై అస్సలు కుదరదు. దుబాయ్‌లో సమావేశమైన అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) 'స్టాప్ క్లాక్' నిబంధనను ఈ ఏడాది జూన్‌లో వెస్టిండీస్-అమెరికాలలో జరిగే టి20 ప్రపంచకప్ నుంచి అమలు చేయాలని నిర్ణయించింది. దాంతోపాటు టి20 ప్రపంచకప్‌లో నాకౌట్ దశ మ్యాచ్‌లన్నింటికీ రిజర్వ్ డేలను ఖరారు చేసింది. రెండు ఓవర్ల మధ్య విరామ సమయాన్ని తగ్గించడమే 'స్టాప్ క్లాక్'. ఒక బౌలర్ ఓవర్ ముగించిన వెంటనే మరో బౌలర్ 60 సెకన్లలోపే బౌలింగ్ చేయాలి. బౌలింగ్ జట్టు 60 సెకన్లలోపే ఓవర్ వేయకపోతే అంపైర్లు మూడుసార్లు హెచ్చరికలతో సరిపెడతారు. ఆ తర్వాత పునరావృతమైతే పెనాల్టీ విధిస్తారు.

రఫ్ఫాడించిన రష్మిక

ప్రపంచ 249వ ర్యాంకర్‌పై 6-0, 6-0తో విజయం



ఇండోర్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మహిళల టోర్నమెంట్‌లో హైదరాబాద్ ప్లేయర్ భమిడిపాటి శ్రీవల్లి రష్మిక కళ్లు చెదిరే ప్రదర్శన చేసింది. సింగిల్స్ విభాగంలో సెమీఫైనల్లోకి దూసుకెళ్లిన రష్మిక... డబుల్స్ విభాగంలో తన భాగస్వామి వైదేహి చౌదరితో కలిసి టైటిల్ పోరుకు అర్హత సాధించింది. శుక్రవారం జరిగిన సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 486వ ర్యాంకర్ రష్మిక 6-0, 6-0తో ప్రపంచ 249వ ర్యాంకర్ జస్టినా మికుల్‌స్కయిటీ (లిథువేనియా)పై జయభేరి మోగించింది. 48 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రష్మిక ఏకంగా 'డబుల్ బేగల్' నమోదు చేయడం విశేషం. మ్యాచ్‌లో ప్రత్యర్థికి ఒక్క గేమ్ ఇవ్వకుండా సెట్‌ను 6-0తో గెలిస్తే టెన్నిస్ పరిభాషలో దానిని 'బేగల్'గా అభివర్ణిస్తారు. ఈ మ్యాచ్‌లో రష్మిక రెండు సెట్‌లలోనూ ప్రత్యర్థికి ఒక్క గేమ్ కూడా కోల్పోకపోవడం విశేషం. జస్టినా సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేసిన రష్మిక తన సర్వీస్‌లో మూడుసార్లు గేమ్ పాయింట్లను కాపాడుకుంది. మరోవైపు డబుల్స్ సెమీఫైనల్లో రష్మిక-వైదేహి జోడీ 6-1, 7-6 (8/6)తో హైదరాబాద్‌కు చెందిన సహజ యామలపల్లి-జీల్ దేశాయ్ (భారత్) జంటపై గెలిచి ఫైనల్లోకి అడుగు పెట్టింది. 93 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రష్మిక ద్వయం మూడు ఏస్‌లు సంధించడంతోపాటు ప్రత్యర్థి సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేసింది. నేడు జరిగే ఫైనల్లో నాలుగో సీడ్ యా సువాన్ లీ (చైనీస్ తైపీ)-షోయున్ పార్క్ (దక్షిణ కొరియా) జోడీతో రష్మిక-వైదేహి జంట తలపడుతుంది. సింగిల్స్ సెమీఫైనల్లో ఏడో సీడ్ పోలీనా లాచెంకో (రష్యా)తో రష్మిక ఆడుతుంది.

శరత్ కమల్ ఓటమి

సింగపూర్: సంచలన విజయాలతో సింగపూర్ స్మాష్ వరల్డ్ టేబుల్ టెన్నిస్ (టీటీ) టోర్నీలో అదరగొట్టిన భారత స్టార్ ఆచంట శరత్ కమల్ జోరుకు బ్రేక్ పడింది. క్వాలిఫయింగ్ ద్వారా మెయిన్ 'డ్రా'లో అడుగుపెట్టిన ప్రపంచ 88వ ర్యాంకర్ శరత్ కమల్ క్వార్టర్ ఫైనల్లో వెనుదిరిగాడు. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో శరత్ కమల్ 9-11, 2-11, 7-11, 11-9, 8-11తో ప్రపంచ 6వ ర్యాంకర్ ఫెలిక్స్ లెబ్రున్ (ఫ్రాన్స్) చేతిలో ఓడిపోయాడు. 32 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో శరత్ మొత్తం 37 పాయింట్లు సాధించాడు. ఇందులో 24 పాయింట్లు తన సర్వీస్‌లో నెగ్గగా... తన సర్వీస్‌లో మరో 22 పాయింట్లు ప్రత్యర్థికి కోల్పోయాడు. క్వార్టర్ ఫైనల్లో ఓడిన శరత్ కమల్‌కు 14,000 డాలర్ల (రూ. 11 లక్షల 60 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 350 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.




సాత్విక్-చిరాగ్ జోడీకి షాక్



బర్మింగ్‌హామ్: ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పురుషుల డబుల్స్‌లో ప్రపంచ నంబర్‌వన్ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) జోడీకి చుక్కెదురైంది. ప్రిక్వార్టర్ ఫైనల్లో టాప్ సీడ్ సాత్విక్-చిరాగ్ ద్వయం 16-21, 15-21తో 2022 డబుల్స్ చాంపియన్ షోహిబుల్ ఫిక్రీ-మౌలానా బగస్ (ఇండోనేసియా) జంట చేతిలో ఓడింది. గతంలో ఫిక్రీ-మౌలానా ద్వయంపై నాలుగుసార్లు గెలిచిన సాత్విక్-చిరాగ్ ఈసారి ఒత్తిడికి లోనై అనవసర తప్పిదాలతో మూల్యం చెల్లించుకున్నారు.

క్వార్టర్ ఫైనల్లో తరుణ్

వాటరింజెన్ (నెదర్లాండ్స్): డచ్ ఇంటర్నేషనల్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్ తరుణ్ మన్నెపల్లి క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. క్వాలిఫయర్‌గా అడుగుపెట్టిన తరుణ్ సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో 21-16, 23-21తో భారత్‌కే చెందిన శుభాంకర్ డేపై గెలుపొందాడు. తొలి రౌండ్‌లో తరుణ్ 18-21, 21-10, 23-21తో ఆరో సీడ్ మథియాస్ కిక్లిట్జ్ (జర్మనీ)పై సంచలన విజయం సాధించాడు.





Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.